RNI No. APTEL/2003/12253

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

Vol : 19 Issue No. 1 (1) Monthly January (1) 2022 ISSN No. : 2456-4702 Rs. : 15/-



సావిత్రిబాయి ఫూలే

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19 - Issue. 1 - January (1) 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

సావిత్రి బాయి ఫూలే

"మనకి ఒకే ఒక్క శత్రువు ఉన్నాడు. ఆ శత్రువు పేరే అజ్ఞానం. విద్యావంతులై, ఆ శత్రువును తుదముట్టించడమే మన లక్ష్యం"

– సావిత్రిబాయి ఫూలే.

సావిత్రిబాయి ఫూలే పేరు కాదు ఆత్మగౌరవ పోరాటం, నడుస్తున్న విప్లవం. స్త్రీ విద్యకు పనికిరాదు అనే కాలంలో భర్త జ్యోతిభా ఫూలేతో కలిసి భారతదేశంలో తొలి బాలికల పాఠశాల స్థాపించి 'ఆడ పిల్లలకు చదువు వద్దు' అనే అహంకార ధోరణికి ఉప్పు పాతర వేసింది.

సావిత్రిబాయి ఫూలే ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. సావిత్రిబాయి ఫూలే 1831 జనవరి 3వ తేదీన మహారాష్ట్రలోని సతారా జిల్లా ఖండాల తాలూకా నయాగావ్ గ్రామంలో లక్ష్మీ ఖండోజీ, నెవేషే దంపతులకు జన్మించారు. నాటి సమాజంలో ఆడ పిల్లల చదువు నిషిద్ధం. బాల్య వివాహాలు విరివిగా జరుగుతుండేవి. సావిత్రిబాయి వివాహం 9 ఏళ్ల వయసులో జ్యోతిరావు ఫూలేతో 1840 సంవత్సరంలో జరిగింది. జ్యోతిరావు ఫూలే సంఘ సంస్కర్త, అభ్యుదయవాది. స్త్రీ విద్యను ప్రోత్సహించాలని పేర్కొనేవాడు. తన ప్రసంగాలకే మాటలను పరిమితం చేయకుండా తన భార్య సావిత్రిబాయికి విద్యాబుద్ధులు నేర్పించాడు. సావిత్రిబాయి మొదటి గురువు తన భర్తే. ఇంట్లో తల్లిదండ్రులు, బంధువులు, రక్త సంబంధీకులందరు హేళనలు, అవమానాలు చేసినా ఏది పట్టించుకోకుండా కేవలం భార్య చదువుపైనే దృష్టి పెట్టారు. సావిత్రిబాయి ఫూలే కూడా భర్త ఎదుర్కొంటున్న అవమానాలను, ఛీత్కారాలను వింటూ లోలోపలే బాధను దిగమింగుకుంటూ పట్టుదలతో విద్యను అభ్యసించింది. అహ్మద్‌నగర్‌లో ఉపాధ్యాయ శిక్షణ పొంది మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా ఖ్యాతి గడించింది.

సావిత్రిబాయి భర్తతో పాటు సంఘ సంస్కరణ కార్యక్రమాలలో పాలు పంచుకునేవారు. నాటి సంఘంలో పేరుకుపోయిన దురాచారాలను నిరసిస్తూ ఉద్యమించారు. ఉద్యమంలో భాగంగా స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను ఎదురించారు. అయితే అప్పటికే సంఘంలో దురాచారాలు బాగా పాతుకుపోయి ఉండడంతో సావిత్రిబాయి ఫూలే అందరు తిట్టిపోసేవారు. అయినా అవేమి పట్టించుకోకుండా స్త్రీల అభ్యున్నతికి కృషి చేశారు. సమాజంలో స్త్రీ అణచివేయబడడానికి కారణం కేవలం వాళ్ళు చదువుకోకపోవడమే కారణమని ప్రత్యేకంగా ఆడపిల్లలందరికి ఒక పాఠశాలను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. సావిత్రిబాయి ఫూలే భర్త జ్యోతిరావు ఫూలే సహకారంతో 1848 సంవత్సరం పూణేలో మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారు.

సావిత్రిబాయి ఫూలే నడిపే పాఠశాల అగ్రవర్ణాలకు నచ్చలేదు. దీనితో ఆమెను వేధింపులకు, భౌతిక దాడులకు గురిచేశారు. ఆమె పాఠశాలకు నడిచివెళ్ళే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్ళు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడడం చేసేవాళ్ళు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్ళిన తర్వాత మార్చుకుని

మరలా తిరిగి వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చేది. ఎవరైనా అడిగితే ధైర్యంగా నా విధిని నేను నిర్వర్తిస్తున్నాడని చెప్పేవారు. పూలే దంపతులు ఎప్పుడైతే బాలికల కోసం పాఠశాలను ఏర్పాట చేశారో తమ స్వంత కులస్థులు, రక్త సంబంధీకులందరు గృహ బహిష్కారానికి గురి చేశారు. అనేక అణచివేతలకు గురయ్యారు. పూలే దంపతులు అవేవి పట్టించుకోకుండా అభ్యుదయం వైపు పయనించారు. స్త్రీలను చైతన్యపరచడానికి 'మహిళా సేవామండల్' అనే సంఘాన్ని 1852 సంవత్సరంలో స్థాపించారు. 1860 సంవత్సరంలో భర్త చనిపోయిన స్త్రీ లందరికి శిరోమండనం చేయవద్దని క్షుకులను (మంగలి) వాళ్ళను చైతన్యపరచి వారితో ఉద్యమం చేయించి విజయం సాధించారు. 1890 సంవత్సరం నవంబర్ 28వ తేదీన భర్త జ్యోతిరావు పూలే మరణించడంతో తన భర్త చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి నూతన సంప్రదాయానికి నాంది పలికారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇది. సావిత్రిబాయి పూలే సంఘ సంస్కర్తే కాక రచయిత్రి. 1854 సంవత్సరంలో కావ్య పూలే కవితా సంపుటిని, 1891 సంవత్సరంలో పాదన కాశీ సుబోధ రత్నాకర అనే మరో కావ్యాన్ని రచించారు. 1897 సంవత్సరం మార్చి 10న ప్లేగు వ్యాధి సోకి మరణించారు. భారత ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జ్ఞాపకార్థం తపాలా స్టాంపును 1998 సంవత్సరంలో విడుదల చేసింది. 2014 ఆగష్టు 9వ తేదీన పూనే విశ్వవిద్యాలయానికి సావిత్రిబాయి పూలే పూనే విశ్వవిద్యాలయంగా నామకరణం చేశారు. మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి ఫూలే.

- సంపాదకవర్గం

★★★

Contents (విషయ సూచిక)

1. వాలాగ్ని నాటికలు - పరిశీలన	- బాదరవేణి నాగరాజు	6
2. వరంగల్ జిల్లా వచన కవితా పరిణామం	- బోజనపల్లి లక్ష్మణ్‌కుమార్	10
3. ఆచార్య కొలకలూరి ఇనాక్ నవలలు-దళిత స్త్రీ బ్రతుకు పోరాటం	- సురేఖ దుగులూరు & - డా॥. వై. సుభాషిణి	14
4. మాతృభాషతోనే మనోవికాసం - నూతన జాతీయ విద్యా విధానం 2020	- డా॥. భూక్యా రాజారాం	18
5. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి సాగర సంగమం కథ - దళిత చైతన్యం	- డా॥. గుండ్లూరు వెంకట రమణ	22
6. అనుబంధాలకు చిరునామా 'మహీధర' నవలలు	- కచ్చళ్ళ బలరామ్	24
7. అస్పృశ్యమవుతున్న దేశీ శబ్దజాలం నిమ్నతీకరణంలో	- డా॥. పి.ఎ. సత్యనారాయణ	28
8. అభ్యుదయ శంఖారావం - అనిసెట్టి కవిత్వం	- డా॥. పి. విజయకుమార్	31
9. దళిత కవిత్వం - సామాజిక చైతన్యం	- ఆచార్య డి. వి. శ్రవణ్ కుమార్	34
10. వేదాంగ వాఙ్మయంలో స్మృతులు	- డా॥. డి.ఉదయకుమారి	39
11. ప్రాచీన కథాకావ్యాల్లో తెలుగువారి సంస్కృతి - జీవన విధానం	- డా॥. వేదాంతం. బి.యమ్.యమ్	42
12. తిక్కన తెలుగు తెన్నులు	- డా॥. వై. విజయలక్ష్మి	44
13. కుందుర్తి కవిత్వంలో మానవీయత	- డా॥. చింతల రాకేశ్ భవాని	47
14. 'వలస' నవల : వస్తు పరిణామం	- డా॥. వి. శాంతిలక్ష్మి	52
15. అంగర వెంకట శివ ప్రసాదరావు కథలు - మానవతా విలువలు	- నద్దన పుట్టి గణేష్	55
16. శ్రీ గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి గారి సాహిత్యము - పరిశీలన	- కాంపల్లె రవిచంద్ర	59
17. అమెరికా తెలుగు కథానిక - మహిళ	- యన్. మహేశ్వరి & - ఆచార్య మూలె విజయలక్ష్మి	63
18. కాకాని చక్రపాణి నవలలు - సమగ్ర పరిశీలన	- మల్లెంబాక వేంకటరావు	66
19. జయంతి ప్రకాశ శర్మ కథలు - సామాజిక చైతన్యం	- మొండి స్వామి	72
20. పింగళి - కాటూరి 'అజ్ఞాన కృతము' కరుణశ్రీ 'పుష్ప విలాపం'..	- నలసాని రాం ప్రసాద్	76
21. సాహిత్య ప్రస్థానం కథల్లో - మద్యంపై పోరాడిన స్త్రీ పాత్రలు	- పి. సాయిలక్ష్మి	82
22. ద్రావిడ భాషల్లో భారతాలు	- డా॥. వి. పళని	87
23. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య పరిచయం	- ఆర్. గోపాల్	90
24. డా॥. ఎమ్.వి.జె. భువనేశ్వరరావు 'ఈత రాని పడవలు' కథలోని..	- శివయ్య రాజులపాటి	93
25. జూకంటి జగన్నాథ కవిత్వంలో చారిత్రక సాంస్కృతిక అంశాలు	- యస్. మహేందర్	98
26. అనురాగ తరంగాలు నవల - అద్దె గర్భం చిత్రణ	- వడ్డివాటి మల్లయ్య	101
27. తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి ఫూలే	- డా॥. పెండ్యాల లావణ్య & - డా॥. బూసి వెంకటస్వామి	109
28. Philosophical Concepts in the Bhagavad Gita - An Overview	- Ashok Manda	113
29. A Literature Review on the Challenges of Learning English Skills...	- B.Venkateshwarlu & - K.Saritha	118
30. History, Architecture and Terrain analysis of Chandragiri fort	- Dr. Meesala Ramakrishna, - Dr. Doneti Sivaji & - Dr. Seelam Srinivasa Rao	123
31. SOCIO POLITICAL CONCERNS in Nayantara Saghal's ...	- Dr. C. Jaiganesh	131
32. Erroneous Companionship in Shobhaa De's work Snapshots	- V.Hamsaveni	136

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వాలాగ్ని నాటికలు - పరిశీలన

- బాదరవేణి నాగరాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాద్.

వాలాగ్ని అసలు పేరు తోక చిచ్చు సుదర్శన వర్మ. వాలాగ్ని అనేది ఆయన కలం పేరు. కృష్ణా జిల్లా, ముదినేపల్లి మండలం, వాడవల్లి గ్రామంలో 8-5-1947వ సంవత్సరంలో జన్మించారు. అనంతమ్మ, సత్యనారాయణ రాజు వీరి తల్లిదండ్రులు. ఈయన నిజామాబాద్‌లోని వాసవి పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేస్తూ అదే జిల్లాలో స్థిరపడ్డారు. ఈయన హరికథా కళాకారుడిగా, వ్యాఖ్యాతగా, పౌరాణిక పద్య నాటకంలో కృష్ణుడుగా, తెలుగు ఫిలిం రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తి గడించారు. హరికథలు, బుర్రకథలు, రేడియో రూపకాలను రచించి నిజామాబాద్ జిల్లా కళా రంగంలో తనదైన ముద్ర వేశారు.

వాలాగ్ని గారు అద్భుతమైన రంగస్థల నటులు. నిజామాబాద్ లోని కొందరు మిత్రులతో కలిసి స్నేహ మయి సాంస్కృతిక సమాఖ్యను ప్రారంభించి దాని ఆధ్వర్యంలో, తాను రాసిన నాటికలను ప్రదర్శింపజేసి ఎన్నో రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి నాటక పోటీలలో ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. నాటక పరిషత్ పోటీలలో పాల్గని ఉత్తమ దర్శకుడిగా, రచయితగా, నటునిగా అనేక పురస్కారాలు అందుకున్నారు. ఈయన 22-2- 2012న మరణించారు. వాలాగ్ని గారు నల్ల, ఇదా మనిషి విలువ?, ఊరు బందీ/చీకటి కట్టడి, అన్నాద్భవంతి, చంద్రునికో నూలుపోగు, బాపూ...మళ్ళీ పుట్టు మొదలైన నాటికలు రచించారు. ఇవి అముద్రితాలు అయినప్పటికీ రంగ స్థలంపై ప్రదర్శించబడ్డాయి. వాలాగ్ని గారు రచించిన పై నాటికలను పరిశీలించడం, ఈ వ్యాస ప్రధానోద్దేశం.

'నల్ల' నాటిక :

వాలాగ్ని రచించిన నల్ల నాటికలో ముసలవ్వ ,ఆమె కొడుకు పీతాంబరం, మనవడు విశ్వం, మరో మతి స్థిమితం లేని మనవడు, మనవరాలు శాంతి, పాత్రలు ఉంటాయి. ముసలవ్వ ఓ మూటని ఎప్పుడూ జాగ్రత్తగా దాచుకుంటుంది. ఎవరినీ దాని దగ్గరికి రానివ్వదు.

ఆ మూటలో డబ్బు, నగలు ఉన్నాయని పీతాంబరం, విశ్వం భ్రమపడతారు. ముసలవ్వ ఆ మూటని తన కొడుకూ, మనవడికి దొరకనివ్వదు. తిండిలేక కుటుంబీకులందరూ పస్తులుంటారు. ముసలవ్వ తన చివరి కోరికగా నల్ల (మేక రక్తం) తెచ్చి, కూర వండి పెట్టమని కోరుతుంది.

నాటిక మొత్తం కొడుకు, మనవడు, ముసలవ్వ నుండి మూట దక్కించుకోవాలనే ప్రయత్నిస్తారు. పీతాంబరం తన చిరిగిపోయిన చొక్కాకి అతుకు వేసుకోడానికి ముసలవ్వ మూటలోని బట్టపీలికల్ని ఇవ్వమని ప్రాధేయపడతాడు. మతిస్థిమితం లేని పీతాంబరం కొడుకు ఎక్కడి నుంచో ఏదో జెండాని తీసుకువస్తాడు. దానికోసం పీతాంబరం, విశ్వం గొడవ పడతారు. ఆ క్రమంలో ముసలవ్వ మూటలో బట్ట పీలికల్ని దాచిందని తెలుసుకొని. మూటలో అంతకాలం దాచినవి పీలికలా అని కొడుకు, మనవడూ ఆశ్చర్యపోతారు. మూటలో డబ్బు దాచాననే భ్రమతోనే తనని ఇంతకాలం బతకనిచ్చారని, దాని వల్లనే తనకు గంజి నీళ్ళు పోసారని, అవి లేకపోతే తనని బయటకు గెంటేవారని మగవాళ్ళయి వుండి, కష్టపడే వయసులో ఉండి సంపాదించక, దాచిన మూటకోసం చూడడం అవివేకమని ముసలవ్వ బోధిస్తుంది. మతకలహాల్లో లభించిన మనిషి రక్తం తెచ్చి ఇచ్చిన మతిస్థిమితం లేని మనవడిపై జాలి చూపిస్తుంది. తనకు మనిషి రక్తం అసహ్యం, జంతు రక్తాన్ని గౌరవిస్తానంటుంది.

'చంద్రునికో నూలు పోగు' నాటిక :

ఈ నాటికలో గాయత్రి, గాయత్రి కొడుకు, స్వతంత్ర, మార్కండేయులు, నాయకుడు, చంద్రయ్య మొదలైన

పాత్రలుంటాయి. చంద్రయ్య నిరుపేద నేత కార్మికుడు, వృద్ధుడు. అప్పుల బాధతో, ఆకలి బాధతో చంద్రయ్య కొడుకు ఆత్మహత్య చేసుకుంటాడు. చంద్రయ్య కోడలు గాయత్రి, ఈమె మగ్గం ద్వారా నేసిన నేత బట్టల్ని అమ్ము కుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. స్వతంత్ర చిన్నపిల్ల, పాఠశాల విద్యార్థిని. కష్టపడి సంపాదించిన సొమ్ముతో గాయత్రి కొడుకు అమెరికా వెళ్ళి చదువుతుంటాడు. మార్కండేయులు చంద్రయ్యకు వరసకు బావమరిది. చనిపోయిన నేత కార్మికుల పేరిట వితరణను ప్రభుత్వం నుండి డబ్బు ఇప్పిస్తానని తిరుగుతుంటాడు. వీళ్ళని అడ్డు పెట్టుకుని డబ్బు సంపాదిస్తూ ఓట్లు పొందాలని ఆరాట పడుతాడు నాయకుడు. ఈ నాటిక తరతరాల నేత కార్మికుల కన్నీటి బ్రతుకులను ప్రతిబింబిస్తుంది. స్వదేశీ వస్త్రాలనే ధరించండి, స్వదేశీ వస్తువుల్నే గౌరవించండని మహాత్మాగాంధీజీ ఉద్బోధనలను తూచ తప్పక పాటించే చంద్రయ్య, ఆఖరిశ్వాస వరకూ నూలు వస్త్రాలపై గౌరవంతో గడుపుతుంటాడు. అందరికీ ఆదర్శంగా నిలుస్తూ ప్రచారం చేస్తాడు. నూలు వస్త్రాలు ఎవరూ కొనడం లేదని పాలిస్టర్ వస్త్రాలు కూడా అమ్ముదామన్న కోడలు గాయత్రి ఆలోచనలకు చంద్రయ్య బాధ పడుతాడు. ససేమిరా అంటాడు. తిండిలేక రోజులు గడవకపోయినా నూలు వస్త్రాల అమ్మకం సాగించమని కోడలిని కోరతాడు. అమెరికా నుండి మనవడు ఉత్తరం రాసి అక్కడ కూడా నూలు వస్త్రాలే ధరిస్తున్నానని చెప్పినప్పుడు, చంద్రయ్య మహదానందపడి చివరి శ్వాస వదుల్తాడు. చివరలో కొడుకు అమెరికా నుండి ఉన్ని-పాలిస్టర్ వస్త్రాలు ధరించి రాగా, గాయత్రి నిలదీస్తుంది. తను కూడా చంద్రయ్య మామ బాటలో నడుస్తుంది. నూలు వస్త్రాల కోసం ఆకలిని, కష్టాల్ని లెక్క చేయని పాత్రల చిత్రణ ఈ నాటికలో అద్భుతంగా చిత్రించాడు.

'ఊరుబందీ/చీకటి కట్టడి' నాటిక :

ఈ నాటికలో పటేలు, గణాచారి, బడి పంతులు, ఊర్లో డప్పు వాయించే పెద్దింటోడు, అతని పసి కొడుకు మైసయ్య, మొదలైన పాత్రలుంటాయి. బడి పంతులు, అమాయక పల్లె ప్రజలు మూఢాచారాలతో తమ జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారనే బాధతో ఊరి పొలిమేర్లలో ఉన్న గ్రామ దేవత రాయిని తీసివేయాలని చూస్తాడు. ఆ రాయిని దేవతగా భావించి మూర్ఖంగా నమ్మిన గ్రామస్తులు, వారికి రోగాలు వస్తే జాతర్ల పేరిట, కోళ్ళని, మేకల్ని నిత్యం బలి చేస్తుంటారు. దాన్ని అడ్డుకోవాలని బడి పంతులు ప్రయత్నం చేస్తాడు. ఊరి పెద్ద అయిన పటేలు ఆ అమాయక ప్రజల్ని మరింత వెర్రి వాళ్ళని చేసి పెత్తనం చెలాయిస్తుంటాడు. చిన్నవాడైన తన కొడుకు మైసయ్యని పెద్దింటోడు, గ్రామ దేవతగా ఉన్న రాతి దగ్గరకి తీసుకొస్తాడు. కల్లు కుండలు, కోడిని తెచ్చి పూజిస్తాడు. మైసయ్య తన తండ్రి చేస్తున్న పనిని తప్పుపడతాడు. 'ఈ కోడిని రాయికి ఎందుకు బలి ఇస్తున్నావు?"అని తన తండ్రిని అడుగుతాడు, అలా అనడం తప్పని తండ్రి నచ్చచెపుతాడు. సరిగ్గా అప్పుడే అక్కడికి వచ్చిన పటేలుకి ఎదురు చెపుతాడు మైసయ్య. పటేలు ఉగ్రుడవుతాడు. ఊరి జనం పొలిమేర్లు దాటి పోకూడదని, అమ్మోరికి కోపం వస్తుందని పూనకం పట్టినట్టు ఊగుతాడు గణాచారి. పెద్దింటోడు డప్పు వాయించి వస్తాడు. ఊర్లో కలరా వ్యాధి వచ్చి అందరూ ప్రాణాపాయ స్థితిలో ఉంటారు. మైసయ్యకు కలరా వచ్చి చావు బ్రతుకుల కొట్టుమిట్టాడుతుండగా పెద్దింటోడు పంతులుగారి సలహాపై పట్నం వెళ్ళి, ఆసుపత్రిలో చూపించి తన కొడుకును కాపాడుకోవాలనుకుంటాడు. కాని పటేలు ఊరు దాటకూడదు అని అడ్డుకుంటాడు. సకాలంలో వైద్యం అందక మైసయ్య చనిపోతాడు. అప్పుడు పెద్దింటోడు కోపోద్రిక్తుడై పటేలుని ఎదుర్కొని, హెచ్చరించి పడిపోతాడు. మూఢాచారాలను విడిచిపెట్టి, ప్రజలు వివేకవంతులుగా మెలగాలని చెప్పడం ఈ నాటికలోని సందేశం.

'అన్నాద్భవంతి' నాటిక :

గోపన్న, గోపన్న కొడుకు,గోపన్న బావమరిది మొదలైనవి

ఈ నాటికలోని పాత్రలు. గోపన్న 'చెట్లు, మనిషి ప్రగతికి మెట్లు' అంటూ. 'మట్టి, మనిషి జీవనానికి మూలం' అంటూ. చెట్టుని, మట్టిని గాఢంగా ప్రేమించే వ్యక్తి. గోపన్న. అతని భార్య మగబిడ్డని ప్రసవించినా ఆ సమయంలో మొక్కని పాతి నీళ్ళు పోస్తాడు గానీ తనకి కొడుకు పుట్టినా అంతగా పట్టించుకోడు. 'నా కొడుకు కన్నా నేను నాటిన మొక్క మిన్న' అని తన బావమరిదికి చెప్తాడు. సంవత్సరాలు గడుస్తాయి. గోపన్న నాటిన మొక్క పెద్ద వృక్షమై ఫలాలనందిస్తుంది. గోపన్న కొడుకు పెద్దవాడై తండ్రి సూచనతో వ్యవసాయ శాస్త్రం చదివి ఉద్యోగాన్వేషణలో ఉండి, అయిదు వేలు కావాలంటాడు. ఇంటి అవసరాలు, చదువులకి సరిపడా డబ్బు తను నాటిన చెట్టే ఇప్పటి దాకా తీర్చిందని చెట్టుని ఆప్యాయంగా చూసుకుంటాడు గోపన్న. కలప వ్యాపారి సూచన మేరకు గోపన్న కొడుకు చెట్టుని అమ్మివేసి డబ్బు సమకూర్చుకోవాలని తండ్రి పై వత్తిడి చేస్తాడు. తను ప్రాణంతో సమానంగా పెంచిన చెట్టును అమ్మనంటాడు గోపన్న. కొడుకు పంపిన వ్యక్తి వచ్చి చెట్టుని గొడ్డలితో నరకబోగా గోపన్న అడ్డుకొని గొడ్డలి దెబ్బతిని పడిపోతాడు. తనకి దెబ్బ తగిలినా చెట్టుకి తగలలేదని శాంతిస్తాడు. ఈ పరిణామానికి చెట్టును నరుకుతున్న వ్యక్తి పారిపోతాడు. పంటపొలాలు, పచ్చని చెట్లతో ప్రకఅతి నిత్యం పచ్చగా కళకళలాడితేనే మనిషి బ్రతుకు చక్కగా సాగుతుందని చెప్పిన సందేశాత్మక నాటిక ఇది.

'ఇదా మనిషి విలువ!' :

ముస్లిం నాయకుడు, మతం ఆకారం, మనిషి, హిందూ నాయకుడు మొదలైనవి ఈ నాటికలోని పాత్రలు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన మనదేశంలో స్వార్థ, కుటిల నాయకులు మతకలహాలు సృష్టించి ప్రజల్ని రెచ్చగొట్టి హిందూ, ముస్లిం, క్రైస్తవుల ఐకమత్యాన్ని నాశనం చేస్తున్నారు. భిన్న మతాలకు చెందిన స్వార్థ రాజకీయ నాయకులిద్దరూ మత ఛాందసాన్ని నిద్రలేపి అమాయకులను ఉసిగొల్పుతూ మతకలహాలు సృష్టిస్తారు. మసీదులో పందిమాంసం ముక్కలు, హిందూ దేవాలయంలో ఆవు మాంసం ముక్కలు వేసి అపవిత్రం చేసి ఆయా మతాల వారు రెచ్చిపోయేట్టు చేస్తారు. అందువల్ల మత కలహాలు జరుగుతాయి. అమాయకుడైన ఓ మనిషి గాయాలపాలవగా,అతను రాజకీయ నాయకుల్ని హెచ్చరిస్తాడు. మతం తన తప్పిదాన్ని తెల్సుకుని పశ్చాత్తాపపడుతుంది. మాంసం ముక్కలు ఏ జంతువువీ కావు, అవి అకఅత్యానికి పాల్పడే మనిషివని తెల్సుకుని అసహ్యించుకుంటారు. మనిషి నెత్తురు, మాంసం కంటే, జంతువు రక్తమాంసాలే పవిత్రమైనవన్న భావన ఉందని ఈ నాటిక తెలుపుతుంది, మహనీయులు మత సారాన్ని మహత్తరంగా వివరిస్తే, నేటి తరం కుటిల వ్యక్తులు మతాన్ని స్వార్థానికి వినియోగించుకోవడం శోచనీయమని తెలిపిన సందేశాత్మక నాటిక ఇది.

'బాపూ.. మళ్ళీ పుట్టు' నాటిక :

కరణం, గ్రామ సర్పంచ్, అతని సేవకుడు, మొదలైనవి ఈ నాటికలోని పాత్రలు. ఆంగ్లేయుల పాలన నుండి మహాత్మాగాంధీజీ దేశానికి స్వతంత్రం తీసుకు వచ్చారు. అయినా భారతదేశంలో పెత్తందారీ, పెట్టుబడిదారీ వ్యవస్థలు బలంగా వ్రేళ్ళూనుకుని యావత్ ప్రజానీకాన్ని తమ గుప్పిట బిగించాయి, అది ఆరు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉందని నిరూపిస్తూ, కేవలం నాలుగు పాత్రలతో మలిచిన నాటిక ఇది. పెత్తందారులు తమ దౌర్జన్యపూరిత స్వార్థ పెత్తనాన్ని అమలు చేస్తూ.. బడుగు, ప్రజానీకాన్ని ఏవిధంగా మరింత అణగదొక్కడానికి ప్రయత్నించారో రచయిత ఈ నాటికలో తెలిపాడు. కక్కడిది 'ఊరి పెద్దలకు సేవచేయడమే బడుగు జీవుల జన్మ' అని భావించే సాత్విక పాత్ర, ఇతని వఅత్తి చెప్పులు కుట్టడం. తండ్రి అవస్థ చూడలేని విప్లవ భావాలు కలిగిన యువకుడు, కక్కడి కొడుకు చితరంజన్. ఆవేశంతో సర్పంచ్‌కి ఎదురు నిలిచి, సర్పంచ్ చేతిలో హతమవుతాడు. చివరికి కొడుకు చావుకి చలించిపోయిన కక్కడు

గాంధీ విగ్రహానికి మొక్కుతూ ''అహింస, ధర్మం మాలాంటి వాళ్ళకేనా నువ్వు బోధించింది'' అంటూ విలపిస్తాడు. ''బాపు..మళ్ళీ పుట్టు'' అంటూ అర్థిస్తాడు. ఇలా సమాజంలోని లోపాల్ని ఎత్తి చూపుతూ రచయిత వాలాగ్ని ప్రయోగించిన సామాజిక అస్త్రాలు ఈ సాంఘిక నాటికలు అని చెప్పవచ్చు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వరంగల్ జిల్లా వచన కవితా పరిణామం

– బోజనబల్లి లక్ష్మణ్‌కుమార్, తెలుగు స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రా. ముత్తారం, జి. పెద్దపల్లి.

తెలంగాణలో వరంగల్ జిల్లాది ఒక ప్రత్యేక స్థానం. తెలంగాణలోని ఇతర జిల్లాలను పరిశీలిస్తే వరంగల్ జిల్లా ఎన్నో రంగాలలో ఖ్యాతిగాంచింది. మొట్టమొదటిసారిగా తెలుగు ప్రజలనందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చిన ఘనత వరంగల్‌ను రాజధానిగా చేసుకొని పాలించిన కాకతీయులదే. ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలతో పాటు లలిత కళల వికాసానికి కాకతీయులు చేసిన కృషి మరువలేనిది. ఒకప్పుడు ఓరుగల్లుగా విలవబడిన వరంగల్ ఎంతో మంది మహాకవులకు పుట్టినిల్లు. కాకతీయుల కాలంలో సంస్కృతాంధ్ర భాషలు వర్ధిల్లాయి. ఈ రెండు భాషల్లో అనేక శాసనాలు కూడా కనిపిస్తాయి. గణపతిదేవుని సేనానియగు జాయపసేనాని రాసిన 'నృత్తరత్నావళి' ఈ కాలం నాటిదే. ప్రతాపరుద్రుడు విద్యానాథునిలాంటి విద్వత్కవులను పోషించాడు. పాల్కురికి సోమనాథుని 'ద్విపద' రచనలన్నీ వరంగల్‌లో పురుడుపోసుకున్నవే. పోతన రాసిన 'భాగవతం' ఇక్కడ పుట్టిందే. ఇలా వరంగల్ జిల్లా కేంద్రంగా తెలుగు సాహిత్యంలోనే మైలురాళ్లుగా నిలబడిపోయే ఎన్నో గొప్ప గ్రంథాలు, కావ్యాలు వచ్చాయి. ఎంతో పద్య కవిత్వం వచ్చింది.

క్రమక్రమంగా విచ్ఛిన్నమవుతూ వచ్చిన వరంగల్ ప్రాంతం నిజాం ప్రభువుల కాలంలో 'హైదరాబాద్ రాజ్యం'లో ఒక సుబేదారుగా మారిపోయింది. 1948లో 'ఆపరేషన్ పోలో'తో తెలంగాణ ప్రాంతం భారత యూనియన్‌లో చేరిపోయిన తరువాత 1956లో భాషా ప్రాతిపదికన ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో కూడా వరంగల్ ఒక జిల్లాగా ఉన్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పూర్వపు వరంగల్ జిల్లా 1. వరంగల్ అర్బన్ 2. వరంగల్ రూరల్ 3. జనగాం 4. జయశంకర్ భూపాల్‌పల్లి 5. మహబూబాబాద్ అనే అయిదు కొత్త జిల్లాలుగా విడిపోయింది.

వరంగల్ జిల్లా కవిత్వం ప్రధానంగా రెండు పాయలుగా వెల్లివిరిసింది. 1. పద్య కవిత్వం 2. వచన కవిత్వం. పద్యకవితా వైభవాన్ని మనసులో ఉంచుకుంటూనే వచన కవితా వికాసాన్ని పరిశీలిద్దాం.

కాళోజీ నారాయణరావునే వరంగల్ జిల్లా తొలి వచన కవిగా గుర్తించాలి. సంప్రదాయాన్ని విచ్ఛిత్తి చేయకుండా తెలుగు కవులు ఇంకా ఎక్కువ శాతం పద్యాన్ని పట్టుకొని వేలాడుతున్న కాలంలో 1940 నాటికే కాళోజీ పరిపూర్ణ వచన కవిగా ఆవిర్భవించారు. సర్ వాల్టర్ స్కాట్ రాసిన Lay of the last minstrel అనే గేయంలోని "Breathes there a man, soul so dead, who has not said unto himself, this is my own native land" చరణాల ఆధారంగా రాసిన 'మాతృదేశము' కవిత ఎంతో దేశభక్తిని చాటిన కవిత.

"మాతృదేశము మాట ముచ్చట
ముదము గూర్పదు మదికిననియెడి
పరమనీచుడు ధరణినంతట
గలయ వెదికిన గాననగునా?
నీరులేని ఎడారియైనను
వాన వరదల వసతియైనను
అగ్గికొండల అవనియైనను
మాతృదేశము మాతృదేశమే!" (మాతృదేశము కవిత)

ఎన్ని దేశాలు తిరిగినా మాతృదేశాన్ని మించిన నేల ఎక్కడా దొరకదని కవి ఎంతో గాఢంగా చెప్తాడు. కూడు, గూడు, గుడ్డ ఏది లేకపోయినా మాతృదేశాన్ని వదిలిపోవుటకు ఏ మానవుడు ఇచ్చగించడని మాతృదేశము యొక్క ఔన్నత్యాన్ని ఎంతో గొప్పగా వర్ణిస్తాడు కవి ఈ కవితలో.

తొలినాళ్ల నుండే పద్యాన్ని, గేయాన్ని, వచన కవిత్వాన్ని సమానంగా ప్రేమించిన, రాసిన కవి దాశరథి కృష్ణమాచార్య. దాశరథి తొలి కవితా సంపుటి 'అగ్నిధార' (1949) లోనే పద్యాలతో పాటు వచన కవిత్వం కూడా కనిపిస్తుంది. పద్యాన్ని రాయడంతో పాటు వచన కవిత్వాన్ని రాయడం కూడా అంత సులభం కాదని తరచూ చెప్పే దాశరథి వచన కవిత్వాన్ని కూడా చాలా బలంగా రాసిన కవి.

"తరతరాల దరిద్రాల/బరువులతో పరువెత్తే
నిరుపేదా! విరుగుతోంది నీ మెడ
పెరుగుతోంది నీ గుండెల్లో దడ
బరువులతో శిరసు వంచి
పరువెత్తుటె బ్రతుకని
బ్రహ్మరాతయని/భ్రమపొందిన
ధోకా చెందిన/నిరుపేదా!
శ్రమ విలువను గమనించని
అమాయకుడ/అన్నార్తుడ!" (నిరుపేదా! కవిత)

ఈ సమాజం, ధనవంతులు నిరుపేదను ఎంత తీవ్రంగా అణచివేస్తున్నారో ఎంతో ఆర్ద్రంగా చెప్పాడు కవి. శ్రమజీవి ఎంత దోపిడీకి గురవుతున్నాడో చెప్తూనే నిరుపేదల పిల్లల్ని మిల్లులు కిల్లీల మాదిరి నమిలి వేస్తున్నాయంటాడు. చివరికి నేను కూడా నీ కోసం ఆకలితో చచ్చేనా? నా కలాన్ని రూకలకై అమ్ముకొచ్చేనా? అని ప్రశ్నిస్తాడు. తరతరాలుగా నీ భుజాలపై కనిపించని బరువును వెోస్తున్న ఓ నిరుపేదా నీ జీవితంలో తొంగిచూసే వెలుతురు కోసం వేచి చూడమని, నిరీక్షించమని కోరుతాడు.

కాళోజీ, దాశరథితో పాటు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మరో వరంగల్ జిల్లా కవి, పోరాటయోధుడు పొట్లపల్లి రామారావు. పొట్లపల్లి రామారావు తెలుగులోనే కాదు ఉర్దూలో కూడా కవిత్వం రాసిన బహుభాషావేత్త. కవిత్వం, కథ, గల్పిక, నవల, నాటిక, లేఖాసాహిత్యం ఇలా అనేక ప్రక్రియల్లో వీరి సాహిత్య వ్యాసంగం సాగింది. పొట్లపల్లి రామారావు కవితా సంపుటాలు 1. ఆత్మవేదన 2. చుక్కలు 3. మెఱుపులు 4. అక్షరదీప్తి 5. నాలోనేను. ఇందులో 'ఆత్మవేదన' ఒక్కటి గేయ కవిత్వం. మిగతావి వచన కవితా సంపుటాలు. ఆత్మవేదన గేయాల్లో తిరుగుబాటు, ఉద్యమ స్ఫూర్తి కనిపిస్తాయి. మిగతా కవితా సంపుటాల్లో ఎక్కువ భాగం తాత్త్విక చింతన కనిపిస్తుంది. వీరి కవితల్లో 'జనత', 'కాలిబాట' చాలా ప్రాచుర్యం పొందాయి.

"ఎవడు ఇక్కడ రాజు
ఎవడు ఇక్కడ రైతు
కష్టించు వారొకరు
కాజేయు వారొకరు
కష్టజీవి నీవు
కడదొలగవయ్యా
చూదాము ఈ ప్రభువులేమేలుతారో!"

ఇలా నిజాం నిరంకుశత్వంపై ధ్వజమెత్తి సహాయ నిరాకరణోద్యమాన్ని బలపరిచాడు పొట్లపల్లి రామారావు.

"సిలువెక్కించిన మేమే
నిలువెక్కించిన మేమే
ఉరియెక్కించిన మేమే
కరినెక్కించిన మేమే" (జనత గేయం నుంచి)

అంటూ పాలకులను హెచ్చరించాడు. ప్రజలు తల్చుకుంటే ఏమైనా చేయగలరని ఆనాడే హెచ్చరించడం గమనార్హం. ప్రభువుల అధికారానికైనా, పదవీ భ్రష్టతకైనా ప్రజలే మూలమని, అధికారానికి మూలాధారం ప్రజలేననే ఎరుక ఉండాలని స్పష్టపరుస్తాడు. కాలిబాట అనే గేయంలో కూడా కాలిబాట సింప్లిసిటీని, ఔన్నత్యాన్ని ఎంతో నిరాడంబరంగా వర్ణిస్తాడు.

జీవితం, సమాజం, సాహిత్యం ఎప్పటికీ ఎవరికీ అర్థం కావని చెప్పే వేలూరి రాములు విద్యార్థి (వి. ఆర్. విద్యార్థి) అనేక వచన కవితా సంపుటాలు వెలువరించారు. 1960లో

"సైనికుడా.. ఓ సైనికుడా.. హిమాలయ కొండల్లో, కొంకర్లు పోయే చలిలో సైనికుడా.. ఓ సైనికుడా" అంటూ తన మొదటి కవిత రాశారు. తరువాత అలలు, పలకరింత, ఘర్మసముద్రం, మంచు మైదానం, యుద్ధం, తుపాకి శాంతి, బహురూపి తదితర కవితా సంపుటాలు వెలువరించారు. బార్డర్‌లో సైనికునిగా పనిచేసిన వి. ఆర్. విద్యార్థిది వరంగల్ వచన కవితా వికాసంలో ప్రత్యేక స్థానం.

తెలంగాణ ప్రజల భాషలో కవిత్వం, కథలు రాసి మెప్పించిన బహుముఖ ప్రజ్ఞాశాలి దేవరాజు మహారాజు. ఇటీవలనే 'నేను అంటే ఎవరు?' అనే రచనకు గాను బాలసాహిత్య విభాగంలో కేంద్రసాహిత్య అకాడమి అవార్డు పొందిన దేవరాజు మహారాజు బహుగ్రంథకర్త. 'గుడిసె గుండె', 'గాయపడ్డ ఉదయం' తదితర కవితా సంపుటాలు వెలువరించారు. వీరు తొలి ఎక్స్‌రే అవార్డు (1982) గ్రహీత కూడా.

"ఇనుము వేడెక్కితే ముక్కలయ్యేది తేలిక
ప్రజల నాడి ఇంకా వేడెక్కితే
ముక్కలు సైతం అతుక్కుని ఒక్కటయ్యేది కూడిక
ప్రజల ధర్మాగ్రహానికి ప్రభుత ఏదీ
మనుగడ సాగించలేకపోవడమే వాడుక"

(ఐకమత్యమే మహాబలం కవిత)

అంటూ ఒక ప్రజా ఉద్యమం తల్చుకుంటే ఏమి చేస్తుందో చెప్తాడు కవి.

కథలు, నవలలు, సాహిత్య విమర్శ, ఇంజనీరింగ్ పాఠ్యగ్రంథాలు రాసిన విలక్షణ రచయిత రామా చంద్రమౌళి. ఇప్పటిదాకా దీపగ్ని, శిలలు వికసిస్తున్నాయి, స్మృతిధార, ఎటు?, కిటికి తెరిచిన తరువాత, ఒక దేహం.. అనేక మరణాలు, తపస్సు తదితర కవితా సంపుటాలు వెలువరించారు.

"సాగుతున్న నిరంతర ప్రయాణంలో
ఏమి కావాలో ఏమి వద్దో తెలియదు
ఎవడో దారి కనిపెడ్తే.. మనం దానిపై నడుస్తూ
ఎవడో నాల్గు గింజలు పండిస్తే మనం తింటూ
ఎవడో ఒక సెల్‌ఫోన్‌ను కనిపెడ్తే
జీవితమంతా దాన్లోనే మరణిస్తూ.. మనం"

(తపస్సు కవితా సంపుటి నుంచి)

మనుషులంతా నిమిత్తమాత్రులుగా బతికేస్తున్న కాలం. అందరూ పరాన్నజీవులే. స్వంతంగా ఏదీ కొత్తగా కనుక్కోలేని ఒక మరయంత్రపు జీవితం ఇప్పుడు సాగుతోంది. అందుకే కవికి ఇంత నిర్లిప్తత.

తెలంగాణ విప్లవోద్యమ స్వరం వరవరరావు. ఆరున్నర దశాబ్దాలుగా సమకాలీన సామాజిక, రాజకీయార్థిక, సాంస్కృతిక రంగాల కదలికలను ఎప్పటికప్పుడు కవిత్వం చేస్తోన్న కళాభివ్యక్తి వరవరరావు. చలినెగళ్లు, జీవనాడి, ఊరేగింపు, స్వేచ్ఛ, సముద్రం, భవిష్యత్తు చిత్రపటం, ముక్తకంఠం, ఉన్నదేదో ఉన్నట్లు, ఆ రోజులు, దగ్ధమవుతున్న బాగ్దాద్, మౌనం ఒక యుద్ధ నేరం, అంతస్స్రోతం, తెలంగాణ వీరగాథ, పాలపిట్ట తదితర కవితా సంపుటాలను వెలువరించారు.

"మీరెంత అసామాన్యులు
మట్టిలో పుట్టి మట్టిలో పొర్లాడి పోరాడి
మహోన్నత శిఖరాలకెదిగినారు
పల్లె మీ తల్లి/పాలం మీ ఒడి
ఆచరణ మీ చదువు/అనుభవం మీ గురువు
పోరాటం మీ పాఠం/ప్రజలే మీ ప్రాణం
విప్లవం మీ గురి
మీరెంత అసామాన్యులు"

(స్వేచ్ఛ కవితా సంపుటి నుండి)

ప్రజల వైపు నిలబడి, ప్రజల కోసమే ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పోరాడే కామ్రేడ్స్ త్యాగాల గురించి రాసిన కవిత ఇది.

తెలంగాణ కవిత్వాన్నే కాదు తెలుగు కవిత్వాన్నీ మలుపు తిప్పిన ఎంతో విలువైన కవిత్వం వరంగల్ జిల్లా

కేంద్రంగా పుంఖాను పుంఖాలుగా వెలువడింది. గత ఎనిమిది దశాబ్దాలుగా వరంగల్ జిల్లా కవులు సమకాలీన సమాజంలో జరుగుతున్న ఎన్నో మార్పులను ఎప్పటి కప్పుడు రికార్డు చేస్తూనే ఉన్నారు. డా. బన్న అయిలయ్య, లోచన్, కోడూరి విజయకుమార్ (రేగుపండ్లచెట్టు) వడ్డెబోయిన శ్రీనివాస్, డా. పసునూరి రవీందర్ (లడాయి, ఒంటరి యుద్ధభూమి), ఎన్. వేణుగోపాల్ (రెప్పవాల్చని కాపలా), చింతం ప్రవీణ్ , బిళ్ల మహేందర్, డా. కంది కొండ, పొట్లపల్లి శ్రీనివాసరావు, అన్వర్, అనిశెట్టి రజిత తదితరులు కొందరు మాత్రమే. కొన్ని వందల మంది వరంగల్ జిల్లా కవులు తెలుగు వచన కవిత్వాన్ని ఎంతో సంపద్వంతం చేశారు. చేస్తున్నారు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆచార్య కొలకలూరి ఇనాక్ నవలలు – దళిత స్త్రీ బ్రతుకు పోరాటం

- సురేఖ దుగులూరు
పరిశోధన విద్యార్థిని, యస్.పి.యం.వి.వి. తిరుపతి

- డా॥. వై. సుభాషిణి
అసిస్టెంట్ ప్రొఫెసర్, యస్.వి.యం.వి.వి. తిరుపతి.

ఇనాక్ గారు దళిత స్త్రీ చేత మలచబడిన మేలి శిల్పం. కష్టాలు, ఆటుపోట్లను ఎదుర్కొని కష్టించి పైకి వచ్చిన వారు కనుక స్త్రీ సమస్యలు, అందునా దళిత స్త్రీ ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటుందో తెలుసు. దళిత స్త్రీ ఆత్మస్థైర్యం మనుగడ, జీవన విధానం, బ్రతుకు పోరాటం చూస్తూ, వింటూ పెరిగారు. కావున వారి నవల్లో దళిత స్త్రీ బ్రతుకు పోరాటం వైవిధ్యభరితంగా ఉండడాన్ని మనం గమనించవచ్చు. దళిత స్త్రీల స్థితిగతులు, వారు సంఘంలో బ్రతకడానికి ఏవిధంగా బ్రతుకు పోరాటం చేస్తున్నారన్నది తెల్పడమే ఈ వ్యాస ఉద్దేశ్యం. ఒక వ్యక్తి బ్రతకడానికి చేసే పోరాటమే బ్రతుకు పోరాటం. ఇనాక్ గారి 2 నవలల్లో స్త్రీలు బ్రతుకు పోరాటం ఏవిధంగా ఉందో చూద్దాం!

అవి 1) ఎక్కడుంది ప్రశాంతి? సుందరి

2) ఇరులలో విరులు - రమ, జానికి

ఎక్కడుంది ప్రశాంతి :

నవలలో కథానాయకుడైన రామయ్య ఉరఫ్ రామూర్తి అగ్రకులానికి చెందినవాడు. దళిత కులానికి చెందిన సుందరి, రామయ్యలు ప్రేమించుకుంటారు. సుందరి రామయ్యను ప్రేమించినా పెళ్ళికి అంగీకరించదు. కారణం సుందరి అక్క రామయ్యను ప్రేమిస్తుంది. అక్క అంటే అభిమానం వల్ల తన ప్రేమను త్యాగం చేసి, అక్కను పెళ్ళాడమని పట్టుబట్టి, రామయ్య సీతలు ఒక్కటయ్యేలా చేస్తుంది సుందరి. వారి దాంపత్యానికి ఒక కొడుకు పుట్టాడు. ఇక్కడ ప్రేమించిన వాడు నాకే దక్కాలి అన్న అహం, స్వార్థం సుందరికి లేదు. సుందరి పాత్ర ద్వారా ప్రేమలో ఉన్న వ్యక్తి నాకే దక్కాలి అనే సంకుచితత్వం పోయి, ప్రేమ పరిధిని, వైశాల్యాన్ని పెంచాడు రచయిత. దళిత స్త్రీ కోరుకున్న వాడిని కూడా త్యాగం చేయగలదు అని రచయిత నిరూపించాడు.

విధి విచిత్ర రాతవల్ల సీతను, కొడుకును పోగొట్టుకుని, పిచ్చివాడులా మారిన రామయ్య నందరిని వెతుక్కుంటూ పల్లెకి వెళ్తాడు. అక్క, బిడ్డల మరణం విని బాధపడుతుంది సుందరి. సుందరికీ, రామయ్యకూ, ఇద్దరికీ ఒక్కటవ్వాలన్న కోరిక ఇద్దరిలోనూ విడివిడిగా ఉంది. కానీ రామయ్య అగుడుతాడని సుందరి, సుందరి అడుగుతుందని రామయ్య ఎదురుచూస్తూ ఎవరూ బయట పడలేక దూరమవుతాడు.

భార్యను పోగొట్టుకుని సుందరి పరాభవానికి గురైన రామయ్య గుంటూరు చేరి, అక్రమ బియ్యం వ్యాపారం చేస్తూ, బాగా సంపాదిస్తున్న రోజుల్లోనే రామయ్య రామ్మూర్తిగా మారతాడు. రామూర్తిలోని మంచి తనం చూసి, మాధవయ్య తన సినిమాహాలుకు యజమానిని చేస్తాడు. రామూర్తితో అంతకు ముందే పరిచయం ఉన్న సరోజతో రామూర్తి వివాహం జరిపిస్తాడు మాధవయ్య. సరోజ, రామూర్తి దంపతులకు ఒక కూతురు జన్మించింది. తల్లిని పోగొట్టుకున్న సుందరి, బావని, బావ కాపరాన్ని చూడాలని అక్షర జ్ఞానం లేకపోయినా రైల్లో గుంటూరుకు బయలుదేరింది. ఇంట్లో బయట ఎక్కడైనా స్త్రీ పట్ల మగాడి మానసిక స్థితి ఒక్కటే. రైల్లో ఎక్కినప్పటినుండి సుందరిని వంకర చూపులు చూస్తుండే నారాయణరావు, ఏమాత్రం పరిచయం లేని సుందరిని మా ఇంటికి వస్తావా? అని పిలుస్తాడు. కావాలనే సుందరి కాలుతొక్కగా తాచుపాము లాగా లేచి చంప చెల్లిమనిపించింది "బుద్ధి లేనోడా, వొళ్ళు బలిసిందేం కత? తిన్నక్కూకో, సితక తన్నేను (297) అని బెదిరిస్తుంది. ఈ సంఘటనను బట్టి

చూస్తే, ఎప్పుడైతే అర్ధరాత్రి ఆడది ఒంటరిగా, నడిరోడ్డుపై నడిచి పోగలదో అప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అన్న గాంధీజీ మాటలు జ్ఞప్తికి వచ్చి, పట్టపగలు కూడా స్త్రీకి ఇంకనూ పూర్తి స్వాతంత్ర్యం రాలేదనిపిస్తుంది. ఈ సంఘటన చిత్రణ ద్వారా సుందరి లాంటి సమస్యల్ని ఎదుర్కొంటున్న నేటితరం ఆడపిల్లలకు, సమస్య వస్తే సుందరిలా ధైర్యంగా ఎదుర్కొవాలనే పరోక్ష సందేశాన్ని రచయిత పాఠకులకు ఇచ్చినట్లు తెలుస్తుంది.

రామూర్తి సరోజను ఒప్పించి, సుందరిని పెళ్ళి చేసుకుంటానంటే, సరోజకు అన్యాయం చెయ్యడం ఇష్టం లేక పెళ్ళికి ఒప్పుకోదు. రామ్మూర్తికి భార్య ఉండగా తనను పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచన ఉందని తెలిసి అక్కడ నుండి పల్లెకి వెళ్ళిపోతుంది. ఒకసారి అక్కకోసం తన ప్రేమను త్యాగం చేస్తే, మరోసారి చెల్లెలాంటి సరోజకు అన్యాయం చెయ్యలేక, తానే ఒంటరి జీవితాన్ని గడపాలని, నిర్ణయించుకొని పల్లెకి వెళ్ళిపోతుంది. సరోజ పాప చనిపోయిందని తెలిసి భోరున విలపిస్తుంది. రామ్మూర్తి సరోజల విడిపోయారని తెలిసి గుంటూరు వచ్చి, ఇద్దరినీ కలిసి, వారిని కలిపే ప్రయత్నం చేస్తుంది. తన ప్రయత్నాలు వికటించడంతో, స్థిరచిత్తురాలై మూర్తిని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకుంటుంది.

కానీ అప్పటికే ఇద్దరు భార్యలను పోగొట్టుకున్న రామ్మూర్తికి జీవితం మీద విసుగుపుట్టి పెళ్ళి వద్దు అనే స్థితిలోకి వెళ్ళిపోతే, డా॥సరళతో పరిచయం వల్లే తనను నిరాకరిస్తున్నాడని తలచి, డా॥సరళతో తనకెలాంటి సంబంధం లేదని చెప్పినా వినకుండా, అపార్థం చేసుకుని "నన్ను పెళ్ళాడాలని పిస్తే మన ఊరురా, నీకోసం కోటి నోములు నోచుకుంటూ, ఎదురు చూస్తూ జీవించి ఉంటారు" (363) అని చెప్పి, స్వగ్రామం వెళ్ళి పోతుంది. చివరిరోజుల్లో రామ్మూర్తి తలపులతోనే చెక్కి శల్యమై ఉండగా, రామూర్తి వెళ్ళి పలకరిస్తే, వచ్చావా? అంటూ అతని గుండెలపై పడి చనిపోతుంది.

ఇక్కడ సుందరి జీవితంలో ఓడిపోయి చనిపోయిందా? అన్న సందేహం పాఠకులకు కలిగినట్లు అనిపిస్తుంది కానీ దళిత స్త్రీ అయిన సుందరి జీవితం అంతే త్యాగంతోనే నిండింది. అనుమానం కాస్త, మంచితనం కాస్త సుందరి జీవితాన్ని ఒంటరిని చేసింది. వాస్తవానికి ఆమె ఒంటరి కాదు. ఎప్పుడూ రామూర్తిని ప్రేమిస్తునే వుంది. ఎదుటి వ్యక్తిని ప్రేమిస్తే పెళ్ళి చేసుకుని వారికి సన్నిహితం కానవసరం లేదు. జీవితాంతం ప్రేమిస్తూనే ఉండోవచ్చు అని ప్రేమకు విస్పృత అర్థానిచ్చాడు రచయిత. అలాగే సుందరి బ్రతుకు పోరాటం అంతా ప్రేమతో ముడి పడింది.

ఇరులలో విరులు :

నవలలో రమ, జానకి ఇద్దరూ దళిత క్రైస్తవ యువతులే. రమ పేదింటి పిల్ల. జానకి తండ్రి జానయ్య సంపన్నుడు కాబట్టి జానకి సంపన్నురాలు. వీరిలో రమ పేదరికంతో పోరాడితే జానకి, తెలివి తక్కువ పనులు చేసి జీవితంతోనే పోరాడాల్సి వచ్చింది. రమకు పేదరికం వరం ఎందుకంటే త్రోవ తప్పకుండా చేసింది. జానకికి సంపన్నత శాపం. కారణం దారి తప్పేలా చేసింది. జీవితంలో పోరాడాల్సి వచ్చింది.

రమ పేదరికంలో పుట్టి పెరిగింది. తండ్రి చనిపోవడంతో తల్లికి, ఆమె తండ్రి ఇచ్చిన ఎకరం పొలంతో, సాంఘిక సంక్షేమ శాఖ ఇచ్చే స్కాలర్‌షిప్‌తో రమను చదివిస్తుంది. ఇప్పుడా పొలం కూడా లేదు. కప్పు చెదిరి పోయి ఉన్న గుడిసె ఆమె ఆస్తి. స్కాలర్ షిప్‌ను నమ్ముకుని ఎం.ఏలో చేరింది. కష్టాలతో రాటు తేలింది. కాబట్టి జీవితం పట్ల అవగాహన, జాగ్రత్త రెండూ ఉన్నాయి. తనకు ఏది అవసరమో, ఏది అవసరం లేదో తెలిసి నడుచుకొంటూ సమర్థురాలు.

కష్టాలతో, పేదరికంతో సహజీవనం చేస్తూ, మెస్‌బిల్ కట్టలేక, మంచి నీళ్ళతో కడుపు, నింపుకుని ఎం.ఏ చదువుతుంది. మెస్‌బిల్‌కు 300రూ॥లు అవసరం అయితే, క్లాస్‌మేట్ రామంను అడుగుతుంది. రామం

డబ్బు తేవడం ఆలస్యం అయ్యేసరికి సుందరం దగ్గర తీసుకుంటుంది. డబ్బు ఇచ్చిన నెపంతో రమకు దగ్గర కావాలనుకుంటాడు సుందరం. రమ, సుందరంలు సన్నిహితంగా ఉండడం సహించలేక అసూయపడి వీరిద్దరినీ విడదీస్తుంది జానకి. దాంతో రమకు ప్రమాదంతో స్నేహం తప్పింది. రమ లాగే జీవితం పట్ల స్పష్టమైన అవగాహన ఉన్న వ్యక్తి రామం. రామంతో పరిచయం ప్రేమగా మారినా, ఎక్కడా వారిద్దరూ దారితప్పలేదు. అందుకే రామం జానకితో "రమను మోసం చేయడం తేలిక కాదు. నిన్ను తేలికగా మోసగించవచ్చు (115) అంటాడు. జానకి సుందరంతో తిరిగి, గర్భం దాల్చి, సమస్యల వలయంలో చిక్కుకున్నప్పుడు సమస్య తీరే వరకూ ఆమెకు అండగా ఉంటుంది. చెడు తిరుగుళ్ళ తిరిగిన జానకీతో స్నేహం చేసినా, ఎక్కడా దారి తప్పని రమని చూస్తే, రాక్షస రాజ్యంలో ఉన్నా, రాక్షస లక్షణాలు అలవర్చుకోని విభీషణుడు గుర్తొస్తాడు.

జానకిని తండ్రి డబ్బు, విచ్చలవిడితనం దారితప్పేలా చేశాయి. నెలతప్పడానికి కారణం అయిన సుందరిని కలిసి, సమాజపు వెక్కిరింతలు చెప్పి, పెళ్ళిచేసుకోమని అడుగుదామని, అర్ధరాత్రి హాస్టల్ నుండి ఎవరూ చూడకుండా సుందరం గదికి వెళ్తే "ఇప్పుడెక్కడి నుండి వస్తున్నావు? ఏ మహాత్ముడి హస్తాలు విడిపించుకు వస్తున్నావు? ఈ వారం నుండి ఏ మహానుభావుణ్ణి ఆనంద పరిచావు" (131) అంటూ బయటకు నెట్టితే ఆమె తలుపు పైబడి స్పృహకోల్పోతుంది. ఆమె ముఖంపై నీళ్ళు చల్లితే, స్పృహలోకి వస్తుంది. స్పృహలోకి వచ్చిన ఆమెను మళ్ళీ బెడ్‌రూంలోకి తీసుకెళ్ళబోతే, తప్పించుకొని అతన్ని దూరంగా నెట్టి "సిగ్గు ఉన్నవాడెవ్వడూ, మానవత్వం గల మనిషి ఎవ్వడూ, లజ్జాభిమానాలున్న వాడెవ్వడూ అక్కరలేదనుకున్న మనిషిని అంటుకోజూడడు..... నీ బ్రతుకులో చీకట్లు కలిగి, నువ్వు సర్వనాశనమై, నా పేరు తలుచుకుంటూ చచ్చేదాకా నిన్ను వదలను నేను చావను". (132) అంటుంది. మామూలుగా ఇలాంటి పరిస్థితుల్లో స్త్రీకి మొదట వచ్చే ఆలోచన ఆత్మహత్య. అమ్మ తిట్టిందనో, నాన్న దండించాడనో ఆత్మహత్య చేసుకునే వాళ్ళని చూస్తున్నాం. తన శీలాన్ని కోల్పోయి, గర్భాన్ని ధరించిన ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో దళిత స్త్రీ ఎంత గుండె నిబ్బరంతో పోరాటం చేయగలదో జానకి పాత్ర ద్వారా రచయిత స్పష్టం చేశాడు. "తెగించినోడికి తెడ్డే లింగం" అన్నట్లు జానకి తెగించింది. కనుకనే "ఇంతా అయిం తర్వాత నిన్ను నాశనం చేయకుండా వుండను. ఏం చేయడానికైనా కావల్సిన సాక్ష్యాలు, సామర్థ్యం నాకున్నాయి. వస్తాను" (133) అని సుందరాన్ని బెదిరిస్తుంది.

అంటే జానకి ఉద్దేశం తప్పు చేసిన సుందరాన్ని సాక్ష్యాలతో నైనా న్యాయస్థానానికి వెళ్ళి, తాను చేసిన తప్పుకు తనను పెళ్ళి చేసుకొనేలా చెయ్యగలను అన్న ధీమా జానకి మాటల్లో కన్పిస్తుంది. ఇక్కడ దళిత స్త్రీ అయిన జానకి సమస్య నుండి పారిపోవాలనుకోలేదు. సామదాన బేద దండో పాయాలతో దేనితోనైనా సుందరం మెడలు వంచి, తాళికట్టించుకోడానికే సిద్ధమైంది. పెళ్ళికి అంగీకరించకపోగా, పరుషంగా మాట్లాడి ఆమె శీలాన్ని శరికించి సుందరం అంబేద్కర్ అన్నట్ల "వినయం, శీలనం లేని విద్యావంతుడు మృగం కంటే హీనుడు". అలాంటి మృగాన్ని నువ్వు మనిషిని కావు. పశువ్వి అంటుంది. దళిత స్త్రీలకు తప్పు చేసిన వారిని పరుషంగా మాట్లాడడంతో పాటు, ఆదరించిన వారిని అభిమానించడమూ తెలుసు సుందరం కాదనా, తనను పెళ్ళి చేసుకొంటానన్ని రామంని అభినందిస్తుంది.

లెక్చరర్ రాజేశ్వరి చొరవ సుందరాన్ని, అతని తండ్రిని జానికితో పెళ్ళికి అంగీకరించేలా చేస్తుంది. వీరిద్దరిలో రమ పరిస్థితులలో పోరాడి జీవితాన్ని నిలుపుకుంటే, జానకి బ్రతుకుతో పోరాడి జీవితాన్ని నిలుపుకుంది.

ఆచార్య ఇనాక్ గారి నవలల్లో దళిత స్త్రీలు ఎక్కడా నిరాశానిస్పృహలకు లోనైట్టుగానీ, అధైర్య పడ్డట్టుగానీ కన్పించరు. చిన్నప్పటి నుండి తల్లిని, ఆమె తెగువను,

ధైర్యాన్ని, గట్టదనాన్ని, మొండితనాన్ని చూస్తూ పెరిగిన ఇనాక్ గారు, తన నవలల్లోని దళిత స్త్రీ పాత్రలను కూడా ఎలాంటి సమస్యలనైనా, ఎదుర్కొని, పోరాడి జీవితాన్ని నిలుపుకునేట్లు చిత్రించారు. వీరి దళిత స్త్రీ పాత్రల్లో ఎక్కడా ఆత్మహత్య అన్న ఆలోచన గానీ, వెనకడుగు అన్న తలంపు కానీ లేదు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాతృభాషతోనే మనోవికాసం – నూతన జాతీయ విద్యా విధానం 2020

– డా॥. భూక్యా రాజారాం, తెలుగు బోధకులు, శ్రీ చక్రా కాలేజ్ అఫ్ ఎడుకేషన్, రంగారెడ్డి.

వ్యక్తి తన తల్లి ఒడిలో పాలు తాగుతూ ఉన్నప్పుడే అప్రయత్నంగా, సహజంగా అలవడిన భాషే మాతృభాష. ప్రపంచంలోని ప్రతి మానవుడు తన ఆలోచనలను ఇతరులకు తెలుపడానికి, ఇతరుల ఆలోచనలను తెలుసుకోవడానికి ఉపయోగించుకునే మాధ్యమమే భాష. భాషకు లిపి, భాషాసూత్రాలు, వ్యాకరణం, సాహిత్యము ముఖ్యమైన అంశాలు.

ఒక ప్రత్యేక భాష మాట్లాడే ప్రజలందరి చరిత్ర, సంస్కృతి, వారసత్వం, వారి ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లన్నింటి సమాహారమే ఆ భాషకు ప్రత్యేకమైన అస్తిత్వాన్ని తెలియజేస్తాయి. వందల సంవత్సరాల మానవ సామూహిక ప్రయత్నాల ద్వారా సంపాదించిన విజ్ఞానం ఆ భాషలో ఇమిడి ఉంటుంది. కవులు, రచయితలు, తాత్వికులు, శాస్త్రజ్ఞులు, తమ అనుభవాల ద్వారా గడించిన జ్ఞాన సంపద ఆ భాషా సాహిత్య ప్రక్రియలలో వ్యక్త పరచబడి ఉంటుంది. భాషను కేవలం భావ ప్రసార మాధ్యమంగా మాత్రమే చూడటం భాషను సంకుచిత పరచడం అవుతుంది. భాష గురించి భారతీయ ప్రాచీన కవి ఆచార్య దండి తెలియజేస్తూ "భాష యొక్క కాంతి లేకపోతే మనం చీకటి ప్రపంచంలో జ్ఞానాన్ని వెదకటం లాంటిది" అంటూ భాష యొక్క ఆవశ్యకతను తెలియ జేశారు. మాతృభాష ఆవశ్యకత, భారతదేశంలో ప్రస్తుతం అంతరించిపోతున్న భాషలు మరియు నూతన జాతీయ విద్యా విధానం 2020లో మాత్రుభాషల ప్రాధాన్యతను తెలుపడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశము.

ముఖ్యంశాలు : మాతృభాష ఆవశ్యకత, భారతదేశంలో ప్రస్తుతం అంతరించిపోతున్న భాషలు, నూతన జాతీయ విద్యా విధానం 2020లో మాత్రుభాష ప్రాధాన్యత.

భాష మానవ అవసరాలకు అనుగుణంగా ఎప్పుడూ మార్పు చెందుతూ ఉంటుంది. భాష అవసరాలను బట్టి పెరగడం కుచించుకుపోవడం, రూపాంతరం చెందడం, ప్రత్యేకమైన ఈ పరిస్థితులలో విలీనం కావడం, జన వ్యవహారంలో లేని భాష నశించిపోవడం లాంటివి భాష పరిణామక్రమంలో వివిధ దశలుగా మనకు అర్థమవు తుంది. ఒక భాష అంతరించిపోవడమంటే వేల సంవత్స రాల మానవ మేధోపరమైన సంపదను ఈ సమాజం శాశ్వతంగా కోల్పోవడమే. యునెస్కో డైరెక్టర్ జనరల్ గా వ్యవహరించిన కోయిచిరో మత్సుర "ఒక భాష మరణం ఆ జాతి సాంస్కృతిక వారసత్వానికి చెందిన అనేక రూపాలను అదృశ్యం చేస్తుందని అన్నారు. ముఖ్యంగా వెలకట్టలేని ఆచార వ్యవహారాలు, పద్యాలు, సామెతలు, నుడికారాలు చమత్కారాల రూపంలో ఉండే ఆ జాతి మౌఖికంగా భావ వ్యక్తీకరణలను, ఆ జాతి నివాసిత ప్రాంతాలకు సంబంధించిన పర్యావరణ సమాచారం ఆ భాషలోనే నిక్షిప్తమై ఉంటుంది. ఏ భాష అంతరించిన మానవ మేధలో కొంత భాగం అంతరార్థమైనట్లే" నని భాష నశించడం వల్ల కలిగే నష్టాలను తెలియపరిచారు. అనేకమైన భాషలకు, యాసలకు పుట్టినిల్లు భారతదేశం. భారతదేశం విభిన్న సంస్కృతులు, సాహిత్యాలు, వైవిధ్యత, భావ వైరుధ్యాలు కలిగిన శాంతియుతమైన, మహోన్నత మైన నాగరికత వ్యవస్థ కలిగినది. భారతదేశంలో దాదాపు 3.772 భాషలు మాట్లాడే వారు ఉన్నారు. ప్రపంచంలో ఇన్ని భాషలు మాట్లాడే దేశం కాన రాదంటే అతిశయోక్తి కాదు.

నేడు ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ ధోరణుల మూలంగా ప్రపంచమే ఒక కుగ్రామంగా రూపుదాల్చింది. ఈ సాంకేతిక విజ్ఞానంతో అనేకమైన

నూతన ఆవిష్కరణలు ఆవిష్కరించబడ్డాయి. ఆంగ్ల భాషలో విద్యనభ్యసించడం అనేది "ఆంగ్ల భాష అనే గవాక్షం నుంచి ప్రపంచాన్ని చూడడం వంటిది" అని అన్నారు నెహ్రూ. కనుకనే నేడు ఆంగ్ల మాధ్యమాన్ని అభ్యసించడానికి తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజ మాన్యాలు, ప్రభుత్వాలు ఆంగ్ల భాష పట్ల శ్రద్ధను కనబరుస్తున్నాయి. భారతదేశంలోని అనేక రాష్ట్రాలు ఆంగ్ల భాషనూ ప్రధాన బోధనా మాధ్యమంగా అమలుకు ఉపక్రమించాయి. ఇటీవలికాలంలో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలు కూడా ప్రభుత్వ పాఠ శాలలలో ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు ఉపక్ర మించాయి. దీనికి ప్రధాన కారణం ప్రస్తుత సరళీకృత ఆర్థిక వ్యవస్థలో ఆంగ్లభాషను అభ్యసించిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు లబించడం. వాటిని అందిపుచ్చు కోవడానికి తమ పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దాలని తల్లిదండ్రులు ఆలోచించడం.

నేడు ప్రమాదంలో అనేక మాతృభాషలు :

భారతదేశం అనేక భాషలకు పుట్టినిల్లు. విభిన్నమైన సంస్కృతులు, సాంప్రదాయాలు, భౌగోళిక పరిస్థితులు సానుకూలతలుగా ఇందుకు దోహదపడ్డాయి. కానీ కాలక్రమంలో చాలా భాషలు వాడుకలో లేకుండా కను మరుగైపోతున్నవి. 2011 జనాభా లెక్కలలో సేకరించిన భాష సంబంధిత సమాచారాన్ని క్రోడీకరించి భారత జనాభా లెక్కల కార్యాలయం 2018 లో భాషల నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం మన దేశం మొత్తం 19,569 భాషలు, మాండలికాలకు నిలయంగా ఉంది. హేతుబద్ధీకరణ అనంతరం ఈ సంఖ్యను 1369 వర్గీ కరించబడిన, 1474 వర్గీకరించబడలేని మాతృభాషలుగా తేల్చడం జరిగింది. అయితే 10 వేలకు మించి ప్రజలు మాట్లాడే భాషలు కేవలం 121 మాత్రమే ఉన్నాయని తేలింది. భారతదేశ మొత్తం జనాభాలో, 96.71 శాతం మంది 22 షెడ్యూల్డ్ భాషలలోని ఎదో ఒక దానిని మాతృభాషగా కలిగి వుండడం, కేవలం 3.29 శాతం మంది మాత్రమే మిగిలిన భాషలను మాట్లాడుతుండటం ఆయా భాషల క్షీణతను ఈ గణాంకాలు కళ్ళకు కడుతున్నవి.

ఇటీవలి కాలంలో ప్రముఖ భాషాశాస్త్రవేత్త 'గణేష్ దివే' ఆధ్వర్యంలో 'పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా' నిర్వహించిన మరో అధ్యయనం మాత్రం భారతదేశంలో ప్రస్తుతం మొత్తం 780 భాషలు ఉండగా అందులో 600 భాషలు అంతరించిపోతున్న దశలో ఉన్నాయని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా యునెస్కో గుర్తించిన, అంతరించి పోతున్న భాషల సంఖ్యలో ఇది 10 శాతమునకు సమానం. గత 60 సంవత్సరాల కాలంలో మన దేశంలో దాదాపు 250 భాషలు కనుమరుగైపోయాయని ఇతని అభి ప్రాయం.

దేశంలో 22 షెడ్యూల్డ్ భాషలు, 31 భాషలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారిక భాషలుగా గుర్తింపబడగా, చాలావరకు గిరిజన భాషలు అంతరించి పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నవి. ఒక భాషను మాట్లాడే ప్రజలు పదివేల మంది కంటే తక్కువ ఉన్నట్ల యితే దానిని అంతరించిపోయే దశలో ఉన్న భాషల జాబితాలో చేరుస్తారు. వీటిని పరిరక్షించడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తరపున అనేకమైనటువంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మైసూరులోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ వీటిని పరీక్షించుటకు ఏర్పాటు చేయబడిన సంస్థ.

భారత భాషా శాస్త్రవేత్త గణేష్ దివే ప్రకారం సహజ వనరులైన గాలి, నీరు వలే కాకుండా భాష అనునది మానవ ప్రయత్నం ద్వారా నిర్మితమైనది. ఒక భాష జనించవలేనంటే వేల సంవత్సరాల మానవ ప్రయత్నం అవసరం. భాషలు అంతరించిపోవడాన్ని అనుమతించడం అంటే మన పూర్వీకులకు, మన ముందు తరాల వారి కృషికి మనం తీరని అన్యాయం చేస్తున్నట్లే లెక్క. అంతరించిపోతున్న భాష తనతో పాటు తనకే ప్రత్యేకమైన విజ్ఞాన సంపద, సాంప్రదాయిక జీవన విధానాలు,

నైపుణ్యాలు, కలలు, హస్త కళలు మరియు వ్యాపార రీతులను కూడా అది తనతోపాటు అంతర్ధానం చేసుకొని వెళ్తుంది.

2020 - నూతన జాతీయ విద్యా విధానంలో మాతృభాష :

ఈ సందిగ్ధ కాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ విద్యా విధానం -2020, నాణ్యమైన విద్యకు మరియు మాతృభాషలో విద్యాబోధనకు ఉన్న లంకెను గ్రహించి కొన్ని కీలకమైన ప్రతిపాదనలు చేసింది. ఈ ప్రతిపాదనలు క్షేత్రస్థాయిలో విద్యా రంగం అంతటా అమలు జరిగితే పిల్లలకు అవగాహనతో కూడిన విద్య అందడమే కాకుండా భారతదేశంలో అంతరించిపోయే దశలో ఉన్నా భాషలకు ఇవి జవసత్వాలు జోడిస్తాయనడంలో సందేహం లేదు.

నూతన జాతీయ విద్యా విధానం విద్యార్థులకు కనీసం 5 వ తరగతి వరకూ, సాధ్యమైనంతవరకూ ఎనిమిదవ తరగతి తదనంతరం కూడా, మాతృభాషలోనే విద్యాబోధన జరపాలనే విధానం నూతనంగా ఆ భాషలో మాట్లాడే వారిని తయారుచేస్తుంది. త్రిభాషా సూత్రం అమలు మరియు నాణ్యమైన పుస్తకాలు, బోధనోపకరణాలు ద్విభాషలలో (Bilingual) సమకూర్చి ఇవ్వడం వలన ఆ విద్యార్థికి మాతృభాషతో పాటు ఇతర భాషలలో ప్రవేశానికి మార్గం సుగమం అవుతుంది.

ఆయా భాషలలో డిక్షనరీలు, వీడియోలు, పద్యాలు, నవలలు, నాటికలు, పత్రికలు రూపొందించడం వలన భాషలు. కాలానుగుణమైన మార్పులు చేసుకొని శక్తివంతంగా పరిణామం చెందుతాయి. ప్రపంచంలో ప్రాచుర్యంలో ఉన్న ఆంగ్లము, ఫ్రెంచి, జర్మనీ, హిబ్రూ, కొరియన్ మరియు జపనీస్ వంటి భాషలలో త్వరితంగా సాంకేతిక వైజ్ఞానిక భావనలకు సరిపోవు పదాలను తయారు చేయు ప్రక్రియ నిరంతరం జరుగుతూ ఉంటుంది. ఆ విధమైన ప్రయత్నాలు చేయడానికి మన దేశంలో కూడా జాతీయ విద్యా విధానం సంకల్పించడం హర్షించదగ్గ విషయం.

మాతృభాషలో బోధనకు భాషా బోధకులు చాలా కీలకం. విశ్వవిద్యాలయాలలో, బహుళ విభాగాలతో కూడిన కళాశాలలలో సమీకృత ఉపాధ్యాయ కార్యక్రమాలను అమలుపరుస్తూ భారతీయ భాషలు, తులనాత్మక సాహిత్యం, సృజనాత్మక రచన, కళలు, సంగీతం, తత్వం వంటి అంశాలపై కఠోరమైన శిక్షణ భాషా బోధనతో పాటు ఇతర విద్యా సంబంధిత అంశాలలో విద్యార్థులను నిష్ణాతులుగా మార్చగలదు. సాహిత్యం, పదాలు, వ్యాకరణం వంటి విషయాలను మాత్రమే స్రూసించేదిగా కాకుండా పిల్లలకు అనుభవ పూర్వకమైన జ్ఞానమును ప్రసరింపజేయునదిగా భాషా బోధనను మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది. పరస్పర ప్రతిచర్యలలో బోధనాభ్యసనలలో భాషలను విరివిగా ఉపయోగించాలని జాతీయ విద్యావిధానం నిర్దేశించినది.

భాష ఇతర ప్రాముఖ్యత కోల్పోతున్న భాషలను బోధించు శిక్షణ పొందిన నిష్ణాతులు దొరకడంలో ఉన్న ఇబ్బందిని గమనించి జాతీయ విద్యా విధానం తాత్కాలికంగా స్థానిక సమాజంలో ఉన్నటువంటి మానవ వనరులను స్వీకరించుటకు అవకాశం ఇవ్వడంతో పాటు దీర్ఘకాలంలో ఉపాధ్యాయ శిక్షణ వైపు ప్రోత్సహించుటకు విద్యార్థులకు ఉపకార వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించి. ఆయా భాషలలో శిక్షణ పొందిన మానవ వనరులను తయారు చేయుటకు ఇది ప్రాధాన్యత ఇచ్చింది.

భారతీయ భాషలలో నాణ్యమైన అభ్యసన వనరులను తయారు చేయుటకు 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్ లేషన్ అండ్ ఇంటర్ప్రిటేషన్' (ఐఐటిఐ) ఏర్పాటు చేయబడుతుంది. దీని యొక్క ముఖ్యలక్ష్యం భారతీయ భాషలను అభివృద్ధి పరచడం. ఈ అనువాద ప్రయత్నాలను వికేంద్రీకరించాలని నొక్కి చెబుతూ ప్రతి విశ్వ విద్యాలయం మరియు ఉన్నత విద్యా సంస్థ

సంస్కృతంతో పాటు. ఇతర భారతీయ భాషల అధ్యయనంను నూతన ఉత్తేజంతో ప్రోత్సహించడం కీలకమని జాతీయ విద్యా విధానం వివరించింది. సంస్కృత విశ్వవిద్యాలయాలు, కళాశాలలు కూడా 'బహుళ విభాగాల' (Multidisciplinary) విద్యా సంస్థలుగా మారబోతున్నాయి. భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్లో పేర్కొన్న ప్రతి భాషకు అకాడమీలు ఏర్పాటు చేయబడతాయి.

భారతీయ భాషల పరిరక్షణలో సాంకేతికతను విరివిగా వాడాలని కూడా జాతీయ విద్యా విధానం సూచించింది. భాషలు వాటి అనుబంధ కళలు మరియు సంస్కృతులను వెబ్ ఆధారిత వనరులు లేదా వికీపీడియా వంటి పోర్టల్ ద్వారా డాక్యుమెంట్ చేయబడాలని, నిష్ణాతులకు తమ నైపుణ్యాలను వీడియోలు, నిఘంటువులు, రికార్డింగ్లు, కథలు, కవితలు, నాటకాలు, జానపద పాటలు ప్రదర్శించటానికి ఇవి ఉపయోగపడాలని సూచించింది. సంబంధిత అంశాలలో జరిగే పరిశోధనలకు "నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ - ఎన్ ఆర్ ఎఫ్" ద్వారా నిధులు అందజేయబడతాయి.

ముగింపు :

మాతృభాషల పరిరక్షణ "బహుళ భాషా వాదము" (Multilingualism) ను పెంపొందించడంలో అతి ముఖ్య సహాయకారిగా కూడా తోడ్పడుతుంది. కొలంబియా విశ్వవిద్యాలయ ఆచార్యురాలు కరోల్ బెన్సన్ ప్రతిపాదించినట్లు వ్యక్తి మొదటగా నేర్చుకున్న భాష నైపుణ్యాలు ఎంత సమర్ధవంతగా ఉంటే తరువాతి దశలలో నేర్చుకోబోయే భాష మరియు గ్రాహ్యత అంత బలంగా ఉంటాయి. ఒక సమాజంలోని ఆధిపత్యపు భాషను బోధనభాషగా అమలు పరుస్తే విద్యార్థులు ఆ భాషను అభ్యసించుటలో మరియు స్థూలంగా పాఠ్యప్రణాళికకు సంబంధించిన అంశాలు అర్థం చేసుకోనడంలో అడ్డంకిగా మారుతుందని దశాబ్దాల తరబడి జరుగుతున్న పరిశోధనలను ఆమె ఊటంకించినది. అయితే, ప్రస్తుతం కేవలం విద్యాసంస్థల వరకే భాష పరిరక్షణ చర్యలు పరిమితం కావడం వలన ఆశించిన ఫలితాలు రావడం లేదు. యునెస్కో నిర్ధారణ ప్రకారం విద్య, పని ప్రదేశాలు, మాస్ మీడియా, ప్రభుత్వ వ్యవహారాల్లో వాడుకలో ఉండే భాష మాత్రమే ఎల్లకాలం నిలుస్తుంది. వ్యక్తి జీవితంనకు సంబంధించిన అన్ని రంగాలలోకి ఈ చర్యలు వ్యాపించాల్సిన అవసరం ఉంది. సమాచార ప్రసారం, వ్యాపార వ్యవహారాలు, ప్రభుత్వ కార్యాలయాల వ్యవహారాలు ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులు, సామాజిక మాధ్యమాలు, మొబైల్ కంప్యూటర్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలతో కూడా మాతృభాషను వినియోగించే అవకాశాలు పౌరులకు రావాలి. మాతృభాషలో చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాధాన్యం, తగిన ప్రోత్సాహకాలు, మాతృభాషలలో రచనలు చేసే వారికి అవార్డులు రివార్డులు ఇవ్వడం ద్వారా వారికి తగిన గుర్తింపు లభించి ఒక గుణాత్మకమైన మార్పుకు ఇవి దోహదపడగలవు ఇందుకోనం వ్యక్తిగతంగా, వ్యవస్థాగతంగా అంకిత భావంతో కూడిన ప్రయత్నాలు జరగాల్సివుంది. ఆ దిశగా నూతనంగా ప్రకటించిన జాతీయ విద్యా విధానం స్ఫూర్తిని అందరూ అందిపుచ్చుకొని అకుంటిత దీక్షతో మాతృభాషల పరిరక్షణకు కంకణబద్ధులవుతారని ఆశిద్దాం.

ఆధార గ్రంధాలు :

1. నూతన జాతీయ విద్యా విధానం 2020 రిపోర్ట్.
2. ముదిగంటి సుజాత రెడ్డి, మన బతుకు భాష, దినపత్రిక నమస్తే తెలంగాణ, 21 ఫిబ్రవరి 2021.
3. తెలుగు బోధన అభ్యసన శాస్త్రం, బి. ఎడ్, తెలుగు అకాడమి, హైదరాబాదు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి సాగర సంగమం కథ – దళిత చైతన్యం

– డా॥. గుండ్లూరు వెంకట రమణ, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గణపవరం, ప.గో. జిల్లా.

'సాగర సంగమం' అనే కథను కథక చక్రవర్తి 'శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి' రాశారు. మన భారతదేశం 19, 20 వ శతాబ్దాలు బ్రిటీష్ వారి పరిపాలనలోనే మగ్గిపోతూ వచ్చిందనే విషయం తెలిసిందే. అయితే వారి ప్రభావం పరోక్షంగా, కొన్నిసార్లు ప్రత్యక్షంగా తెలుగు సమాజం మీద, సాహిత్యం మీద కూడా పడింది.

బ్రిటిష్ వారు స్థానిక విషయాలలో పట్టు సాధించడం కోసం మన భారతీయ భాషలను నేర్చుకున్నారు. వారి ఇంగ్లీష్ భాషను మనకు నేర్పించారు. ఇదంతా ముద్రణా యంత్రం గొప్పతనమని వేరే చెప్పక్కర్లేదు. అదికూడా వారి పుణ్యమే. ఇంగ్లిష్ భాషను నేర్పే క్రమంలో బైబిల్‌ను ముద్రించి దాన్ని మన భారతీయ సమాజానికి పరిచయం చేశారు. ఇది కొన్ని వర్గాల వారిని ముఖ్యంగా దళిత వర్గాల్ని బాగా ఆకర్షించింది. ఎందుకంటే ఈ సమాజం అప్పటికే చాతుర్వర్ణ వ్యవస్థతో కుళ్ళి కంపుకొడుతూ ఉన్నది గనక. వాళ్ళని ఏ గుడిలోకి, ఆలయంలోకి ప్రవేశించనిచ్చేవారు కాదు. కాబట్టి అగ్ర వర్ణాలవారికి అదొక మత ప్రచారంగా కనపడటం వల్ల వాళ్ళు అంతగా దానిపై సుముఖత చూపించి ఉండకపోవచ్చు. ఏదయినా కానీ ఒక కులం ఇంకో కులంతో కలవటానికి ఎవరూ ఒప్పుకొనని పరిస్థితుల్లో క్రైస్తవ్యం కొంత ఆ కులం బూజుని కొంత దులిపి పారేసిందని చెప్పవచ్చు. శ్రీపాద ఈ విషయాలు పట్టుకొని ఒక అద్భుతమైన కథను రాశారు. అదే ఈ సాగర సంగమం కథ.

ఇతివృత్తం : కాటం రాజు అనే ఒక మాల అబ్బాయి, సోమాలి అనే మాదిగ అమ్మాయి ఒక రెడ్డి ఇంట్లో పని చేస్తున్న క్రమంలో పరస్పరం ఒకరినొకరు ప్రేమించుకోగా, వారిరు వర్గాల కుల పెద్దలు అంగీకరించకుండా కులం నుండి వెలివేస్తామన్నప్పుడు వారి రెండు కుటుంబాలు దేవ సహాయం గారి సహాయంతో కిరస్థానీ మతం (క్రైస్తవ మతం) లో చేరి పెళ్ళి చేసుకోవడమే ఇందులోని ఇతి వృత్తం.

కాటం రాజు, సోమాలి పేరెడ్డి ఇంట్లో పనిచేస్తూ ఉంటారు. ఒకరి పట్ల ఒకరికి పరస్పర ఇష్టం ఉండటం వల్ల ఒకరిని విడిచి మరొకరు ఉండలేకపోతారు. అనేక సరదా కబుర్లు చెప్పుకుంటూ శ్రమ తెలీకుండా పని చేస్తుంటారు. సరిగ్గా ఇలాంటప్పుడు రంగమ్మ అక్కడికొచ్చి వాళ్ళను చూసి ముచ్చట పడి సరసంగా నాలుగు మాటలని వెళ్ళిపోగా వాళ్ళిద్దరూ ఫక్కున నవ్వుకుంటారు. పరస్పర ప్రేమికులు కాబట్టి. ఈ విషయాన్ని గంగన్నకు చెప్పకుండా "నీ కూతురికింకా పెళ్ళి చెయ్యవుటరా గంగడూ !" అంటుంది. సోమాలి నాన్న గంగన్న. చేయాలమ్మా. దానికి మీరే సాయం చేయ్యాలంటాడు. సరే చేస్తానని చెబుతుంది. అయితే సోమాలిని రోజూ ఇంటికి తప్పకుండా పంపించమంటుంది. పంపిస్తానని చెప్పి గంగయ్య పొలానికి వెళ్తాడు.

ఒకనాడు కాటంరాజు చెట్టెక్కి అందులో ఉండే యెండిన రెమ్మల్ని విరుస్తుండగా సోమాలి కిందుండి వాటిని పోగేస్తుంటుంది. దీన్ని గంగయ్య చూస్తాడు. వాళ్ళిద్దరూ ఒక్కసారిగా ఉలిక్కిపడతారు. ఆ రెమ్మల్ని మీ కోసమే తెంపానంటాడు. నువ్వు మంచోడివి బాబు. వచ్చే పెళ్ళాన్ని బాగా చూసుకో అంటూ గంగయ్య వెళ్ళిపోతాడు. సోమాలి కాటంరాజు ఊపిరిపీల్చుకుంటారు. కాటంరాజుని వదిలి వెళ్ళలేక 15సార్లు వెనక్కి తిరిగి చూస్తూ ఇంటికి చేరుకుంటుంది సోమాలి.

సోమాలి వేషం, ప్రవర్తన అన్నీ మారిపోతాయి. వంట ముసలమ్మ కబుర్లు సోమాలికి చాలా ఆసక్తిగా ఉండటం వల్ల ఆమెతోనే ఎక్కువ సమయం రెడ్డి గారింట్లోనే

గడుపుతుంది. ఎవరికీ బయట వాళ్లకు కనబడదు. రెడ్డి అరుగు మీద కూచునుండగా కాటం రాజు పాలం నుంచి ఇంటికొస్తాడు. రెడ్డి సోమాలిని చూపిస్తూ "ఓరేయి! సోమాలు పెళ్ళి కూతురులాగ వుందిరా." అనంటాడు. రంగమ్మ కలుగజేసుకుని కాటణ్ణి మీరు పెళ్ళి చేయండం టుంది. సోమాలి, కాటంరాజుల హృదయాలు ఉప్పొంగి పోతాయి.

కాటంరాజు తండ్రి నరిసీములు, తల్లి పోలమ్మ. వీరిది మాలపల్లి. కాటంరాజు సోమాలి ఇచ్చిన నీల్లు తాగాడని, ఆమె ఇచ్చిన పచ్చడి నంజుకున్నాడని, కుల పెద్దలందరూ సమకూడి కాటంరాజు కుటుంబాన్ని కులం నుండి వెలివేస్తామని అంటారు. అటు మాలలకీ, ఇటు మాదిగలకీ దూరం అయిపోతామని నరిసీములు బాధ పడ్తుండగా, పోలమ్మ వారి గత జీవితాన్ని గురించి చెప్పి ధైర్యం పోస్తుంది. నరిసీములు బొబ్బిలి కథ చక్కగా పాడటం వల్ల మనసుపడి పోలమ్మ అన్నల్ని, వదినల్నీ, చివరకు భర్తనీ వదిలేసి వచ్చేస్తుంది. కోరుకున్న మొగుడు దొరికితే కులమెందుకని ప్రశ్నిస్తుంది పోలమ్మ. మాదిగ పల్లిలోనూ ఇలాగే గంగన్నను నిలదీసి సోమాలిని గురించి చెప్తారు. దానికేం తెలీదు చిన్నపిల్ల అనంటాడు గంగయ్య. "వారం రోజుల్లో నీ కూతురికి పెళ్ళి చెయ్యకపోతే కులంలో నుంచి నిన్ను కేటాయించేస్తా" మని ఖచ్చితంగా ఊరి పెద్దలందరూ గంగన్నతో అంటారు. గంగన్న నేరుగా రంగమ్మ దగ్గరకు ఈ విషయమై మాట్లాడటానికొస్తాడు. సోమాలి అక్కడే ఉంటుంది.

కాటంరాజు తల్లిదండ్రులు దేవసహాయం, మధురం అనేవాళ్లను ఈ విషయమై మాట్లాడటానికి సంప్రదిస్తారు. దేవయ్య మాల. మధురం వెలమ. వీల్లు కిరస్తానీ మతం పుచ్చుకుని కులభేదం లేకుండా పెళ్ళి చేసుకొని ఉంటారు. వీరిద్దరు క్రైస్తవమతం గురించి ఒకరి తర్వాత ఒకరు ఉపన్యాసాలిచ్చి క్రైస్తవ మతంలో కలిసేటట్లు చేస్తారు. గంగయ్య పెళ్ళి విషయం మాట్లాడ్డానికి రెడ్డి ఇంటికొచ్చి అన్నీ చెప్తాడు. పేరెడ్డి, రంగమ్మలు సోమాలికి కాటనితో పెళ్ళి జరిపించి ఇక్కడే ఉంచుకుంటామని ఏం భయమ వసరం లేదని చెప్తారు. రంగమ్మ సోమాలినడిగి ఆమె ప్రేమ విషయాలన్నింటినీ తెలుసుకుని కొంత ధైర్యాన్ని నూరిపోస్తుంది. కాటన్ని చేసుకొని సుఖపడుమని చెబుతుంది. అలా మనసుకు ఆసరా కల్పించి కాటంరాజు దగ్గరికెళ్ళి మాట్లాడమంటుంది. సోమాలి మెల్లిగా లేచి వెళ్ళి నూతి వైపు వెళ్తుంది. కాటంరాజు అక్కడ చెట్లకు నీళ్ళు కడుతూ ఉంటాడు. రెడ్డి గంగన్నకు మాట ఇవ్వడం వల్ల తాను కూడా సోమాలినిచ్చి పెళ్ళి చేయడానికి ఒప్పుకుంటాడు. నగలు చేయుమని రంగమ్మ సన్నాసి రెడ్డికి డబ్బులిచ్చి ఉంటుంది. సోమాలి పొంగిపోతుంది. అక్కడికి అప్పుడే దేవసహాయం వస్తాడు. ఇరువురు ఈ విషయం మాట్లాడుకుంటారు. ఇరువురికి పెళ్ళౌతుంది. ఒక వారం తర్వాత యాకూబూ, దావీదూ కాలువ గట్టున కూర్చుని "మాలాడికీ మాదిగదానికీ పెళ్ళా? ఎక్కడైనా జరిగిందా యిలాగా?" అని అనుకుటుంటారు. చివరికి "కిరస్తానీ మతం మంచిది కాదోస్" అననుకుంటారు.

శ్రీపాద వారు 1931లో ఈ కథను రాశారు. సాధా రణంగా మాలలకూ మాదిగలకూ సఖ్యత ఉండదు. ఒకరి నొకరు కలుపుకొనిపోరు. ఒకరి ఇళ్ళలోకి మరొకరు వెళ్ళరు, తినరు. ఇలాంటి సమయంలో క్రైస్తవ మతం ప్రవేశించటం వల్ల ఏ కుల, జాతి, మత భేదాలు లేకుండా అందరూ సమానంగా మెలుగుతూ, కొంతలో కొంత మార్పు అనేది సమాజంలో చోటు చేసుకుంది. ఇట్లా క్రైస్తవ మతంలో చేరితే ఏ భేదాలుండవని తెలిసి కాటంరాజు, సోమాలీ లిరువురు కిరస్తానం తీసుకుని పెళ్ళి చేసుకుంటారు. ఇదొక సామాజిక మార్పుకు నాందిగా చెప్పవచ్చు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అనుబంధాలకు చిరునామా 'మహీధర' నవలలు

- కచ్చళ్ళ బలరామ్, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

1961లో మహీధర రామమోహనరావు వ్రాసిన నవలకు ఆయన ఎంచుకున్న పేరు ''కత్తులవంతెన''. గడిచిన కాలానికీ, రాబోయే కాలానికీ మధ్య ప్రస్తుతం నడుస్తున్న కాలాన్ని వంతెనగా భావిస్తారు. రచయిత ''గతంలోని అభివృద్ధి నిరోధక అంశాలను వదిలేసి, పురోగామికరమైన భవిష్యత్తును సాధించాలంటే వర్తమానంలో సంఘర్షణ తప్పదంటూ,ఆ వంతెన సరళమైన సామ్యాన్యమైనదీ కాదనీ, మహానిడివైనా వంతెన కత్తుల వంతెన లాంటిదం టారు. అయినా తరం ఆ వంతెనను ధైర్యంతో, సాహసంతో, నిబ్బరంగా దాటుతుంది'' (కత్తుల వంతెన, ముందుమాట) అన్న విశ్వాసాన్ని రచయిత వ్యక్తం చేసారు.

కార్మికవర్గం :

నవలలో మహీధర ప్రస్తావించిన మరోసమస్య కార్మిక వర్గంలో పనిసంస్కృతి లోపించడం, రౌడీ సంస్కృతి ప్రవేశించడం. కమ్యూనిస్టులు హక్కుల గురించి మాత్రమే మాట్లాడతారనీ,బాధ్యతలగురిచి పట్టించుకోరన్న విమర్శ సర్వత్రా వినపడేది. రైల్వేలోను, ఆర్టిసీలోను సంఘాల ప్రస్తావన నవల్లో వుంది. ఆర్టీసి బస్‌ను పాసింజర్ల మీదుగా తొలిందిగాక అదేమన్నందుకు విరుచుకుపడ్డ కండక్టరు భద్రంపై కేసును ఉపసంహరించుకోమన్న ప్రతిపాదనతో వచ్చిన యూనియన్ నాయకుల బాధ్యతారాహిత్యాన్ని ప్రశ్నిస్తుంది కళ్యాణి. దాన్ని యూనియన్ బలపరచబోదని ప్రకటించడమేగాక, తన తప్పును గుర్తించకుండా యూనియన్‌ను తిట్టిన భద్రంను సంఘం నుండి బహిష్కరించి విశాలాంధ్రలో ప్రకటిస్తారు.తర్వాత అతను కాంగ్రెసు యూనియన్‌లో చేరతాడు.విజయవాడలోని వీధి రౌడీ రాజకీయ సంస్కృతిలో భాగస్వామి అయి, కళ్యాణిపై కక్ష సాధింపుకు పూనుకొంటాడు. ఆ ప్రమాదం నుండి ఆమెను రక్షించిన రాజగోపాలంపై మళ్ళీ దాడిచేస్తాడు. కమ్యూనిస్టులు హక్కులకే గాదు బాధ్యతతో కూడా వ్యవహరిస్తారని చెప్తారు మహీధం. కమ్యూనిస్టుల పై ఆరోపణలు చేసే వారే రౌడీ రాజకీయ సంస్కృతికి, బాధ్యతారహిత్యానికి మూలంగా వున్న వాస్తవాన్ని బహిర్గత పరిచారు.

ఈ నవలలోనే మహీధర కమ్యూనిస్టు కార్యా చరణలోని నిర్లప్తతను కూడ విమర్శిస్తారు. సుమారు పదిసం॥ల పాటు (1952 నుండి 61) కమ్యూనిస్టు పార్టీ ఎన్నికల్లో దిగబడిపోయిక్రమంగా వర్గపోరాట సంఘర్షణ పట్ల మెతక వైఖరి నవలంబించడం, దాని ప్రభావం కమ్యూనిస్టుల కుటుంబ జీవితంపై పడడం పట్ల మహీధర ఆవేదనగా దీన్ని భావించవచ్చునేమో! కళ్యాణి పాత్ర ద్వారానే విమర్శిస్తారు.

కమ్యూనిస్టులు :

నిరీశ్వరవాదం గురించి చర్చ జరిగిన సందర్భంగా మంజులత కమ్యూనిస్టు కుటుంబాల్లోకూడా సాంప్ర దాయాలు పాటించి దృష్టాంతాన్ని కోట్ చేస్తుంది. ఆమెను ఖండిస్తూనే తన ఇంట్లో అన్న భాస్కరం అనుసరిస్తున్న పద్ధతిని గుర్తు చేసుకుటుంది. ''మా అన్న ఓ కమ్యూనిస్టు మా వదిన సాయి భజన చేస్తుంది. అది మతస్వేచ్ఛను అమలు పరచడమనీ, శాంతి యుత సహజీవన సూత్రాన్ని ఇంట్లోంచి అమలు జరిపి చూపిస్తూన్నావనీ మావాడి పరితృప్తి. పదేళ్ళ క్రితం మా వదినే మా అందరికీ నిరీశ్వర తత్వం బోధించింది. కాని ఈ వేళ ఇలా ఎందుకయింది. తన కొడుకు పరీక్ష పాసయితే మల్లేశ్వరుడి గుళ్ళో కొబ్బరికాయలు కొట్టించింది. మగడు లంఖణం చేస్తే మార్కండేయస్వామికి మొక్కుకుంది. ఇందంతా ఎందు కొచ్చిందీ, ఎల్లా వచ్చింది.అని మా అమ్మనే ఆశ్చర్య పెడతాడు. శాస్త్రవిజ్ఞానం తార్కిక దృష్టి పట్టుదల చూపడం

తగ్గేసరికి ఫలితం ఏమయింది. వాళ్ళననుసరించిన వాళ్ళే ఈ వేళ ఎన్నో మూర్ఖాచారాలు సాగిస్తున్నారు. కానీ డాక్టరుగారు! విశ్వాసం ఒక్కటే చాలదు. దానిని కనీసం కొంతవరకయినా అమలు జరిపే ఆలోచనవుండాలని కమ్యూనిస్టులయినా అంతే, కాకున్నా అంతే. (కత్తుల వంతెన, పుట.35)"

వివాహబంధం :

రెండో సందర్భం- హైమ, మధుసూధన్‌ల పెళ్ళి, మధుసైదవ్ అక్క వితంతు వివాహం చేసుకుంటుంది. ఆచారాన్ని భంగపరచిన అవిడా పెళ్ళికిరావడంపై హైమ కుటుంబానికి అభ్యంతరం తమ కుటుంబ సభ్యులు లుకుండా పెళ్ళి కి ఎలా చేసుకోవాలన్నప్రశ్నవస్తుంది. మధుసూధన్‌తండ్రి కమ్యూనిస్టు కట్నం కోరాడు. అయితే పెళ్ళి సాంప్రదాయ పద్ధతిలో జరగాలా? నూతన పద్ధతి లో జరగాలా? అన్న అంశంలో నిర్ణయం తీసుకుని మార్గదర్శకత్వం వహించకుండా వధువరుల ఇష్టా ఇష్టాలకే వదిలేస్తాడు. కళ్యాణి వద్దకుసమస్య వచ్చినపుడు జరిగే చర్చలో ఇలా అంటుంది.

"ఏమంటే ఇల్లాంటతి జనం వాళ్ళలోనే కన్పిస్తున్నారు. మనం రోడ్ల కూడలిలోకి వచ్చాం. ఇప్పుడు కాస్తదారి చూపడం అవసరం,బొప్పిలు కట్టినేర్చుకోలేమా అంటే ఎందుకు నేర్చుకోలేము. సమాజం ఇంతవరకూ రాలేదు? ఇన్ని వేలూ, లక్షల సంవత్సరాలుకమ్యూనిస్టుల మొహం ఎవరికేనా తెలుసా? అయితే ఇప్పుడున్నారు.కనుక, వాళ్ళేదో వుద్ధరిస్తానుకుంటున్నాంగనక వాళ్ళకేసి చూశాం. మీరే నేర్చుకోండి మంచి చెడ్డలు అని వాళ్ళొదిలేస్తున్నారు అందుకడిగేనులే"

"చచ్చాంరా దేవుడా! ఈ తెలుగు దేశం ఏమయి పోతుంది? తాను మంచిది కాదనుకున్నది కొడుకు చేత వొప్పించలేకపోయారు.! మా అన్నయ్యొకడు. మినాన్న మరొకరు! దొడ్డ కమ్యూనిస్టులురా దేవుడా. ఏ పనీ చేయ్యకుండా సోషలిజం వచ్చేస్తుందిలేయని వీళ్ల ఊహకాబోలు! బలే". తర్వాత కాలంలో మితవాద రాజకీయాల వెంటే వెళ్లినా ఈ నవలరాసేనాటికి ఆనాటి పార్టీలో ప్రవేశించిన ధోరణులపట్ల విమర్శనాత్మకంగా వున్నారు.మహీధర.

1960లతో పోల్చితే సాపేక్షంగా ప్రేమవివాహాలు చేసుకోడానికి అవరోధాలు ఈనాడు బలహీనపడినట్లు అన్పించినప్పటికి ఈ నవలలోని అంశాలు ఇప్పటికి యువతీ యువకులకు ఎంతో విజ్ఞానాన్నిస్తాయి. స్త్రీ పురుష సంబంధాల గురించి చర్చలు మరింతగా తెలుగు సాహిత్యంలోకి వచ్చిన ఈ కాలంలో ఆనాడే ఈ సంబంధాల్లోని ఆరాచక ధోరణులను ఖండించి శాస్త్రీయ అవగాహన కలిగించేందుకు ప్రయత్నించిన"కత్తుల వంతెన"ఈనాటకీ ప్రయోజనాన్ని, ఉత్తేజాన్ని కలిగించే నవలే.

స్త్రీ, పురుష సమానత :

భారత సమాజం రకరకాల అసమానతల మధ్య కొట్టుమిట్టాడుతోంది, అందులో స్త్రీ-పురుషులమధ్య సమానత కూడా ఓ ప్రధానపార్శ్వం ! ఈ అసమానతని పెంచి,పోషించివర్ధిల్లేలా చేస్తూ అన్ని రంగాల్లోను వారిపై అమలవుతున్న అణచివేతకు అవరోధం లేకుండా కాపాడుకుంటూ వస్తోందీ సమాజం. ఇందులో భారతీయు కుటుంబ వ్యవస్థ, మతం, దాని ఆధారంగా అల్లిన ధర్మ శాస్త్రాలు, గొప్పగా దోహదం చేస్తున్నాయి.అథఃపాతాళం వరకూ వేళ్లు తన్ని బలిసిపోయిన పితృస్వామ్యపు ఊడల మర్రికి స్త్రీలు కూడా సొంత ఆస్తే అన్న భావన మంచి ఎరువులా పని చేసింది. ఇవేవీ వాళ్లని గుర్తించనివ్వకుండా మతం, కులం, శాస్త్రాలు, సాంప్రదాయాలు పేరిట చట్రాలు బిగించి గొంతువిప్పడంమొదలు పెట్టిన పక్షంలో'శీలం' పేరిట వారి నైతికతని ప్రశ్నించి మారు మాట్లాడకుండా చేయడం రివాజు.భారతదేశంలో ఏ సాధారణ కుటుంభాన్ని తీసుకుని పరీశీలించినా ఈ లక్షణాలన్నీ కనిపించక మానవు. అలాంటి ఒకానొక కుటుంబ కథే మహీధర రాసిన 'ఇకా కథ అంతే..!'

ప్రచురణ కర్తలు దీనిని నవల అన్నప్పటికీ ఇది ఏకోశానా ఆ కోవలోకి వచ్చే అవకాశం లేదు. నవలకు వుండాల్సిన విస్తృతిగాని, ఇతర అంశాలు గానిదీనికి లేవు. ముమ్మూర్తులా ఇది 'కథ'! 1963లో ఇది పుస్తకరూపం దాల్చింది.రచయిత రాసుకున్న ఉపక్రమణికనుబట్టి చూస్తే అంతకు ముందే ఈ రచన ఏపత్రికలోనో ప్రచురిత మయిందనిపిస్తుంది. గాని ఆ వివరాలు అలభ్యం.

రాజ్యలక్ష్మి- ప్రభాకరం భార్య భర్తలు. వాళముద్దుల బిడ్డడు రజని. ఓ ప్రైవేట్ స్కూల్లో పనిచేస్తున్న ప్రభాకరం అక్కడి మేనేజరుతో గొడవపడి ఉద్యోగం పొగొట్టు కుంటాడు. ఇల్లు గడవడానికి ఎంతో కొంత సంపాదిం చాలి. కాబట్టి దానికోసం కొన్ని ప్రయత్నాలు చేసినా ఎందులోనూ కుదరుకోలేక పోతాడు.నికరంగా ఆదాయం వుండదు.దాంతో కుటుంబం వీధిన పడేదశ వస్తుంది. ఈ పరిస్థితుల్లో కొంతవరకు చదువుకున్న రాజ్యలక్ష్మికి గ్రామ సేవిక ఉద్యోగం వస్తుంది. మొదట్లో వ్యతిరేకించినా తప్పనిసరి పరిస్థితుల్లో రాజ్యలక్ష్మి ఉద్యోగానికి వెళ్లడానికి అతను ఒప్పుకోక తప్పదు. పరిస్థితులు ఆమె సంపాదనను ఒప్పుకోక తప్పని స్థితికి నెట్టినా అర్థంచేసుకునే నైజం, సహకరించే గుణం అతడికి వుండవు. ముఖ్యంగా 'ఆడ దాని సంపాదన' పై బతకాల్సొస్తోందన్న విషయం అతన్ని భాద పెడుతూనే వుంటుంది. పర్యవసానంగా నైతికంగా అతను దిగజారి, భార్యని అనుమానించి రంకు కట్టి వేదిస్తాడు. నయాన, భయాన, ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలమై విసిగివేసారిపోయి రాజ్యలక్ష్మి అతని వేధింపులకి జవాబులు చెప్పడం, దాంతో అతను రెచ్చిపోయి కొట్టడం జరుగుతుంది. రాజ్యలక్ష్మి ప్రశ్నలకి సమాధానాలు చెప్పలేక తన అహంకారాన్ని సమర్థించుకోలేక ఆవిడ ఆఫీసు కాయితాల్ని కూడా చించి పోగులుపెడతాడు. ఈ క్రమంలో పనిమనిషితో అతని సంబంధాన్ని గమనించిన రాజ్యలక్ష్మి ఇక ఊరుకోలేకపోతుంది. విడి పోదామను కుటుంది. దాన్ని కూడా ఖాతరు చేయకుండా ఎగతాళిగా మాట్లాడేసరికి అవాక్కయిపోతుంది. స్థూలంగా కథ ఇది.

నవలా రచయితగా లబ్ద ప్రతిష్టలయిన మహీధర రామ్మోహనరావు రాసిన ఈ 70 పేజిల కథకు చదివించే గుణం వుంది. ఇది రాసి ఐదు దశాబ్దాలు దాటిన ఇప్పటికీ భాషగాని, వాక్య సరళి గాని మనకి ఇబ్బంది అనిపించక పోవడం విశేషం. పైగా వెంట మనల్ని పరుగులెత్తించి ఒకే ఉదుట్న చదివిస్తుంది. అది మహీధర శైలిలోని గొప్పదనం !

ఈ రచనలో పాఠకులగుండెకు హత్తుకునే సన్నివేశాలు కొల్లాలు. ఇందుకు కారణం - తాను చెప్పదలుచుకున్న ప్రధానాంశం కి బలం చేకూర్చే సంఘటనలని మాత్రమే చెబుతూ వాటి ఆధారంగా మిగతాది పాఠకుల ఊహకి వదిలిపెట్టడం. ఇందులో చాలా విషయాలు తెలుగింట, మరీ ముఖ్యంగా ఆడవాళ్లు ఉద్యోగాలు చేసే ఇళ్లలో ఏదో ఓ రూపంలో ఈ రోజుకీ వ్యక్తమవుతూనే వున్నాయి. స్త్రీలకి సొంత సంపాదన లేకుండా చేసి పరాధీనులుగా చూడ్డం, చిన్నబుచ్చడం, తప్పనిసరి పరిస్థితుల్లో వారిని ఉద్యోగాలకు వదలడం, పని విభజన పాటించకపోవడం, శారీరకంగా ఆలసిపోయి ఇంటికి వచ్చినా ఇంటి పని కూడా వారి నెత్తినే వేయడం, పైగా మానసికంగా కూడా శ్రమ పెట్టి వేధించడం- ఇదంతా ఇప్పటికీ జరుగుతున్నదే.

ముఖ్యంగా రాజ్యలక్ష్మి పాత్ర చిత్రీకరణ, మగడికి పరిస్థితులు అర్థం చేయడానికి ఆమె పడే శ్రమ, విఫలమయినప్పుడాల్లా ఆమె పడే వేదన, ఎలాగైనా అతడిని చక్కదిద్దాలన్న తపన, వీటిన్నిటి మధ్య అనుభ వించే మానసిక ఘర్షణని రచయిత గొప్పగా చిత్రించారు. ఒక పతాక సన్నివేశానికి పాత్రలు ఎదిగే క్రమంలో, వాటిలో వచ్చే మార్పు, తీరు గొప్పగా వ్యక్తం చేశారు. ఈ కథలో ఎక్కువభాగం సంభాషణల రూపంలో నడిచినప్పటికీ చెప్పదలుచుకున్న వియంలో స్పష్టత వ్యక్తమయ్యేట్లు చూడ్డం రచయిత గొప్పదనం. ఇది ఇప్పటకీ అందురూ చదవదగ్గ పుస్తకం. కాని అందుబాట్లోలేదు. పునర్ముద్రణ ప్రయత్నం ఎవరైనా చెయ్యాలి.

"ఈ కథను మొదట ప్రచురించినప్పుడు పాఠకులు రకరకాలుగా ప్రతిస్పందించారుట. 'సమాప్తం' అనే పదం చూసిరచయిత మీద కోపగించుకున్నారుట. రాజ్యలక్ష్మి భర్తను వదిలేయాల్సిందని కొందరు. ప్రభాకరంమనసు మారి మళ్లీ వాళ్లు సర్దుకుపోయినట్లు రాసుండాల్సిందని... యిలా రకరకాల సలహాలిచ్చారట. కాని రచయిత ఆ రెంటితోనూ అంగీకరించలేకపోయారట" (తెలుగునాట సామాజిక జీవితం మీద మార్క్సిజం ప్రభావం - పుట 3 - 1990).

ముగింపు :

భార్య భర్తలిద్దరూ ఒకరినొకరు గౌరవించడం,ఆత్మ గౌరవంతో వ్యవహరించడం ఆనాటి సమాజానికి అలవాటులేదు. అలాంటిస్థితిలో తాను విడిపోతానని చెప్పినా భర్త ఖాతరు చెయ్యకపోవడం ఆమెను అవాక్కు చేస్తుంది. అప్పటి కథ అంతే! అయితే వాళ్లకి ఒకటే ఆశ! భవిష్యత్ తరాలైనా దాస్యం నుంచి బయటపడి సుఖపడ తాయని, అందుకోసం వాళ్లు ఈ రోజు ప్రాతిపదిక వేస్తున్నారని రచయిత చెప్పారు. అయితే ఇప్పటికీ అప్పటకీ పరిస్థితుల్లో పెద్దగా మార్పులు రాలేదు. స్త్రీలు వేలాదిగా అన్ని రంగాల్లో ఉద్యోగాలకి వెళుతున్నారంటే ... దాని అర్థం వేరు ! అంతేకాని వారి వ్యక్తిత్వానికి గుర్తింపు, వారి ఆత్మగౌరవానికి ఓ మన్నికా వుండి కాదు. కొన్ని ప్రతి ఘటనాస్వరాలు, నిరసనలు వినపడ్డంలేదని కాదుగాని అవింకా బలహీనం గానే ఉన్నాయని చెప్పడమే ఈ కథ.

ఆధార గ్రంథాలు :

1) 'కొల్లాయి గట్టితేనేమి?', మహీధర రామమోహనరావు
2) 'కత్తుల వంతెన' మహీధర రామమోహనరావు
3) 'ఎవరి కోసం', మహీధర రామమోహనరావు

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అస్పృశ్యమవుతున్న దేశీ శబ్దజాలం నిమ్నతీకరణంలో

– డా॥ పి.ఎ. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

ఒక నిర్దిష్ట ప్రాదేశిక విభాగంలోని సమాజం ఆచార వ్యవహారాల్లో వేష భాషల్లో గుంపులుగా విడువడి మనుగడ సాగిస్తుంది. ఒక్క ప్రాదేశికత మాత్రమే దాన్ని ఒకమొత్తం కట్టిపడేయగలుగుతుందికానీ గుంపుల మధ్య అనైక్యత అనివార్యంగా కొనసాగుతుంది. అంటే అది ఊరికో పేరుకో మాత్రమే సమాజంకాని అది వైవిధ్యాల సమాహారం. సమాజంతాలూకు ఈ వైవిధ్యాలు చాలా వరకు పరస్పర వైరుధ్యాలుగా చలామణిలో ఉంటాయి. ప్రతి కదలికలోను కనపడని లక్ష్మణరేఖలు అడ్డుతగుతూ ఉంటాయి. ఏకత్వంవైపు నడచే ప్రతికదలిక అతిక్రమణ గానో, ఆక్రమణగానో నిషిద్ధ ముద్రలు వేయించుకుంటుంది. వేగంగా మారే వస్తువాహన సంస్కృతి ప్రభావంతో దాని లక్ష్మణ రేఖలు చెరిగిపోతున్నట్టే అనిపించినా కనపడని అంతరాల్లో, అగాధాల్లో దాని ప్రగతి చక్రం కూరుకుపోతూ ఉండటం చాలా సహజంగా జరుగుతుంది.

ఈ ఏకత్వంలోని భిన్నత్వాన్ని అధ్యయనం చేసే క్రమంలో ఆ సమాజంలో ఉపశ్రేణిగా ముద్రవేయబడ్డ సమూహాల భాషా సాహిత్యాలు మరుగున పడిపోవటమో వెనకపడిపోవటమో చాలాసహజం. భాషాసాహిత్యం శోధకులకు వీటిపట్ల ఉదాసీనత, వివక్ష గొప్ప వనరుగా ఉపయోగపడతాయి. నిమ్నతీకరించబడుతూ, క్రమంగా అస్పృశ్యమవుతూ చివరికి అదృశ్యమయ్యే ఉపశ్రేణి వర్గాల భాషను దాని సభ్యతాసభ్యతలముద్రల్ని వివేచించడం ఆవశ్యం.

ఒక సమాజంలోని ప్రతివ్యక్తి, ప్రతి సమూహం ఇతర వ్యక్తులకంటే ఇతర సమూహాలకంటే భిన్నమైనవిగా, ప్రత్యేకమైనవిగా గుర్తించబడాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకు అడుగేస్తాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేకమైనవిగా గుర్తించబడ్డ వ్యక్తులు, సమూహాలు ఇతరులకు, ఇతర సమూహాలకు ఆదర్శం అవుతాయి. ఈ ఆదర్శవంతమైన వ్యక్తులు, సమూహాలు మొత్తం సమాజాన్ని నడిపిస్తారన్న మాట. వాళ్ళు గోతిలోకి దిగమంటే మొత్తం సమాజం కళ్ళు మూసుకుని గుడ్డిగా దిగిపోతుంది. లేదా పైకిరమ్మంటే గొర్రెదాటుగా అనునరిస్తాయి. గొర్రె స్వభావం సమాజ సహజ స్వభావం సమాజాన్ని ముంచాలన్నా పైకెత్తాలన్నా ఆధిపత్యం నాయకత్వం వహించే వ్యక్తుల, సమూహాల చేతుల్లోనే ఉందన్నమాట.

ఆధిపత్యంవహించే వ్యక్తులు, సమూహాలు సాంఘిక, ఆర్థిక రాజకీయాలపరంగానే కాకుండా మానసికంగా, మేధోపరంగా కూడా పైచేయిగా ఉంటారు. అంటే వీళ్ళు సమాజంలోని మిగతా సమూహాలను చేతగాని వాళ్ళుగా, చవటలుగా నమ్ముతూ నమ్మిస్తూ వాళ్ళ అనుచర గణంగా తయారుచేసుకుంటారు.

భారతీయుల ప్రాచ్య విజ్ఞానం మీద లార్డుమెకాలె వ్యూహరచన ఇలాంటిదే. ఇలాంటి వ్యూహరచన ఉపశ్రేణి వర్గాలమీద నిరంతరం ప్రయోగించబడుతూ ఉంటుంది. ఈ నేపథ్యంలో భిన్న సంస్కృతుల సమాహార సమాజాన్ని ఒకానొక ప్రాదేశిక ఆధిపత్య సంస్కృతి మొత్తం సమాజానికి ప్రాతినిధ్యం వహించగలుగుతుంది. ఈ క్రమంలో స్థానిక వేషభాషలు, ఆచారవ్యవహారాలు, విజ్ఞానం, కళలు, మొత్తం వాళ్ళ వారసత్వ సంపద పనికిమాలినవిగా తీర్మానించబడతాయి. జానపద విజ్ఞానం విషయంలో కూడా జరిగిందదే.

ఈ స్థానిక వేష, భాషల వెనకబాటు తనాన్ని సోదాహరణంగా పరిశోధకులు చర్చించడంవల్ల వీటిపట్ల నెలకొన్న ప్రెజుడైస్‌ను, వివేచనా రాహిత్యాన్ని తగ్గించే అవకాశం కలుగుతుంది. స్థానిక భాషాలోని పదాలు,

పదబంధాల చుట్టూ అల్లుకున్న న్యూనతీకరణను అర్థంచేసుకునే వీలుకలుగుతుంది. ఇవి వర్గ మాండలికాలుగా కూడా మినహాయించబడి ఉదాసీనతకు గురికావడం జరుగుతుంది.

'నాకు తెలియదు', 'నాకు తెలవదు' అన్న వాక్యాలలో మొదటిదే ప్రమాణభాషలోకి చేరుతుంది. విద్య, సాంస్కృతిక, రాజకీయ ఆర్థికాది రంగాల్లో పైచేయిగల వ్యవహర్త లను అనుసరించి ప్రామాణీకరణ నిర్ణయించ బడుతుందన్న సంగతి తెలిసిందే.

'పనిమినిషి' అనే పదబంధం ఇంటిపనులకు నిర్దేశించ బడ్డ వ్యక్తిగత ఉద్యోగిని సూచిస్తుంది. ఉద్యోగం అంటే రూఢిలో ఏదో ఒక పనికి నియుక్తం కావటమే. కాని ఇది సేవా, పారిశ్రామిక రంగాలకు పరిమితం అయ్యింది. ప్రాథమికరంగం, లేదా గృహ సంబంధ అంశాలలో ఉద్యోగం అన్న పదాన్ని వాడుకలో కనిపించదు. మన సమాజంలో పనిమనిషి కంటే 'ఉద్యోగి' కి ఎక్కువ సామాజిక హోదా ఆపాదించబడుతుంది.

పనిని సమాజం వైట్ కాలర్ అని వైట్ కాలరేతరంగా విడగొట్టి తద్వారా భౌతికశ్రమ, బౌద్ధిక శ్రమకంటే తక్కువ స్థాయి కలదిగా గణించబడి భౌతికశ్రమ తిరిగి నైపుణ్యం కలపని, నైపుణ్యం అవసరం లేని పనిగా విడగొట్టబడింది. మొత్తం చేతిపనులన్నీ ముఖ్యంగా ప్రాథమికరంగానికి చెందిన పనితనం అంతా నైపుణ్యం లేనిపనిగా తీర్మానించ బడింది. ఇది బుద్ధిజీవులు శ్రమజీవులపై పన్నిన కుట్రగా చెప్పవచ్చు.

పారిశ్రామిక విప్లవం, సేవారంగవికాసాలను మన సమాజంలో పాశ్చాత్య విజ్ఞానం ప్రభావితం చేసింది. ప్రాచ్య విజ్ఞానం పాశ్చాత్య విజ్ఞానం కంటే తక్కువస్థాయి కలదిగా ఎంచబడింది కాబట్టి. సామాజికంగా ఆర్థికంగా ప్రాథమికరంగం సహజంగా తక్కువస్థాయిలోనే ఉం టుంది. కాబట్టి ప్రాథమికరంగానికి చెందిన పదజాలమూ తక్కువస్థాయిలోనే ఉంటుంది. కుశమును నేర్పుగా కోయకపోతే వేళ్ళుతెగుతాయి. కుశమునుకోసే వాడు కుశలుడుఅంటాం. కాని 'కుశలత' 'తెలివి', 'నైపుణ్యం'గా అందులోను ప్రాథమికరంగానికి సంబంధంలేనంతగా దూరంగా జరిగిపోయింది.

సంస్కృతీకరణ, అంగ్లీకరణ నేపథ్యంలో స్థానిక భాష నిమ్నతీకరించబడటంచూస్తాం. చేతివృత్తులేకాక వాటిపేర్లు కూడా నీచస్థితి లోకినెట్టబడ్డాయి. ఉదా॥కు చాకలి, మంగలి పేర్లు రజక, నాయీబ్రాహ్మణులుగా సంస్కృతీ కరించ బడ్డాయి. నిందవాచకాలు మిగిలాయి. తొక్క, తోలు, బొక్క, లాంటి పదాలు ఆగ్రహవ్యక్తీకరణలుగా, బూతులు జాబితాలోకి జారిపోయాయి. తెలుగులో లైంగికావయవ వాచకాలు ఇతర అవయవ వాచకాల్లా కాకుండా రాయశక్యంకాని స్థాయిలో బూతుల జాబితాలో చేరిపోయాయి. వీటి సంస్క ృతీకరణలే సభ్యోక్తులుగా ప్రమాణభాషశబ్దాలుగా చలామణి అవుతున్నాయి.

లేబరు, విధువ (వెధవ) లాంటిపదాలు తిట్లుగా వాడబడుతున్నాయి. అంటే భౌతికశ్రమ, బౌద్ధికశ్రమ; స్త్రీత్వం, పురుషత్వం; తెలుగు, సంస్క ృతంలాంటి ద్వంద్వాలలో మొదటివి తక్కువ శ్రేణివిగా జమకట్ట బడుతున్నాయి. లింగ, కుల, భాషలాంటి అంశాలలో తిష్టవేసిన వివక్ష తెలిసో తెలియకో మన వివేచనను అధిగమించి ఒక నిబంధన అభ్యసనంలా ఉనికిలో ఉంది.

ఈ వివక్షను ప్రశ్నించటం ప్రస్తుతం విడ్డూరంగా ధిక్కారంగా ముద్రించబడి సామాజిక తిరస్కారానికి గురవుతుంది. వృత్తులు, వర్గాలు నిమ్నోన్నతాలుగా గణించబడటం, ఉచ్చనీచాలుగా చలామణిలో ఉండటం సర్వసాధారణ అంశం అయ్యింది. ఆయా ద్వంద్వాలలో ఒక దానిపట్ల మోజు, మరోదానిమీద చిన్నచూపుకు ప్రధానభూమిక బలమైన ఆర్థిక ప్రాతిపదికలే అన్నది స్పష్టమైన విషయం. వివక్షను తప్పించుకోవటానికి ఉపశ్రేణి వర్గాలు గొంతెత్తడం, పిడికిళ్ళు బిగించడం, అహింసపోరాటాలు చెయ్యడం మేధోపరమైన వ్యాసంగా లతోపాటు ఉచ్చశ్రేణి వర్గాల భూమికల్ని గమనించి అదే

భూమికల్ని నిర్మించుకోవటం ద్వారా పరిస్థితిని మెరుగుపరచుకోవచ్చు.

ఆగ్రహావ్యక్తీకరణకు, ప్రతీకారవాంఛకు, ప్రతిచర్యకు వినియోగించబడే 'బూతులు' 'స్త్రీ' ని లక్ష్యం చేసుకున్నవే. ఇద్దరు పురుషులమధ్య లేదా ఇద్దరు స్త్రీల మధ్యకానీ హింస, ప్రతిహింస, ప్రతీకారేచ్ఛల్ని సంతుష్టిపరచుకోవడానికి స్త్రీ యే బలవుతుంది. ఆమ్మో, ఆలో ఘర్షణలో ఎలాంటి సంబంధ లేకపోయినా ప్రతీకారేచ్ఛ సంతుష్టికి ప్రధాన వనరు అవుతుంది. దీనికి కారణం ఆడదాన్ని ఆస్తిగా పరిగణించడమే. ఆస్తుల్ని దోపిడీ చేయడం, దోపిడీ చేయబడడం ధీర, భీర చర్యలుగా జమకట్టబడు తున్నాయి. పిరికిపందలు చేతకాని వాళ్ళుగాను, ధీరులు, వీరులు గాను ఆస్తుల్ని కొల్లగొట్టడం ప్రాతిపదికగా సమాజం విభజిస్తుంది. గెలుపోటముల్ని 'కొల్లగొట్టడం, కొల్లగొట్టబడటం భూమికగానే నిర్ణయించడానికి నిలువెత్తు సాక్షీభూతంగా చరిత్ర నిలుస్తుంది.

పితృహంతకుల పట్ల ఉదాసీనతను కాలం కలగ జేస్తుందికాని తన ఆస్తులు ఆడవాళ్ళను అపహరించే వారిపట్ల పగచల్లారే అవకాశం ఉండకపోవటానికి కారణం పితృస్వామ్యవ్యవస్థలో స్త్రీని భోగవస్తువుగా, ఆస్తిగా చూడటమే ఆస్తుల దురాక్రమణ అవమానంగా, ఆత్మగౌరవ హానిగా, ఆత్మ గౌరవ భావన ప్రాణంకంటే గొప్పదని సమాజం నమ్మడం లాంటి భావజాలంవల్ల సమాజంలోని హింసకు ప్రధానకారణం.

ఈ ద్వంద్వాల మధ్య సమతుల్యత వైపుగా హింసాత్మకంగానో, అహింసాత్మకంగానో ఘర్షణలు అనివార్యం అవుతాయి. అయితే ఈ ఘర్షణలు, పోరాటాలు అహింసాత్మకంగా కొనసాగటమే వాంఛనీయం. సంబంధిత సమాజ పరిణామ పరిణితి చిహ్నం. ఉపశ్రేణి వర్గాలపట్ల వివక్ష అసమానతలు నశించడం ఆరోగ్యదాయకం.

సృజనలో వీటిని స్పృశించడం సమాజప్రగతికి ఆవశ్యం.

ఆధార గ్రంథాలు :

1) తెలుగుభాషాచరిత్ర - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి
2) పోష్టుమోడర్నిజం - బి. తిరుపతిరావు

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అభ్యుదయ శంఖారావం - అనిసెట్టి కవిత్వం

- డా॥. పి. విజయకుమార్, తెలుగుశాఖాధ్యక్షులు, ఎస్.ఎమ్.ఎల్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎమ్మిగనూరు.

ప్రజాకవులు సమకాలీన సమస్యలు ఆధునిక కవిత్వంలో ప్రతిబింబింపజేశారు. "మీతోనె వుంటాను. మీతోనె వస్తాను; అడుగడుగునా మీకు అండగా నిలుస్తాను. పరతంత్రతలొ మగ్గు బానిసల ముక్తికై కదనభూములకెత్తి కదలివెళ్ళే మీకు అడుగడుగునా నేనె అండగ నిలుస్తాను" అని 1942లో బానిసత్వ విముక్తికై పురోగమించే స్వాతంత్ర్యవీరులకు అనిసెట్టి సుబ్బారావు వాగ్దానం చేశాడు. ఇదే సంకల్పబలంతో కష్టాలకు ఓర్చి 1950 వరకు అక్షరపోరాటం చేశాడు. బాధాజీవన ప్రవాహంలోని పరమణువులకు ప్రతీకగా ఎన్నో పద చిత్రాల అనిసెట్టి కవిత్వంలో సాక్షాత్కరిస్తాయి. సామాన్యుల అభ్యున్నతే పరమావధిగా కవిత్వాన్ని రచించాడు. పీడనారహిత సమాజదర్శనం కోసమే కవిగా అనిసెట్టి స్వప్నించాడు; తపించాడు; అక్షరసృజన చేశాడు. అభ్యుదయకవులు సామాన్యుడినే నాయకుడిగా చేసుకొని రచనలు చేశారు. అభ్యుదయకవి దాశరథి కృష్ణమాచార్యులు 'రుద్రవీణ' వాయిస్తే ప్రజాకవి అనిసెట్టి 'అగ్నివీణ'ను మీటాడు. అనిసెట్టి సుబ్బారావు తన కవితలను ఒక సంపుటిగా ప్రచురిద్దాం అనుకున్నప్పుడు ఈ కవితల సంపుటికి 'అగ్నివీణ' అనే పేరు పెట్టింది శ్రీరంగం నారాయణబాబు.

"అభ్యుదయ కవుల్లో అనిసెట్టి వేరుగా కనిపిస్తాడు. అభ్యుదయకవిత్వం ఆవేశప్రధానమైనది; కానీ అనిసెట్టి కవిత్వం అనుభూతి ప్రధానంగా ఉండేది. అభ్యుదయ కవిత్వపు కూర్పు ఘాటుగా ఉంటుంది; కాని అనిసెట్టి కూర్పు సున్నితంగా ఉండేది. ఇతను నిజంగా అభ్యుదయ కవేనా? అనిపించేంత భావసౌకుమార్యం అతని కవిత్వంలో కనిపించేది" అంటాడు ఆరుద్ర. అనిసెట్టి శ్రీమంతుల ఇంట్లో పుట్టినా ఆగర్భదరిద్రుల ఆర్తనాదాలు విని పించుకున్నాడు. బిచ్చగాళ్ళ ఆలాపనలను ఆలకించాడు.

గుండె తడబడినదీ / గొంతుతడుపమ్మా / తులసి కోటకు నీరు తోడినంతమ్మా / కాలిపోయే ఇల్లు చల్లార్చి నంత / పనికిరానీ చిరుగు / పడవేయితల్లీ / స్వామివారికి వలువ చదివించినంత / శిథిలాన ప్రాకారమెత్తినంతమ్మా / బిడ్డకొక పిడికిలీ / విడువమ్మ తల్లీ / నట్టింట దీపమే నిలిపినంతమ్మా / పడినడిచి వచ్చాము ప్రాణి నిలుపమ్మా / అంగిట్లో ప్రాణాలు అణగిపోతున్నాయి / గుండె తడబడినదీ గొంతు తడుపమ్మా / మంచుపొగగా చలికి మాడిపోతున్నాము / పనికిరానీ చిరుగుపడవేయి తల్లీ / పీలికై చేతిలో వాలిపోతున్నాడు / బిడ్డకొక పిడికిలీ విడువమ్మ తల్లీ!" అంటూ బిచ్చగాళ్ళు బిచ్చమడిగితే వాళ్ళు బిచ్చమేసినా, వేయకపోయినా దీవించడమే తప్ప తిట్టడం చేయరన్న భావన వ్యక్తం చేసాడు.

వేకువ రాగానే 'నాలోని మృత్యువుని బంధించి / మారణాయుధంలో చేర్చాను / నాలోని ప్రాణశక్తి విజృంభించి / ప్రచండ జీవనోద్వేగంగా మార్చాను" అంటాడు. సంహరించాను పురాణాల రాక్షసుల్ని, భూమి మీద క్రిముల్ని, బుద్ధిలో మునిరే దురాలోచనల్ని అంటాడు. "విగ్రహంలా వెయ్యేళ్ళు బతకటం కన్నా / విద్యుత్తులా ఒక్క క్షణం వెలగటం మేలు" అంటాడు.

కంటికి కనిపించని సత్యం మనస్సులో
గోచరిస్తుందని
మనస్సుకు స్ఫురించనిది స్వప్నంలో
సాక్షాత్కరిస్తుందని
స్వప్నాలకందని సత్యం మానవాంతరాత్మలో
మౌన సంగీతం ఆలపిస్తుందని
ఆలకిస్తున్నాను
అర్థం చేసుకుంటున్నాను.

అంటూ తాత్వికతను కూడా తన కవిత్వంలో అంతర్భాగం చేశాడు. "వీడని కలకాల వేదనకు విశ్వం

విడిచే కన్నీటిబొట్టు నేనౌతాను" అన్న అభ్యుదయకవి అనిసెట్టి. "నడుస్తున్నాను / నడిదారిలో వాహనం ఈ దేహం కూలినా / కడవరకూ ప్రయాణం సాగిస్తాను / ప్రభంజనంలా పయనించే జనం నలుగడ / ప్రతిక్షణం ప్రతి కణంలోను మనుగడ / ఇది నా స్వీయచరిత్ర / ఇది ప్రతి ఆత్మచరిత్ర" అంటూ

ఇది నా స్వీయచరిత్ర :

ఇది ప్రతి ఆత్మచరిత్ర" అంటూ జీవన మహా యాత్రాపథంలో పయనిస్తున్న తీరును ఆవిష్కరించాడు. "ఇది నా స్వీయచరిత్ర / ఇది ప్రతివ్యక్తి చరిత్ర / ఈ నిర్జీవపు బెడారి ఉదయమునై ఎదిగి / ఈ నెత్తురుటేరున ముత్యమునై వెలిగి / ఈ నరాల కారడవిని జ్వాలగ చెలరేగి / జడతను ఛేదించి, నిండు /జవమునుచ్ఛ్వసించి మహా / జగతినిశ్వసించి / చలించాను, జనించాను, బ్రతుకారంభించాను అంటాడు.

"భయం భయం బ్రతుకు భయం / భయం బ్రతుకు భయం భయం / అన్నా ! మనకీ లోకం / పన్నిన పద్మవ్యూహం / ఆశలతో బ్రతుకీడ్చే అస్థిపంజరాలు మనం / ఆవేదన హతమయ్యే ఆశాజీవులం మనం / గతమంటే కారువెగటు, రేపంటే తగని భయం / ప్రళయం ఈ ప్రస్తుతం, క్షణక్షణం దుర్మరణం / ఛిద్రమైన జీవితాలు, చితికిన సంసారాలకు / స్వప్నం ఒక స్వర్గసీమ, సౌభాగ్యం సౌందర్యం" అంటూ స్వప్నలోకాన్ని ఆశ్రయించి బ్రతుకీడ్చే సంసారాలు ఈ వాస్తవిక జీవితాన్ని శిఖలదగ్ధమౌను సుమా అంటాడు.

వెళ్లిపోయిన కోటికోట్ల జీవుల విడిచి, కుళ్ళిపోయే నేటికోట్ల జీవుల కొరకు, పొర్లివచ్చే కోటికోట్ల జీవులకొరకు వ్యాస సంతతివాణ్ణిగా నేను వచ్చాను అంటాడు. రణభేరి పగిలించి, పద్మవ్యూహాన్ని త్రెంచి, శివమెత్తి, విస్ఫులింగాలు చిమ్ముతూ లేచి, ఈ జగత్తులో నూత్నజగతి పెకలిస్తా నంటాడు. మీరు ఇంక ఎవరికి తలొగ్గి బానిస సలాము చేయరంటాడు. పిడికిలికి చాలని పేదగుండెలో ఎన్నెన్నో లోకాలు ఇమిడి ఉన్నాయంటాడు.

సమరహృదయం నేను. బానిసలకు అండగా ఉండి మీలోనే ఉండి, మీతోనే వస్తానంటాడు. బాధాజీవ ప్రవాహపరమాణువులార లేచి రమ్మని పిలుపునిస్తాడు. మూడు శతాబ్దాల నుండి రాజిన నిప్పులకుంపటి మా దేశం. శాంతికోసం, జగతి దాస్యముక్తి కోసం, శత్రుసేన తత్తునియలు చేసేందుకు నేను గూడా నడుస్తానంటాడు. పాలకులెవరైనా ప్రళయాగ్నై పోరుతాం అంటాడు. చావు బ్రతుకుల మధ్య చెరసాల మిగిలి మన తరతరాలు బానిసత్వంతో తల్లడిల్లాయని ఒక్క శిశువు ఏడ్చినా, ఒక గింజ దోచినా ఉరిమి పిడుగుల్లాగా విరుచుకుపడమని పిలుపునిచ్చాడు. కాయాలు ఖడ్గాలుగా లేచిపోరండి, కనికరం లేని కాలంలాగా పోరండి అంటాడు.

"లేవండి లేవండి లెండి మానవులార!
విజయమో, స్వర్గమో విక్రమించండి
గుడిసె గుడిసెకుకోట నిర్మించి లేవండి
వనితనంటిన మదాంధులకు గతిలేదింక
గమిడి తొక్కిన నియంతలకు గతిలేదింక" అని ఇలా సమిష్టిగా ప్రతిప్రాణి పోరవస్తున్నాము, పొంగిన సముద్రమై పొర్లి వస్తున్నామంటాడు.

ఇంటింటా ఒక దీపం ఎందుకారిపోయిందో, ఇంటింటా ఒక కుసుమం ఎందుకు వాడిపడిందో, ఏ ఇంద్రుని ఇనుపవేళ్లు చీల్చిన నీ కుసుమాన్ని! కాలి పగులు కాగితమై చెదిరిందే ఈ పురుషుడు స్త్రీ ప్రాణం కొన్నాడా! స్త్రీ హృదయం విన్నాడా! అంటూ ఆవేదనతో రగిలి పోయాడు. కలిమిలేమి సమరంలో కాలం ఎర్రబడిం దంటాడు. నరచరిత్ర క్రిక్కిరిసిన, ప్రళయనమర సంఘర్షణే అంటాడు.

నీముందున్నది ప్రజ
నీవెనకున్నది రుజ
ముందడుగొక్కటి వేస్తే
మూలవిరాట్టును విడిచి,
వెనకడుగొకటే వేస్తే
ప్రాణదాతలను మరచి

అదే అదే
ఆ అడుగే
నీ విలువకు కొలమానం.

అంటూ మన వెనకున్నది మోగని చెల్లని రాజుతల; ముందున్నది బృహత్ ప్రాణికోటి ఆహ్వానం అంటాడు. బ్రిడ్జికింద, స్టేషన్లో, ధూళి మీద / ఎటుచూచిన మీ రూపులు / ఎటువిన్నా మీ అరుపులు / పార్కుచెట్లు, కాల్వగట్లు / అరుగులు, మరుగులు అన్నీ / ఆక్రమించి తిరుగుతున్న / ఎవరి పిల్లలోయి మీరు అంటూ బిచ్చగాళ్ళ గురించి నినదిస్తాడు. ఒక్క బానిసున్నా ఈ లోకానికి ముక్తిలేదు అంటూ మాతృభూమి పిలుస్తోంది మారు పలుకవేమిరా అంటూ ఇలా ప్రతి పలుకులో సమకాలీన సమస్యలకు దర్పణంలా అనిసెట్టి సుబ్బారావు కవిత్వం దర్శనమిస్తోంది.

ఆధార గ్రంథాలు :

1. అర్ధశతాబ్దపు ఆంధ్రకవిత్వం - శ్రీపాద గోపాలకృష్ణమూర్తి
2. ఆధునికాంధ్ర కవిత్వం ఆవిర్భావ వికాసాలు - ఆచార్య ఎస్వీడి చంద్రశేఖర్

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత కవిత్వం – సామాజిక చైతన్యం

– ఆచార్య డి. వి. శ్రవణ్‌కుమార్, ప్రొఫెసర్-కం-డైరెక్టర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

తెలుగు సాహిత్యంలో దళిత ప్రస్తావన మొదటిసారిగా బమ్మెరపోతన రచించిన శ్రీమద్భాగవతం, అష్టమ స్కంధంలోని గజేంద్రమోక్ష ఘట్టంలో 'దళిత' పద ప్రయోగం కన్పిస్తుంది. ఇది దళిత చైతన్య సూచిక కాదు. మహాత్మజ్యోతి బా పూలే దళిత శబ్దాన్ని జాతివాచకంగా ప్రచారంలోకి తెచ్చారు. 1970 సంవత్సరంలో దళిత పాంథర్స్ ఉద్యమం వచ్చిన తర్వాత ఈ పదం బాగా ప్రచారంలోకి వచ్చింది. తెలుగు సాహిత్యంలో బలిజేపల్లి లక్ష్మీకాంతకవి 'సత్యహరిశ్చంద్రీయం' నాటకంలోనూ, మంగిపూడి వేంకటశర్మ రచించిన దళితకావ్యం 'నిరుద్ధ భారతము'లోనూ దళిత పద ప్రయోగం కన్పిస్తుంది.

దళిత నిర్వచనం :

1. "తరతరాలుగా అస్పృశ్యతకు గురై, మతం పేరిట, సాంస్కృతికంగా హీనంగా చూడబడి, విద్యా సౌకర్యాలు కరువై సమాజంలో ఉంటూ కూడా ప్రధాన జీవన స్రవంతికి దూరమై ఆర్థికమైన అణచివేతకు, శ్రమదోపిడికి గురైన వాళ్లు"
2. "మనిషి మనుగడకు కనీస అవసరాలైన కూడు, గుడ్డ, గూడు నోచుకోని నిర్భాగ్యులు, ఊరికి దూరంగా ఉండి ఉనికిని కోల్పోయిన వాళ్లు సభ్య ప్రపంచంతో సరైన సంబంధాలు లేనివాళ్లు, నిత్య పీడితులు, నిత్య తాడితులు, అవమానాలకు, అత్యాచారాలకు గురవుతున్న వాళ్లు దళితులు" అని ఎండ్లూరి సుదాకర్ నిర్వచించారు.
3. "కుల వ్యవస్థ కారణంగా రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా అణచివేయబడిన శ్రామికులే దళితులు" అని కె.సత్యనారాయణ నిర్వచించారు.
4. "దళితులంటే ఎస్.సి,. ఎస్.టి,. బి.సి,. మైనారిటీ మతస్థులు అంతా కలిపి దళితులే" అని గుంటూరు లక్ష్మీనరసయ్య నిర్వచించారు.

దళిత సాహిత్య నిర్వచనాలు :

దళితులు తమ ఆవేదనను, ఆర్తిని యుగ యుగాలుగా అనుభవించిన వివక్షతలను తామే స్వానుభవంతో ఆ అనుభవాలను అక్షరీకరించుకోవడమే దళిత సాహిత్యం. దళితుల ద్వారా దళితుల కోసం రాయబడే సాహిత్యమే దళిత సాహిత్యమని చెప్పవచ్చు. ప్రగాఢమైన సంవేదన, తిరుగుబాటుతత్వం మార్పుకోసం పోరాట నిర్దేశం చేసేదే దళిత సాహిత్యంగా భావించవచ్చు.

- "దళితులంటే అంటరానితనం, మాల, మాదిగ కోవకు చెందినవారు. వీరి సాహిత్యమే దళిత సాహిత్యం" అని శివసాగర్ నిర్వచించారు.
- ప్రముఖ మరాఠీ కవి యోగీంద్ర "దళిత జీవితాన్ని చిత్రించేది దళిత సాహిత్యం" అని నిర్వచించారు.
- మరొక మరాఠా రచయిత వాంఖడే "ఒక విప్లవాత్మక సంఘటన ఫలితంగా జన్మించి తీవ్రమైన తిరుగు బాటు యొక్క వ్యక్తీకరణ రూపమే దళిత సాహిత్యం" అని నిర్వచించారు.

దళిత సాహిత్య లక్షణాలు :

దళిత సాహిత్యం అనుభూతి విశిష్టమైంది. జీవితాన్ని, సమాజాన్ని యథాతథంగా ప్రతిబింబించడం దీని లక్షణం. ఇది కుల, మత, వర్గ, ఆర్థిక, రాజకీయ, సామాజిక ఆధిపత్య స్వభావం నుండి మనిషికి స్వేచ్ఛను కల్గించే దిశగా కొనసాగుతుంది. దళిత దృక్పథంలో జీవితమే సాహిత్యం కనుక సాహిత్యానికి ప్రజలకు మధ్య ఉన్న ఖాళీని పూరించే దిశగా కృషి చేస్తుంది. మనిషి కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ, మానవ జీవితంలో చైతన్య స్ఫూర్తిని రగిలించడానికి ప్రయత్నిస్తుంది. ప్రాచీన, సాంప్రదాయిక స్వభావం కలిగిన సామాజిక నిర్మాణాన్ని తిరస్కరిస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం,

సామాజిక న్యాయం వంటి విలువల ప్రాతిపదికగా ఏర్పడే సమాజ నిర్మాణాన్ని ఆహ్వానిస్తుంది. హేతువాద దృష్టిని కలిగి, పురాణ భావనలు, మత సిద్ధాంతాలు, అశాస్త్రీయమైన భావనల్ని ఖండిస్తుంది.

సమాజంలో సంస్కరణ భావాలు రేకెత్తించడానికి సాహిత్యం ఒక సాధనం కావాలని దళిత సాహిత్యం భావిస్తుంది. సాహిత్యం సామాజిక చైతన్యాన్ని కల్గించేదిగా ఉండాలని ఆశిస్తుంది. దళిత సాహిత్యం పీడితుల ఆశలు, ఆశయాలు, అనుభవాలు, అనుభూతులను చిత్రిస్తుంది. అణచివేత, దోపిడీలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, సామాజిక ఆర్థిక న్యాయం కోసం పోరాడటమే దళిత సాహిత్య ప్రధాన లక్షణం. దళితుల మానసిక దాస్య శృంఖలాలు తెంచడానికి పోరాటస్ఫూర్తి రగిలించడం కూడా మరొక ప్రధాన లక్షణం. ఈ దిశగా చేసే పోరాటంలో ఉన్నత వర్గాలు కూడా దళితుల గురించి ఆలోచించేలా చేసింది దళిత సాహిత్యం.

దళిత దృక్పథాన్ని అర్థం చేసుకోకపోతే దళిత సాహిత్యాన్ని అర్థం చేసుకోవడం కష్టతరమవుతుంది. అంబేద్కర్, ఫూలే, మార్క్స్ రచనల్ని, సిద్ధాంతాల్ని అర్థం చేసుకుంటే దళిత దృక్పథం అర్థం చేసుకోవడం సులభతరమవుతుంది. భారతదేశంలో పట్టిపీడిస్తున్న కుల సమస్య, అస్పృశ్యత వంటి నేపథ్యంలో దళితుల బానిసత్వాన్ని ప్రతిఘటిస్తూ దళితులు కవిత్వం రాయడం ఆరంభించారు. మొదటగా గుర్రం జాషువా రచించిన కవిత్వం నేటి దళిత కవిత్వోద్యమానికి భూమికగా నిలిచిందని చెప్పవచ్చు. 90వ దశకంలో జరిగిన చుండూరు, కారంచేడు సంఘటనలు, దళిత స్త్రీలపై అఘాయిత్యాలు, అంబేద్కర్ విగ్రహాల కూల్చివేతలు, వర్ణ వివక్ష, దళితుల వేదనలు, అగ్రవర్ణ దురహంకారాలు వంటి నేపథ్యాలు దళిత కవిత్వానికి వస్తువులయ్యాయి. దళితవాద నేపథ్యంతో రచించిన కొన్ని కవితల్ని ఈ వ్యాసంలో ప్రస్తావించడం జరిగింది.

కత్తి పద్మారావు దళితవాదంతో రచించిన కవిత "అవును ఈ యుగం మాది"లో యుగం మాది అంటే వ్యక్తిది కాదు. సమూహానిది, అదే దళిత సముద్రపు ఘోష అని కవి తెలియజేశాడు.

"అవును
నా గాయాలన్నీ గర్వపడేవే
నేల కన్నీటి బొట్లతో
తడిసినప్పుడల్లా
నేనొక నాగాస్త్రం ధరించాను
వెలుగు బక్కచిక్కినపుడల్లా
నేనొక వెన్నెల తుంపరలా వ్యాపిస్తాను
భూమిని ఎంత లోతుగా త్రవ్వినా
నా చరిత్ర సాక్షాత్కారం అవుతోంది
మనిషి అంతరంగం ఎంత వెదికినా
వేదనే దొరుకుతుంది...."

అని కత్తి పద్మారావు దళిత వేదనని ఈ కవితలో చిత్రించాడు. తమ జీవితాల్లో వెలుగు కోల్పోయి చీకటి పరచుకున్నపుడల్లా తాను ఒక వెన్నెల తుంపరలా వ్యాపిస్తానని చెప్పాడు. చరిత్ర పుటల్ని ఎంత లోతుగా తవ్వి వెలికి తీసినా దళిత వేదనాభరిత చరిత్ర సాక్షాత్కరిస్తుందని, మానవ అంతరంగాల్ని ఎంత శోధించినా దళిత వేదనే దొరుకుతుందని తెలిపాడు. తమ అభివ్యక్తిలో కన్పించే శిల్ప సౌందర్యాలు అంతర్మథనం నుండే జన్మిస్తాయని స్పష్టం చేశాడు.

రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చినపుడు, అంబేద్కర్ విగ్రహం శిరస్సును ఖండించినపుడు చలించిపోయిన ఎండ్లూరి సుధాకర్ 'ఒక విగ్రహం - ఒక నిగ్రహం' అనే కవిత రచించాడు. దళితుల్ని అవమానించడానికి అంబేద్కర్ విగ్రహ శిరస్సే కన్పించిందా అని ఈ కవిత ద్వారా ప్రశ్నించాడు. ఈ దేశంలో ముప్ఫయి మూడు కోట్ల మంది దేవతలు చేయలేని పనిని, రాజ్యాంగ రూపకల్పనని డా.బి.ఆర్.అంబేద్కర్ చేశారని, అందరికీ ఆత్మగౌరవాన్ని కల్గించిన వ్యక్తి మా దీన

బాంధవుడని ఇందులో పేర్కొన్నాడు. అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చడమే మగతనమైతే, అంబేద్కర్‌ని అవమానించడమే పగ తీర్చుకోవడమైతే, ఈ దేశంలో మట్టితో చేసి పూజించే దేవుళ్లకు పుట్టగతులుండవని ఈ కవిత ద్వారా కవి హెచ్చరించాడు. ఎండ్లూరి సుదాకర్ తన ఆవేదనని వ్యక్తం చేస్తూ...

"బాబా సాహెబు లేకపోతే
భావి భారతదేశమే లేదు
విద్వేషం విగ్రహాన్ని కూలుస్తుందేమో కానీ
వివేకాన్ని వికసించనియ్యదు
కూల్చిన అంబేద్కర్ తలకు వెల కట్టడానికి
ఈ భూగోళం మీది ధనం సరిపోదు
ఆయన చూపుడు వేలు కింద
శాశ్వతంగా తల వంచడమే
జరిగిన నష్టానికి పరిహారం
పశ్చాత్తాపమే పూలహారం..." అని తెలిపారు.

మనుషులు మానవత్వాన్ని మరచి ఇనుపరాడ్లతో, గొడ్డళ్లతో దళితులపై దాడి చేసిన లక్ష్మింపేట మారణ కాండకి చలించిపోయిన కవయిత్రి జూపాక సుబద్ర 'నెత్తుటి పేట' అనే కవితను రాసింది. ఈ కవితలో బానిసలుగా బతుకుతూ, మూతికి ముంత, ముడ్డికి తాటాకు కట్టడం వల్ల అస్పృశ్యులుగా జీవితాన్ని అనుభవిస్తున్న దళితుల పక్షాన కవయిత్రి నిలబడింది.

"మొన్న పులులు చంపిన కారంచేడులు
నిన్న సింహాలు వేటాడిన చుండూరులు
ఇయ్యాల తోడేళ్లు పారించిన నెత్తుటిపేట లక్ష్మింపేట"

అంటూ కవయిత్రి దళితులపై జరిగిన మారణ కాండని తెలియజేసింది.

"తొండ ముదురుతున్న దొర తనాల్ని
కండ్లు దెరుస్తున్న వూరి కుక్కలు పులి వుచ్చతొక్కి
కన్నుమిన్ను గానక
కత్తులకు తోడు కారంపొడిగా కదిలిన ఆడ దొరలతో
లక్ష్మింపేటను రక్తం పేటను జేసినయి
నావేలే బరిసైనా కంటికడ్డంబడ్డ చెడ్డకాలం
తిరిగి తిరిగొస్తున్న కారంచేడు, చుండూరు
కైర్లాంజి, లక్ష్మింపేటల మారణకాండలకు మరణ
మెప్పుడో..."

నని అంటూ జూపాక సుభద్ర దళితులపై దాడులను ఖండించారు. అగ్రవర్ణ మహిళలు కూడా దళిత స్త్రీలపై కారంపొడులతో దాడి చేసిన దృశ్యాలను, అగ్రవర్ణ స్త్రీల దురహంకారాన్ని ఇందులో ఆవిష్కరించారు. దళితులకు పాలం ఉండకూడదనే, సొంత వ్యక్తిత్వం ఉండకూడదనే నీచ మనస్తత్వాన్ని చిత్రించారు. పాలం దున్ని, పంట పండిస్తే దళితులపై దాడిచేసి, వారి ప్రాణాలు తీయడానికి వెనుకాడని అగ్రవర్ణాల దుర్మార్గాన్ని ఈ కవితలో కళ్లకుకట్టినట్లు చూపించారు.

అరుణ్‌సాగర్ అనే కవి వెట్టిచాకిరీని వ్యతిరేకిస్తూ 'హూ లెట్ ద డాగ్స్ ఔట్' అనే కవితను రాశాడు. ఎడారిని కప్పిన ఆకాశం, మనుషుల మధ్య నుండి దారి చేసుకుంటూ, సముద్రంలోకి దూకిన మనిషి ఎక్కడికి పారిపోతావంటూ కవి ప్రశ్నించాడు. మనిషిని తన కుల మేంటని ప్రశ్నిస్తూ పక్కనోడు చనిపోతుంటే పట్టించుకోని మనిషి తత్వాన్ని కవి ఇందులో దుయ్యబట్టారు.

'కేపిటలిజమా తొక్కా
చారిత్రక బహుతిక్కవాదమా
ఇది బానిస సమాజము
నాణేనికి కాదు
ప్రతి కథకూ మరోవైపు
నీకు నువ్వేరా
కనిపించని నాలుగో సింహం
అందుచేతనే
నువు కనిపిస్తే కాల్చివేత..." అని అంటూ దళిత చైతన్యాన్ని రగిలించడానికి కవి ప్రయత్నించాడు.

బతుకమ్మ పండుగ వస్తే కుల ప్రస్తావన లేకుండా పండుగ జరపడాన్ని, ఓట్లు అడుక్కునే సమయంలో పావలావడ్డీ, కరెంటు బుడ్డీ, రూపాయికిలో, ఆపద్బంధు

వంటి పథకాల వలల్తో ఓట్ల వేటకొచ్చినరాజకీయ నాయకుల తీరును కృపాకర్ మాదిగ 'పాదయాత్రలన్నీ దండ యాత్రలే' అనే కవితలో ఎండగట్టాడు.

"కాలువలు కాలువలుగా నీళ్లని దొబ్బుకున్న వాడే
కడివెడు నీళ్లు వాళ్లని
బలిదానాలకు ఉరికిస్తుండు
చిందు మాదిగ పూలపై
నిషేధాలు సాగిస్తున్న ఆడ దొరలు
రోడ్డు మీద రాజకీయ బత్కమ్మలాడుతున్నరు
ఊరి బయటికి నెట్టినోడే
మనమంతా బంధువులం
గంగ సింధు బిందువలమని
నినాదాలు చేస్తుండు..." అని అంటూ ప్రజావంచన ప్రస్థానాల్ని విమర్శించాడు. ఒక పక్క ఖనిజ వనరుల్ని ఇనుప గోళ్లతో దేవుకుంటూ, భూమిని శనగపొట్టులా, డొల్లగా చేస్తున్న రాజకీయ నాయకుల దోపిడీని ఈ కవిత ద్వారా ఎండగట్టారు. చెరువు మట్టి, ఇసుకను తరలిస్తూ, బాక్సైటు కొండల్ని మింగేస్తూ ఆదివాసీల జీవితాల్ని, పర్యావరణాన్ని రంగురాయిలా దొంగలిస్తూ, తేనెటీగలకు మంటబెట్టి ఆర్థిక మండళ్ల నాగజెముళ్లు పెంచుతున్న రాజకీయ నాయకుల వైఖరిని ఈ కవితలో తేటతెల్లం చేశాడు. కుర్చీల కోసం కాకుండా ప్రజల పక్షం నిలబడే విధంగా పాదయాత్రలు ఉండాలని నిర్దేశం చేశాడు.

చుండూరు మారణకాండపై వచ్చిన తీర్పుని ఖండిస్తూ తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ 'మట్టి పువ్వు సైతం కులం పాటకు పత్రహరితం' అనే కవితను రచించాడు. దళితులు అన్ని రంగాల్లో రాణించడం, అభ్యున్నతిలో పురోగమించడం ఓర్వలేని కళ్ల దాష్టీకానికి ఈ కవిత అద్దం పడుతుంది. దళితులు చదువుకొని పైకి ఎదగడం, సూటు, బూట్లు వేసుకోవడం భరించలేని అగ్రవర్ణాలు దళితుల్ని చంపడానికి, వారి పాలాల్ని రక్తసిక్తంగా మార్చడానికి వెనుకాడరనే సత్యాన్ని ఈ కవిత ద్వారా విల్సన్ సుధాకర్ తెలియజేశాడు. చంపిన వారూ తెలుగువారే. చనిపోయిన వారూ తెలుగు వారే, ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ పెటాకులై సమకాలీన తెలుగు సమాజాన్ని ముక్కలు చేస్తూ దళితులపై అగ్రవర్ణాలు వేటకుక్కల్లా దాడి చేసిన తీరుని ఈ కవిత తెలియజేస్తుంది.

"అతిశీతల శవపేటికలో సత్యాన్వేషణ శాశ్వత నిశేషం
సాక్ష్యాధారాల ఆకలి తీరని మీనారవిందుల ఖాకీ లలిత సంగీతం
మీడియా రథమెక్కి జీవనదిలో ఒక్క పీనుగూ లేదని బొంకుతున్న
రేడియోల ప్రత్యక్ష ప్రసారాల అభినయం
మీమాంస లేకుండా నరమాంసంపై మనువు తీర్పుల వాద్య సహకారం
మట్టిపువ్వు సైతం కులంపాటకు పత్ర హరితం.."

చుండూరు మారణహోమాన్ని దర్శించిన రాజకీయ నాయకులు, ప్రసారమాధ్యమాల్ని విమర్శిస్తూ కవి ఈ కవితను ప్రారంభించాడు. అడుగు తవ్వితే ఉబికే మధుర జలాల తెలుగు మాగాణిని, పొగాకు, పత్తి, మిర్చి, చెరుకు పంటల్ని నాశనం చేసి రక్త ప్రవాహంగా మార్చి, స్మశాన వాటికలా మార్చిన ఔన్నత్యం ఎవరిదని కవి సమాజాన్ని ప్రశ్నించాడు. పోలీసుల పనితనాన్నీ ఎండగట్టాడు. నాయకులు, మీడియా, పోలీసులు ఏకమై స్మశాన వాటికలో ఒక్క శవం కూడా దొరకలేదని పేర్కొనడం అవినీతికి పరాకాష్టగా కవి తెలిపాడు. చుండూరు దళితులకు జరిగిన అన్యాయాన్ని ప్రతిఘటిస్తూ,

"జ్ఞాన దంతం పెరగనివాడు
జనం ఓట్లతో గెలిచి జనమేజయ మహారాజైన వాడు
జీపీఆరెన్‌తో నరమేధపు పటాల్ని దేశమంతా వీక్షించాల్సిన వాడు
రైసినా హిల్స్ నిస్తంత్ర శేషతల్పంపై హాయిగా కొలువు దీరి.."

అని అంటూ రాజకీయ నాయకుల్ని కవి విమర్శించాడు.

కుల వివక్షపై ఎండ్లూరి సుధాకర్ దళితవాదంతో రాసిన మరో కవిత 'తూటాబండి'

"నేను రైలెక్కినప్పుడల్లా
మూడో తరగతి రైలు డబ్బాలనే గమనిస్తుంటాను
అందరూ నా బంధువుల్లాగా అనిపిస్తుంటారు
మా బతుకు పట్టాల మీదకి
రైలు తల్లి రాకపోతే
మాకో మెతుకు దొరికేది కాదు
కుక్కూసులు కడిగే వాళ్లుగా
కళాసీలుగా, స్కావెంజర్లుగా
పాసింజర్ల సేవ చేస్తూనే వున్నాం
మాధవుడి ప్రతిరూపాలం
మాల మాదిగలం
మనిషిలోంచి కులంపోదు
మావాళ్లు చీపుళ్లు పట్టకపోతే
రైలు పట్టాల మీద మలం పోదు..."

రైలుబండి ఎక్కితే కవికి మేకల మండీ గుర్తు కొస్తుందట. సుఖంగా ప్రయాణం చేయడమంటే సుఖప్రసవం జరిగినట్టుగా కవి పేర్కొన్నాడు. సీటు ఉన్న వారు, లేనివారు, ప్రాణాలకు తెగించి రైలు ఉపరితలంపై ప్రయాణించేవారు ఏ తరగతి, వర్గం ప్రయాణికులని ప్రశ్నించాడు. మనదేశంలో బుల్లెట్ రైళ్లు, కొత్త రైల్వేలైన్లు ఎవరి కోసమని ప్రశ్నించాడు. జలాలను, పాలాలను చూస్తూ హాయిగా ప్రయాణించే జనతారైళ్లు కావాలని కవి కాంక్షించాడు. దళిత జీవితాలన్నీ అంటరాని ప్రయాణాలతో అదిశంకర అవమానాలతో అతలాకుతలం కాకుండా ఆదర్శప్రాయంగా ఉండి, దళితుల్ని అందరితో సమానంగా గౌరవించాలని కవి కోరుకున్నాడు.

దళిత కవిత్వ ఉద్యమంతో విడదీయలేని బంధం ఉన్న కవి శిఖామణి. దళిత పేద జీవితాన్ని కళ్లకు కట్టినట్లు చూపే కవిత 'ముత్యాలు గారి నిలువుటద్దం'. ఎవరైనా అద్దం ముందు నిలబడి ప్రతిబింబాన్ని చూస్తే అద్దం కాస్త పెద్దదిగా కన్పిస్తుంది. భాగ్యనగరంలోని ట్యాంక్‌బండ్, నక్లెస్ రోడ్డు వంటివి చూసి, వాళ్ల ఊరి చెరువుతో పోల్చుకుంటూ, దళిత జీవితాల్ని నెమరువేసుకునే విధంగా ఈ కవిత దర్శనమిస్తుంది.

"నూగారు మీసకట్టు మూతి మీద మొలుస్తుండగా
తొలిసారి చూసి మురిపెంగ మెలేసింది ఈ అద్దం ముందే
మా వాడు పిల్లలందరినీ ఏడు రంగుల ఇంద్రధనుస్సు ఎక్కించి
కలల ప్రపంచంలో ఊరేగించిన
మాయాదర్పణం ముత్యాలు గారి నిలువుటద్దం"

మట్టి ఇల్లు, కంపదడి గోడలు, అరచేయి అంత అద్దం, పిచ్చుక గూడంత దీపం గూడు, చింపిరి జుత్తు, చీమిడి ముఖంతో ఎగిరెగిరి అద్దంలో చూసుకుంటుంటే, ముక్కు కనపడితే కన్ను కనపడదు. కన్ను కనపడితే ముక్కు కనపడదు. కంటికి పెట్టగా మిగిలిన కాటుక రేఖలు, నుదుట దిద్దగా మిగిలిన కుంకుమ రజనుతో ఉన్న ఇంటి గోడలు వంటివన్నీ దళిత పేద జీవితాన్ని చిత్రిస్తాయి.

ఈ విధంగా తెలుగు సాహిత్యంలో దళిత కవిత్వోద్యమం బహుముఖీనంగా కొనసాగుతుంది. ఎందరో దళిత కవులు సామాజిక బాధ్యతగా దళిత స్పృహతో కవిత్వ రచన కొనసాగిస్తూ, దళిత చైతన్యం కోసం శ్రమిస్తున్నారు. సాంఘిక అసమానతల్ని రూపుమాపే దిశగా కవిత్వీకరిస్తున్నారు. ఈ దిశగా సాగుతున్న ఉద్యమంలో దళిత సాహిత్యం మరింత పరిపుష్టమై సామాజిక అసమానతల్ని, రుగ్మతల్ని రూపుమాపి సమసమాజ స్థాపన జరగాలని ఆశిద్దాం.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వేదాంగ వాఙ్మయంలో స్మృతులు

– డా॥. డి. ఉదయకుమారి, అసోసియేట్ ప్రొఫెసర్ - కం, డిప్యూటీ డైరెక్టర్,
ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

శ్రుతులు అంటే వేదాలు, బ్రాహ్మణ, అరణ్యక, ఉపనిషత్ సాహిత్యమని అని అర్థం. స్మృతి అంటే ఆరు వేదాంగాలు, ధర్మశాస్త్రాలు, ఇతిహాసాలు, పురాణాలు, అర్థశాస్త్రం, నీతి శాస్త్రాలు అన్ని ఇందులో చేరుతాయి. అయితే, స్మృతి శబ్దానికి ధర్మశాస్త్రాలు అన్న అర్థం కూడా ఉంది. రాజు అధికారాలు, కర్తవ్యాలు, రాజనీతి, ప్రజలు, సామాజిక వ్యవస్థ, వర్ణాశ్రమ ధర్మాలు, నీతి, సదాచారం మొదలైన అన్ని విషయాలను ధర్మ శాస్త్రాలు బోధిస్తున్నాయి.

ఈ ధర్మశాస్త్రాల ని ప్రత్యేకంగా స్మృతులు అని పిలవడం ఉన్నది. పురాణాలు, ఉప పురాణాల సంఖ్య లాగానే స్మృతుల సంఖ్య కూడా చాలా పెద్దది. పురాణాల్లో అష్టాదశ మహా పురాణాల మాదిరిగానే స్మృతుల్లో కూడా అష్టాదశ స్మృతులు ఉన్నాయి. ఈ స్మృతులు దాదాపుగా వాటి నిర్మాతల పేర్ల మీదనే వ్యవహారంలో కనిపిస్తు న్నాయి. అవి పద్దెనిమిది :

1. మనుస్మృతి, 2. పరాశరస్మృతి, 3. వశిష్ఠ స్మృతి, 4. శంఖ స్మృతి, 5. లిఖిత స్మృతి:, 6. అత్రి స్మృతి, 7. విష్ణుస్మృతి, 8. హరితస్మృతి, 9. యమస్మృతి, 10. అంగీరస స్మృతి, 11. ఉశస్మృతి, 12. సంవర్తనస్మృతి, 13. బృహస్పతిస్మృతి, 14. కాత్యాయనిస్మృతి, 15. దక్షస్మృతి, 16. వ్యాస స్మృతి, 17. యాజ్ఞవల్క్యస్మృతి, 18.శాతాతపస్మృతి.

అయితే, ఈ స్మృతులన్నీ మూల రూపాల్లోనే లభిస్తున్నాయని చెప్పలేం. ఈ స్మృతులు అన్నింటిలోనూ మనువు రచించిన మనుస్మృతి ప్రముఖ మైందని, అతి ప్రాచీనమైనదని అంటారు. దీన్ని మానవ ధర్మ శాస్త్రం అని కూడా వ్యవహరిస్తారు. మనువు మానవజాతికి ఆదిమ పురుషుడని సంహిత, బ్రాహ్మణ గ్రంథాల్లో చెప్పబడింది. మను ధర్మ శాస్త్రంలోని కొన్ని అంశాలు ప్రాచీన గ్రంథాల్లో కనిపిస్తున్నాయి. ఈ విషయాలు ఇప్పుడు దొరికే మను స్మృతితో సరిపోలడంలేదు. కాబట్టి మానవ ధర్మ శాస్త్రం, మనుస్మృతి ఒకే గ్రంథాలు కావని, మానవ ధర్మ శాస్త్రం ఆధారంగా మనుస్మృతి రాయబడిందని విమర్శకుల అభిప్రాయం. మిగతా స్మృతి గ్రంథాలు కూడా మను స్మృతినే ప్రామాణికంగా పేర్కొంటున్నాయి. ఇందువల్ల మూల రూపంలో మానవ ధర్మ శాస్త్రం ఒక్కటే స్మృతి గ్రంథంగా ఉండేదని, దాని ఆధారంగానే మిగిలిన స్మృతి గ్రంథాలన్నీ వెలువడ్డాయని పండితులు నిర్ణయించారు.

మహా భారతంలోని శాంతిపర్వంలో బ్రహ్మ చెప్పిన దండనీతి శాస్త్రం గురించి చెప్పబడి ఉంది. ఈ నీతి శాస్త్రంలో లక్ష అధ్యాయాలు ఉండేవని వాటిలో ధర్మార్థ కామ మోక్ష సంబంధమైన వివరణలు ఉన్నాయని చెప్పబడింది. ఈ నీతి శాస్త్రాన్ని శివుడు పదివేల అధ్యాయాలు గల ' వైశాలక్ష ' మనే గ్రంథంగా సంక్షిప్తం చేశాడని, ఇంద్రుడు ఐదు వేల అధ్యాయాలు గల గ్రంథంగా ' బాహుదంతక శాస్త్రం ' అనే పేరుతో సంక్షిప్తం చేశాడని అంటారు. తరువాత ఈ గ్రంథాన్ని శుక్రాచార్యుడు వేయి అధ్యాయాలు కలిగిన ' ఔశనసీ నీతి ' లేదా 'శుక్రనీతి' పేరుతో నిర్మించాడని, ఆ తర్వాత కాలాను గుణంగా ఈ నీతిశాస్త్రం సంక్షిప్త రూపాన్ని ధరిస్తూ ప్రచారంలోకి వచ్చిందని చెబుతారు. ఈ మహాభారత కథను బట్టి ధర్మ శాస్త్రం మొదట ఒకే గ్రంథంగా ఉండి, తరువాత వివిధ రూపాలను ధరిస్తూ వచ్చిందని చెప్పవచ్చు. మను, వశిష్ఠ, విష్ణు మొదలైన ఋషులు రాసిన స్మృతి గ్రంథాలన్నీ బ్రహ్మ చెప్పిన దండనీతి శాస్త్రం మీదనే ఆధారపడి ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ దండనీతి శాస్త్రమే కాలానుగుణంగా మారుతున్న ధర్మం, నీతి,

సాంఘిక విలువలను ప్రతిబింబింప చేస్తూ వేరు వేరు గ్రంథాలుగా రూపొంది ఉంటుందని భావించవచ్చు.

అల్బెరూని అనే అరబ్బీ యాత్రికుడు స్మృతి గ్రంథాలను గురించి ప్రస్తావించి ఉన్నాడు. స్మృతి గ్రంథాలు వేదాల నుండి ఉద్భవించాయని ఇతడు పేర్కొన్నాడు. అల్బెరూని 20 మంది బ్రహ్మ పుత్రులైన స్మృతి కారుల పేర్లను ప్రస్తావించాడు. వీరిలో దేవల, శుక్ర, భార్గవ, బృహస్పతి, యాజ్ఞవల్క్య, మనువులను వ్యాసుని శిష్యులుగా పేర్కొన్నాడు. అయితే ఇతడు పేర్కొన్న స్మృతి కారుల పేర్లు సాధికారికంగా లేవని విమర్శకుల అభిప్రాయం.

స్మృతి గ్రంథాలు - విషయం :

ప్రాచీన భారతీయుల సామాజిక, ధార్మిక, రాజకీయ జీవన విధానాన్ని తెలుసుకోవడానికి స్మృతి గ్రంథాలు చాలా సహకరిస్తాయి. స్మృతి గ్రంథాలు ప్రాచీన భారతీయుల ఆచార వ్యవహారాలు, నీతి, ధార్మిక, రాజనీతి విషయాలకు ప్రామాణికమైన గ్రంథాలు.

రాజులు, న్యాయ వేత్తలు స్మృతి గ్రంథాల ఆధారంగానే విషయం నిర్ణయం చేసేవారు. ప్రాచీన భారతీయులు తాము సదాచార మని భావించిన దాన్ని కఠినంగా అనుసరించేవారు. ఇటువంటి ఆచారబద్ధమైన జీవన విధానాన్ని అవలంబించడానికి స్మృతి గ్రంథాలు ఆధార భూతంగా ఉండేవి. భారతదేశంలోకి ఎడతెగకుండా విదేశీ జాతులు వలసలు, దండయాత్రలు జరపడం వల్ల వివిధ జాతుల సమ్మేళనం ఏర్పడింది. అందుకు తగిన విధంగా ధర్మ శాస్త్రాలు రాయవలసిన అవసరం కూడా కలిగింది.

స్మృతి గ్రంథాల రచన సూత్ర గ్రంథాల తర్వాత జరిగినట్టు తెలుస్తున్నది. స్మృతి గ్రంథాలకు ముందు భారతీయుల ఆచార వ్యవహారాలను, నీతి ధార్మిక విషయాలను వేదాలు, బ్రాహ్మణ, ఆరణ్యకాలు నియమించేవి. జాతుల సమ్మేళనం విస్తరించిన తర్వాత అరాచకం ప్రబలకుండా ఉండడానికి నీతి, ధార్మిక విషయాల ప్రాధాన్యత కూడా పెరుగుతూ వచ్చింది. అందువల్ల నీతి, ధార్మిక విషయాలను నియమించే స్మృతి గ్రంథాల అవసరం కూడా ఏర్పడింది.

బ్రాహ్మణ, ఆరణ్యకాలు కేవలం వైదిక కర్మలు వరకే పరిమితమైనవి. సూత్ర గ్రంథాలు వర్ణాశ్రమ ధర్మాన్ని, కర్తవ్యాలను ప్రతిపాదించాయి. అయితే స్మృతి గ్రంథాలు మాత్రం మానవుల సమస్త ధర్మాలు అంటే సామాజిక, నైతిక, రాజకీయ ధర్మాలన్నింటిని గురించి చర్చిస్తున్నాయి. దీన్నిబట్టి ఈ స్మృతి గ్రంథాలు మానవుని వ్యక్తిగత కర్మానుష్ఠానానికి కాకుండా, సామాజిక కర్మానుష్ఠానానికి ప్రాధాన్యతను ఇచ్చాయని చెప్పవచ్చు. స్మృతి గ్రంథాలు రాజులకు పరిపాలనా వ్యవస్థను, న్యాయ నిర్ణయాన్ని కూడా బోధించేవి. రాజ్య వ్యవస్థ విస్తరించే కొద్ది ధర్మ శాస్త్రాల సంఖ్య, విషయ వివరణలు పెరుగుతూ వచ్చాయి. ఒక విధంగా స్మృతి గ్రంథాలు ఆయా యుగాల రాజ్యాంగ గ్రంథాలని చెప్పవచ్చు.

స్మృతులు - రచనాకాలం :

స్మృతుల రచనా కాలాన్ని స్పష్టంగా చెప్పడం కష్టమే. అయితే ఇవన్నీ ఒకే సమయంలో వ్రాయబడినవి కావని నిశ్చయంగా చెప్పవచ్చు. స్మృతుల రచనాకాలం చాలా విస్తరించి కనిపిస్తుంది. ఈ సుదీర్ఘ రచనా కాలాన్ని విమర్శకులు మూడు విభాగాలుగా విభజించారు.

ప్రారంభ యుగం క్రీస్తు పూర్వం 600 - 200
మధ్య యుగం క్రీస్తుపూర్వం 200 క్రీస్తు శకం 800
తృతీయ యుగం క్రీస్తు శకం 900 - 1800

ప్రారంభ యుగంలో స్మృతి గ్రంథాలకు మూల రూపాలైన ధర్మసూత్ర గ్రంథాల నిర్మాణం జరిగింది. మధ్యయుగంలో ధర్మ సూత్రాలకు వ్యాఖ్యానాల రచన జరిగింది. మధ్య యుగం లోనే పద్య రూపంలో స్మృతి గ్రంథాల రచన ప్రారంభమై క్రీస్తు శకం 18వ శతాబ్దం వరకు కొనసాగింది. స్మృతుల రచన శుంగ వంశ రాజుల కాలంలో ఆరంభమైందని, గుప్త రాజుల కాలంలో

స్మృతుల రచన చాలా విరివిగా జరిగిందని, క్రీస్తుశకం 18వ శతాబ్దం వరకు ఈ రచన కొనసాగిందని విమర్శకుల అభిప్రాయం. అంటే స్మృతుల రచన పురాణ కాలం నుండి ఆధునిక కాలం వరకు కొనసాగిందని చెప్పవచ్చు.

స్మృతి గ్రంథాల్లో మనుస్మృతి, యజ్ఞవల్క్య స్మృతి భారతదేశమంతటా అంగీకారయోగ్యమైన ధర్మశాస్త్ర గ్రంథాలు. ప్రాచీన భారతీయ సమాజంలో సామాజిక వ్యవస్థ, రాజధర్మం, రాజ శాసన సంబంధమైన విషయాల మీద ఈ రెండు గ్రంథాలు భారతీయులకు అత్యంత ప్రామాణికమైన గ్రంథాలు. ఈ రెండు స్మృతి గ్రంథాలు శాతవాహన రాజుల కాలంలో వ్రాయబడినవని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

స్మృతి గ్రంథాలు - నిర్మాణం :

కల్ప సూత్రాలకు చెందిన ధర్మ సూత్రాల ఆధారం గానే స్మృతి గ్రంథాలు ఎక్కువగా నిర్మితమైనాయి. ఈ ధర్మ సూత్ర గ్రంథాలే కాకుండా స్మృతి కారులకు పురాణాలు, మహాభారత, రామాయణాలు, లోక రీతులు కూడా ఆధారంగా కనిపిస్తున్నాయి. పారంపర్యంగా వచ్చే నీతి, ధార్మిక వ్యవహారాలనే కాకుండా స్మృతి కారులు సమకాలీనమైన ఆచార వ్యవహారాలను కూడా ప్రామాణికంగా గ్రహించారు. స్మృతి గ్రంథాలలోని విషయాలను నాలుగు విధాలుగా విభజించవచ్చు. అవి ఆచార నియమాలు, వ్యవహార విషయాలు, ప్రాయశ్చిత్త విధానాలు, కర్మఫలము మొదలైన వాటి వివరణలు. వర్ణాశ్రమాల్లోని విధి విధానాలు కూడా స్మృతుల్లో విశదంగా చెప్పబడ్డాయి.

స్మృతి గ్రంథాల్లో కొన్ని లఘు, బృహత్ రూపాలు రెండింటిలోనూ లభిస్తున్నాయి. నారద స్మృతికి లఘు, బృహత్ సంస్కరణలు రెండూ ఉన్నాయి. పరాశర స్మృతికి లఘు సంస్కరణ ఉన్నది. బృహస్పతి స్మృతి ప్రస్తుతం పూర్తి రూపంలో లభించడం లేదు. మొత్తం మీద స్మృతుల సంఖ్య 152 వరకు ఉన్నదని పండితులు నిర్ణయించారు.

స్మృతి గ్రంథాలకు టీకలు, భాష్యాలే కాకుండా స్వతంత్ర రూపమైన వివరణ గ్రంథాలు కూడా వెలువడ్డాయి. వాటిలో క్రీస్తుశకం 12వ శతాబ్దికి చెందిన జీమూతవాహనుడు రచించిన ధర్మ రత్నం, లక్ష్మీ ధరుడు రాసిన స్మృతి కల్పతరువు, హలాయుధుని బ్రాహ్మణ సర్వస్వము అనే గ్రంథాలు కనిపిస్తున్నాయి. 13వ శతాబ్దంలో రేవణ్ణ భట్టు స్మృతి చంద్రిక, వరదరాజు స్మృతి సంగ్రహం, హేమాద్రి చతుర్వర్గ చింతామణి, కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుని సరస్వతీ విలాసం కనిపిస్తున్నాయి. 14వ శతాబ్దంలో విశ్వేశ్వరుని మదన పారిజాతం, చండేశ్వరుడు రాసిన స్మృతి రత్నాకరం, మాధవుని కాల మాధవీయం ఉన్నాయి. 15వ శతాబ్దంలో వాచస్పతి రచించిన చింతామణి, 16వ శతాబ్దంలో రఘునందనుని అగ్నిపరీక్ష, వైద్యనాథుని తిథి నిర్ణయం, కమలాకర భట్టు నిర్ణయ సింధువు, నీలకంఠ దీక్షితుని భాగవత భాస్కరం, మిత్ర మిశ్రుని వీరమిత్రోదయం కనిపిస్తున్నాయి. ఈ ధర్మ శాస్త్ర విషయ సంబంధమైన రచనలు 18వ శతాబ్దం వరకు కొనసాగాయి.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రాచీన కథాకావ్యాల్లో తెలుగువారి సంస్కృతి – జీవన విధానం

– డా॥. వేదాంతం. ఐ.యమ్.యమ్, ఆర్.యస్.టి.కె. ఆచార్యులు, గుంటూరు.

ప్రాచీన తెలుగు సాహిత్యంలో పురాణేతిహాసాలు, ప్రబంధాలు, కావ్యాలు, కథాకావ్యాలు, ద్విపద కావ్యాలు, చంపూ కావ్యాలు వంటి సాహిత్య ప్రక్రియలెన్నో ఉన్నాయి. వీటిలో సాహిత్యపరంగా పరిశీలిస్తే 'కథాకావ్యాల'కు ప్రత్యేక స్థానం ఉందని తెలుస్తుంది. తిక్కన యుగమైన 13వ శతాబ్ది నుండి తెలుగుసాహిత్యంలో కథాకావ్యాల ప్రక్రియ ప్రారంభమైందని పండితాభిప్రాయం. "చిత్ర విచిత్రాలైన మహిమలు, మలుపులు వినోదాలు, నీతులతో కూడుకున్న కథల సంపుటియే కథాకావ్యాలని" సాహితీ విమర్శకులు నిర్వచించారు. కథాకావ్యాల్లో ప్రధానంగా కన్పించే అంశాలు నైతికత, అనాటి సాంఘిక పరిస్థితులు, ఆంధ్రులయొక్క దేశీయ ఆచారములు అని చెప్పవచ్చు.

తెలుగుసాహిత్యంలో తొలి కథాకావ్యం కేతన రాసిన దశకుమార చరిత్ర. ఆ తర్వాత వెలువడిన కథాకావ్యాల్లో మంచన పండితుడు రాసిన కేయూరబాహు చరిత్ర, జక్కన రాసిన విక్రమార్కచరిత్ర, అనంతామాత్యుని భోజ రాజీయం, కొరవి గోపరాజు విరచితమైన, సింహాసన ద్వాత్రింశిక, పాలవేకరి కదిరీపతి - శుకసప్తతి అనునవి ప్రసిద్ధమైనవిగా సాహితీ చరిత్రలో నిలిచాయి. ఈ కథా కావ్యాల్లో అనాటి సాంఘిక పరిస్థితులు, సంస్కృతి, భాష వంటి అంశాలు ఉన్నాయని తెలియజేయడానికి కొన్ని ఆధారాలు ఉన్నాయి. "తెలుగువారి సాంఘిక జీవితాన్ని వర్ణించుటలో 'శుకసప్తతి' నిరుపమాన గ్రంథమని" సురవరం ప్రతాపరెడ్డి గారు ఆంధ్రుల సాంఘిక చరిత్రలో రాశారు. కొరవి గోపరాజు రాసిన 'సింహాసన దాత్రింశిక' లో రెడ్డిరాజుల కాలం నాటి సాంఘిక పరిస్థితులు అనాటి వినోద క్రీడలు, వస్త్ర విశేషాలు, గుళ్ళు, వేటలు, గ్రహశాంతులు, దొంగలకు వేసే శిక్షలు మొ. ఎన్నో వివరించబడ్డాయి.

కథాకావ్యాల ద్వారా భాషాంశాలు, గణితశాస్త్ర సంబంధిత అంశాలు, ప్రజల జీవన విధానం, ఆచార సాంప్రదాయాలు మొదలైన సాంఘిక సాంస్కృతికాంశాలు గురించి సవివరముగా తెలునుకోవచ్చు. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

దశకుమార చరిత్ర :

కేతన రచించిన ఈ కథాకావ్యం ద్వారా పదమూడవ శతాబ్దినాటి దేశీయ ఆచారాలు, ప్రజల అలంకారాలణాది విశేషాల గురించి తెలుస్తున్నవి. ఈ కావ్యంలోని మూడవ ఆశ్వాసం 77వ పద్యాన్ని పరిశీలిస్తే - "మట్టియలుజ్జ్వల మణినూపురంబులు మొలనూలు వస్త్రముల్ ముత్తి యములు" అని ఉంది. దీన్ని బట్టి ముత్యాలు, పూసలదండలు, ఉంగరాలు, చేసి కంకణాలు వంటి ఆభరణాలను నాటి ప్రజలు అలంకరణలో భాగంగా ఉపయోగించేవారని, స్త్రీలు - కాటుక, తిలకం వంటి ద్రవ్యములు వాడేవారని తెలుస్తుంది.

తొమ్మిదవ ఆశ్వాసంలోని 33వ పద్యంలో - "ఎదిరిన కోడి మున్నెగసి యారెలు మెడ"... అని కోడిపోరు వర్ణన చేశారు. దీన్ని బట్టి 'కొడిపందేలు' జరపడం నాటి సాంప్రదాయంలో ఒక భాగమని గ్రహించవచ్చు.

కేయూరబాహుచరిత్ర :

మంచన పండితుడు రాసిన ఈ కథాకావ్యంలో అనాటి సాంఘిక విషయాలతోపాటు గణితశాస్త్ర విషయాలు కూడా ఉన్నాయి. కావ్యంలోని 4వ ఆశ్వాసంలోని 201 పద్యంలో - "కర్పూర కస్తూరికా పరిమళకరం..... " అంటూ నాయికా నాయకులైన మృగాంకావళి కేయూరబాహుల యొక్క విహారమును వర్ణించారు. దీని ద్వారా నాటి రాజులు కస్తూరి, కర్పూరం వంటి పరిమళ ద్రవ్యాల్ని విరివిగా ఉపయోగించేవారని, రాజభవనాలు ఉద్యాన

వనాలతో,రత్నాలశోభతో అలరారుతూ ఉండేవని తెలుస్తుంది.

ఒకటవ ఆశ్వాసంలోని 2వ పద్యమైన "కరిముఖుల్ డశ్వినులు శ్రుతులు....." అనుదానిలో ఒకటి నుండి అనంతం వరకు గల సంఖ్యను తెలిపారు.

మూడవ ఆశ్వాసంలోని 168వ పద్యంలో వానియము, నావలు, ఇమ్ము, సెట్టులు వంటి పద ప్రయోగములు చేశారు. వానియము అంటే వాణిజ్యం (వ్యాపారం) అని అర్థం. నావలు అంటే నౌకలని, ఇమ్ము అంటే ద్రవ్యమని, సెట్టులు అనగా వ్యాపారమని అర్థాలున్నాయి. నాటి వ్యాపారులు ద్రవ్యముతో నౌకావ్యాపారాన్ని చేసేవారని తెలుస్తుంది.

విక్రమార్క చరిత్ర :

జక్కన రాసిన ఈ కథాకావ్యంలో భాషాంశాలైన జాతీయాలు, సామెతలు మొ.నవి ఉన్నాయి. మానవుని జీవనం ఉన్నతమార్గంలో కొనసాగడానికి ఉపయోగపడే సూక్తులు ఉన్నాయి. 'శత్రుడు చదువని పుత్రుడు...' 'చింతామరణే రణే...' వంటి మొ? సూక్తులు ఈ కావ్యంలో ఉన్నాయి. 'వర్ణనలు' కూడా ఎక్కువగా ఉన్న ఈకథాకావ్యాన్ని పరిశీలిస్తే నాటి సాంఘిక విషయాలెన్నో తెలిసే అవకాశం ఉందని చెప్పవచ్చు.

భోజరాజీయము :

అనంతామాత్యుడు రాసిన ఈ కథాకావ్యంలో సత్యం, ధర్మం, త్యాగం, అహింస, వంటి సాంఘిక, నైతికాంశాలతో పాటు స్త్రీల సంభాషణారీతులు, ప్రజల జీవన విధానం మొ. విషయాలు వివరించబడ్డాయి.

సింహాసన ద్వాత్రింశిక :

కొరవి గోపరాజు రచించిన ఈకథాకావ్యం రెడ్డిరాజుల కాలంనాటి సాంఘిక జీవనానికి ప్రతిబింబం. కావ్యంలోని ఒకటవ ఆశ్వాసంలోని 103వ పద్యంలో - "కామాక్షికిని మహాకాళికి, చండికి..." అని ఉంది. దీని ద్వారా నాటి శూద్రజాతి వారు దేవతాశక్తులైన కామాక్షి, మహాకాళి, చండి, అంబిక మొదలైన వారిని కొలిచేవారని తెలుస్తుంది. ఇదే ఆశ్వాసంలోని "కేరి జరంబుల గోరి,,,," అను కవిత ద్వారా నాటి కాలంలోని ధనవంతులకి వేటకు వెళ్ళే సాంప్రదాయం ఉండేదని, వేటలో 'పక్షివేట' కు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారని గ్రహించవచ్చు.

ఒకటవ ఆశ్వానంలోని సుదీర్ఘమైన కవితయైన "చందన కావులును, పట్టెడు కావులును....." అనుదానిలో కవి తనకాలం నాటి వాడుకలో ఉన్న పట్టువస్త్రాల రకాలను గురించి వివరించడాన్ని బట్టి నాటి ప్రజల వస్త్రాలంకరణ విషయాలు తెలుస్తాయి.

పదవ(10) ఆశ్వాసంలో నాటి ప్రజలు చదరంగము, జూదము వంటి ఆటలు ఆడేవారని, 11వ ఆశ్వాసంలో వ్యాపారులు పద్దులు రాసేపద్ధతిని పాటించేవారని, వితంతు ధర్మాలు ఉండేవని వివరించబడింది.

శుకసప్తతి :

పాలవేకరి కదిరీపతి రచించిన ఈ కథాకావ్యంలో వర్ణాంతర వివాహాలు, వేశ్యావృత్తి వంటి సాంఘికాంశాలు వివరించబడ్డాయి.

ఈవిధంగా కవులు కథాకావ్యాల ద్వారా తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను, సాంఘిక, నైతికాంశాలను తెలపడం మన సాహితీ వైభవానికి నిదర్శనం. ఆయా విషయాలనన్నింటిని గ్రహించి తర్వాతి తరాలకి తెలియజేయడం మన కర్తవ్యం. కథాకావ్యాలు, సాంఘిక సాంస్కృతిక జీవనానికి ప్రతిబింబాలు అనడం సమంజసమని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్యసమీక్ష - జి. నాగయ్య.
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా. ద్వా.నా.శాస్త్రి.

★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తిక్కన తెలుగు తెన్నులు

– డా॥ వై. విజయలక్ష్మి, విభాగాధిపతి, తెలుగు విభాగం, నేషనల్ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఒకరి అభిప్రాయంను ఇంకొకరు తెలిసికొనుటకై జనులేర్పరచుకున్న గుర్తులను భాష అంటారు. మనము మాట్లాడు భాష పేరు తెలుగు. తెలుగు, తెనుఉగు, ఆంధ్రము అనునవి దీనికి గల పేర్లు. ఇది దాదాపు రెండువేల సంవత్సరముల నుండి వాడుకలో వున్నది. ఒక వేయి సంవత్సరముల పటిష్టమైన సాహిత్యమున్నది. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యొక్క అధికార భాష. ఇది భారత దేశములో హిందీ తరువాత అధిక సంఖ్యాకులు మాట్లాడు భాష. శ్రీశైలము, కాళేశ్వరం, ద్రాక్షారామం అను మూడు శివక్షేత్రములున్న రాష్ట్రం అగుట వలన మన రాష్ట్రంనకు పూర్వం ''త్రిలింగ దేశం'' అను పేరు కలిగింది. తెనుంగు, తెనుగు ఈ రెండు రూపాలు భాషా పరంగా నన్నయ భారతంలో మొట్టమొదటిసారిగా గ్రంథస్థమై ఉన్నాయి. పాలకురికి సోమన తెనుంగు, తెలుగు పదాలను భాషాపరంగా ప్రయోగించాడు. తిక్కన్న నిర్వచనోత్తర రామాయణంలో తెలుగు కవిత్వము, తెలుపబడి, భారతావతారికలో ''తెనుంగు బాస తెనుగు బాస'' అని ప్రయోగించి ఉన్నాడు. తిక్కన కవిత్రయంలో ద్వితీయుడు. కవిత్వంలో అద్వితీయుడు తిక్కన తెనుగు తెన్నులు పున్నమి వెన్నలలు అమృతపు జున్నులు. సంస్కృత భాషతో సమంగా తెలుగు భాషలో భావ గాంభీర్యాన్ని చూపించిన భాషాభిజ్ఞుడు. కనరాని తెలుగు పలుకులలోని మెలకువను వెలికి తీసిన కవిహాలికుడు. పదాలతో పాత్రలను తీర్చిన చిత్రలేఖకుడు. భారత పాత్రలతో తెలుగు హృదయాలను ఆవేశింపచేసి, ఆంధ్రుల హృదయాలలో భారతసారాన్ని నింపిన భాషారస సిద్ధుడు తిక్కన.

తిక్కన ఆంధ్రమహాభారతాన్ని ఆంధ్రులు ఆనందం పొందేటట్లుగా వ్రాసాడు. తేట తెనుగు పదాలతో కవిత అల్లడంలో తిక్కనకు సాటి రాదగిన కవి మరి యొక్కరు లేరు. భారతాన్ని ఆంధ్రుల ప్రవృత్తికి దర్పణంగా ఆయన తీర్చిదిద్దాడు. తెలుగు భాష యొక్క మాటలవాడి వేడి ఎట్టిదో నిరూపించాడు. సామాన్య ప్రజలకు కూడా భారతం అర్థమయ్యే విధముగా నాటకీయ శైలిలో వ్యావహారికాను గుణంగా తిక్కన భారత రచన చేశాడు. పాత్ర చిత్రణంలో సంభాషణలలో, భావ ప్రకటనలో అచ్చమైన తెలుగు కవి తిక్కన. భారత కర్తలలో ద్వితీయుడైనా అద్వితీయకవితా శిల్పి తిక్కన. తన భారత రచన వల్ల సాధింపదలచిన పరమార్థం ఆంధ్రప్రజలకు ఆనందం కలిగించడం భారతీయులందరికీ ఆనందదాయకమైన వ్యానుని భారతాన్ని తెలుగులోకి తీసుకురావటం వల్ల కలిగే ఆనందం ఆంధ్రప్రజలకు కలగాలి. మహాభారతం సమిష్టి కుటుంబం యొక్క జీవితాన్ని తెలిపే కథ. ఉమ్మడి కుటుంబంలో ఉండే మనో భావాలూ, ఆప్యాయతలూ, స్వార్థాలూ, నెత్తుటి పొత్తులూ, మానసిక వేదనలూ, ఇష్టం లేక పోయినా కలిసి ఉండే నందర్భాలు ఇవన్నీ మహాభారతంలో పొదగబడి ఆంధ్రుల సంతోషానికి కారణమైంది. ఆంధ్ర ప్రజలు తిక్కన భారతం వల్ల పొందిన సంతోషాన్ని మరే కావ్యం వల్ల పొందలేదంటే అతిశయోక్తి కాదు. ఆంధ్రులది సహజంగానే ఆవేశపూరిత మైన చిత్తి వృత్తి అధర్మాన్ని సహించరు. మాయా మర్మాలు వారికిష్టం ఉండవు. కుండబద్దలు కొట్టినట్లుగా మనస్సులో ఉన్న దానిని వెళ్ళగక్కడం, ఆవేశంతో ఊగిపోవడం ఇవన్నీ ఆంధ్రజాతి లక్షణాలు. తిక్కన భారతంలోని పాత్రలు సరిగ్గా ఇలాంటివే. తిక్కన తీర్చిదిద్దిన పాత్రలో ఆంధ్రులు తమ ప్రతిబింబాలనే చూసుకుంటారు. ఆంధ్రులు ఆ పాత్రలను తామే అనుకుంటారు. ద్రౌపది వెంట పడిన కీచకుడి వర్తనలో, కృష్ణుణ్ణి రాయబారానికి పంపుతూ ద్రౌపతి పలికిన పలుకుల్లో, కుంతీదేవిని కృష్ణుడు

సందర్శించినపుడు జరిగిన సంభాషణలో, భీష్మ కర్ణుల వాగ్వాదంలో తమ సహజ స్వభావమైన ఆవేశాన్ని దర్శించ గలిగిన ఆంధ్రులకు తిక్కన భారతం అత్యంత ప్రీతి దాయకమైనది. తిక్కన తెలుగులోని ప్రత్యేకతలు చూసేటప్పుడు ఈ క్రింది సామాన్య లక్షణాలు కని పిస్తాయి. తెలుగుపదాలు ఎక్కువగా వాడం, ఎంత కష్టమైన భావాన్నైనా తెలుగు లోకి శక్తిమంతంగా చెప్పడం, అవసరమైన పదబంధాలను కావలసిన అర్థంలో సృష్టించు కోవటం, వ్యవహారిక భాషకు అనుగుణంగా ఉన్న గ్రాంథిక రూపాలను వాడటం భావ ప్రధానంగా పద్యాన్ని రాయడం మొదలైనవి కనిపిస్తాయి.

"నీకు వెఱవనేలో, నిన్ను నా బుద్ధిమం
తుండు సెప్పుమనిన తులువ మాట
లెన్ని గలవు వాని నన్నింటి ననుమాన
మింతలేక యాడు మెల్లవినఁగ"

నీకు భయం ఎందుకు? ఇంతకు ముందు మాట ఇచ్చి ఎప్పుడూ ఆమాటను తప్పలేదు. అంతటి కర్ణుడికి కోపం వస్తే పాండవులు ఏవిధంగా బ్రతుకుతారు. అని భీష్ముడు దుర్యోధనుడితో అన్న మాటలు.

"కొడుకుఁగాంచు రాచకూతురెద్దానికి
నట్టి పనికి నుచితమైన సమయ
మొదవె, దడయు టింకనాప్పుడు జనములు
నట్లుగాని పురుషులనరు మిమ్ము."

దేనికోసమైతే క్షత్రియ స్త్రీకుమారుడిని కంటుందో అ పని చేయవలసిన సమయం వచ్చింది. ఆలస్యం చేయకుండు ఆపని (యుద్ధం) చేయాలి. అట్లా చేసినప్పుడే ప్రజలు మిమ్మల్ని పురుషులు అంటారు. అని కుంతీదేవి కుమారులను ఉద్ధేశించి పలికిన మాటలు.

"తానైననపుడు వక్రుం
డైనీతి పథంబు విడిచెనక్కట! పతి
మ్మైనను జక్కని తెరువున
బూని నడువుడనుచు నిపుడు బుద్ధులు సెప్పెవ్"

అక్కడా! తానేమో అప్పుడు వంకర బుద్ధికలవాడై నీతి మార్గాన్ని విడిచి పెట్టి ప్రవర్తించాడు. ఇప్పుడాదృతరాష్ట్రుడు మమ్మేమో న్యాయ మార్గంలో నడవమని నీతి బోధలు చేస్తున్నాడు.

భాషాగతమైన సౌందర్యానుభూతి అందరికీ కలుగదు. భాషతో నిత్యపరిచయం, ప్రత్యేక భాషా దృష్టి కలిగిన పండితులకు మాత్రమే ఆనందానుభూతి కలుగుతుంది. తిక్కన భారతం లోని వస్తువులో ఆంధ్రులు తమ నిత్య జీవితాన్ని దర్శించారు. ఆంధ్రుల జీవితాన్ని ప్రతిబింబించే అద్దం లాంటిది తిక్కన భారతం. ఏ ఆంధ్రుడు దాని వంక చూచినా అతడి ముఖమే అందులో కనబడుతుంది. తిక్కన ఆంధ్రజాతికి ప్రాతినిధ్యం వహించిన మహా కావ్యకర్త తిక్కన ఆంధ్ర జాతీయ మహాకవి.

తిక్కన భారతంలో ప్రధానంగా మూడు అంశాలలో ఆంధ్రావళికి మోదాన్ని కలిగించాడు. 1. వస్తు సాన్నిహిత్యం 2. పాత్ర చిత్రణ 3. తెనుగుతనం. తిక్కన భారతంలోని వస్తువులో ఆంధ్రులు తమ నిత్య జీవితాన్ని చూచు కున్నారు. పాత్రలలో ఆవేశపూరితమైన తమ తత్వాన్ని తిలకించారు. భాషలో తమ జవజీవాలు కలిగిన భాషా రీతులను చూసారు. ఈ విధంగా తిక్కన భారతం మూడు మేలిగుణాల త్రివేణి సంగమమై ఆంధ్రావళి మోదాన్ని సంపాదించింది.

ఆధార గ్రంథాలు :

1. శ్రీ మదాంధ్ర భారతం - కవిత్రయం - తిరుమల తిరుపతి దేవస్థానం.
2. తిక్కన భారతి - తిక్కన భాషా సాహిత్యాలపై నిర్వహించ బడిన సదస్సులో సమర్పించబడ్డ పత్రాల సంకలనం తెలుగు శాఖ. హైదరాబాదు, కేంద్ర విశ్వవిద్యాలయం.

3. మహా భారతం - రెంటాల గోపాలకృష్ణ
4. తెలుగు సాహిత్య - చరిత్ర - జి. నాగయ్య
5. మహాభారత విమర్శనము - మరుపూరి కోదండ రామిరెడ్డి.
6. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కుందుర్తి కవిత్వంలో మానవీయత

– డా॥. చింతల రాకేశ్ భవాని, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా.

మనిషిని మనిషిగా చూసేది మానవీయత. మనిషికీ మనిషికీ మధ్య అవసరమైనది మానవీయత. అయితే మనిషిని మనిషి దోచుకునే స్వార్థపు పునాదులపై లేచిన ఈ మానవసమాజంలో కరువయినదే మానవీయత. దానిని కనిపించేలా చేయడం కోసం "అక్షర లక్షాధికారి, మాటల కోటీశ్వరుడు కుందుర్తి" చేసిన ప్రయత్నమే కవిత్వం.

సంఘజీవి అయిన మానవుడు తన చుట్టూ ఉన్న నలుగురితో కలిసి జీవించాలి. అందుకు ఆలంబన మానవీయత. అన్ని వాదాలకు మానవతావాదమే మూలం అని విజ్ఞులు విశ్వసిస్తారు. మానవీయత లేకుంటే మనిషి మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది. ఎన్ని రంగాలలో పురోగమించినా అందులో మానవీయత లేకుంటే ఆ అభివృద్ధి అంతా అర్థం లేనిదే అవుతుంది. అందుకే నిరంతరం మానవీయ స్పర్శ మానవ హృదయాలను తాకుతూ ఉండాలి. మానవ హృదయాలను స్పందింప చేయగల శక్తి కళలకు ఉంది. అందులో ఆలోచనామృతం అయిన కవిత్వం మహాశక్తిమంతమైనది. ఆ కవిత్వం సామాన్య మానవుని సైతం చేరగలిగినప్పుడే దానికి సార్థకత. అందుకనే కుందుర్తి, "వచన కవిత్వం సరళంగా ప్రజలను చేరుకునే శక్తిమంతమైన సాధనగా ఆయన భావించారు. సామాజిక స్పృహ ఆధునిక యుగానికి ఊపిరి లాంటిది కాబట్టి దాన్ని ఆయన మన్నించారు".

ఇంటిపేరు 'కుందుర్తి'తో ప్రసిద్ధి చెందిన వీరి పూర్తి పేరు కుందుర్తి ఆంజనేయులు. నర్సారావుపేట సమీపంలోని కోటవారిపాలెంలో 1922 డిసెంబర్ 16న కామయ్య , నరసమ్మ దంపతులకు జన్మించారు. "పాత కాలం పద్యమైతే, వర్తమానం వచనగేయం" అని విశ్వసించారు. 1976 లో ఫ్రీవర్స్ ఫ్రంట్ ను స్థాపించి వచన కవితోద్యమానికి మూల స్తంభంగా నిలిచారు. నయాగరా, తెలంగాణ, యుగే యుగే, నగరంలోవాన, నాలోని నాదాలు, మాతృగీతం, ఇదేనా దేశం మొదలైన వచన కవితా కావ్యాలు, కవితా సంపుటులు వెలువ రించారు.

ఈ ప్రపంచపు ప్రకృతి ఒడిలో జన్మించిన సామాన్య మానవుడికి నవసమాజం సమసమాజమై సౌఖ్యాన్ని అందించాలనే తాపత్రయంతో సాహితీ సృజన గావించారు కుందుర్తి. ''సాహిత్య ప్రయోజనం సమాజంలో మానవీయతను పెంపొందించడమే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే". సాహిత్య పరమావధిని ఔదల దాల్చిన కుందుర్తి కవిత్వంలోని పదపదాన అన్యాయమై పోయిన సామాన్యుడు కనిపిస్తాడు. సాటి మానవుని కష్టం తనదిగా భావించే సానుభూతి అందులో ధ్వనిస్తుంది.

జరుగుతున్న అన్యాయం అర్థంకాని అభాగ్యుల గురించి కుందుర్తి ఇలా అంటారు-

"చాలీ చాలని
కూలి జీవనం
కండల తరుగూ
మండే ప్రేవులు
తెలియని అజ్ఞానంలో
చిమ్మి దీపం చీకటిలో
నిరాశలో
నిద్రించిన జీవులు
మనిషిని మనిషీ
జాతిని జాతీ
దోచుకున్న
పురాతన గాథలవి!"

(తరువాత, 'నయాగరా' సంపుటి)

రోజంతా పడిన తన కష్టం దొరలకు ఖజానాలు నింపగలిగింది కానీ తన కడుపు నింపలేకపోయింది. కండ లని కరిగించి సృష్టించిన సంపద తన ప్రేగుల్లో మంట లను ఆర్పలేకపోయింది. ఇలా ఎందుకు జరుగుతుందో వారికి అర్థం కావడంలేదు. అవును మరి అర్థమైతే తరాలకు తరాలు వెట్టిచాకిరిలోకి ఎలా నెట్టబడేవారు? ఇది గతం. ఒకనాటి గాథ. అన్యాయమే ఆచారమై బలి అయిన బడుగుల బతుకులు, వారి అమాయకపు బాధలు ఇక్కడ ధ్వనిస్తున్నాయి.

"వంతుల వరుస ప్రకారం వెట్టి చెయ్యటం
ఎందుకో ఎవరికీ తెలేదు
పండిన పంట మొత్తం పన్నుగా యివ్వటం
ఎందుకో ఎవరికీ తెలేదు
గ్రామాల శీలవతుల్ని చెరిచే హక్కు దేశముఖులకు
ఎక్కడిదో ఎవరికీ తెలేదు
వాములు మేసే స్వాములకు
ఇండ్లు తగలబెట్టే అలవాటు
ఎప్పటిదో ఎవరికీ తెలేదు"

(సంఘోదయ, 'తెలంగాణా' కావ్యం)

మనిషిని అన్నిరకాలుగా దోచుకునే హక్కు దొరలకెలా వచ్చిందో ఎవరికీ తెలియదు. బడుగుల ధన, మాన, ప్రాణాలకు కనీస రక్షణ కూడా లేదు. చెప్పినట్టు వినలేకపోయినవారి ఇండ్లు తగులబెట్టి సజీవదహనం చేసే దొరల అలవాటు తరతరాలది మరి. కించిత్ మాన వత్వం లేని అమానవీయ దొరల పాలనలో సాగిన అకృత్యాలు హృదయవిదారకంగా వినిపిస్తున్నాయి. ఈ కవితలో కుందుర్తిది ద్విముఖ ధ్వని - కవిదృష్టికోణంలో నడుస్తున్న కవితాపంక్తులలో "ఎవరికీ తెలేదు" అన్న మాటలలో దోపిడీవర్గాల క్రౌర్యం ఒకవైపు, పీడితవర్గాల ఆక్రందనలు మరొకవైపు ధ్వనిస్తున్నాయి. దొరలు చెలాయిస్తున్న ఎవరికీ తెలియని ఎదురులేని అధికారం, ప్రజలు అనుభవిస్తున్న ఎవరికీ తెలియని అంతులేని అవమానం ఎప్పటిదో ఎందుకొచ్చిందో మరి?

ఇన్నాళ్ళుగా దోపిడీకి మరిగిన వర్గం రాసిన పురాతన గాథలు దోపిడైపోయిన వారి కథలను మరుగుపరచినవి. ఇక ముందు అది సాగదు అని ఇలా కుందుర్తి నినదిస్తున్నారు-

"ఒక వేపున
అధికోత్పత్తి
మరోవేపు డొక్కల కరువూ
కట్టిన ఆర్థిక సోపానాలూ
సాధనాల వ్యక్తిగతత్వం
చాలన్నది సాగవంది"

(తరువాత, 'నయాగరా' సంపుటి)

ఆకలితో అలమటించే శ్రమజీవుల కష్టంచేత నిర్మిత మైన ధనసౌధాలు కొందరి వ్యక్తిగతం అనేమాట ఇక గతం, ఇక్కడితో అంతం. అసమానతలు పుట్టించే అటువంటి చట్టాలు, న్యాయాలకు స్వస్తి పలకాలని కుందుర్తి కమ్యూ నిజపు పిలుపునిస్తున్నారు. ఎందుకంటే "కావ్య రచన విధానంలో మార్క్సిస్టు దృక్పథాన్ని ప్రవేశపెట్టి ఏఏ సత్ఫలితాలను సాధించడం ద్వారా కవిత్వాన్ని సాధ్యమై నంత ఎక్కువగా ప్రజల దగ్గరకు తీసుకువెళ్ళటానికి వీలున్నదో చూడటం కూడా కవి యొక్క బాధ్యత"[4] అని ఆయన భావించారు. "ఈయుగంలో వచ్చిన మరియొక విశేషము సామాజిక పరిస్థితులను మార్క్సిస్టు దృష్టితో అవగాహన చేసికోవడం. అభ్యుదయ యుగంలోని కవులూ, వచన కవితా, దిగంబర కవితా, విప్లవ కవితా మొదలగు వివిధ రంగాలలో సాధన చేసిన, చేస్తున్న వారందరూ ఈ మార్క్సిస్టు దృక్పథం కలవారే. అందువల్ల ఆధునిక కవిత్వానికి ఇది ఒక ప్రధాన లక్షణమై భాసిస్తున్నది" అని వివరిస్తున్నారు. కవిత్వంలో కమ్యూనిజం కనిపించడం అనేది ఆధునికయుగ లక్షణంగా మారి పోయింది. ఆశ్చర్యమేముంది, మానవులంతా సమాన మవ్వాలనే మానవీయత అందులోనే ఉంది మరి. అందుకే కవిత్వంలో కమ్యూనిజం కుందుర్తిని మానవీయ కవిని చేసింది.

స్వాతంత్ర్యం రాక ముందు దేశంలోని పరిస్థితుల్ని మన కళ్ళ ముందుంచారు కుందుర్తి. బ్రిటీషు కసాయితనం కారణం లేకుండానే కనబడుతుంది. తప్పు చెయ్యకుండానే మనిషిని శిక్షించే వారి రాజనీతిని దమనరీతిని, ప్రజల దుస్థితిని తేలిక మాటలతో గుండె బరువెక్కేలా వర్ణించిన కుందుర్తి ''ప్రథమశ్రేణి కవి, పాతకాలపు కవిసమయాలు మార్చేశాడు. కవిత్వాన్ని ప్రజల దగ్గరకు తీసుకొనివచ్చాడు''.

''పశువుల్ని బందెల దొడ్డిలో తోలడానికి
ఎవరి చేలోనైనా మేయాలి
మనిషిని అరెస్టు చెయ్యడానికి అతను తప్పెందుకు చేయాలి?
భారతీయుడైతే చాలు బంధించవచ్చు జైల్లో!
అడవిలో పెద్దపులికి ఏదైనా జంతువు ఆహారంగా దొరికినట్లు
జైల్లో మనిషి దొరికాడంటే పోలీసులకు తీరిక ఉండదు''

(రాజద్రోహమే నా మతం, దండియాత్ర కావ్యం)

పశువును సైతం తప్పు చేస్తేనే బంధిస్తారు కానీ బ్రిటిష్ పరిపాలనలో మనిషి ఎటువంటి తప్పు చేయాల్సిన అవసరం లేదు, కేవలం భారతీయుడు అయితే చాలు బంధిస్తారు. మానవులు మానవులుగా కాక పశువుల కన్నా హీనంగా పరిగణింపబడిన రాక్షస పాలన అది. శ్రీశ్రీ చెప్పిన దారుణ మారణ కాండ ఇదేనేమో మరి. అన్యాయమే న్యాయస్థానాలు చేసే న్యాయంగా మారిన బ్రిటిష్ పరిపాలన మానవీయ విలువలు అన్నింటిని కాలరాసింది. దేశభక్తులతో జైళ్లన్నింటిని నింపింది. మరి ఆ జైల్లో పోలీసులకి మనిషి దొరికితే అడవిలో పెద్దపులికి జంతువు దొరికినట్టు. పెద్దపులి బ్రిటీష్ పోలీసయితే జంతువు భారతీయుడు. ఇదీ అనాటి పరిస్థితి. ఇటువంటి ఉపమానాలు అందరి కవిత్వంలోనూ చూసినా వాటిని ప్రయోగించి సాధించిన శిల్పం మనం కుందుర్తి కవిత్వంలోనే చూస్తాం.

అప్పుడు తెలంగాణాలో కూడా పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఏమీ లేవు. ప్రజలకి శ్మశానానికి పోవడంకన్నా పోలీసు ఠాణాకు పోవడమే ఇష్టమట-

''పుట్టింటికి పోయినా పెళ్ళాన్ని
మళ్ళీ కళ్ళారా చూసిందాకా నమ్మకం లేదు
అత్తవారింటి కొచ్చిన కొత్త పెండ్లి కొడుకు
అక్కడే వీల్నామా రాస్తే మంచిది
ప్రతి ఊరికి ఉత్తరాన ఒక శ్మశానం ఉంది
అక్కడికి పొయ్యేవాండ్లు తక్కువ
పోలీసు ఠాణాకు ఫర్లాంగు దూరంలో
చెరువంత గొయ్యి ఉందిబీ దాని మీద అందరికీ మక్కువ''

(మానభంగ, తెలంగాణా కావ్యం)

ప్రజల పరిస్థితి హృదయవిదారకంగా కనిపిస్తుంది. మనిషిని మనిషిగా బ్రతకనివ్వలేని రాజ్యంలో ప్రజలకు మరణం కన్నా దగ్గర చుట్టం ఎవరూ లేరు. భర్తకు భార్య భార్యకు భర్త శాశ్వతమైన తోడు అంటారు. అటువంటి వాళ్లు ఎప్పుడూ ఉంటారో, ఎప్పుడు ఏమైపోతారో తెలియని పరిస్థితి. కంటి ముందు నుంచి వెళ్లిన మనిషి మళ్లీ తిరిగి కనిపిస్తాడన్న నమ్మకం లేదు. అందుకు కారణం ప్రజలను రక్షించడానికి ఏర్పాటు చేసిన పోలీసు వ్యవస్థతోనే ఆ ప్రజల ప్రాణాలు తీయిస్తున్నది ప్రభుత్వం. క్షణభంగురం జీవితం అన్న విషయాన్ని సత్యం చేస్తున్నది.

స్వాతంత్ర్యం వచ్చాక కూడా ప్రజల కష్టాలు తీరలేదు. ఆకలీ దరిద్రం తీరవు. వాటి గురించి ప్రశ్నిస్తే ప్రాణాలు దక్కవు. వారి కష్టాల్ని ఇలా తెలుపుతున్నారు కుందుర్తి.

''ప్రభుత్వం ప్రజల మీదికి వదలిన
ఆకలి, దరిద్రం, తుపాకి గుండ్లు
కడుపుల్లో దూరి పోయినవాళ్ళు పోగా
మిగిలిన వాళ్ళంతా క్షేమం''

(చిరంజీవి విప్లవానికి, 'యుగేయుగే' సంపుటి)

ప్రభుత్వం పుణ్యాన పోయిన వాళ్ళంతా పోగా మిగిలిన వాళ్ళయితే క్షేమమేనట. మరి వాళ్ళన్నా బాగున్నారా?

'ఇక్కడ కరువు పులి కరవని ప్రదేశం
గాలించినా దొరకడం లేదు
మరలో పనివాడు యేపూట కాపూట
మరణించకుండా బ్రతకడం లేదు"

(చిరంజీవి విప్లవానికి, 'యుగేయుగే' సంపుటి)

అంటే కరువు పులి కోరల్లో చిక్కి ప్రజలు విలవిల లాడుతున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు గాలికొదిలేస్తే దినదిన గండంగా ప్రాణం ఒక గుదిబండగా కాలం వెళ్లదీస్తున్నారు. చావడమే లక్ష్యంగా బ్రతకడమేనా? బ్రతుకు కే పరమార్థం లేదా? పేదల ప్రాణాలకు విలువేలేదా? వాటి బాధ్యత ప్రభుత్వానిది కాదా? వేల ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. మరి వీటికి సమాధానం ఎక్కడ?

"నేడు బ్రతుకు గాఢనిద్రలో కలిగిన పీడకల
విస్మరించు గతాన్ని
చరిత్రను కరిచిన అనుభవాల వాసుకితో
మథించు ప్రస్తుతాన్ని"

(సముద్ర మథనం, 'యుగేయుగే' సంపుటి)

పీడకలలా మారిన నేటి జీవితాన్ని చరిత్ర నేర్పిన పాఠాలతో మార్చుకోమంటున్నాడు. వెతల గతాన్ని వదిలేసి ప్రస్తుతాన్ని దిద్దుకోమంటున్నాడు. మత్తు వదిలి జీవితాన్ని మథించమంటున్నాడు. "సమస్త పురాణ రోగాలకు మన చైతన్యం ధన్వంత్రి !" అని చైతన్యంతో జీవించమంటు న్నాడు. ఇంకా -

"నేను గీతాన్ని
ఎండిపోయి పండని బ్రతుకు పొలంలో
సకాల వర్షపాతాన్ని
కుందుర్తి గుండె కొండ శిఖరాల నుండి
పరుగులెత్తిన భావ జలపాతాన్ని"

(నాగీతం, 'యుగేయుగే' సంపుటి)

తన కవిత్వం ఎండిపోయిన జీవితాలను పండించ డానికేనని చాటుతున్నాడు కుందుర్తి. తన హృదయం నుండి జలపాతంలా దూకే భావాలన్నీ ప్రజల బాధల్ని ఉపశమింప చేయడానికే నని నినదిస్తున్నాడు.

"నేను గేయాన్ని
ప్రజల గుండెల్లో యింకా మాయని గాయాన్ని
మృత వీరుల ధ్యేయాన్ని
పరిపాలనలో ప్రజల ప్రమేయాన్ని"

(నాగీతం, 'యుగేయుగే' సంపుటి)

పేరుకు ప్రజాస్వామ్యమైనా పరిపాలనలో ప్రజల ప్రమేయం లేదని, అది సాధించాలని పోరాటం చేసి నేలకొరిగిన వీరుల ధ్యేయాన్ని తన కవిత్వంలో ధ్వనింప జేస్తానని పలుకుతున్నాడు కుందుర్తి. పీడిత ప్రజల గొంతుకై వారి గుండెల్లోని మంటల్ని వెల్లగక్కుతానని చెబుతున్నాడు.

కుందుర్తి గారి కవిత్వంలో అన్యాయం పట్ల ఏవగింపు వ్యంగ్యంగా కనిపిస్తూనే, అవే మాటల్లో ప్రజల దీనావస్థపైన సానుభూతీ కనిపిస్తుంది. అది దీనుల పట్ల చూపించే జాలీ దయ లాంటిది కాదు. ఈ కష్టాలు నావే అని అనుకోగల సహానుభూతి, మానవీయత. దీన్ని వ్యక్తీ కరించడానికి ఆయన ఎన్నుకున్న సాధనం వచనకవిత్వం. "కుందుర్తిగారి దృక్పథంలో ప్రయోగం ప్రయోగంకోసం కాదు ప్రజాప్రయోజనం కోసం. వచన కవిత్వం సరళంగా ప్రజలను చేరుకునే శక్తిమంతమైన సాధనగా ఆయన భావించారు". "అది నిరక్షరాస్యులైన కోట్లాది సామాన్య ప్రజానీకం యొక్క గాథలను బాధలను మాత్రమే ప్రతి ఫలిస్తూ సాగినప్పటికి అక్షరాలా వారి దగ్గరికి పోలేక పోయింది" అని కవిత్వంగా విజయవంతం అయిన ప్రక్రియ "లక్ష్యం పాక్షికంగా మాత్రమే నెరవేరిందని అంగీకరించక తప్పదు" అని ఆవేదన చెందారు. "మానవతావాదాన్ని మన్నించిన మార్క్సిస్టు దృక్పథం వారిది. వచన కవిత్వ ప్రయోగ వికాస వ్యాప్తులకు కులపతిగా ఒక విశిష్ట పాత్రను నిర్వహించి, వచన కవితాపితామహ బిరుదాన్ని సమకలీన సాహిత్యంలో సగౌరవంగా పొందారు." అని డా. జి.వి. సుబ్రహ్మణ్యం గారు అన్న మాటలు అక్షరసత్యాలు.

సంప్రదింపు గ్రంథాలు & ఆకరాలు :

1. కుందుర్తి కృతులు, కుందుర్తి ఆంజనేయులు, ప్రచురణ: శ్రీ వరలక్ష్మి ప్రెస్, హైదరాబాదు. మార్చి 1975
2. కుందుర్తి కవితా వైభవం, అద్దేపల్లి రామమోహనరావు, ప్రచురణ: యువభారతి, సికందరాబాదు. మార్చి 1980
3. ప్రతిభామూర్తులు, డా. అక్కిరాజు రమాపతిరావు, ప్రచురణ: విజ్ఞానదీపిక, హైదరాబాద్. 1991
4. విహంగ, మహిళా సాహిత్య పత్రిక, 01/01/2015), (https://vihanga.com/?p=13635)
5. నవోదయలహరి, డా. జి.వి. సుబ్రహ్మణ్యం(ప్ర. సం.), ప్రచురణ: యువభారతి, సికందరాబాదు, మార్చి 1980
6. భారతి(సాహిత్య మాస పత్రిక), ఎస్. రాధాకృష్ణ(సం.), విజయవాడ, సెప్టెంబరు 1980
7. స్రవంతి(సాహిత్య మాస పత్రిక), డా. సి. నారాయణ రెడ్డి(సం.), హైదరాబాదు, జనవరి 1983

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'వలస' నవల : వస్తు పరిణామం

– డా॥. వి. శాంతిలక్ష్మి, బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగుళూరు, కర్నాటక.

చాలా ప్రాచీనత, అంతకన్నా విస్తృతి ఉన్న పదం "వలస". ఎంత అంటే అతి ప్రాచీనకాలం నుండీ, మనిషి పుట్టుక, మనుగడల ఆరంభకాలం నుండీ, మనిషితో పాటే పయనం చేస్తూ చేస్తూ... నేటి అత్యంతాధునిక కరోనా కాలానికి సరికొత్త రూపంతో చరిత్ర పుటల్లో కెక్కేంత అని చెప్పాలి.

గ్రామీణ ప్రాంతాల నుంచి అభివృద్ధి అందుకోవడం పేరిట అమెరికా వలస వెళ్లిన మేధోవలసను, తరాల అంతరాలను వాటి పర్యవసానాలను ఎదుర్కొంటున్న వారి జీవితాలను చిత్రిస్తూ అనేక కథలు వచ్చాయి. దక్కను పీఠభూమి నుంచి ముఖ్యంగా తెలంగాణ ప్రాంతం నుంచి సేకరించి సంకలనం చేసిన శాతవాహనుల కాలం నుండి గణాఢ్యుడు బృహత్కథ. హాలుడి గాథాసప్తశతి, అప్పటికి ఇంకా తెలుగు జాతిగా రూపుదిద్దుకోని పైశాచి తెలంగ, అస్సక, అంధక ప్రజల వలన గురించి, ప్రయాణాల గురించి, పర్యవసానాల గురించి అద్భుతంగా రికార్డు చేసి పెట్టాయి. పంచతంత్ర కథలు కేయూరబాహు చరిత్రలోనూ పక్షుల, జంతువుల వలస ప్రస్థానాన్ని, వలసలు వెళ్లిన చోట స్థిరనివాసం ఏర్పరచుకోవడాన్ని చిత్రించాయి. రాహుల్ సాంకృత్యాయన్ ఓల్గా సే గంగ (ఓల్గా నుంచి గంగకు - చాగంటి తులసి, తెలుగు అనువాదం), దివోదాసు, ఋగ్వేద ఆర్యులు, జయోదేయ వంటి కథలు, నవలలు మొత్తం మానవ సమాజ వలస ప్రస్థానాలను ఆర్యుల దండయాత్రలను చిత్రించాయి. తెన్నేటి సూరి చెంఘిజ్‌ఖాన్ నవలలో మధ్య ఆసియా గోబి ఎడారి నుంచి మొదలై చైనా దాకా సాగిన అరబ్ తెగల వలసలను చిత్రించాడు. మద్రాసు ప్రావిన్స్‌లోని తెలుగువాళ్లు కలకత్తా, రంగూన్, బర్మా వలసల గురించి రాశారు.

ఐతే, ఇంత వరకూ సాగిన వలసలు ఒక రకమైతే, ప్రస్తుతం అంటే అత్యంతాధునికతతో, ప్రపంచీకరణ తెచ్చిన సరికొత్త ఆర్థిక సంస్కరణలతో, దేశం ఎంతో ముందుకు సాగుతోంది అనుకుంటున్న తరుణంలో, దేశం మొత్తాన్ని భయభ్రాంతులకు లోను చేసి, అల్లకల్లోలం సృష్టించిన కరోనా కారణంగా సాగిన, సాగుతున్న ప్రస్తుత వలసలు కనీ, వినీ ఎరుగనివి. దేశం మొత్తాన్ని ఆశ్చర్యా సక్తులను లోను చేసినవి. నిజానికి తిరోగమన వలస ఇది. ప్రపంచీకరణ తెచ్చిన పరాభవం అని కూడా చెప్పవచ్చు. ఈ మాటెందుకంటే, అసలు ప్రపంచీకరణ పేరిట యావత్ ప్రపంచం కుగ్రామంగా మారడం వల్లే ప్రపంచ దేశాలతో లావాదేవీలు, ప్రయాణాలు పెరిగాయి కాబట్టి, కరోనా కూడా వేగంగానే ప్రయాణం చేసింది మరి అన్నదే నా ఆలోచన. ప్రపంచీకరణ చాప కింద నీళ్ళవంటిది అని, ప్రమాదం పొంచి ఉందని ప్రారంభం నుండీ రచనల్లో, సాహిత్యంలో చదువుతూనే ఉన్నాం కూడా. ఏ రూపంలో ఇబ్బందులు తెచ్చిపెడ్తుందో తెలియదు, అప్రమత్తంగా ఉండక తప్పదు అంటూ హెచ్చరిస్తూనే ఉన్నారు ఆర్థిక నిపుణులు. ఇప్పుడు ఇలా కరోనా రూపంలో యావత్ భారతదేశాన్ని అల్ల-కల్లోలం చేసింది, చేస్తూనే ఉంది. ఇకపై బహుశా ఇటువంటి వలసలు దేశం చూడక పోవచ్చు. అటువంటి పరిస్థితులు రాకూడదనే ఆశిద్దాం.

అంత ప్రత్యేకత సంతరించుకున్న ఈ వలసలకు సాహిత్య రూపమే పద్మశ్రీ ఆచార్య ఇనాక్ గారి 'వలస' నవల. జీవన్మరణ పోరాటంలో, పొట్ట చేత పట్టుకుని, తమ తమ స్వస్థలాన్ని వదిలి, పనులు వెతుక్కుంటూ హైదరాబాద్ చేరి, ఎవరికి చేతనైన పనులు వాళ్ళు చేసుకుంటూ జీవితం గడుపుతున్న వలస కూలీల బతుకులు ప్రశ్నార్థకమయ్యేలా చేసి, ఎక్కడి నుంచి

వచ్చారో అక్కడికే తిరోగమనం పట్టించి, కాలి నడకకు సైతం సరే సరేననిపించిన కరోనా వలసల గాథ ఈ "వలస".

ప్రపంచానికి పరిపాలకులు, మేధావులు, శాస్త్రవేత్తలు, కళాకారులు, వ్యాపారులు, ఉద్యోగులు, కర్షకులు, కార్మికులు, కూలీలు వలసల రాకపోకలు క్రీస్తుకు పూర్వం నుండే వున్నల్లు సాహిత్యం ద్వారా తెలుస్తుంది. ఇప్పుడీ కరోనా క్రిమి ప్రపంచానికి వలస వచ్చింది. ఇది కనిపించని శత్రువుతో, ఆయుధదారితో నిస్సహాయుల, నిరాయుధుల నిరాహార యుద్ధం. ప్రథమ కబళం వలస కూలీలు అంటారు రచయిత.

సమాజం సాహిత్యంలో ప్రతిఫలిస్తుంది అన్నది ఎంత సత్యమో, అందుకు ఈ నవల ప్రత్యక్షసాక్షిగా నిలుస్తుంది. వలస కూలీల హైదరాబాద్ - బీహారు ప్రయాణం నవలలో ప్రధానాంశం. వీళ్ళు ఎందుకు వచ్చారు అన్న ప్రశ్నకు కూలీకోసం, బ్రతుకుదెరువు కోసం అన్నది స్పష్టం. మరి ఎందుకు వెళుతున్నారు అన్న ప్రశ్నకు కరోనా భయంతో వేగలేక, పనిలేక, కూలీలేక, ఊరికే ఉండలేక, పనెప్పుడో అర్థంకాక, తిండికి జరక్క, తిక్కబట్టి..... ఇలా స్పష్టతలేని సమాధానాలు లెక్కకు మించి.

లాక్-డౌన్ సమయంలో ప్రయాణ సౌకర్యాలు లేనప్పుడు, వీళ్ళు కాలి నడకన ఎంతదూరం పోతారు. ఏమి తింటారు, ఏమి తాగుతారు, ఎలా బ్రతుకుతారు, నెత్తిన ఎంత బరువు, ఎందరు పిల్లలు, ఎటు పయనం, ఏది గమనం, ఎక్కడ గమ్యం అన్న ప్రతి ఒక్కరి సంశయానికి సమాధానంగా నవలలో, హైదరాబాదు నుండి బీహారులోని సంసారం గ్రామానికి కాలినడకన బయలుదేరిన ఒక సమూహం చిత్రించబడింది.

వలస కూలీలు మనుషులే, ఆరాట పోరాటాలు సహజమే, కష్టనుఖాలూ, వాంఛితావాంఛితాలు, మనిషిలోని ద్వంద్వాలు, సమూహంలోని సంబంధాలు సంవదించటమూ, సంఘర్షించటమూ వంటి సన్నివేశాలు అడుగడుగునా పాఠకుడిని కలవరపెడ్తాయి. కళ్ళారా సమాజంలో కనిపించిన అసంకల్పిత ఆపన్నుల ప్రేమ, దయా దానధర్మాలు, సంపన్నుల సానుభూతి, సంతర్పణలు కథలో వలస కూలీలను కూడా వరించాయి.

ఇతివృత్తం సారాంశం :

కథ మొత్తం సంసారం సమూహం చుట్టూ సాగుతుంది. బీహారులోని సంసారం అనే ఊరికి చుట్టుపక్కల ఉన్న గ్రామాల వాళ్ళంతా ఒక గుంపుగా జతకలిసి, హైదరాబాదు వదిలి, తమ తమ సొంత ఊరు వెళ్ళాలని నిర్ణయించుకుంటారు. పదిహేను వందల కిలోమీటర్ల నడక ప్రయాణం, చిన్న నుండి పెద్ద వరకూ అన్ని వయసులవారు బెదరక ముందడుగు వేస్తారు. సమూహాన్ని ముందుకు నడిపించే నాయకుడు, వీళ్ళం దరికీ పెద్ద దిక్కై, మంచి చెడులు గమనించుకుంటూ, తగిన సలహాలు ఇస్తూ, ముందుకు నడిపిస్తాడు. అనుకోని ఆపదలను ఎదుర్కొంటారు. సమూహ నాయకుడు గమ్యం చేరికముందే తన కూతురిని మృత్యువు కబ లించడం, అతని కాలు విరిగి అతని ప్రయాణానికి ఆటంకం కలగడం అందరినీ కలవరపెడ్తుంది. ఆపై సమూహ నాయకుడుగా రాం అనే వ్యక్తి అందరినీ ముందుకు నడిపించవలసి వస్తుంది. వీరి ఈ కాలినడక ప్రయాణంలో ఎదురయ్యే అనేక సమస్యలను ఎదుర్కొని గమ్యం చేరుకుంటారు. నిజంగా ఇదొక కనీవినీ ఎరుగని ఒక పెద్ద విజయంగా గుర్తించదగింది.

ఐతే, వూహించని విపత్తులా, వీళ్ళ వూరు వీరి రాకను ఆమోదించదు, పదిహేను రోజల వరకు వూరి బైట ఉండమని, తరువాత కూడా అన్ని టెస్టులు చేయించిన తరువాత ఏమీ తొందర లేకుంటే మాత్రమే ఊరిలోపలికి మీకు ప్రవేశం అంటుంది. ఈ విపత్తును వూహించని వలస కూలీల హృదయం విలపిస్తుంది. ఏమీ పాలుపోని పరిస్థితులకు నెట్టివేస్తుంది ఈ పరిణామం. అయోమయంలో ఎక్కడికి వెళ్ళాలో, ఎక్కడ ఉండాలో, ఏమి తినాలో ఏమీ పాలుపోని పరిస్థితుల్లో పడిపోతారు అందరు.

నిజానికి వీళ్ళు కరోనాకు మాత్రమే భయపడి రాలేదు. కరోనా లేని ప్రాంతమే భూమ్మీద లేదన్నది వాస్తవమై నప్పుడు, మరి వీరందరూ ఎందుకొచ్చినట్లు అన్న సందేహం అందరికీ. ఐతే వాళ్ళందరూ ఎందుకోసం వచ్చారో అది నెరవేరదని అర్థం అయ్యి, తిరుగు ప్రయాణంతో హైదరాబాదు చేరుకోవాలని నిర్ణయించు కుంటారు. ఐతే, ఈసారి మాత్రం, కూటికి, గుడ్డకు, గూటికి నష్టం వాటిల్లని విధంగా తగు ముందు జాగ్రత్తలు తీసుకుని, తమని తిరిగి రమ్మంటున్న తమ యాజమాన్యంతో తగు మంతనాలు జరిపి, యాజ మాన్యం ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్లలో సంసారం సమూహం తిరిగి హైదరాబాదు చేరడంతో కథ ముగు స్తుంది.

ఇక్కడ ఒక్క విషయం అర్థం అవుతుంది అందరికీ, రోజుల తరబడి దూరంగా ఉండవలసి వచ్చినప్పుడు బంధాలు - అనుబంధాలు సన్నగిల్లడం వాస్తవమని. అలాంటిది, ఊర్లు వదిలి సంవత్సరాలు దాటిన తరువాత తిరిగి వచ్చిన వారికీ, ఊర్లోనే ఉన్న వాళ్ళకూ మధ్య దూరం కూడా బాగా పెరిగిపోవడం సహజం. నిజానికి తరాల అంతరం కూడా ఉంటుంది. అదే జరిగింది సంసారం సమూహం విషయంలో.

ఎక్కడికైతే వలస వెళ్ళిపోతామో అక్కడే మిగతా జీవితాన్ని గడపడానికి ఇష్టం, ఉన్నా లేకున్నా సిద్ధపడక తప్పదన్న సత్యం కూడా ఈ 'వలస' నవల నిరూపించింది. దేశ, విదేశాలకు వలస వెళ్ళిన ప్రతి ఒక్కరికీ ఈ పరిస్థితి ఎప్పుడో ఒకప్పుడు ఎదురవ్వక తప్పదు అన్న సూచన కూడా ఉంది. ఈ కరోనా కష్టకాలంలో మనమందరం కళ్ళారా చూశాం, చూస్తున్నాం కూడా, సమాజం ప్రస్తుతం ఎదుర్కొంటున్న వాస్తవాన్ని 'వలస' నవల అత్యంత నూతనంగా స్పృశించింది.

ఉపసంహారం :

అడుగడుగునా కలిగిన అసౌకర్యాల్ని ఎదుర్కొంటూ, మండుతున్న ఎండలో మాడి, మాసొతూ, ఆకలికి, దప్పికటలకు అలమటిస్తూ, వయసుతో నిమిత్తం లేక సాగిన ఈ సంసారం వలస విజయవంతంగా ముగిసింది. కానీ వారి జీవితాలకు నిజమైన విజయం ఎప్పుడు వర్తిస్తుంది అన్నది ప్రశ్నార్థకం.

ప్రాచీనత ఉన్న వలసలకు కొత్తరూపం ఈ వలస నవల. మనిషి చలనం నిశ్చలమైతే, శబ్దం నిశ్శబ్దమైతే, తరణం నిస్తరణమైతే, నిర్మాణం నిర్మూలనమైతే, సృజనం శూన్యమైతే, పంట దూరమైతే, వస్తూత్పత్తి క్రూరమై ఆకలి ఘోరమై, అవసరం నేరమై, దేశం దారిద్ర్యాన్ని, జనం దౌర్భాగ్యాన్ని కొగిలించుకునే పరిస్థితులు ఎలా ఆసన్నం కాగలవో సంసార ప్రయాణరూపంలో రచయిత తెలిపే ప్రయత్నం చేశారు.

దేశం కరోనా క్రిమి నిర్మూలనానికి పోరాడుతూ, ఆర్థిక దుస్థితి నిర్మాణానికి ఊపుకోవటమా, మృత్యుశంకకు భయపడి భవిష్యత్ భారతాన్ని మంచంమీది మనిషిని చేయడమా, ప్రస్తుత కర్తవ్యం ఏది అంటూ ప్రతి పాఠకుడు ప్రశ్నించుకునే పరిస్థితి వలస నవల కల్పించింది. పరిస్థితుల ప్రాబల్యంతో మనిషి జయిస్తాడన్న విశ్వాసంతో పాటు, మానవ చైతన్యం వల్ల ప్రజలు విజయులౌతారన్న నమ్మకం కలిగితే అదే కర్తవ్యం అన్న ఆశాభావాన్ని పాఠకులకు కలుగుతుంది.

కరోనా కష్టకాలంలో వలస కూలీల విజయం వివరించిన, మనిషి మహత్తర శక్తిమీద తీరని మమకారం తెలిపిన "వలస" ప్రస్తుత అత్యంతాధునిక సాహిత్యంలో చెరగని ముద్ర వేసిందనటంలో అతిశయోక్తి లేదని నమ్ముతున్నాను.

ఆధారగ్రంథ సూచి :

1. వలస నవల - ఆచార్య కొలకలూరి ఇనాక్, 2020.
2. ఇంటర్నెట్ వెబ్‌సైట్స్.
3. సాహిత్యంలో వలసల ప్రస్థానం, గూగుల్.
4. కరెంట్ అఫైర్స్, ఇంటర్నెట్.

★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అంగర వెంకట శివ ప్రసాదరావు కథలు – మానవతా విలువలు

– నద్దన భుట్టి గణేష్, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టు
కింద మరణించిన ముసలివాణ్ణి
నేను చూశాను నిజంగా నీరంధ్ర వర్షాన వంతెన కింద
నిండు చూలాలు ప్రసవించి మూర్ఛిల్లిన దృశ్యాన్ని
నేను చూశాను నిజంగా తల్లి లేక తండ్రి లేక తిండి లేక
ఏడుస్తూ ఏడుస్తూ ముంజేతుల కన్నులు
తుడుచుకుంటూ మురికి కాల్వ ప్రక్కనే నిద్రించిన
మూడేళ్ల పసిబాలుణ్ణి

అని తిలక్ తన తీవ్రానుభూతిని మన కళ్లకు కట్టించారు. ఈ వచన కవిత్వంలో తిలక్ మానవతావాదం స్పష్టమగుతుంది. మానవాళికి అభయహస్తమివ్వాలన్న తిలక్‌లోని మానవతావాదం ఉందనడానికి ఈ వచన కవిత్వం నిదర్శనం. శ్రీశ్రీ సి.నారాయణరెడ్డి, ఆరుద్ర, శేషేంద్రశర్మ మొదలగు కవుల రచనల్లో కూడా మానవతావాదం దర్శనమిస్తుంది. సమాజానికి మంచి సాహిత్యంతో పాటు విలువలను నేర్పడమే కవుల రచనల యొక్క ముఖ్య ఉద్దేశం. సమాజంలో జాతి, కులం, మతం అనే తేడా లేకుండా ఒకరికి ఒకరు సహాయం చేసుకున్ననాడే మానవ సంబంధాలు దృఢంగా ఉంటాయి. మానవ సంబంధాలెపుడూ ఎదుటి వారి ఆనందాభివృద్ధిని కోరుకునేలా ఉండాలి.

దృక్పథం :

మానవ మనన్తత్వాలలో కౌటుంబిక, నైతిక, మానవీయ విలువలను తన కథలలో నిబిడీకృతం చేసినవారు "అంగరవెంకట శివ ప్రసాదరావు." సమాజానికి మంచి సాహిత్యం ఎంత అవసరమో, ఎంత ప్రయోజనం చేకూర్చునో అటువంటి ఉత్తమ సాహిత్యాన్ని పండించి పాఠకులకు అందించే రచయితలు చాలా మంది ఉన్నారు. అందులో ముందు వరసలో ఉండదగినవారు అంగర వెంకట శివప్రసాదరావు. ఈయన విశాఖపట్నం నివాసి. సహృదయం గలవారు. సామాజిక స్పృహ కలిగినవారు. ఎన్నో ఉత్తమ రచనలు చేసి ఎన్నో పురస్కారాలు అవార్డులు పొందిన నిరాడంబరమైన మనిషి "అంగర వెంకట శివ ప్రసాదరావు. ఈయన రచనలలో మానవ సంబంధాలు రోజురోజుకు ఎలా క్షీణిస్తున్నాయో తెలియజేయడమే కాకుండా వాటిని పునర్నిర్మాణం ఎలా చేయాలో కూడా తెలిపారు.

రచయిత పరిచయం :

అంగర వెంకట శివ ప్రసాదరావుగారు 1949లో విశాఖ పట్నంలో జన్మించారు. అంగర వెంకట నారాయణ రావు, శాంతమ్మ వీరి తల్లిదండ్రులు. ఇతని భార్య సావిత్రి. ఎ.వి.ఎన్. కళాశాలలో బి.కామ్ వరకు చదివారు. కొంతకాలం ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేసారు. తర్వాత కాలంలో కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అసిస్టెంట్ మేనేజర్‌గా కూడా పని చేసి 2007లో రిటైర్మెంట్ చేశారు. వెంటనే గాయత్రి విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కాలేజీలో ఉద్యోగంలో చేరారు. ప్రసాదరావు గార్కి ఇద్దరు కుమారులు. రవికాంత్, శశికిరణ్. అంగర వెంకటశివప్రసాద్ గారిని రచయితగా ప్రోత్సహించింది పెదనాన్న అయిన శ్రీ అంగరవెంకట కృష్ణారావు. ఏది ఎలా రాయాలో ఏది రాయకూడదో చెప్పినది కృష్ణారావు. ప్రసాదరావు గారు సమాజంలో జరిగే ఇతివృత్తాలనే కథా వస్తువుగా మలిచారు. ఈయన 100కి పైగా కథలు రాశారు. 2 నవలికలు రాశారు. ఈయన రాసిన కొన్ని కథల్లో మానవ సంబంధాలు ఎలా క్షీణిస్తున్నాయో తెలిపే ఇతివృత్తాలు ఉన్నాయి.

చెత్తలారీ :

కాలేజీ పిల్లలు బస్సులో వెళ్తుండగా వీరి వాహనం

ముందు మునిసిపాలిటీ చెత్తలారీ వెళ్తూ ఉంటుంది. అందులోంచి ఒక పసిబిడ్డ చేయి బయటకు కని పించడంతో వారు ఆ బండిని ఆపుతారు. ముగ్గురు బిడ్డల తండ్రి అయిన ఆ లారీ డ్రైవర్ చెత్తలో దొరికిన పసిపాపని నాలుగోబిడ్డగా గుండెలకు హత్తుకుంటాడు. ఈ విధమైన ఇతివృత్తంతో సాగిన రచన ఇది.

నేటి సమాజంలో కొంతమంది చేసిన తప్పుల వల్ల ఇలాంటి పిల్లలు అనాథులవుతున్నారు. వివాహానంతరం జరగాల్సిన విషయాలు కొంతమంది ఆకర్షణకు లోనై, శారీరక సుఖాలు కోరుకుని తద్వారా జన్మించిన బిడ్డల్ని అనాథులగా మారుస్తున్నారు. పెళ్ళి అయిన వారు కూడా మగ శిశువును కోరుకుంటున్నారు. ఆడపిల్ల అని తెలిస్తే గర్భంలోనే చంపాలని చూస్తున్నారు. అలా కుదరకపోతే ఏ కుప్పతొట్టిలో పడేసిపోతున్నారు. పుట్టిన పిల్లల్ని చెత్తలో వేయడానికి వారికి మనసు ఎలా వస్తుందో తెలియడం లేదు.

పుట్టిన బిడ్డల్ని చెత్తతొట్టిలో పడేస్తున్న పాషాణ హృదయాలను చూస్తే మానవ సంబంధాలు ఎటు వెళ్తున్నాయో తెలియడం లేదు. ముగ్గురు పిల్లలు ఉన్న లారీ డ్రైవరు లాంటి మానవతా వాదులు ఈ సమాజానికి అవసరం. లారీ డ్రైవరు నాలగవ బిడ్డగా ఆ పాపను తీసుకుని తన విశాల హృదయం చాటుకున్నాడు.

కన్నె మందారం :

కథలో తండ్రే బిడ్డని వేశ్యగా మార్చడం అతని పరిస్థితులకు తప్పనిదైనా హర్షించదగ్గ విషయం కాదు. తానుపోతే కూతురు అనాథ అయి సమాజంలో ఒంటరి దైతే ఆమె జీవితం కుక్కలు చింపిన విస్తరి అవుతుందని అనుకున్నాడు గాని ఏ తండ్రీ చేయకూడని పని చేసి బ్రోకరుగాడిలా ప్రవర్తించడం సమర్థనీయం కాదు. డబ్బుండి అతని వైద్య సేవలకు సరిపడా సాయాన్నం దించే స్థోమత ఉన్నవారు కూడా అమ్మాయికి వెలకట్టారు. ఇటు తండ్రి పాశానికి కోరికలకు మధ్య ఆ అమ్మాయి జీవితం నాశనమైపోయింది. సంతలో పశువులా ఆ అమ్మాయిని అమ్మారు.

తండ్రి అసమర్థత చేతకానితనం వల్ల ఒక అమ్మాయి జీవితం నాశనమైపోయింది. సమాజం స్త్రీని చూసే దృష్టి మారాలి. పేదరికం మనుషుల చేత ఏ పనిని అయినా చేయిస్తుంది. కడుపు నింపుకునేంత స్థోమత లేదు వీళ్ళకి. డబ్బున్న వారికైనా, అధికారంలో ఉండే ప్రభుత్వాలైనా పేదవారిని పట్టించుకోరు. ఈ రోజుల్లో డబ్బుకున్న విలువ సాటి మనిషికి లేదు. సమాజంలోని మానవ సంబంధాలు ఎలా అడుగంటి పోయాయో రచయిత ఈ కథ ద్వారా తెలియపర్చారు.

ఇదే న్యాయం :

ఈ కథలో కార్తికేయ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటాడు. సెలవుల రీత్యా ఇంటికి వచ్చిన కొడుక్కి పెళ్ళి చేయాలనుకుంటాడు. తండ్రి విశ్వనాథం. ఒక మంచి కుటుంబంలో లావణ్య అనే యువతితో పెళ్ళి చేస్తాడు. పెళ్ళి అయిన వెంటనే ఏ అచ్చట ముచ్చట తీరకుండానే ఉద్యోగరీత్యా కార్తికేయ అమెరికా వెళ్లి పోతాడు. లావణ్య తన మామగారి ఇంట్లోనే ఉంటుంది. విశ్వనాథం లావణ్యకు ఇంటర్‌లో జాయిన్ చేస్తాడు. స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పిస్తాడు. ఎన్ని నెలలు గడిచినా కార్తికేయ రావడం కుదరట్లేదు అని చెప్తాడు. లావణ్య తల్లిదండ్రులు వచ్చి మా అమ్మాయిచే మీ ఇంటి చాకిరీ చేయించుకుంటున్నారు అంటూ గొడవ పడతారు. వారికి లావణ్య సర్ది చెప్తుంది. అప్పుడు విశ్వనాథం కార్తికేయతో ఫోన్‌లో మాట్లాడుతాడు. కార్తికేయ 10 సం॥ వరకు రాలేనని చెప్తాడు. అపుడు విశ్వనాథం లావణ్యకి వేరే పెళ్లి చేయాలని నిర్ణయించుకుని, లావణ్యని పెళ్లి గురించి అడుగుతాడు. లావణ్య మీ ఇష్ట ప్రకారం చేయండి అంటుంది. కొడుకు నుండి విడాకులు ఇప్పించి లావణ్యకు ఒక మంచి సంబంధం చూసి పెళ్లి చేస్తాడు. ఇది ఈ కథ యొక్క ఇతివృత్తం.

ఈ కథలో విశ్వనాథం తన కొడుకు భవిష్యత్‌ను పక్కనపెట్టి లావణ్య మంచి చెడ్డలు తండ్రి వలె చూసుకున్నాడు. లావణ్యకు సాకేత్ అనే వ్యక్తితో పెళ్లి చేస్తాడు. మానవతా దృక్పథంతో విశ్వనాథం ఆలోచించి మంచి నిర్ణయం తీసుకుంటాడు. ఈ విషయం అంతా తెలుసుకున్న లావణ్య తల్లిదండ్రులు విశ్వనాథంకు అభినందనలు చెప్తారు.

కస్తూరి తిలకం :

కనిపించే కన్నవారిని ప్రత్యక్ష దైవాలంటారు. కన్నవారికి సేవ చేయనివాడు కనిపించని దైవానికి సేవ చేయడంలో మూఢత్వంతో పాటు బాధ్యతారాహిత్యం కూడా ఉంది. పుట్టిన బిడ్డకు విలువలు నేర్పి విద్య ఉద్యోగాల్లో ఎదగాలని ఆశిస్తారు. కానీ అన్నిటికీ కన్నవారి ఆసరాతో ఎదిగిన కొడుక్కి తనవారికంటే పరాయివారు అధికమవడం బాధాకరం. కథలో విశ్వం చదువుకున్న జ్ఞానవంతుడు. కానీ తన జీవితాన్ని వంశవృద్ధి కానీయని నన్యాసి అయ్యాడు. మూఢభక్తిని నూరిపోసి అతని జీవితంపై తన ముద్రని మాత్రమే ఉంచి తల్లిదండ్రులకు దూరం చేసేవారిని ఆధ్యాత్మిక గురువుగా నమ్మడం బాధాకరం.

పున్నామ నరకం నుండి తప్పించాల్సిన కొడుకు బతికుండగానే తల్లిదండ్రుల ఆశలకు కొరివి పెట్టడం సహింపరానిది. బిడ్డల్ని బలి చేసుకుంటూ మానవ సంబంధాలను మంట కలుపుతున్న మూర్ఖుల కథలను వింటున్నాం. ఇలాంటి సంఘటనలు మనుషుల మధ్య ఉండే సంబంధాలను హీనస్థితికి తీసుకువెళతాయి.

మానవ సంబంధాలు రోజురోజుకు క్షీణించడానికి వెనుక విలువల్లేని గమనంతో స్వార్థంతో నిండిన మనస్సుతో వెళ్ళడమే కారణం. వ్యక్తిలో మానవ ధర్మాలు, కుటుంబ సూత్రాలు, నైతిక న్యాయాలు వంటివి మందగించడంతో మానవ సంబంధాలు క్షీణిస్తున్నాయి. నమ్మకాలు లేని భార్యాభర్తల సంబంధాలు, వాత్సల్యం లేని పేగు బంధాలు, ధనముండి సాయం చేయలేని లోభితనం, ఎదగడానికి ఎదుటి వారిని స్వార్థానికి ఉపయోగించుకునే స్వార్థగుణం, సాటి మనిషిని పట్టించుకోని క్రమం వంటివి ప్రబలి మానవ సంబంధాలను కలుషితం చేస్తున్నాయి. ఫలితంగా ఎవరికెవరూ ఏమి కామనే ధోరణి హెచ్చి మానవ సంబంధాలు దెబ్బతిన్నాయి.

అర్థం లేని ఆలోచనలు, అనుభవం లేకుండా చేసే పనులు ఎలాంటి లాభదాయకాలను సమకూర్చవు. అందరూ బాగుంటేనే నేనూ బాగుంటాననే తత్వం పెంచుకుంటే ఒకరి బాధను ఒకరు పంచుకుంటే జీవితంలో ముందడుగు వేయగలం. ప్రతి వ్యక్తీ తన జీవన గమనంలో ముందుకు పోతున్నపుడు తన అభివృద్ధికి కారణాలైన వారిని అప్పుడప్పుడు గుర్తు చేసుకోవాలి. పరిసరాలను గమనించినవాడే పక్కవారి కష్టాలను పంచుకుంటాడు. ఒకరికి ఒకరు దగ్గరి వారైనా దూరంగా ఉండే వారైనా అందరం ఒకటేనని గుర్తించాలి.

ముగింపు :

సమాజంలో నివసించే వ్యక్తులకు బాధ్యతలుండాలి. మనమేం చేసిన ఎదుటి వ్యక్తులకు, సమాజానికి బాధపెట్టేదిగా ఉండకూడదు. అవసరమైనపుడు ఎదుటి వారికి ధైర్యానిస్తూ చేయూతనివ్వడం, మన ధర్మాలను ఉత్తమ రీతిలో నిర్వర్తించే వాడి జన్మకు సార్థకత ఉంటుంది. ఆలోచనా జ్ఞానం లేని ఒక చెట్టు ప్రాణిగా ఉన్నందుకు నీడనందిస్తుంది. అలాంటిది జ్ఞానం సమృద్ధిగా ఉండే మనిషి మరెంతో ఉన్నతత్వాన్ని ప్రదర్శించడానికి కృషి చేయాలి. మానవ సంబంధాలెపుడూ ఆనందాభివృద్ధిని కాంక్షించేలా తీర్చిదిద్దుకోవాలని రచయిత అంగరవెంకట శివప్రసాద్ అభిప్రాయంగా పాఠకుల హృదయాలను హత్తుకునే సంఘటనలతో తెలియజేసారు.

ఆధారాలు :

1) చెత్తలారీ - అంగర వెంకటశివ ప్రసాదరావు
2) కన్నెమందారం - అంగర వెంకటశివ ప్రసాదరావు
3) కస్తూరి తిలకం - అంగర వెంకటశివ ప్రసాదరావు
4) ఇదే న్యాయం - అంగర వెంకటశివ ప్రసాదరావు
5) అమృతం కురిసిన రాత్రి (ఆర్తగీతం) - తిలక్

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీ గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి గారి సాహిత్యము – పరిశీలన

- కాంతల్లె రవిచంద్ర

కవి మానవుడు. మనిషి మనిషిగా పరిమళిస్తే, ఆయనలో ఉన్న మానవత్వం మరీ భాసిస్తే, అతడు మహోన్నతంగా ఎదుగుతాడు. ఎలుగెత్తి జాతిని పిలుస్తాడు. చేయెత్తి జీవనపథాన్ని నిర్దేశిస్తాడు. అందరికంటే ముందుగా తాను నడుస్తాడు. ఎన్ని అడ్డుగోడలు నడకను నిలువరించినా, ఎన్ని చీకట్లు తను విషపుకోరలతో చరచినా, తన గమ్యాన్ని చేరేదాకా పయనం సాగిస్తూనే ఉంటాడు. ప్రజాభ్యుదయం కోసం, మానవజీవన సౌభాగ్యం కోసం చెమట కాలువలు కట్టిస్తాడు. అట్లా జనజీవన సౌఖ్యం కోసం ఆరాటపడే కవిలో పలురకాల భావనలు ఉదయిస్తాయి. గాయపరచిన సంఘటనలు, రుధిరాన్ని నడిపించిన సన్నివేశాలు, ఆకలితో తనువులు చాలించిన హృదయవిదారకదృశ్యాలు అంతేగాక, ప్రకృతి సౌందర్యం నాదరూపంగా తరగలెత్తే శబ్దచిత్రాలు, ఇవన్నీ మనసున్న అతనిలో స్పందనను కలిగిస్తాయి. కార్యోన్ముఖుణ్ణి చేస్తాయి. ఆయన హృదయపాదు నుంచి కవితాంకురాలను సృష్టిస్తాయి. గళమెత్తి పాడిస్తాయి. కావ్యాలుగా అవతరిస్తాయి. ఒక అపూర్వమైన, ఆశావహమైన రమ్యలోకాన్ని మరింతగా దర్శింపజేస్తాయి. తన చుట్టూ పరుచుకుని ఉన్న సమాజాన్ని అనేక ప్రక్రియల ద్వారా సరిదిద్దడానికి అతడు పూనుకుంటాడు. అవి పాట, పద్యం, గేయం, కథ, నవల, విమర్శ, వ్యాఖ్య... ఇలాంటివి ఎన్నైనా కావచ్చు. వాటిని సమాదరించి చైతన్యోర్మికుల్ని కదను తొక్కించి సమాజ హృదయాంతరాళాలలో ప్రశాంతతను కలిగిస్తాడు. ఆ సాహితీమూర్తి ఎన్ని ఆటంకాలు ఎదురు వచ్చినా తన మార్గాన్ని ఆగామి కాలానికి ప్రయోజనవంతంగా రూపిస్తాడు.

శ్రీ గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి అలాంటి కవి, పండితుడు సంపాదకుడు, వ్యాఖ్యాత, గేయరచయిత, నవలాకారుడు. ఎన్నో రచనల ద్వారా విజయ పరంపరలను నిండుగా అనుభవించి ప్రాచీనార్వాచీన రీతుల్ని, గతుల్ని సాకల్యంగా అవలోకనం చేసుకున్న దార్శనికుడు.

కవిత్వం ఎలా పుడుతుంది? కదిలే మనసుంటే
పద్యం ఎలా పలుకుతుంది? హృదయంలో లయ లహరులెత్తితే
గేయం ఎలా ఉరుముతుంది? అనుభూతి తరంగాలై ఎగిసిపోతే
విమర్శ ఎలా ఉదయిస్తుంది? ఆలోచనకు మారాకు హత్తితే
వ్యాఖ్యానం ఎలా రాణిస్తుంది? మేధ బహు ముఖాలుగా విస్తరిస్తే....

కవిత, పద్యం, వ్యాసం, పరిశోధన, పరిశీలన, నవల ఆరుపేటలుగా అల్లుకున్న ప్రతిభ శ్రీ గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రభ !

గొట్టిముక్కలదృష్టి భవిష్యత్తును సుషమాసుందరంగా చూడడమే. సాహిత్యంతో చెరగని సోయగాలను రేపటితరాలకు కుప్పలుగా పోయడమే. ఆయన ఆలోచన అంతా ఒక రసలోకాన్ని నిర్మించడం కోసమే. "ముందు చూపు కవి ఒక్కడుచాలు, అతడు అవశ్యం కలిగిస్తాడు మేలు" అన్న ఆరుద్ర మాటలు శ్రీ గొట్టి ముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి ఎడల అక్షరసత్యాలు.

సాహిత్య రంగంలో ముఖ్యంగా పఠనవాఙ్మయంలో పద్యకవిత, గేయకవిత, నవల, విమర్శ అనేవి ప్రధాన ప్రక్రియలు, ఈ నాలుగు ప్రక్రియల్లోనూ అవిశ్రాంతంగా కృషి చేసిన, చేస్తున్న అరుదైన సంప్రదాయ కవిశేఖరుడు, ఉత్తమపరిశోధకుడు, విమర్శభాస్కరుడు, నవలాకారుడు శ్రీ గొట్టిముక్కల. అంతేకాదు, అరుదైన గ్రంథాల సంపాదకుడుగా, సంప్రదాయ గ్రంథాల వ్యాఖ్యాతగా శ్రీ గొట్టి

ముక్కల సాహితీలోకంలో చిరపరిచితులు. జీవితంలో సాహితీసేవ వీరికి ఒక ప్రధానవ్యాపకం. వృత్తిరీత్యా పాఠశాలలో తెలుగుపండితులే అయినా ప్రవృత్తిరీత్యా సాహితీ రంగాన్ని ఎంచుకొని ఆమరణాంతం, సాహితీ క్షేత్రంలో వివిధప్రక్రియల్లో విశేషకృషి చేసిన లబ్ధప్రతిష్టుడు శ్రీ గొట్టిముక్కల.

సాధారణంగా ప్రక్రియల రీత్యా సాహిత్యకృషీవలులు అనేకమందే ఉంటారు. కొందరు పద్య కవిత్వాన్ని ఎన్నుకుంటారు. కొందరు నవలా సాహిత్యంలో కృషి చేస్తారు. కొందరు కథలతో రాణిస్తారు. మరికొందరు వ్యాసకర్తలుగా, విమర్శకులుగా, పీఠికారచయితలుగా నిలబడతారు. అయితే అన్ని ప్రక్రియలనూ స్పృశించేవారు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన సాహితీవేత్తలలో శ్రీ గొట్టిముక్కలసుబ్రహ్మణ్యశాస్త్రి బహుముఖీన పాండిత్యగరిమ ఉన్న శేముషీసంపన్నుడు.

ముఖ్యంగా పద్యకవితారంగంలో, నవలారంగంలో, సాహితీవిమర్శనారంగంలో విశేష సాధన చేసిన, యీ పండిత పరిశోధకుడి ఏ రచన చూసినా, అప్రమత్తత, భావతీక్షణత, శబ్దనైశిత్యం, ఔచిత్యం ప్రస్ఫుటమౌతాయి. వీరి సాహిత్యకృషిఫలాలను పరిశోధిస్తే తెలుగు సాహిత్య రంగానికి ఎన్నోదృక్కోణాలు అవగతమౌతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే బహుగ్రంథపరిశీలన, బహువిషయ నిరూపణ లక్ష్యంగా పురోగమిస్తున్న బహుముఖప్రజ్ఞాశాలి శ్రీ గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి .నిరంతరం కవిగా, పద్యకవిగా తన జీవిత సాహితీయాత్రలో సాహిత్యమే దారిదీపంగా చేసుకుని ముందుకు సాగిన మహా పండితుడు శ్రీ గొట్టిముక్కల.

శ్రీ గొట్టిముక్కల రచనా వైవిధ్యం :

వస్తువు అన్నా, ఇతివృత్త నిర్మాణం అన్నా ఇంచు మించు ఒకటే. వాస్తవ జీవితంలోంచి రచనలకు ఉపయుక్తమైన అంశాలను ఎన్నుకోవటమే ఇతివృత్త నిర్మాణం.

భరతుడు కావ్యానికి రసం ప్రాణం అని పేర్కొన్నాడు. ఐతే రసం వ్యక్తంకావడంలో ప్రధానపాత్ర పోషించేది ఇతివృత్తం. ఇది ఏ రచనకైనా శరీరం వంటిది. ఇతివృత్త మంటే క్రమపరిణామానికి అనుకూలంగా, ఒక పరిణామ బద్ధంగా రూపొందిన వస్తువు.

ఒక రచన చదివాక అందులోని వస్తువు ఏం చెబు తోంది? ఏ జీవితకోణాన్ని చిత్రిస్తున్నది, వాస్తవజీవితంలో ఇలా జరగటానికి వీలుందా? ఇలాంటి ప్రశ్నల్ని పాఠ కునిలో కలిగిస్తే అది ఇతివృత్తం లేక వస్తువు అవుతుంది. రచనల్లోని సంఘటనలు అలా ఎందుకు జరిగాయో చెప్పేది వస్తువు. అలాంటి వస్తువున్న రచనలు మాత్రమే ఆదరణకు నోచుకుంటాయి.

మంచి సాహిత్యకారులు తమకు తెలిసిన జీవితం ఆధారంగానే వస్తువులను ఎన్నుకుంటారు. అయితే గొప్పసాహిత్యం సృష్టించాలంటే, గొప్పరచనలు చేయా లంటే రచయితల జీవితానుభవాల వైశాల్యం గొప్పగా ఉండాలి. రచయితలకు అనుభవ వైశాల్యం ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎక్కువ రచనలు రావడానికి అవకాశం ఉంటుంది. శ్రీ గొట్టిముక్కల ఆ కోవకు చెందిన రచయిత.

ఈయన ఎన్నో సామాజికాంశాలను వస్తువులుగా తీసుకుని రచనలు చేశారని చెప్పుకోవచ్చు. ఆయన రచనావైవిధ్యాన్ని ప్రక్రియాపరంగా మూడురకాలుగా వర్గీకరించి విశ్లేషించుకోవచ్చు. అవి (1) పద్యసాహిత్యం 2) నవలాసాహిత్యం 3) విమర్శసాహిత్యం.

పద్యసాహిత్యం :

తెలుగుపద్యం అజరామరమైన జీవనవాహిని. అది ఎంత పురాతనమైందో, అంత సనాతనమైంది. ప్రభువుల శాసనాలను, పండితులవాదాలను, వివాదాలను, అభ్యు దయాన్ని, ఆధునికతను సమస్కంధంగా మోస్తున్న సుప్రసిద్ధప్రక్రియ పద్యం.

పద్యంలోని సొగసులు, పోకడలు అసంఖ్యాకాలు. రాజాస్థానాల్లో పురుడు పోసుకున్నంత మాత్రాన పద్యం

మడిగట్టుకొని, అంతఃపురసీమల్లో, పరదాల లోపలే ఉండిపోలేదు. అది జనంలోకి ప్రవహించింది. పండితుల నుండి పామరుల వైపుకు అమరగంగాప్రవాహంలా ఉరికింది. శ్రమ జీవులనాల్కలపై సాధారణవ్యక్తుల గుండెల్లో సముచితస్థానాన్ని పొంది, చిరంజీవిగా వెలుగుతోంది. ఇంకా చెప్పాలంటే పద్యం తెలుగు వారి ఆస్తి, అస్తిత్వం కూడా. వేదాంగాల్లో ఒకటైన ఛందస్సుతో పాటు అలంకార, వ్యాకరణశాస్త్రాల శోభతో వెలుగొందేది పద్యం. తెలుగుపద్యానిది వేలసంవత్సరాల చరిత్ర. ఈ చరిత్రలో ఎంతోమంది కవులు మణిపూసల్లా ప్రకాశించి పద్యానికి సేవచేశారు. తద్వారా కీర్తిపొందారు. ఈ కోవకు చెందిన మహాకవి శ్రీ గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి.

పద్యరచనలో సుబ్రహ్మణ్యశాస్త్రి గారి ప్రతిభా పాటవాలు కవితామతల్లికి అందించిన నీరాజనాలు, సాహిత్యలోకంలో పసిడికాంతులు. గొట్టిముక్కల పద్యరచనలైన సత్యనారాయణా (2003), త్రయీ (2005), శ్రీ పాండురంగ శతకం (2008), శ్రీ బుడ్డా వెంగళ రెడ్డీయము (2011), కృతిపంచకం (2019), 'మృత్యుహేల' (2021) గ్రంథాలు.

నవలా సాహిత్యం :

నవల ఒక పెద్దకథకు మారు రూపం. నవలలో రచయిత చెప్పదలచుకున్నదంతా విస్తృతంగా, వివరణాత్మకంగా చెప్పవచ్చు. అయితే నవలకు కథానికా లక్షణాలు ముఖ్యంగా వుంటాయి. ఎత్తుగడ, మధ్యలో ఉత్కంఠ, చివరిలో కొసమెరుపు నవలా లక్షణాలు. కథానికారచనలో లేని సౌలభ్యం రచయితకు నవలలో లభిస్తుంది. ఎన్నిపాత్రలనైనా చిత్రించవచ్చు. ఎంత కథనైనా ఉత్కంఠభరితంగా చెప్పవచ్చు. ఎంతటి సందేశాన్నైనా తీర్చిదిద్దవచ్చు. నవలా పాఠకుల సంఖ్య మినుమిక్కిలిగా ఉన్న తరుణంలోనే శ్రీ గొట్టిముక్కల లాంటి పద్యరచయితలు, సంప్రదాయ సాహిత్యవాదులు కూడా నవలా ప్రక్రియ రచనలో తాము కూడా సమర్థులమేనని నిరూపించుకోవటానికే అన్నట్లు నవలలు రచించారు. ఈయన 1) జనారణ్యం 2) ఒక హృదయం మీటితే 3) ప్రణయతంత్రం 4) మంటల్లో మానవుడు 5) ఈ పయనం ఎక్కడికో 6) రాగమంజీరాలు 7) కలకాదు అనే సాంఘికనవలలను, మగువ మాంచాల అనే చారిత్రకనవలను రచించారు.

విమర్శసాహిత్యం :

గొట్టిముక్కల ఎన్నో సాహిత్య ప్రక్రియలలో సృజనాత్మక ప్రతిభగల ప్రయోగశీలి. సమకాలీన సాహిత్యచైతన్యానికి సమగ్రంగా, సముచితంగా స్పందించే గుణం కలిగినవారు. కానీ, కొత్తదనంలో కొట్టుకొనిపోవడం వారి స్వభావం కాదు. గతంతో నవ్యతకు మెరుగుపెట్టేవారు. వర్తమానంలోని ఆవేశానికి కళ్లెంవేసి, ఆలోచనకు అక్షరశిల్పాన్ని అందించే వారు. గతానికీ, వర్తమానానికి ఒక సమన్వయసంధాతగా ఉంటూ, తాము నిర్వహించేపాత్రను నిర్మాణాత్మకంగానే గాకుండా, సృజనాత్మకంగా కూడా ఉండగలిగేటట్లు తీర్చిదిద్దేవారు.

గొట్టిముక్కల తమను తాము జీవితకాలంపాటు సహృదయులుగా, రసజ్ఞులుగా తీర్చిదిద్దుకోవడానికే ఎక్కువ యిష్టపడ్డారు. బహుగ్రంథపరిశీలన, బహు విషయనిరూపణ లక్ష్యంగా పురోగమించిన భావుకులు, రసజ్ఞత గల నిశితవిమర్శకులు శ్రీ గొట్టిముక్కల గారు. వీరి విమర్శ, పరిశోధనాగ్రంథాలైన సర్వ వేదవాఙ్మయం, పింగళిసూరన సాహితీవైభవం, కవితాసామ్రాజ్యం (శ్రీ మద్దులపల్లి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి జీవితం), అవధాన వీర రాఘవం (శ్రీ గాడేపల్లి వీరరాఘవశాస్త్రి గారి జీవితం), శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం - సాహితీ విన్యాసం, రేనాటి సూర్యచంద్రులు, ప్రభాకరోదాహరణము, సంగ్రహ నంద్యాలచరిత్రలను రచించారు.

గొట్టిముక్కల సాహిత్యం - సామాజికస్పృహ :

సమాజంలో వివిధవర్గాల ప్రజలు నివసిస్తూ ఉంటారు. సంఘజీవి అయిన మానవుడు తన ఉనికిని కాపాడుకోవడం కోసం నిరంతరం తాపత్రయపడే

ప్రయత్నంలో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. సాహిత్యం సమాజానికి దర్పణం వంటిది. కనుకనే రచయితలు తాము ఎన్నుకున్న సాహితీ ప్రక్రియ ఏదైనా సరే ఆ ప్రక్రియలో వీలును బట్టి ఆనాటి సమాజాన్ని, ఆ సమాజంలోని విభిన్న అంశాలను ప్రతిఫలిస్తూ పాఠకులకు వివిధ సామాజికసమస్యలపట్ల స్పృహను కల్గిస్తూనే ఉన్నారు. అదేవిధంగా గొట్టిముక్కల సాహిత్యం కూడా సామాజికస్పృహ కలిగిందే!

ఉపసంహారం :

చుక్కలెన్ని వున్నా వేగుచుక్కదే విలక్షణత. మహాను భావుల జీవితాలు జీవనదీప్రవాహాలు. వారి మార్గాలు, స్ఫూర్తిదాయకచర్యలు. తదుపరితరాన్ని చైతన్య పథాన నడిపిస్తుంది. శ్రీ గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి కూడా అలాంటి స్ఫూర్తికిరణం, వెలుగురేఖ. హితాన్ని కల్గించడమే సాహిత్యపరమార్థంగా తు.చ. తప్పకుండా అనువర్తింప జేసిన ఆదర్శరచయిత శ్రీ గొట్టిముక్కల.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అమెరికా తెలుగు కథానిక – మహిళ

- యన్. మహేశ్వరి
పరిశోధక విద్యార్థి, శ్రీ పద్మావతి మహిళా
విశ్వవిద్యాలయం, తిరుపతి.

- ఆచార్య మూలె విజయలక్ష్మి
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం,
తిరుపతి.

అమెరికా తెలుగు కథానిక సంకలనాలు వంగూరి చిట్టెన్ రాజు సంపాదకత్వంలో వెలువడినాయి. ఇంటి చాకిరి పురుషాదిపత్యం, వరకట్నం, భాషాసంఘర్షణ, సంస్కృతి పరిరక్షణ పిల్లల వల్ల సమస్యలు మొదలైనవి పుట్టిన గడ్డపై మమకారం భారతీయ సంస్కృతిపై అభిమానంతో ఆచరణకు ఆసక్తిగా ఉండే అంశాలను ప్రధాన ఇతి వృత్తాలుగా, రచయితలు సాహిత్యంలో వెలువరించారు. పెళ్ళయి అమెరికా వెళ్ళిన స్త్రీలు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను తెల్పడం ఈ వ్యాసాంశం.

అమెరికా సంబంధాలంటే గొప్పగా భావించి లక్షల కట్నాలు కుమ్మరించి పెళ్ళి చేసుకొన్న భర్తలు తమకు రక్షణ ఇవ్వక పోగా, మానసికంగాను, శారీరకంగాను హింసిస్తున్నారు. పరాయి దేశంలో తమ బాధలను పంచుకొనే వారు లేక స్వదేశంలో తల్లిదండ్రులకు చెప్పుకోలేక మూగ బాధను అనుభవిస్తున్నారు.

ఇంటి చాకిరి :

అమెరికా సంబంధాలు కుదరడం అమ్మాయిల అదృష్టం అనుకుంటున్నారు. కాని పురుషులు మాత్రం పురుషాదిపత్యం చూపిస్తూ దాష్టికంగా ప్రవర్తిస్తున్నారు. ఆ విద్య ఉద్యోగాలు లేని స్త్రీలు పురుషుని ఆధీనంలో నానా కష్టాలు పడుతున్నారు. ఇంటిపని, వంటపని ఆడవాళ్ళదే అనే తత్వం పురుషునిది, అభివృద్ధిచెందిన అమెరికా లాంటి దేశాల్లో కూడా ఈ దోరణి మార్చుకోరు భారతీయులు. గొడ్డు చాకిరి చేయలేక ఆసక్తిగా వెళ్ళిన ఆడపిల్ల అడుగు వెనకేస్తుంది.

లత కందికొండ రాసిన 'మార్పు ది చేంజ్' కథలో అమల పెళ్ళి ఈడు వచ్చినప్పుడు నుండి అమెరికా సంబంధం కుదురితేనే పెళ్ళి చేసుకుంటాను లేకపోతే పెళ్ళే వద్దు అని చెపుతుంది. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న మాధవన్‌ను వెళ్ళి చేసుకొని అమెరికా వెళుతుంది. విదేశం వెళ్ళినప్పుడు నుండి వంట పని, ఇంటి పని అంతా అమలనే చేస్తూ ఉంటుంది. మాధవన్ జీతం అడగని పని మనిషి దొరికింది అనే భావన తప్ప, అమల ఆలోచనలకి గౌరవం ఇచ్చేవాడు కాదు మాధవన్.

ఆంగ్లంలో ఏవో రెండు పుస్తకాల పేర్లు చెప్పి ఇవి చదివావా? అని చులకన చేసి మాట్లాడుతాడు. ఆడదని అంత చులకన చేసి చూడాల్సిన అవసరం లేదు. నాకు చక్కగా మాతృ భాష మాట్లాడగలను. నాకు నచ్చిన సుస్తకాలను చదువుకుంటాను.

ఇండియాలో ఆడపిల్లలు అమెరికా సంబంధాలంటే చాలా గొప్పగా ఊహించుకొని మురిసిపోతారు. ఇక్కడ కూడా ఇంటి చాకిరి చేస్తూ నరకం అనుభవిస్తున్న వాళ్ళు చాలా మంది ఉన్నారు అని అమల అనుకుంటుంది.

ఈ గొడ్డుచాకిరి చేసేదానికేనా మాతృదేశం వదిలి, తల్లిదండ్రులు, బంధువులను వదులుకొని వచ్చాను. నాకు అమెరికా వద్దు ఈ భర్త వద్దని అమల ఇండియాకి వచ్చేస్తుంది.

పురుషాదిపత్యం :

అభివృద్ధి చెందిన అమెరికాలాంటి దేశాలలో ఆడవారిపట్ల పురుషాదిపత్యం చూపిస్తూ దాష్టికంగా ప్రవర్తిస్తున్నారు.

సత్యం మందపాటిన రాసిన 'జోయాన్' అనే కథలో జోయాన్ అనే అమ్మాయికి చిన్నప్పుడే తల్లి మరణిస్తుంది. తల్లిలేని బిడ్డను ఎంతో ఆప్యాయంగా చూసుకోవాల్సిన

తండ్రి హత్యాచారానికి పాల్పడతాడు. కంపెనీ ఉద్యోగంలో చేరుతుంది. మార్క్‌తో పరిచయం ఏర్పడుతుంది. అతను ప్రతి దానికి అడదని చులకన చేసే చూస్తు ఉంటాడు. జోయాన్ ఎదురు తిరుగుతుంది. మగవాడు అని కూడా చూడకుండా మాట్లాడతావ అని తలపగిలేలా కొటతాడు. హింసభరించలేక మార్క్‌ను పోలీసులకు అప్పగిస్తుంది.

వరకట్నం :

భారతదేశంలోను అమెరికాలోను వరకట్న దురాచార సమస్యతో స్త్రీలు బాధింపబడుతున్నారు. వరకట్న నిషేధ చట్టం ఉన్నా, కట్నం ఇచ్చి పుచ్చుకోవడాలు చాపకింద నీరులా సమాజంలో జరుగుతూ ఉంది. పెళ్ళికి కట్నాలు ఇచ్చుకున్న ఆదనపు కట్నం కోసం అమెరికాలో కూడా వేదింపులు తప్పడం లేదు. భారతదేశం తిరిగి రావాలన్న హింసించడం తప్ప సహకరించని భర్తలు అమెరికాకు వెళ్ళి ఒక నిస్సహాయ స్థితిలోకి నెట్టి వేయబడుతున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. భారతదేశంలో కొన్ని కుటుంబాలల్లో జరుగుతున్న అరాచకాలు అమెరికాలో సాగిస్తూ, మహిళలను మనోవేదనకు గురి చేస్తున్నారు అనే విషయం ఈ కథాంశం ద్వారా తెలుస్తుంది.

సత్యం మందపాటి రాసిన 'మరణ ముహూర్తం' కథలో సునేత్రి పెళ్ళి చేసుకొని భర్తతో కలిసి విదేశం వెళుతుంది. ఇద్దరు పిల్లలు పుడతారు. సునేత్రి భర్త కట్నం తెమ్మని రోజు హింసించేవాడు, కొట్టెవాడు, గాయం చేసేవాడు. గొంతు అదిమి చంపాలని అనేక సార్లు ప్రయత్నిస్తాడు. బాధలు భరించలేకపోతుంది. ఇండియా రావాలనుకొన్న పాస్‌పోర్టు లేకుండా చేస్తాడు. తనను వదిలి వేరే చోటుకి పోవడానికి కుదరదని భయపెడతాడు. ఈ ఉచ్చునుండి బయటపడలేమని ఆత్మహత్య చేసుకోవాలనుకుంటుంది. తల్లి లేకపోతే పిల్లలను ఎన్ని బాధలు పెడతాడోఅని పిల్లలకు పాలలో విషం కలిపి ఇచ్చేస్తుంది. తన చేతిలో పిల్లలను చంపేశామని ఆలోచిస్తూ గృహ తప్పిపడి పోతుంది. నేరం తెలిసి పోలీసులు సునేత్రిని జైలుకు తీసుకొనిపోతారు. జైలులో పిల్లలను గూర్చి ఆలోచిస్తూ వేదనకు గురై పిచ్చిగా పిచ్చిగా ప్రవర్తించపోతుంటే పోలీసులు ఎన్‌కౌంటర్ చేసేస్తారు.

భాష సంఘర్షణ :

పల్లెటూరిలో పెరిగిన వారు వివాహం చేసుకొని అమెరికాకు వెళ్ళినప్పటి నుండి అక్కడ ఉంటున్న వారి భాష నాగరికథను అలవర్చుకొని ఉంటున్నారు. అమెరికాలోను భాషను, సంస్కృతికి భిన్నంగా ఉంటే అత్తవారి నుండి అవహేళన, అవమానాలను ఎదుర్కొవలసివస్తుంది. స్త్రీలు తన మాటతీరు కట్టుబొట్టు మార్చుకొని పరాయికరణ చెందవలసి వస్తుంది.

ఆంగ్లభాష రాకపోవడం వలన భర్త, పిల్లల దగ్గరకొన్ని సందర్భాలలో అవమానించబడుతున్న వారు భారతీయ మహిళలు శ్యామలదశిక రాసిన 'జానకి' కథలో మారుమూల ప్రాంతంలో చదువుకొని, పల్లెవాతావరణంలో పెరిగిన జానకిని అమెరికాలో ఉంటున్న మోహన్‌కి ఇచ్చి వివాహం చేస్తారు పెద్దలు. ఇంటి నుంచి జానకి బయటరావడం ఇదే మొదటిసారి. అత్తావారింట్లో అడుగు పెట్టగానే తన అత్తగారు హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషలలో చక చక మాట్లాడుతూ పని మనుషులతో పనులు చేయిస్తూ ఉంటుంది. ఆమెను చూసి జానకి భయపడుతుంది. ముగ్గురు పిల్లలుపుడతారు.

ఎప్పుడూ ఇండియన్ లాగా చీరలు కట్టడం, పాడవాటి జుట్టు రూపాయి బిల్లంతా బొట్టు అని హాస్యంగా మాట్లాడుతాడు. భర్త జానకి తల్లిదండ్రులను విడిచి పరాయిదేశం వచ్చుంకాని నాకు ఇష్టమైన కట్టుబొట్టు కూడా వీళ్ళ కోసం మార్చుకోవల్సిందేనా? అని బాధపుడుతుంది. చీరకు బదులు ప్యాంట్, షర్టులు చిన్నజుట్టు, పెదాలకు రంగు వేసుకుంటుంది.

పిల్లలు ముగ్గురు జానకిని చులకనగా చూస్తారు. నీకు ఆంగ్ల భాష రాదు. బయట ప్రపంచజ్ఞానం తెలియదు అని పిల్లలతో పాటు మోహన్ కూడా ఎగతాళి చేస్తాడు. పిల్లల కోసం ఏవైన కొన్న వస్తువులు కూడా వాళ్ళు వాడకుండా బాగ లేదని పక్కన పెట్టేస్తారు. జానకి తన బాధ ఎవరికి చెప్పుకోలేక బాధపడుతుంది.

జానకి తన స్నేహితురాలు పద్మజ ద్వారా ఆంగ్లభాష నేర్చుకుంటుంది. పిల్లలందరికి పెళ్ళిళ్ళు అయిపోతాయి. మనమరాలు జానకి పెళ్ళిపోటో చూసి నాన్నమ్మ ఈ పోటోలో ఆవిడ ఎంత అందంగా ఉంది నన్ను కూడా అలా తయారు చేయ్యి అని అంటుంది. ఆ పోటోలో ఉన్నది నేనేనుమ్మ అని చెప్పి బాధపడుతుంది జానకి.

నా తల్లిదండ్రులు అమెరికా సంబంధం అని గొప్పగా భావించి పెళ్ళి చేసారు. ఇక్కడికి వచ్చినప్పటి నుండి ఎన్నో బాధలు భరించాను అని మనమరాలుకి చెపుతుంది జానకి.

సంస్కృతి పరిరక్షణ :

భారతీయ, సంస్కృతిలో వివాహాని కులం, గోత్రం అనే అంక్షాలు ఉంటాయని, కులాంతర వివాహానికి పెద్దలు అడ్డుచెప్తారని, అమెరికాలో అయితే ఆ పట్టింపులు ఉండవని అక్కడకెళ్లి పెళ్ళి చేసుకుంటే జరిగితే ఆదుకునే వారుండరని అల్లాడుతారు. భర్త వదిలేస్తే నిరాశ్రయులవు తారు. బిడ్డల పెంపకం కోసం దగ్గరయిన వారికి చేరువౌతారు. అదయినా కలకాలం నిలుస్తుందా! కాలం కలసి రాకపోతే పడరాని పాట్లు పడుతారు.

సాయిలక్ష్మి రాసిన 'అనాథ' కథలో వెన్నెల తల్లి దండ్రుల దగ్గర ఎంతో అల్లారు ముద్దుగా పెరుగుతుంది. కళాశాల చదువుల కోసం పట్టణం వెళుతుంది. బి.ఎస్.సి చదువుతున్నపుడు తన కంటె తక్కువ కులానికి చెందిన రవితో పరిచయం ఏర్పడుతుంది. ఇద్దరు పెళ్ళి చేసు కోవాలని అనుకుంటారు. పెళ్ళి విషయాన్ని తల్లిదండ్రుల చెపుతుంది. కులం, గోత్రం చాలా ముఖ్యమని అవి తప్పి వివాహం చేసుకుంటే వెనుకటికి బాధపడాల్సి వస్తుందని చెపుతారు. రవి ఇండియాలో పెద్దలు ఇవే ఆలోచిస్తారు. వీరికి దూరంగా అమెరికా వెళ్ళి వివాహం చేసుకుంటే ప్రశాంతంగా ఉండచ్చు అని చెపుతాడు. వెన్నెల తన తల్లిదండ్రుల మాట వినకుండా రవితో కలసి అమెరికా వెళుతుంది. కొద్ది రోజులు సుఖంగా ఉంటారు. కొడుకు వినయ్‌పుడతాడు. రెండవ సారి గర్భంగా ఉన్నపుడు భార్య, బిడ్డను వదిలి తన సుఖం కోసం ఎక్కడకో వెళ్ళిపోతాడు. రెండవ బిడ్డ దీర్ఘకాలిక రోగంతో పుడతాడు. ఒంటరిగా ఆమె పడుతున్న బాధను చూసి ఒక వ్యాపార వేత్త దగ్గరవుతాడు. అనారోగ్యంతో బాధపడుతున్న బిడ్డను చూసి రవి చేతిలో మోసపోయి అందరికి దూరం అయ్యాను అని బాధపడుతుంది.

వెన్నెల పెద్ద కుమారుడు వినయ్ పాఠశాల ఉపాధ్యాయుల ద్వారా తల్లిదండ్రుల ప్రేమా, అప్యాయతలు గ్రహించి తన తల్లి తనను రాత్రి వేళలో స్నేహితుల ఇంటికి పంపించడం, వ్యాపార వేత్తకి దగ్గరవడం చూసిన వినయ్ అమ్మా నువ్వు వేశ్యవా? ఉంపుడు గత్తెవా? అని అడుగుతాడు. ఆ మాటలు విన్న వెన్నెల హృదయ విదారకమైన బాధను అనుభవిస్తుంది. వ్యాపార వేత్తకి అనేక మంది స్త్రీలతో సంబంధం ఉండడం వలన అతి చిన్న వయసులో అనారోగ్యంతో మంచాన పడుతుంది. తన తల్లి పరిస్థితిని చూసిన వినయ్ సంస్కృతి గౌరవించక పరాయిదేశం వచ్చి మగవాడి చేతి మోస పోయిన నా తల్లిలాంటి ఎంత మంది ఉన్నరో అని బాధ పడుతాడు.

ముగింపు :

పెళ్ళి చేసుకొని భర్తతో అమెరికా వెళ్ళిన ఆడవారు నా అన్నవారు లేక ఇబ్బందులు పడుతున్నారు. పల్లె టూరిలో పెరిగిన వారు అక్కడి వాతావరణంలో ఇమడలేక మానసికంగా కుంగిపోతున్నారు. క్రమంగా అక్కడి నాగరికథను అలవర్చుకోవలసి వస్తుంది. భర్త వ్యసన పరుడైతే బతుకు మరింత దుర్భరంగా ఉంది. విదేశాలల్లో స్త్రీల బాధలు ఇక్కట్లు ఈ కథల ఇతివృత్తాలు.

ఆధార గ్రంథాలు :

1. వంగూరి చిట్టెన్ రాజు వెలువరించిన అమెరికా తెలుగు కథానిక సంకలనాలు.
2. తానా వారు వెలువరించిన సంచికలు

★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కాకాని చక్రపాణి నవలలు – సమగ్ర పరిశీలన

– మల్లెంబొక వేంకటరెడ్డి, పరిశోధక విద్యార్థి (పార్ట్‌టైమ్), ఎస్.వి.యూనివర్శిటీ, తిరుపతి.

సమాజాన్ని జాగృతం చేసేది సాహిత్యం . ఇది ప్రపంచంలోని ఏ భాషలోనైనా వెలువడవచ్చు. సాహిత్యంలో ఒక ప్రక్రియ నవల. "మానవజీవితంలోని సమస్త విషయాల్ని వివరించగలిగిన ఏకైక ప్రక్రియ నవల". ఇది ప్రపంచంలోని అన్ని భాషలకు వర్తిస్తుంది. ఏ దేశచరిత్ర చూసిన సాహిత్య చరిత్ర పరికించిన, ఆయా కాలాలనాటి సాంఘిక పరిస్థితుల్లోంచి, ఉద్భవించిన సాహిత్యం అనాదిగా వస్తూనే ఉంది. మన దేశానికి ఆంగ్లేయుల రాకతో సమాజంలోని ప్రతిరంగంలోనూ మార్పులొచ్చాయి. వైధిక పునరుద్ధరణకోసం నన్నయ ఎలా వ్యాస భారతాన్ని అనువాదం చేశాడో, ఆధునిక యుగంలో ఆంగ్లేయుల సాహిత్య ప్రభావం వలన వారి సంఘ సంస్కరణ నేపథ్యంగా తెలుగులో నవల వంటి సాహిత్య ప్రక్రియ ఆవిర్భవించింది. రాజా రామ్మోహన్ రాయ్ బ్రహ్మసమాజాన్ని స్థాపిస్తే ఆ సమాజాన్నే కందుకూరి తన సాహిత్యంలో ప్రవేశపెట్టి జాతిని జాగృతం చేశాడు.

తెలుగు సాహిత్యంలో ఉన్న వివిధ రకాలైన ప్రక్రియలలో నేడు విశేష ఆదరణ పొందుతున్నది నవలా ప్రక్రియ. ఆధునిక సాహిత్యంలో నవల ప్రముఖ పాత్ర పోషిస్తున్నది. నవలా వస్తువు వ్యవహారికంలో ఉంటూ ప్రతి మనిషి జీవితంలాగే సాగిపోతూ ఉండటం వలననే పాఠకుడి దృష్టిని ఆకర్షించ గలుగుతున్నది. భాష కూడా వ్యవహారికంగా ఉండటం, ప్రతి సంఘటన, సందర్భం కూడా పాఠకుడికి సులువుగా అర్థమవడం వలన పాఠకుడు ఆయా సందర్భాలను, సంఘటనలను సులువుగా ఆస్వాదించగలుగుతున్నాడు. నేటి కాలంలో నవలలు విరివిగా రచింపబడుతున్నవి. నరహరి గోపాల కృష్ణమశెట్టి, కందుకూరి గార్లతో ప్రారంభమైన తెలుగు నవల బండి నారాయణస్వామి 'శప్తభూమి' వరకూ నవలాప్రక్రియ మూడు పువ్వులు ఆరుకాయలుగా వికసించి వర్ధిల్లుతోంది. నవలా ప్రక్రియను దాశరథి రంగాచార్య "నవల సామాన్యునివలె నిరాడంబరమైంది. జీవితంవలె సత్యమైంది. ప్రకృతివలె సుందరమైంది. ఆకాశంవలె విశాలమైంది. సూర్యునివలె తేజోవంతమైంది. వాయువువలె సర్వవ్యాప్తమైంద"ని అంటాడు. ఈ నిర్వచనాన్నిబట్టి ఈ ప్రక్రియ స్థాయి ఏమిటో తెలియకనే తెలుస్తుంది.

తెలుగులో వందలాది నవలా రచయితలున్నారు. వేలాది నవలలూ వెలువడ్డాయి. ఇంకా వెలువడుతూనే ఉన్నాయి. పాఠకులాదరణే ఇందుకు ప్రేరణ. ఈ సందర్భంలో ఇప్పటివరకూ వచ్చిన తెలుగు నవలలను అవలోకిస్తే ...కందుకూరి 'రాజశేఖర చరిత్ర', చిలకమర్తి వారి 'గణపతి', చలం 'మైదానం', విశ్వనాథవారి 'వేయి పడగలు', అడవిబాపిరాజు 'గోనగన్నారెడ్డి' , కొడవటిగంటి 'చదువు' బుచ్చిబాబు గారి 'చివరకుమిగిలేది', ఆళ్వారు స్వామి 'ప్రజలమనిషి', దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు' ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి', వెంకట పార్వతీశ్వర కవులు 'మాతృమందిరం', కొలకలూరి ఇనాక్ 'వలస' 'అమ్మ' , గోపిచంద్ 'అసమర్థుని జీవనయాత్ర', నామిని 'మునికన్నడి సేద్యం', రావిశాస్త్రి 'అల్పజీవి, రంగనాయకమ్మ 'బలిపీఠం', ఓల్గా 'స్వేచ్ఛ', కేశవరెడ్డి 'అతడు అడవిని జయించాడు', రాసాని 'చీకటిరాజ్యం', 'ముద్ర', సలీం 'వెండిమేఘం', 'కాలుతున్న పూలతోట', అప్పలనాయుడు 'పునరావాసం', 'బహుళ', వంటి నవలలు ప్రజలను ఎంతగానో చైతన్యపరచాయి. వీటిని ఆదర్శంగా తీసుకుని నేడు ఎందరో రచయితలు, రచయిత్రులు సమకాలీన వస్తువును ఎన్నుకుని నవలలు రాస్తున్నారు.

పై కనపరచిన నవలలన్నీ సంఘసంస్కరణ, అనువాదం, ఆధ్యాత్మికం, హాస్యం, వ్యంగ్యం, వ్యవసాయ, వైద్యవృత్తి, విద్యావ్యవస్థ, న్యాయవ్యవస్థ, పోలీస్ వ్యవస్థ, హరిజన, గిరిజన, దళిత, శ్రామిక, మార్క్సిజం, స్త్రీవాదం, చరిత్ర-సంస్కృతి, వ్యక్తుల జీవితాలు, కవుల జీవితాలు, పర్యావరణానికి సంబంధించినవి. ఈ నవలలన్నీ తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చి, భారతీయ భాషల్లో తెలుగునవల తన అస్థిత్వాన్ని నిలుపుకుంటూ ముందుకు వెళుతుంది.

ఈ కాలపు తెలుగు నవలాసాహిత్యంలో ఎన్నదగిన వారు కాకాని చక్రపాణి ఒకరు. వీరి కలం నుంచి అనేక కథలు, నవలలూ వెలువడ్డాయి. మరియూ తెలుగు నుండి ఆంగ్లమునకు, ఆంగ్లభాష నుండి తెలుగుభాషలోని అనేక నవలలు అనువాదం చేశారు. కాకాని చక్రపాణి గారి నవలల్లో విశేషమైనది 'నూరు శిశిరాలు' యాధృచ్ఛికమో ఏమో గాని, దాశరథి రంగాచార్య 'శతాబ్ధి', మాలతీచందూరి గారి 'శతాబ్ధిసూరీడు' అన్న నవలలే గాకుండా, 'శత వసంత సాహితీ మంజరి' అన్న సాహితీ విమర్శ గ్రంథం కూడా వచ్చాయి.

కాకాని చక్రపాణి గారిచే విరచితమైన నవలలు 'నూరు శిశురాలు', 'శీల పరీక్ష', 'నిప్పు' లాంటి రచనలు విభిన్న ఇతివృత్తం గల నవలలు కాకానికి విశేషమైన పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి. 'ఎమెస్కో' ప్రచురణ సంస్థవారు వారి రచనా కౌశలాన్ని గుర్తించి, వారి నవలలన్నిటిని ముద్రించి పాఠకలోకానికి అందించడం జరిగింది.

కాకాని చక్రపాణి జీవిత (రచనా) విశేషాలు :

వైయక్తిక జీవితం :

గుంటూరు జిల్లా, మంగళగిరి మండలంలోని చిన్న కాకాని గ్రామంలో 26.04.1942న వెంకటసుబ్బమ్మ, శ్రీరాములకు చివరి సంతానంగా జన్మించారు. తండ్రి గ్రామ కరణము. ఇద్దరు అన్నలు, ముగ్గురు అక్కలు. చిన్నతనములోనే తండ్రి పోవడంతో అమ్మ, అన్న, అక్కల ఆదరణ ఆప్యాయతల నడుమ పెరిగి పెద్దవాడయ్యాడు. బి.ఎస్.సి. సెకండియర్‌లోనే ఆర్.ఎం.ఎస్. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సంపాదించి హైద్రాబాద్‌కు తరలివచ్చాడు. ఉద్యోగం చేస్తూనే సాయంత్రం కళాశాల విద్య ద్వారా బి.ఏ. పూర్తిచేసి తదుపరి ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ. ఇంగ్లీషును 1974లో పూర్తి చేశాడు.

ఆ పిమ్మట, ఆంగ్ల రచయిత "సోమర్‌సెట్ మామ్ సాహిత్యం - తెలుగు రచనలపై ప్రభావం" అన్న అంశంపై పి.హెచ్.డి. పట్టా పొందారు. ఆ పిమ్మట హైద్రాబాద్‌లోని ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాలలో ఆంగ్లోపన్యాసకునిగా ముప్పై సం॥ల పాటు పనిచేసి ఉద్యోగవిరమణ చేశారు. 2017లో కాలధర్మం చెందారు.

సాహిత్య జీవితం :

వృత్తిరీత్యా ఆంగ్లభాషా అధ్యాపకత్వం - ప్రవృత్తిరీత్యా తెలుగు సాహితీసేవ. కాకాని చక్రపాణి తన మాతృభాష తెలుగులో కథలు, నవలలు వ్రాసి వివిధ వార, మాస పత్రికా పాఠకులను రంజింపజేశారు. అంతేగాక వీరు ప్రముఖ అనువాదకులు.

సోమర్ సెట్‌మామ్, ఓహెన్రీ, మాక్సిమ్ గోర్కీ, రుడ్‌యార్ట్ కిప్లంగ్ లాంటి ప్రముఖ ఆంగ్ల రచయిత కథలను తెలుగులోకి అనువాదం చేశారు. అలాగే, కందుకూరి, చలం, బుచ్చిబాబు, రావిశాస్త్రిల ప్రముఖ రచనలైన 'రాజశేఖర చరిత్రము', 'మైదానం', 'చివరకు మిగిలేది', 'అల్పజీవి' లను 'ఫోర్ క్లాసిక్స్ ఆఫ్ తెలుగు' పేరిట ఆంగ్లంలోకి అనువదించి, తెలుగు సాహితీ గౌరవాన్ని విదేశాల్లోని రచయితలకు తెలిపిన ధన్యజీవి.

కాకాని చక్రపాణి బహుముఖ ప్రజ్ఞాశాలి. కాకాని నవలాకారుడే కాక కాలమిస్టు, అనువాదకుడు మరియు చరిత్రపరిశోధకుడు కూడాను. వారి సాహితీసేవను 11 నవలల రూపంలో సమీక్షించుకుందాం.

1) వేగుచుక్క - 1988

2) ఏడడుగులు - 1991
3) గోరంతదీపం - 1992
4) నూరు శిశిరాలు - 1994
5) జోధలో (జోషువా గారి ధర్మలోగిలి) - 1995
6) ది ఘోస్ట్ - 1998
7) నువ్వు నాకొద్దు - 2000
8) నిప్పు - 2001
9) మహానగరంలో మాఫియా (రిక్రూట్‌మెంట్) - 2004
10) అగ్నితీర్థం - 2007
11) శిలపరీక్ష - 2008

కాకాని నవలలు - ఇతివృత్త వైవిధ్యం :

1988లో రచింపబడ్డ 'వేగుచుక్క' నవలలో 'అక్క చెల్లెళ్ళ' అనుబంధం గూర్చి మరియు ఒక స్త్రీ తనకాళ్ళ మీద తాను నిలబడ్డ తీరును తద్వారా స్త్రీ సాధికారితను వ్యక్తం చేసిన గొప్ప రచన. ఈ నవలకు సహరచయిత్రి వి.నాగరత్న కుమారి.

1991లో చతురలో ప్రచురింపబడ్డ 'ఏడడుగులు' నవలలో, సాంప్రదాయ, ప్రేమ వివాహాల తీరును వివరించడం జరిగింది. ఇందు సంధ్య, మీనాక్షి, దివ్య అనే మూడు స్త్రీ పాత్రల జీవితాలను పరిశీలించిన తర్వాత, వివాహమేదైనప్పటికినీ, భార్యాభర్తల మధ్య అనురాగం ముఖ్యమని చెప్పిన మంచి నవల.

1992-93లో ఆంధ్రప్రభ వార్తాపత్రికలో ధారావాహికగా వెలువడి పాఠకులలో ఆలోచనను రేకెత్తించిన నవల 'గోరంతదీపం'. 'స్త్రీకి స్త్రీయే శత్రువు' అన్న నానుడిని వ్యతిరేకిస్తూ వచ్చిన నవల. 'స్త్రీకి స్త్రీయే మిత్రువు' అన్న చందాన ఈ నవలలో 'సుజాత' తన దాంపత్యజీవనాన్ని ఎలా చిద్రం చేసుకుందో చదవగలం. తన భర్త శ్రీధర్ యొక్క విద్యార్థి జీవితంలో లైంగికదోపిడీకి గురికాబడ్డ 'లచ్చిమి' ని 'లక్ష్మి'గా మార్చే క్రమంలో భర్తను ఇంటి నుండి వెళ్ళగొట్టిన సుజాత తన పిల్లలకు తండ్రి ప్రేమను దూరంచేసి ఆదర్శమహిళ పాత్రను విజయవంతంగా నిర్వహించే క్రమాన్ని చిత్రించిన నవల. ఈ నవలకు సహరచయిత గోవిందరాజు చక్రధర్.

1994లో చతురలో వెలువడిన నవల 'నూరు శిశిరాలు'. విశిష్టాద్వైత మత ప్రాశస్త్యము మరియూ సాంప్రదాయ విద్యకు ఆంగ్లవిద్యకూ గల భేదాన్ని ఇందులో చర్చించడం జరిగింది. రంగనాయకమ్మ, కృష్ణమాచార్యులు, ఉగ్రనరసింహాచార్యులు ప్రధాన పాత్రలు. మధ్యతరగతి జీవితాలను, ఆర్థిక స్థితిగతులను ఈ నవల మనకళ్ళముందు ఆవిష్కరించింది.

1995లో చతురలో పాఠకులను అలరించిన 'జోధలో' (జోషువా గారి ధర్మ లోగిలి) నవల. ఇది రాజకీయ, వ్యంగ్య నవల. ఉత్తమపురుషలో వ్రాయబడ్డదీ నవల. వర్ణాంతర వివాహపు కష్టనష్టాలను చర్చించడం జరిగింది. రహదారుల పాడవు యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది.

1998లో జాగృతి వారపత్రికలో ధారావాహికంగా వెలువడిన నవల 'ది ఘోస్ట్'. ప్రముఖ నవలా రచయితలకు సినిమా రచయితలకు గల ఘోస్ట్ రచయితలను గూర్చి ఈ నవలలో అక్షరీకరించడమైనది. తెలుగు నవలా ప్రపంచంలో ఘోస్ట్ రచయితలను గూర్చి చర్చించిన మొదటి నవల బహుశా ఇదేనేమో.

'నువ్వు నాకొద్దు' ఆంధ్రభూమి మాసపత్రికలో 2000వ సం॥లో ప్రచురింపబడింది. కళాశాల నేపధ్యంగా; సాగిన నవల. పరమేశ్వరం కళాశాల లెక్చరర్, తనకిష్టం లేని మరదలుతో తన పెద్దనాన్న వివాహం జరిపించాడు. యిష్టంలేని తన భార్య సుధావల్లిని పుట్టినింట్లోనే వదిలేసి వచ్చేస్తాడు. సుధావల్లి, 'నువ్వు నాకొద్దంటూ' వదిలేసిన తన భర్త పరమేశ్వరాన్ని ఎలా చేరుకోగలిగిందో అన్న విషయాన్ని ఇందులో చర్చించడం జరిగింది.

'నిప్పు' ఆంధ్రప్రభ వారపత్రికలో 2001లో ధారావాహికంగా వెలువడిన నవల. దివ్య, తపతి, మృదుల ప్రధానపాత్రలు. శీలం - శరీరసంబంధమా లేక మానసిక

భావనా అన్న విషయమై ఉత్తమపురుషలో చర్చించిన నవల. వైరాలజీ చారిత్రక నేపధ్యంలో సాగిన గొప్ప నవల.

'అగ్నితీర్థం' గొలుసు నవల. ఈ నవలను సహరచయిత పి.ఎస్.నారాయణరావుతో కలిసి రచించడం జరిగింది. ఈ నవలలోని బేసి సంఖ్య అధ్యాయాలను చక్రధర్ రచించగా, సరిసంఖ్య అధ్యాయాలను కాకాని పూరించడం జరిగింది. చారులత తన విధ్వంసానికి కారణమైన భర్త మరియూ అతని స్నేహితునిపై ప్రతీకారం ఎలా తీర్చుకున్నదో వివరించే విధానాన్ని చెప్పిన రచన.

'శిలపరీక్ష' నవలలో పురుషాహంకారానికి బలైపోయిన ఇద్దరు స్త్రీల జీవితాలను గూర్చి చర్చించిన రచన. అనసూయ అగ్రవర్ణీకురాలు. తండ్రి మరియూ భర్త 'ఇగో' వలన, భర్తతో తాళి కట్టించుకున్నప్పటికీ అతనితో తొలిసమాగమానికి కూడా నోచుకోలేని అభాగ్యురాలు. ఇందులోని మరొక పాత్ర రేణుక అనే దళితురాలు. స్త్రీలోలుడూ మరియూ వ్యసనపరుడైన తన భర్త చేతిలో దౌష్ట్యాలకు గురై 'పతిత'గా ముద్రింపబడి, ఎర్రగా కాల్చిన కొర్రలు చేతబట్టుకొని పతివ్రతగా రుజువు పరచుకోవాలన్న కులం కట్టుబాటుకు లోనైన మహిళ వ్యథాభరిత జీవనగాధను ఈ రచన వివరిస్తుంది.

'నగరంలో మాఫియా' (రిక్రూట్‌మెంట్) పెద్ద నవల. ఇందులో పాత్రల సంఖ్య 49. ఇది క్రైం నవల. మాఫియాలో రిక్రూట్‌మెంట్లు నిర్మాణం, మనుగడ, ఆర్థిక పునాదులు ఏర్పాట్లను గూర్చి మరియు సమాజానికి కలుగు కష్టనష్టాలను గూర్చి వివరిస్తుందీ నవల. కాకాని కలం నుంచి జాలువారిన క్రైం నవల ఇది.

పై నవలలన్ని వైవిధ్యంతో కూడిన రచనలే.

కాకాని నవలలు - శైలీ శిల్ప విశేషాలు :

ఒక రచన పాఠకాదరణకు నోచుకోవడానికి దోహద పడేది శైలీ శిల్పం. రచయిత చక్కని శైలి శిల్పాన్ని ప్రయోగిస్తే అది పాఠకుని హృదయాన్ని హత్తుకుంటుంది. టెక్నిక్ అనే ఆంగ్లపదానికి సమానార్థకంగా 'శిల్పం' అనే పదాన్ని వాడుతున్నాము. రచనా విధానాన్నే శిల్పమని సాహితీవేత్తలు భావిస్తున్నారు.

ఒక శిల్పాన్ని చూస్తే అది మన మనస్సులో ఎలా శాశ్వతంగా ముద్రపడి హత్తుకు పోతుందో, అదే విధంగా ఒక రచయిత తన రచన పాఠకుల మనస్సులో హత్తుకు పోవునట్లు వివిధ జాగ్రత్తలు, కొలమానాలు పాటిస్తూ రాయాల్సి వుంటుంది. అలాంటి రచయితే ఉత్తమ రచయితగా గుర్తించబడతాడు. ఇందుకు చక్కగా దోహద పడేది శిల్పం.

నవలా శిల్పానికి అవసరమైన మూలాంశాన్ని గూర్చి వల్లంపాటి వెంకట సుబ్బయ్య ఇలా అంటారు:

"నవలా రూపంలోని ప్రధానాంగాలు, కథ, కథనం, నేపధ్యం, శైలి. కథా వస్తువుతో సంబంధ లేకుండా ఇవి స్వతంత్రంగా వుండవు. ఉండలేవు. మంచి కథావస్తువు వుండి దానికి తగిన రూపం కుదరని నవల కళా దృష్టితో చూసినపుడు నీరసంగా కనిపిస్తుంది. కథా వస్తువు బలంగా లేకపోయిన రూపం అందంగా ఉన్న నవల వ్యాపార నవల. దాని అందం కృత్రిమమైనది. గొప్ప నవలలో వస్తువు, రూపం, పడుగుపేకల్లా ఒకదానితో మరొకటి మిళితమై వుంటాయి.

శిల్పాన్ని డా॥పోరంకి దక్షిణామూర్తి ఇలా నిర్వచించాడు.

"ఏ పనిలోనైనా కళానైపుణ్యాన్ని చూపే పద్ధతిని శిల్పమనవచ్చు".

కాకాని చక్రపాణి తన 11 నవలల్లో తనదైన శిల్పంతో పాఠకలోకాన్ని మరొక లోకంలోకి తీసుకెళ్లాడు.

శిల్పం :

'నిప్పు', మరియు 'జోధలో' (జోషువ గారి ధర్మలోగిలి) రెండు నవలలనూ ఉత్తమపురుషలో రచించారు. ఉత్తమ పురుషలో కథ చెబుతున్న పాత్ర నవలలోని ప్రధానపాత్రగా ఉండవచ్చు లేదా నవలలోని సంఘటనల్లో సాధ్యమైనన్ని ఎక్కువ సంఘటనల్ని చూసే అవకాశం ఉన్న ఇతర పాత్ర కూడా కావచ్చు. ఈ రెండు నవలల్లోను రచయిత విభిన్న

నేపధ్యాలతో, ఆయా కధాంశాలకు తగినట్లు తన పాత్రలను తీర్చిదిద్దుకున్నాడు.

కాకాని చక్రపాణి తన నవలల్లో సిద్ధాంత ప్రతిపాదన మరియూ కాల్పనిక కధాగమనమూ రెండూ చేతిలో చేయివేసి కదం తొక్కేటట్లుగా అక్షరీకరిస్తాడు. 'నూరు శిశిరాలు' నవలలో విశిష్టాద్వైత మతాన్ని గూర్చి విపులంగా చర్చిస్తూనే సగటు మధ్య తరగతి జీవితాల్లోని 'అమ్మ' పంపకం గూర్చి చెప్పే విఫల సందర్భాలలో లీలాశుకుని కృష్ణ కర్ణామృతం లోని శ్లోకాలను ఆలంబనగా చేసుకున్నాడు. అలాగే 'శిలపరీక్ష' నవలలో కూడా 'జాంబపురాణం' ఆలంబనగా కులాల పుట్టుకను వివరిస్తూ, ప్రధానపాత్రలైన అనసూయమ్మ, రేణుకల ద్వారా 'స్త్రీల రామాయణపు పాటలు' ను సందర్భాను సారంగా మనస్సుకు హత్తుకునేటట్లు వాడుకున్నాడు. 'నగరంలో మాఫియా' నవలలోనూ అంతే... సమయ సందర్భానుసారం శివపంచాక్షరీ స్తోత్రం; మృత్యుంజయ మంత్రాలను ఉపయోగించుకున్నాడు.

'నిప్పు' నవలలోని కొన్ని పాత్రల ద్వారా, పాథాలజీని గూర్చి మరియూ నిజాం రాజవంశ చరిత్రను గూర్చి సోదాహరణగా నవలలోని కధావస్తువుకు ఆలంబన చేసుకున్నాడు. 'గోరంతదీపం' నవలలోనైతే కధా నాయకుని స్నేహితుని పాత్ర ద్వారా సమయ సంధర్భానుసారంగా అందరికీ చిరపరిచితమైన ఘంటసాల సినిమా పాటలను అక్కడక్కడా జ్ఞప్తి చేయించాడు. 'నువ్వునాకొద్దు' నవలలో కధావస్తువైన భార్యాభర్తల మధ్య అనురాగం లేమికి, మానసిక శాస్త్ర నిపుణుల సలహాలు సూచనల ద్వారా వ్యక్తుల యొక్క వైయుక్తిక ప్రవర్తనను చర్చించటం కాకాని చక్రపాణి విశిష్టమైన శైలిగా చెప్పవచ్చును.

శైలి :

భాషను వాడే పద్ధతి అంటే రచనా విధానంలోని ప్రత్యేకతను శైలి అంటున్నారు. భాషను వాడటం అంటే భాషలోని భాషాభాగాలను ప్రయోగించే పద్ధతి. ఒక రచన పాఠకులను ఆకర్షించుటలో శైలి ప్రధాన భూమిక వహిస్తుంది. అదీ ముఖ్యంగా ఆధునిక ప్రక్రియలైన నవల, కథల్లో ఎక్కువ ప్రాధాన్యం కలిగి ఉంటుందని చెప్పవచ్చు. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు వెలువడిన సాహిత్యాన్ని శైలీ భేదం దృష్ట్యా విమర్శకులు ఐదు రకాలుగా విభజించారు. (1) పదగుంఫనశైలి (2) సరళశైలి (3) ప్రాచీన శైలి (4) ఆధునికశైలి (5) మాండలిక శైలి.

పై శైలీ బేధాల్లో కాకాని చక్రపాణి సరళశైలిని ఎంచు కున్నాడని చెప్పవచ్చును.

శైలి అంటే భాషను ప్రయోగించిన రీతి. ఒక్కో రచయిత ఒక్కో రకమైన శైలిని ప్రయోగిస్తాడు. ఈ శైలిని జాతీయాలు, సామెతలు, జంటపదాలు, ధ్వన్యనుకరణ శబ్దాలు, మాండలిక పదాలు, పరభాషా పదాలు, సాదృశ్యాలు నిర్ధేశిస్తాయి. పాఠకులను ఈ అంశాలే బలంగా ఆకర్షిస్తాయి. ఈ ధృక్కోణంతో అవలోకిస్తే కాకాని చక్రపాణి తన నవలల్లో ఒక్కొక్క అంశానికి ఒక్కో ఉదాహరణను ఇవ్వడం జరిగింది.

జాతీయాలు :

ఒక జాతికి సంబంధించినది జాతీయం. ఈ జాతీయాలు ప్రతి భాషలోనూ ఉన్నాయి.

అడకత్తెరలో పోకచెక్క - ది ఘోస్ట్ (పుట సంఖ్య 132)

కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు - నువ్వునాకొద్దు - (పు.232)

సామెతలు :

ఒక సామ్యాన్ని, ఒక జీవిత అనుభవాన్ని ఒక చిన్న వాక్యంలో చెప్పేవి సామెతలు.

'అన్ని గుణాలు కాంచనాన్ని ఆశ్రయిస్తాయి' - నిప్పు (పు:106)

'ఆడది తిరిగి చెడ్డది. మగాడు తిరక్క చెడతాడు' - శీలపరీక్ష. (పు.388).

జంట పదాలు :

జంటపదాలు పాఠకునికి విషయావగాహనకు చక్కగా తోడ్పడతాయి. ఈ విషయాన్ని గుర్తించిన కాకాని చక్రపాణి తన నవలల్లో అనేక జంట పదాలను ప్రయోగించారు.

తృణమో, ఫణమో - ది ఫోస్ట్ (పుఃం20)

ధ్వన్యనుకరణ :

శైలి శిల్పాన్ని నిర్ధేశించడంలో ధ్వన్యనుకరణ శబ్దాలు కూడా ప్రధానపాత్ర వహిస్తాయి. కాకాని చక్రపాణి తన నవలల్లో అనేకమైన ధ్వన్యనుకరణ శబ్దాలు ఉపయోగించారు.

కసబిసా - నూరు శిశిరాలు (పు -175)

తహ తహ - నువ్వు నాకొద్దు (పు-308)

మాండలికాలు :

ప్రతి భాషలోనూ మాండలికాలున్నాయి.

మాండలికాలకు పరిశోధకులు వేర్వేరు నిర్వచనాలిచ్చారు. ఒకే భాష మాట్లాడే ప్రజా సమూహంలో ఒక ప్రాంతం వ్యవహారంలో వున్న పదం మరో ప్రాంతంలో వుండదు. కానీ దాని అర్థం మాత్రం అందరికీ అర్థమవుతుంది.

అన్నం ననుబాయయింది - ది ఫోస్ట్ (పు:64)

తేపతేపా - ది ఫోస్ట్ (పు.131)

పరభాషా పదాలు :

మనిషి సంఘజీవి. వివిధ అవసరాల నిమిత్తం పరభాషీయుల ఆధిపత్యం భరించక తప్పడం లేదు. అంతర్జాతీయ భాషయైన ఆంగ్లభాష మన వాడుక పదాలలో అనివార్యమై పోయింది.

సినిక్ - నిప్పు (పు:253)

డిగ్నిటీ ఆఫ్ లేబర్ - ది ఫోస్ట్ (పు:27)

అసలు తను రాసిన ఒక నవలకు శీర్షికగా ఆంగ్లపదం 'ది ఫోస్ట్' ను వాడటం జరిగింది. ఈ నవలలో ఎడిటర్, సబ్-ఎడిటర్ లాంటి సంబంధిత ఆంగ్లపదాలెన్నింటినో వాడటం జరిగింది.

తనవైన విశిష్ట పదాలు :

పంచమాంగదళం; అశక్తదుర్జనుడు; భావనాశబలత; విమూఢంగా; కృతజ్ఞతతో కుంగిపోవడం; హృదయం ప్రిదిలిపోయింది; నిప్పుచ్చరమయిన కొంప; తందరంతాం పితరంతాం; తేపతేపా! మృషా అధిక్షేపణలు ఇలాంటి ఎన్నో తనవైన ప్రత్యేకతను కలిగిన విశేషణాలను అన్ని నవలల్లోనూ కాకాని చక్రపాణి ఉపయోగించారు.

ఉపసంహారం :

రచయితలు సమాజానికి దిక్సూచి లాంటి వారని, వారు పేర్కొన్న హిత మార్గంలో నడవడం మంచిదని, ప్రజలకు హాని కలిగే విధంగా ఎవరూ వ్యవహరించరాదని వివిధ అధ్యాయాల్లో విశ్లేషించిన తీరును ఇక్కడ పేర్కొనడం జరిగింది. రచయిత కాకాని చక్రపాణి ప్రతీ నవలను ఎంతో నిబద్ధతతో, సామాజిక స్పృహతో, సామాజిక హితం కోరి రాశాడని, ఆయన ఆశయం చాలా వరకు నెరవేరిందని ప్రతిపాదించడం జరిగింది.

ఉపయుక్త గ్రంథాలు :

1. కాకాని నవలలు - ఎమెస్కో పబ్లికేషన్స్
2. తెలుగు నవలా వికాసం - మొదలి నాగభూషణశర్మ, నాట్యకళాప్రెస్, హైదరాబాద్.
3. నవలా శిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
4. సమాజం - సాహిత్యం - కె.ఎస్. సుదర్శనం

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జయంతి ప్రకాశ శర్మ కథలు – సామాజిక చైతన్యం

– మొండి స్వామి, పరిశోధక విద్యార్థి (జె.ఆర్.ఎఫ్.), తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

జయంతి ప్రకాశశర్మ విజయనగరం జిల్లా బొండాడ వీధిలో పుట్టారు. విజయనగరంలోనే విద్యాభ్యాసం గడిచింది. తండ్రిగారు జయంతి కామేశ్వరరావు, తల్లి గారు జయంతి రామలక్ష్మి. జయంతి ప్రకాశశర్మ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేసారు. ఈయన రచనలు 1. ఎడారి పరుగు (కథల సంపుటి) 2. అయ్యకోనేరు గట్టు కథలు.

సమాజంలో నివసించే ప్రతి వ్యక్తికీ బాధ్యత ఉండాలి. సమాజం లేకుంటే మానవ మనుగడ కూడా కష్టసాధ్యం. సంఘజీవిగా మాత్రమే మనగలిగే వారికి సామాజికంగా కొన్ని హక్కులున్నట్లే నిర్వహించాల్సిన విధులు, ధర్మాలు ఉంటాయి. కొందరు వాటిని స్వచ్ఛందంగా పాటించే ఉత్తములుగా వ్యవహరిస్తుంటారు. కానీ అధికులు సమాజం నుండి అన్నీ ఆశించి అందుకుంటారే గానీ దాని పట్ల అందులో తమతో పాటు నివసించే సాటి వారిపట్ల, వ్యవస్థల పట్ల నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తుంటారు. వ్యక్తి చైతన్యం, కుటుంబ చైతన్యంగా, కుటుంబ చైతన్యం సమాజ చైతన్యంగా ఎదగాల్సిన క్రమాన్ని అనుసరించాలి. అలా చేయని వారికి వారి సామాజిక బాధ్యతని గుర్తు చేసే మార్గదర్శకులుగా రచయితలు తమ అక్షర ఆయుధాలతో ప్రతి ఒక్కరినీ దారిలోకి తెచ్చి కార్యోన్ముక్తులను చేస్తుంటారు. అలాంటి వారిలో 'జయంతి ప్రకాశ శర్మగారు' ఒకరు. తన కథలలో సామాజిక చైతన్యం అనే అంశాన్ని చేర్చి ప్రతి పౌరుని, పాఠకుని స్మార్తి పథంలో నడిపించే బాధ్యతని సరైన రీతిలో గుర్తు చేసి తన రచనా విన్యాసంతో దారిలోనికి తెచ్చేలా కర్తవ్యాన్ని ప్రబోధిస్తున్నారు. అలాంటి సామాజిక చైతన్యాన్ని చాటుతున్న కథలను గమనిస్తే అవి ఎంత ఉన్నతత్వాన్ని కలిగి ఉన్నాయో తెలుసుకోవచ్చు. ఆ విధమైన కథనాన్ని 'సైకిల్ డాక్టర్!' అనే కథలో గమనించవచ్చు.

సైకిల్ డాక్టర్ :

కథా పరిచయం :

విశాఖపట్నంలో డాక్టర్ చదువుని అభ్యసించిన గుంటూరు వాసి రాజసురేష్ తన స్నేహితుడైన శర్మ ఆహ్వానం మేర విజయనగరంలో డాక్టర్ వృత్తిని చేపడుతాడు. అయ్యకోనేరు గట్టు మీద గదిలో అద్దెకుంటూ కోట దగ్గర ఒక గదిలో ప్రాక్టీసుని ప్రారంభిస్తాడు. ఎవరూ లేని ఒంటరి పేదవాడు గనుక శర్మ ఇచ్చి వెళ్ళిన సైకిల్‌పై వైద్య సేవలకు వెళ్తూ 'సైకిల్ డాక్టర్' అని పిలవబడేవాడు. పేద బిక్కికి ఉచితంగా వైద్యాన్నందిస్తూ ఓపిక గల హస్తవాసి ఉన్న డాక్టర్‌గా ఎదిగాడు. పెళ్ళితో అతని భావాలకు తగిన భార్య లభించింది. కొంత కాలం తర్వాత మూడు గదుల ఆసుపత్రిని బ్యాంక్ లోన్ సాయంతో కట్టిస్తాడు. ఆ వీధి బాగా అభివృద్ధి చెంది దుకాణాలు, పాఠశాల వంటివి ఏర్పడుతాయి. ప్రమాదాలు జరగకుండా మునిసిపల్ శాఖని కలిసి డివైడర్‌ని రాజా సురేష్ ఏర్పాటు చేయిస్తాడు. రోడ్డు నియమాలను పాటింపచేయడానికి వన్‌వేలో బోర్డులు ఏర్పాటు చేయిస్తాడు. పిల్లలకు క్రమశిక్షణ నేర్పాల్సిన పెద్దలు ఉపాధ్యాయులు వాహనాలను నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతుండటంతో రోడ్డుపై వారితో వాదనకి దిగుతాడు. దారి తప్పిన వారిని సరిచేయాలని ప్రయత్నించినా తెలుసుకోలేని వారు కనీసం పిల్లలకోసమైనా నీతి మార్గాలను పాటించాలని లేదంటే వారు మంచి పౌరుల్లా ఎదగక దొంగల్లానో, హంతకులుగానో మారగలరని హెచ్చరించి ఆలోచించుకోమని చెప్తాడు. బడిపిల్లలు అతని వెనుక వరస క్రమంలో రోడ్డుని ప్రమాదం లేకుండా దాటుతారు.

విశ్లేషణ :

నైతిక విలువలున్న వ్యక్తి తనలోని సామాజిక స్పృహని

పదిమందికీ బోధించి వారిని దారిలోనికి తెచ్చే చైతన్యాన్ని ప్రదర్శించడం ద్వారా రేపటి తరానికి ఆ స్ఫూర్తిని అందించడాన్ని కథలో చూపించారు. సామాజిక చైతన్యకారునిగా డాక్టర్ రాజ సురేష్ పాత్రని ఆద్యంతం దర్శింపజేసారు. ఆ మార్గదర్శకత నేటి సమాజానికి అవసరం అని నిరూపిస్తూ అనుసరింపజేసే ప్రయత్నాన్ని ఉన్నత రీతిలో కావించారు. ప్రాంతీయభేదాలతో నాది, నా ప్రాంతం అని నేలని పంచుకుంటున్న స్వార్థం మనిషికి పనికిరాదు. మనం ఎక్కడుంటామో అదే మన జన్మభూమి అని భావించడం ఉత్తమ పౌరుని లక్షణం. అది రాజా సురేష్‌లో మెండుగా ఉంది. కోట్లను ఆర్జించే అవకాశం ఉన్న వృత్తిలో ధర్మాన్ని అనుసరించడం అందరికీ అలవడదు. కానీ 'మానవ సేవే మాధవ సేవ' అని తలచిన వ్యక్తుల్లో స్వార్థం ఉండదు. తమ వృత్తి ద్వారా పది మందికీ ఉపయోగపడాలనే తపన ఉంటే చాలు.

"సైకిల్ డాక్టర్' అనే శీర్షికలోనే పర్యావరణ హితాన్ని కోరే శబ్ద, వాయు కలుషితాలు చేయని వాహన పరిచయం ఉంది. అది ఆరోగ్యానికీ, వాతావరణానికీ మంచిదనే అభిప్రాయం ఇక్కడ వ్యక్తమవుతూ మనిషికో వాహనం అంటూ కాలుష్య కారాగారంగా భూమిని మార్చుతున్న వారికి హెచ్చరికతో పాటు సూచననీ చేసారు. కొన్ని ప్రధాన వృత్తులు ఆదాయాలను అమితంగా తెచ్చిపెడుతుంటాయి. వైద్య సేవలు ప్రతి ఒక్కరికీ అవసరమే. ఆ వృత్తిని చేపట్టిన వారిని 'వైద్యో నారాయణ:' అని భగవంతునితో పోలుస్తూ తిరిగి ప్రాణం పోసే సంజీవనిగా తలుస్తారు. కానీ నేటి డాక్టర్లు డబ్బు సంపాదనే ధ్యేయంగా పెట్టుకున్నారు. రోగికి స్నేహితునిగా మెలుగుతూ ధైర్యం చెప్పాల్సిన వైద్యులు చిన్న దగ్గు, జ్వరానికి కూడా రకరకాల వింత జబ్బులని భయపెట్టి పరీక్షలు చేయించి డబ్బుని గుంజుతున్నారు. ప్రేమ పూరిత భాషణతో ఓపికగా మెలగాల్సిన వారు వ్యాపారవేత్తల్లా లాభాల లెక్కలతో, డబ్బు కట్టలలో మునిగిపోతున్నారు. మానవత్వం మరిచి వేలకు వేలు పీడించి వసూలు చేస్తూ హృదయం లేని వారవుతున్నారు. అవయవ చౌర్యం, నకిలీ మందులతో జీవితాలతో చెలగాటం ఆడుతూండటం చూస్తున్నాం. అలాంటి వారికి రాజా సురేష్ పాత్ర కనువిప్పని కలిగించి చైతన్యపరిచేలా తీర్చిదిద్దారు.

వృత్తిపరంగా సమాజ సేవలను చేస్తూ సాటి మానవుల హితాన్ని కోరడం 'పరోపకారం పరమోధర్మ:' అని భావించడం ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలి. తప్పుదారి, క్రమశిక్షణ లేకపోవడం నైతిక విలువల క్షీణతగా గుర్తించితే తప్పుతున్న వారిని సరిదిద్దే ప్రయత్నాన్ని చేయాలి. అందులో భాగంగా ఎదుటివారు చులకనగా, వ్యంగ్య రీతిలో మాట్లాడినా నిజాన్ని గ్రహించేదాకా పట్టువిడవక పోవడం సంస్కరణలో భాగమేనని అనుకోవాలి. జన సందోహాలు బడి, పిల్లలు ఉన్న దగ్గర ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్న ఇంగిత జ్ఞానం పెద్దలకు లేకపోవడం, పైగా డాక్టర్‌తో 'ఆక్సిడెంట్లు జరిగితే నీకు బేరాలు వస్తాయిగా...' అనడం బాధ్యతా రాహిత్యం. అలాంటి వారికి రాజా సురేష్ చెప్పిన మాటలు చెంపపెట్టులా పని చేసి సామాజిక స్పృహని కలిగించేవిగా ఉన్నాయి. 'మిమ్మల్ని బాగు చేయడానికి నాకు శక్తి సరిపోదు. ఆ ప్రయత్నం చేయడం లేదు! ఒక వేళ ప్రయత్నం చేసినా, సాధ్యమైన విషయం కూడా కాదు. కారణం బాగుపడే స్థాయిని దాటిపోయారు. ఈ పిల్లలకి ఇప్పుడు నేర్పవలసిన క్రమశిక్షణని పక్కనపెట్టి అడ్డదారులు తొక్కిస్తున్నారు! మీరు నడుస్తూ, వాళ్లని కూడా ఆ అడ్డదారుల్లో నడిపిస్తున్నారు. కనీసం 'అది మంచిది కాదని' నీతి మార్గము బోధించవలసిన ఈ స్కూలు ఉపాధ్యాయులు కూడా అదే మార్గాలలో వస్తున్నారు! మీ పిల్లలు పెరిగి, పెద్దవారై ఓ దొంగగానో, ఓ హంతకుడిగానో చూడాలనుకొంటున్నారా? ఒక్కసారి ఆలోచించండి!" అంటూ వ్యంగ్యరీతిలో తప్పులను ఎత్తి చూపుతూ దాని పరిణామాలను చెప్పి చైతన్యాన్ని రగల్చడంలో ఆ పాత్రతో పాటు రచయితలోని సామాజిక దృక్కోణం స్పష్టమవుతోంది. బాధ్యతను పాటించాల్సిన వారు దాన్ని మరవడం మాత్రమే కాకుండా యదార్థ వాదనకి

విరుద్ధంగా అడ్డదిడ్డంగా మాట్లాడటం తగనిది. ఇలాంటి వారుండగా బడులు, గుడులు వంటి రద్దీ ప్రాంతాలలో నియమాలను స్పీడ్ బ్రేకర్‌లను, డివైడర్‌లను ఏర్పాటు చేసినా ప్రమాదాలు జరుగుతున్నాయి. అందుకే సమాజంలో నిబద్ధత కలిగిన వ్యక్తిగా రాజాసురేష్ ద్వారా వ్యక్తి. సామాజిక చైతన్యాలను చక్కగా చూపించారు. అలాగే 'పచ్చతోరణాలు' కథలో చెట్లను పెంచి పోషించడంను సామాజిక బాధ్యతగా రచయిత గుర్తు చేస్తున్నారు.

పచ్చతోరణాలు :

కథాపరిచయం :

ప్రకాశం, సుబ్బమ్మ దంపతులు జగ్గాపురంలో ఉండేవారు పచ్చని పల్లెటూరిలో రెండెకరాల పొలంతో వారి జీవనం గడిచేది. పిల్లలు లేకపోవడంతో వారు రామేశం అనే అబ్బాయిని దత్తత తీసుకున్నారు. అతను చదివి ఉద్యోగస్తుడై పెళ్ళి కూడా చేసుకుని పట్నంలో ఉండేవాడు. సుబ్బమ్మ ఇంటి చుట్టూ మొక్కలు పెంచుతూ వాటిపై పక్షులకు అన్నం, ధాన్యం పెట్టేది. పిచ్చుకలు, కాకులలో రోజంతా సందడిగా ఉండేది. సెలవులకు రామేశం పిల్లలు మామ్మ, తాతయ్యల వద్దకు వస్తుండేవారు. చెట్ల యొక్క ఉపయోగాలను, వాటిని పెంచడంలోని ఆనందం గురించి ఆమె మనుమలకు చెప్తుండేది. ప్రకాశం గారికి ఎనభై ఏళ్లు వచ్చాక ఆరోగ్యం సహకరించక వారు రామేశం వద్దకు వచ్చేస్తారు. ఆ అద్దింటి వాకిట్లో పెద్ద మామిడి చెట్టును కొట్టించి కొట్టు కట్టించాలని ఇల్లుగలావిడ అనుకొంటుంది. కోడలి ద్వారా ఆ మాటలు విన్న సుబ్బమ్మ బాధపడుతుంది. ఓ రోజు ఇంటి ఓనరు ఒక వ్యక్తితో పాటు చెట్టు కొట్టించడానికి వస్తుంది. ఆమెతో కబుర్లు చెప్తున్నట్లుగా చెట్లెంతటి మహత్తు కలవో, వాటి గొప్పతనం ఎంటో చెప్తుంది. అశోకుడు కోటలు కట్టక చెట్లు నాటడం వలనే ఇప్పటికీ చిరస్మరణీయుడయ్యాడని వివరించడంతో చెట్టు కొట్టడానికి వచ్చిన కూలి నమస్కరించి వెళ్ళిపోతాడు. ఇంటావిడ సుబ్బమ్మ ప్రబోధానికి తలవంచుతుంది. మొక్కలే ఇంటికి పచ్చని తోరణాలని నమ్ముతుంది.

విశ్లేషణ :

పర్యావరణంలో భాగమైన మొక్కల సంరక్షణ వాతావరణ సమతుల్యతకు దోహదం చేస్తుంది. ఎడాపెడా చెట్లని నరకడం మన మరణానికి మనమే గోతులు తవ్వుకున్నట్లవుతుంది. మనిషికి, మొక్కకి ఉండే అవినాభావ సంబంధం విడదీయరానిది. మనిషి లేకున్నా చెట్టు మనగలదు. కానీ చెట్లు లేకుంటే ప్రాణవాయువు కరువై మనిషి ప్రాణం పోతుంది. కానీ ప్రపంచీకరణ వలన పరిశ్రమల స్థాపనలు ఊపందుకొని పల్లెలు, పంట పొలాలు తుడిచిపెట్టుకుపోతున్నాయి. అడవులు, కొండ కోనలు కూడా చదును చేసేస్తున్నారు. పచ్చదనం కరువై భూతాపం పెరగడం, ఓజోన్ పొర కరగడం వంటి దుష్ప్రభావాలతో పాటు ఆమ్ల వర్షాలు పడే అవకాశముంది. మనిషి వైజ్ఞానికంగా ఎంత ఎదిగినా అతని ఆవిష్కరణలు ప్రకృతిని నాశనం చేస్తున్నవిగా ఉన్నాయి. ప్రకృతి వినాశనాన్ని చెట్లు నరకడం ద్వారానే ప్రారంభించాడు. రోడ్లు వెడల్పు చేయడం కోసం తరతరాల వృక్షాలను క్షణంలో నేలకూల్చి గోరీ కట్టుకొంటున్నాడు. సిమెంటు రోడ్లు, అగ్గిపెట్ల ఇళ్ళ నడుమ మసిబారిన చెట్టు అక్కడొకటి ఇక్కడొకటి అన్నట్లుగా కొన ఊపిరితో ఉంటున్నాయి.

ఒకప్పటి గ్రామాలు పచ్చదనాల పరవళ్ళు ఇప్పుడు కొన్ని ప్రాంతాలు మాత్రం అలా కళకళలాడుతున్నాయి. ప్రకృతి ముప్పు మన కొంప ముంచడానికే చేపడుతున్నామని తెలిసాక కొన్ని సామాజిక విప్లవాలు బయల్దేరాయి. కొందరు సామాన్యులు సామాజిక కార్యకర్తలై పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారు. "సుందర్‌లాల్ బహుగుణ చిప్కో ఉద్యమం" ద్వారా అడవులను కాపాడడానికి నడుం బిగించి స్థానిక తెగల సాయంతో సమాజాన్ని, ప్రభుత్వాన్ని చైతన్యపరిచారు. చెట్లను నాటించే కార్యక్రమాలు ఊపందుకున్నాయి. కానీ పెరుగుతున్న జనాభాకు అనుగుణమైన వృక్ష సంపద మాత్రం లేదు. డబ్బు మీది

మక్కువతో కొన్ని కుటుంబాల వారు తమ ఇంటి ముందు చెట్లని నరికి కొట్లు, దుకాణాలు కట్టించి ఆర్థికఅభివృద్ధిని ఆశిస్తున్నారు గానీ పచ్చని చెట్లని వాటిపై బతికే పక్షులని నిర్లక్ష్యం చేయడం తగదని తెలుసుకోకపోవడం శోచనీయం. అలాంటి సమయంలో రచయితలు తమ సామాజిక బాధ్యతని గుర్తించి మొక్కల పరిరక్షణ ఇతి వృత్తాలుగా కథలు, కవితల ద్వారా ప్రజలను చైతన్య పరచడం ప్రారంభించారు. అలాగే జయంతి ప్రకాశశర్మ కూడా తనవంతు కృషిని ఈ కథ ద్వారా చేసారు. సుబ్బమ్మ పాత్రని సృష్టించి ఆమె ద్వారా అద్భుత సందేశాన్ని సమాజానికి విన్నవించారు. భర్తతోను, మనుమలతోను, ఇల్లుగలావిడతోను సాగించే సంభాషణల్లో బిడ్డలు దూరమైనా మనల్ని కాచుకొని ఇంటిముందు కాపలా ఉండేది వృక్షాలేనని వాటిపై ఆవాసమున్న పక్షుల పలకరింతలు ఒంటరివాళ్ళం కాము అని చెప్పే ఆనవాలాలని చెప్పించి వనదేవతని కనులకు గట్టారు. ఈమె పాత్ర ద్వారా పర్యావరణ పరిరక్షణా బాధ్యతతో పాటు మూగ జీవులపై మానవత్వాన్ని కలిగి ఉండాలని, ఆకలిగా ఉన్నవారి కడుపు నింపాలనే చైతన్యాన్ని కూడా అందించారు.

''ఈ మొక్కల ఉద్యోగం ఏంటో తెల్సా మనల్ని కాపాడ్డమే! మనం పీల్చుకునే ప్రాణవాయువుని అవి అందిస్తాయి. పక్షులకు గూడులిస్తాయి. మనకి ఫలాలిస్తాయి. ఎండిపోయినా సరే, అవి మనకి వంట చెరుకుగా ఉపయోగపడతాయి.'' అంటూ ప్రాణం పోసుకొంది మొదలు ఆ ప్రాణం పోయినా అవి మన బాగునే కోరతాయని ప్రకాశం, సుబ్బమ్మలు మనుమలకు చెప్పడాన్ని ఒక పాఠ్యాంశంగా మలిచిన విధం ప్రశంస నీయం. కాకిని చూసి శుభ్రత, చిలక నుండి మంచి మాట తీరు, కొంగ నుండి ఓర్పు - ఒడపు, కుక్క నుండి విశ్వాసం, చీమ - తేనెటీగల నుండి శ్రమ పడటం నేర్చుకోవచ్చునని సుబ్బమ్మ చేత పలికించడం నేటి ఆధునిక సమాజంలో లోపిస్తున్న సుగుణాలు వాటిని పశు పక్ష్యాదుల నుండి నేర్చుకోమని చెప్పడంలో సామాజిక చైతన్యం ఉంది. మనిషి కోల్పోతున్న విలువల ప్రతిష్ట ఉంది.

చెట్టుని నరికి ఇల్లు కట్టుకోవడం గోహత్యలాంటిది'' అంటూ పోల్చి చెప్పడాన్ని గమనిస్తే రచయితలోని ఉన్నత కోణం కనిపిస్తోంది. కళింగ యుద్ధం అశోకుని మహాక్రూరునిగా ప్రపంచానికి పరిచయం చేసింది. కానీ అతను చెట్లు నాటించాడని మహోన్నతుడిగా కీర్తికెక్కాడు. ఈ విషయాలను స్పృశిస్తూ కథానుగుణం చేయడం ఉన్నతం. 'చెట్టు పెరగడానికి సమయం పడుతుందేమోగాని కొట్టడానికి నిమిషం చాలమ్మా!' అంటూ చేసిన బోధ పర్యావరణ హితాన్ని, వనరక్షణ గురించిన చైతన్యాన్ని కథ ద్వారా అందించారు. ఇలాగే మడి, బేరం, నైజం, దారితప్పిన మనుషులు, కొత్త బిచ్చగాడు. మద్రాసీ కామాల్, సంస్కరణ, నాన్న చచ్చిపోయాడు, వీఓణ, చన్నీళ్ళు, జాతక చక్రం, పుట్టలోని చెదలు వరలక్ష్మీ వ్రతం, పగలే వెన్నెలా, దాన సంస్కారం, నిన్నటి నిజాయితీ, గారడి, మాష్టారి విజయం, సారే జహాసే..., సత్యమేవ జయతే, హారతి పళ్లెం, విజయభవ, పా(పా)ల వ్యాపారం, భస్మాసురహస్తం వంటి కథలలో సామాజిక చైతన్యాన్ని రచయిత వెలువరించారు.

ఆధార గ్రంథాలు :

1) అయ్యకోనేరు గట్టు కథలు - జయంతి ప్రకాశశర్మ

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పింగళి – కాటూరి 'అజ్ఞాన కృతము' కరుణశ్రీ 'పుష్ప విలాపం' : ప్రకృతితత్త్వం

– నలసాని రాం ప్రసాద్, రీసెర్చ్ స్కాలర్, తెలుగుశాఖ, యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

'సంవాదిన్యో మేధావినా బుద్ధయ:" అని సంస్కృతంలో ఒక మాట ఉంది. కొంతమంది మేధావుల ఆలోచనలు ఒకేలా ఉంటాయని దాని భావం. మన తెలుగు కవుల్లో కూడా చాలా మంది కొన్ని పద్యాల్ని, కొన్ని కావ్యాల్ని ఒకరినొకరు అనుసరించుకున్నట్లు రాసినవి కనపడుతుంటాయి. భావకవిత్వంలో ఇలాంటి అనుసరణలు లేదా ఒకరికి తెలియకుండా మరొకటి రాస్తున్నవారిలా కనిపిస్తాయి. నేనీ వ్యాసంలో 1918-21 మధ్యకాలంలో రాసిన కరుణశ్రీ గారి 'పుష్పవిలాపం,', 1921 ప్రాంతంలో పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావుగార్లు రాసిన 'అజ్ఞానకృతము' ఖండకావ్యాల్లో కనిపించే ప్రకృతి తత్వాన్ని విశ్లేషించాలనుకుంటున్నాను.

పింగళి-కాటూరి 'అజ్ఞానకృతము' :

అజ్ఞాన కృతమనే ఈ ఖండిక కృష్ణా పత్రికలో 1927 ఆగష్టులో ప్రచురితమైంది. ఇది పింగళి లక్ష్మీ కాంతం, కాటూరి వేంకటేశ్వరరావు గార్లు జంటగా రాసిన 'తొలకరి' ఖండకావ్య సంపుటిలోనిది. దీనిని కాటూరి వేంకటేశ్వర రావు గారు రాసిన ఉంటారని పింగళి వేంకట కృష్ణారావు గారు (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యసమాలోచనం. పుట:385) దీనికి ఒక ఉపపత్తిని చూపించారు. "అలెగ్జాండర్ డ్యూయస్' రచించిన 'బ్లాక్ టులివ్' అనే ఆంగ్ల నవలను కాటూరి వేంకటేశ్వరరావు గారు నల్లకలువ పేరుతో 1965 సంవత్సరంలో అనువదించారు. ఇందులో కోర్నిలియస్ పుష్ప ప్రేమికుడు. అతడు పెంచిన కలువ పూవును ఈర్ష్యతో గ్రెఫస్ అనేవాడు ధ్వంసం చేస్తాడు.ఆ సందర్భంలో కాటూరి వేంకటేశ్వరరావు గారు కోర్నీలియస్ చేత జాలి గొలుపు పూలపాటను పాడించారు. దీనిని బట్టి మొదటి నుండి వీరికి పుష్పాలంటే ఒక సుకుమారమైన భావన ఉన్నదేమో వినిపిస్తుంది. భావంలో భాషలో ఈ ఖండికలో కాటూరి వారి పోకడలే కనిపిస్తున్నాయి" అని అజ్ఞానకృతమనే ఖండికను కాటూరి వేంకటేశ్వరరావు గారే రాసి ఉంటారని తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. "జంట పువ్వులలో ఒక పువ్వును తెంపిన పుత్రుని మందలిస్తున్న తల్లి భావాలను వివరించే ఖండిక" అని గొల్లపూడి ప్రకాశరావు (భారతీయ సాహిత్య నిర్మాతలు పింగళి-కాటూరి,1999:27) తెలియజేశారు. పూల మొక్కలకు కూడా మనిషిలాగే ప్రాణముంటుంది. ప్రకృతిని కవులు అంత ఇష్టపడటానికి కారణం ప్రకృతిలోని కదలికను కవి హృదయంతో చూడగలుగుతాడు. అందుకనే ప్రకృతిని అంతగా ఇష్టపడతాడు కవి. వీటిని ఆకాశాన్ని, భూమిని, వాయువుని, అగ్నిని, నీటిని వీటినే పంచభూతాలంటారు. ఈ పంచభూతాలు అన్ని కలిస్తేనే ప్రకృతి. మనిషి పంచభూతాల నిర్మాణం. మనిషిలో అగ్ని అంటే వేడి ఉంటుంది. ఊపిరి అంటే మనిషిలో వాయువు ఉంటుంది. శరీరం ఒక పదార్థ నిర్మాణం. దానిలో మట్టి ఉంటుంది. ఇలా మానవ దేహం పంచభూతాత్మకం. అందుకే మనిషికి, ప్రకృతికి విడదీయరాని బంధం ఉంటుంది. భావ కవిత్వం లో కవులు విస్తృతంగా వర్ణించడం జరుగుతుంది. అజ్ఞాన కృతము ఖండికలో మానవునిలాగే ప్రాణమున్న చెట్లను నరకడం, పువ్వులను కోయడం, కొమ్మలను నరకడం మొదలైన పనులన్నీ అజ్ఞానంతో చేసే పనులు అని చెప్పడమే ఈ అజ్ఞాన కృతము ఖండికలోని ముఖ్యమైన సందేశం.

తన తోటలోని చెట్లకు రెండు పూలు పూస్తాయి. ఆ రెండింటిలో ఒకదాన్ని ఒక బాలుడు తుంచుతాడు. ఆ

దృశ్యాన్ని చూసిన తల్లి ఆ పువ్వుని విడదీసి నందుకు మరొక పువ్వు ఆ చెట్టు ఎలా బాధపడతామో కవులు ఇలా వర్ణిస్తారు. ఆ రెండు పువ్వులు ఒకే మంచంపై ఎంతో సంతోషంగా పడుకొని ఉండగా వాటి నుండి ఒకదాన్ని విడదీయడానికి నీకు చేతులెట్లా వచ్చాయి. అంతేకాదు తనకెంతో ఇష్టమైన బిడ్డను త్రుంచడం వలన ఆ తల్లి తీగ ఎంత దుఃఖిస్తుంది కదా అంటూ...

"కనులు మొగిడ్చి కూర్కు తన గాదిలిబిడ్డను నీవు త్రుంచిపో
యినగని తల్లితీవ నిలువెల్ల జలింపగ నెట్లు విహ్వలించనొ కనుగొంటివే? కడుపు చుమ్మలుచుట్టగ బాష్పబిందువుల్
కనుగొనలందు నిండి తొలకన్ గనువారల గుండె నీరుగన్"

(తొలకరి, అజ్ఞాన కృతము పుట:31)

అని వర్ణిస్తారు. పువ్వు తల్లి అయిన చెట్టు బాధను కడుపు లుంగలులుంగలు చుట్టిన బాధతో కన్నీళ్ళు కారుస్తూ గుండె నీరు అవుతుంది అంటారు కవి. సహజంగా పూలమొక్కలపై రాత్రి కురిసిన మంచు ఉంటుంది. మనం, ఆకు గానీ, పువ్వు కోసినప్పుడు గానీ గట్టిగా తెలుపడం వలన ఆ మొక్క మీద ఉన్న మంచు నీళ్ళు కిందపడతాయి. అలా నీళ్ళు కిందపడటాన్ని గుండెనీరై కన్నీళ్ళు కాలుస్తుందనడంలో అద్భుతమైన భావుకత కనిపిస్తుంది. "అందుకనే ప్రకృతిని మాతృ మూర్తిగా, దేవతగా భావకవులు గ్రహించడం జరుగుతుందని" (ఆంధ్రునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు: ప్రయోగాలు,1989:403) భావ కవిత్వ లక్షణాల గురించి పేర్కొన్నారు.

అంతేకాదు, అక్కా చెల్లెళ్లలా జంటగా కలకాలం పెరిగే ఆ జంటలోని ఒక పువ్వుని త్రుంచేసిన తరువాత ఆ మిగిలిన పువ్వు ప్రొద్దున్నే లేచి తన ప్రియమైన చెల్లెలు కనిపించకపోవడం వలన బాధపడునో కదా అంటూ అలా ఆ జంటను విడగొట్టడం అది ఎంతటి విషాదానికి కారణం అవుతుందో అని భయం వేస్తుందని తల్లి తన కొడుకుని మందలిస్తున్నట్లు ఈ విధంగా వర్ణిస్తారు.

"కటకట! నిద్ర లేచి తన గాదిలిచెల్లెలు గానరామి మి
క్కటమగు నార్తిజెంది, నవకమ్ములు మాయగ దొంటిమేని ము
చ్చటలకు బాసి యెంతటి విషాదము జెందునొ జంటపూవు? నీ
కటికతనమ్ముగన్నగొడుకా ! భయమయ్యెండు నేమిసేతురా"

(తొలకరి, అజ్ఞాన కృతము పుట:31)

అంతేకాదు ఆ అక్కాచెల్లెళ్ళు ఒకరినొకరు కానరాక ఎలా బాధపడుతుందో

"నిన్నటి సంజ జెల్లి జననీ ! యవి కోసియొసంగు మన్న, నీ
క్రొన్నన లెల్లి విచ్చినను గోసియొసంగెద నంటి, శయ్యపై
కన్నులు విచ్చి జాలకముక్రంతల నీ దురవస్థ చూసి, యా
చిన్నది యెంత పోరిడునొ? చెంపల నశ్రులు జాలువాఱగన్ "

(తొలకరి, అజ్ఞాన కృతము పుట:32)

అంతేకాదు నీ అజ్ఞానం వలన ఆ పువ్వును కోసేశావు. నిన్న ఒక తుమ్మెద ఆ పువ్వుల చుట్టూ తిరుగుతూ వాటిని ఎవరూ ముట్టుకోకూడదని కొన్ని మంత్రాలు వేసింది. దాని ప్రభావం నీపై ఉంటుందమో అని తల్లి భయాన్ని వ్యక్తం చేసింది. తన కుమారుడు చేసిన పనికి ఎంతో బాధ పడింది. అది తెలియక చేసిన పని అని ఆ తల్లి పదేపదే ఆ పూలమొక్కకు వివరించింది. ఆ పూల మొక్కల్ని, పూవుల్ని రాత్రంతా తన చల్లని ప్రేమ అనే రసాన్ని వాటి మీద చల్లుతూ రాత్రంతా కాపాడింది. మరలా రాత్రి వచ్చి ఒక పువ్వు కనిపించకపోవడం వలన ఆ చందమామ ఎంతగా బాధపడుతుందో అని ఆ ప్రకృతిలో ఒకదానితో

ఒకటి ఎలా సంబంధాల్ని కలిగి ఉంటాయో ఊహిస్తున్నారు కవి. ఆ భావనను ఒక అందమైన పద్యంలో వర్ణిస్తూ ...

"చల్లని ప్రేమరసము బై
జల్లుచు రేయెల్ల సాకె చంద్రుడు వీనిన్
బిల్లడ! మాపటికిన్ జిం
తిల్లుచుదనపూవు గనమి దెసల బరచుగా"

(తొలకరి, అజ్ఞాన కృతము పుట:32)

అని వర్ణించారు. తన కుమారుడు చేసిన పనిని కాదనలేను, కానీ తన బిడ్డను తాను మరలా ఎలాగో తెచ్చి ఇవ్వలేకపోయిన తన బిడ్డను మాత్రం మీ బిడ్డగా భావించమంటుంది. అంతేకాదు భవిష్యత్తులో మొక్కలను, పువ్వులను ఎవరూ నాశనం చేయకుండా కలకాలం మేలు జరగాలని కోరుకుంటున్నాననీ దీవిస్తుంది.

ఈ ఖండికలో పువ్వును కోసిన మొక్కలను కొట్టేసినా ప్రకృతితో వాటికున్న అనుబంధాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అవి కూడా మనుషుల్లాగే తమ చుట్టూ ఉండే గాలి, నీరు, భూమి, సూర్యుడు, చంద్రుడు మొదలైన వాటితో అనుబంధాన్ని కలిగి ఉంటాయని గుర్తుంచాలని అంటారు కవులు. భావకవులు ప్రకృతితో గల తాదాత్మ్యాన్ని ఎంతగానో అనుభూతి చెందుతారు. ఆ ప్రభావం ఈ అజ్ఞాన కృతము ఖండికలో స్పష్టంగా కనిపిస్తుంది. తెలుగు సాహిత్యంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారిని భావ కవితా ఉద్యమానికి ఒక నాయకుడిగా చెప్తారు. ఆయన రాసిన కృష్ణపక్షంలో ప్రకృతి తాదాత్మ్యంతో అనేక కవితలు రాశారు. ఒకసారి ఆయన బెజవాడ నుంచి బళ్లారికి రైళ్లో వెళ్లుతుండగా చుట్టూ ఉన్న పొలాల సౌందర్యానికి రైలు పడుతున్న వరకు పరవశించి 'ఆకులో ఆకునై' అనే ఖండికను రాశారు. (దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణపక్షం, 2021:1)

"ఆకులో ఆకునై పువ్వులో పూవునై
కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై
ఈ యడవి దాగిపోనా
ఎట్తైన నిచటనే యాగిపోనా" ఇక్కడ అడవి అనగానే ఒక ప్రకృతి సౌందర్యం, క్షేత్రం అనిపిస్తుంది.

"గల గాలని వీచు చిరుగాలిలో కెరటమై
జల జలని పారు సెలపాటలో తేటనై
ఈ యడవి దాగిపోనా
ఎట్తైన నిచటనే యాగిపోనా"ప్రకృతిలో గాలి,నీరు వాటి వలన కలిగే ఆనందాన్ని ఇక్కడ ప్రత్యేకంగా వర్ణిస్తున్నారు కవి.

"పగడాల చిగురాకు తెరచాటు తేటినై
పరువంపు విరిచేడె చిన్నారి సిగ్గునై
ఈ యడవి దాగిపోనా
ఎట్తైన నిచటనే యాగిపోనా" ఇక్కడ పగడాల చిగురాకు మొక్కలోని చిగురాకులో కనిపించే అందం లేదా సౌందర్యం అక్కడే తిరిగే తుమ్మెదలు అప్పుడప్పుడు విరిసే మొగ్గలు వాటిని మానవీకరించినట్లుగా అవి తనను పిలుస్తున్నట్లుగా,అని తనతో మాట్లాడుతున్నట్లుగా వర్ణించిన దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు ప్రకృతి తాదాత్మ్యం అపూర్వమైంది.

"ఆకలా దాహమా చింతలా వంతులా
ఈ కరణి వెర్రినై యేకతమ తిరుగాడు
ఈ యడవి దాగిపోనా
ఎట్తైన నిచటనే యాగిపోనా" (దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణపక్షం, 2021:1) అని ఇక్కడ ప్రకృతితో తాదాత్మ్యం చెందిన వ్యక్తికి ఆకలి, దాహం, నిద్ర మొదలైనవి ఉండవనడంలో భావకవి ప్రకృతి వర్ణనలతో ఆ సౌందర్యానికి పతాక చిహ్నం. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు ప్రకృతినంతా ఎంతో తాదాత్మ్యంతో అనుభవించి, అనుభూతి చెందుతూ పులకరించాడని ఈ కవిత్వంలో అని చెప్పవచ్చు. ప్రకృతే తానై మాట్లాడాడు. పింగళి, కాటూరి కవులు మాత్రం ఆ ప్రకృతితో సంభాషించడం ఆ ప్రకృతికే తన బిడ్డను అంకితం చేయడం వంటి వర్ణనలు కృష్ణశాస్త్రిగారితో పోటి పడటం అనిపిస్తుంది. కృష్ణశాస్త్రి

గారు 'కృష్ణపక్షం'లో ప్రకృతి తాదాత్మ్యంతో కూడిన కవితలు ఎన్నింటినో వర్ణించారు. ఈ ప్రకృతిని ఎందుకు ప్రేమిస్తున్నావు, ఈ ప్రకృతి మనల్ని ఎందుకు ప్రేమిస్తుందనే ప్రశ్నలు ఒకదానికి మరొక ప్రశ్నగా మిగులుతాయి తప్ప అదే సమాధానంగా చెప్పలేము. దీన్ని 'ఏల ప్రేమింతును' అనే ఖండికలో కృష్ణశాస్త్రి గారు పువ్వుల పరిమళాన్ని ఎందుకు ఇస్తాయి, చందమామ వెన్నెలను ఎందుకు ఇస్తుంది, నదులు ఎందుకు ప్రవహిస్తాయి, ఈ చల్లగాలి ఎందుకు వీస్తుంది అంటే ఏమి చెప్పగలం. అలాగే నిన్నె నిన్ను ఎందుకు ప్రేమిస్తున్నావని నేను ఎందుకు చెప్పగలనని చెప్పడం ప్రేమించడం తన సహజ గుణంగా చెప్పిన మాటల్లో గొప్ప తాత్విక సత్యం ఉంది. ప్రకృతి మనిషికి కావాల్సింది నావి ఎందుకు ఇస్తుంది, ప్రకృతిని మనిషి ఎందుకు ప్రేమిస్తున్నాడు. అవి ఒకదానికి ఒకటి ముడిపడిన సహజ బంధాలు అని ఈ కింది పద్యాంలో ఇలా చెప్తారు కృష్ణశాస్త్రి గారు.

"సౌరభము లేల చిమ్ము పుష్పవ్రజంబు?
చంద్రికల నేల వెదజల్లు చందమామ?
ఏల సలిలంబు పారు? గాడ్పేల విసరు?
ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను? "
"మావిగున్న కొమ్మను మధుమాసవేళ
పల్లవము మెక్కి కోయిల పాడు టేల
పరుల తనియించుటకొ? తన బాగు కొరకొ?
గాన మొనరింపక బ్రతుకు గడవ బోకొ?"

(దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణపక్షం,2021, పుట,14)

ఇటువంటిదే కరుణశ్రీ గారి పుష్ప విలాపం కూడా అని ఈ ఖండిలకలను చూస్తే అర్థమవుతుంది.

కరుణశ్రీ 'పుష్పవిలాపం' :

కరుణశ్రీ పూర్తి పేరు జంధ్యాల పాపయ్య శాస్త్రి. ఆయన రాసిన ఈ పుష్ప విలాపం. కరుణరస భరిత మైనది. ఒక భక్తుడు పూజ కోసం పూలు కోయాలని, పూలతోటకు వెళ్తాడు. పూలు కోసేటప్పుడు ఆ పువ్వుల ఆవేదన అతని మనస్సులో ఎలాంటి భావ ప్రకంపన కలిగించిందో ఒక సంభాషణగా వర్ణించిన తీరు ఎంతోమందిని ఆకట్టుకుంటుంది.

"నే నొక పూలమొక్క కడ నిల్చి చివాలున కొమ్మవంచి గో
రానెడు నంతలోన విరు లన్నియు జాలిగ నోళ్ళు విప్పి "మా
ప్రాణము తీతువా" యనుచు బావురు మన్నవిబీ క్రుంగిపోతి నా

మానసమం దెదో తళుకు మన్నది పుష్పవిలాప కావ్యమై (కరుణశ్రీ 'పుష్పవిలాపం') అని ఆ పుష్ప విలాప సందర్భాన్ని వర్ణిస్తారు కవి కరుణశ్రీ. ఆ పువ్వులు కోసే అతనితో ఇలా అంటాయి. ఓం భక్తుడా నువ్వు మోక్షం అనే ధనం కోసం మిమ్మల్ని మా తల్లి ఒడిలోని ఆడుకుంటున్న మమ్మల్ని తెంపి బుట్టలో పెట్టి అమ్ముకుంటావు. హృదయమే లేని నీకు పూజలెందుకు అని ప్రశ్నిస్తుంది. ఇక్కడ ప్రకృతినే దైవంగాను, దైవాన్ని ప్రకృతిగాను అనే ఒక తాదాత్మ్య భావం ఇందులో కనిపిస్తుంది. ఈ పద్యంలో ఇలా ఉంది.

"తల్లి యొడిలోన తలిరాకు తల్ప మందు
ఆడుకొను మమ్ములను బుట్టలందు చిదిమి
అమ్ముకొందువె మోక్ష విత్తమ్ము కొరకు!
హృదయమే లేని నీ పూజ లెందుకోయి?
జడమతుల మేముబీ జ్ఞానవంతుడవు నీవుబీ
బుద్ధి యున్నదిబీ భావ సమృద్ధి గలదుబీ
బండబారె నటోయి నీ గుండెకాయ!
శివునకై పూయదే నాల్గు చిన్ని పూలు?

(కరుణశ్రీ 'పుష్పవిలాపం')

పింగళి కాటూరి కవులు కూడా ఈ పద్యంలోని భావం లాగే పువ్వులు తల్లితో ఆడుకుంటున్నట్లు వర్ణించారు. ఓ భక్తుడా నిన్ను జ్ఞాన వంతుడు అంటారు. మమ్మల్ని జడవంతులంటారు. మరి నీకు బుద్ధి ఉన్నది, మాట్లాడ గలిగే శక్తి ఉన్నది, అటువంటి నీకు హృదయం బండబారిపోయిందా అని అనడం కవి వర్ణిస్తారు. గారిని

గౌరవించి ఆ గాలి ద్వారా మేము పరిమళాల్ని వెద జల్లుతాం. తుమ్మెదలకు మనుషులకు విందు చేస్తాం. అటువంటి మమ్మల్ని తల్లి బిడ్డలను వేరు చేస్తూ ఉంటారు. అది స్వార్థ బుద్ధి కాదా అని ప్రశ్నిస్తాయి.

ఆయువు గల్గు నాల్గు గడియల్ కని పెంచిన తీవతల్లి జా
తీయత దిద్ది తీర్తు ముబీ తదీయ కరమ్ములలోన స్వేచ్ఛమై
నూయల లూగుచున్ మురియుచుందుముబీ ఆయువు దీరినంతనే
హాయిగ కన్ను మూసెదము ఆయమ చల్లని కాలి వ్రేళ్ళపై

(కరుణశ్రీ, పుష్పవిలాపం)

పింగళి కాటూరి కవులు కూడా ఒక పువ్వును తుంచడం వలన కలిసి ఆడుకుంటున్న అక్క చెల్లెళ్ల, తల్లి బిడ్డలా ఉన్న వాళ్ళని విడగొట్టడాన్ని ఒక విషాదం గానే అభివర్ణించారు కవులు. అలా ప్రకృతిలో ఉన్నటువంటి పువ్వుల్ని కోసినప్పుడు కేవలం రెండవ పువ్వు, తల్లి ఆ ప్రకృతి విలాపాన్ని పింగళి కాటూరి కవులు పలికించగలిగారు. దాన్ని ఒక అజ్ఞాన మైన చర్యగా అభివర్ణించి ఆ ఖండికలు అజ్ఞాన కృతమనే పేరును పెట్టారు. కరుణశ్రీ పువ్వులను కోయడం అడవాళ్ళు పువ్వులను దారాలతో గొంతులను గూర్చి ఉరి బిగించి గుండెలో నుంచి పువ్వుల్ని గుచ్చి తలలో పెట్టుకుంటారు. అటువంటి దయలేని ఆడవాళ్ళు కూడా నిందిస్తారు కరుణశ్రీ. అనలు ఆ నరజాతికే నీతి, జాలి లేదని వ్యాఖ్యానిస్తారు.

మా వెలలేని ముగ్ధ సుకుమార సుగంధ మరంద మాధురీ
జీవిత మెల్ల మీకయి త్యజించి కృశించి నశించిపోయెబీ మా
యౌవన మెల్ల కొల్లగొని ఆ పయి చీపురుతోడ చిమ్మి మ
మ్మావల పారబోతురు గదా! నరజాతికి నీతి యున్నదా!
బుద్ధ దేవుని భూమిలో పుట్టినావు
సహజ మగు ప్రేమ నీలోన చచ్చెనేమి?
అందమును హత్య చేసే హంతకుండ!
మైలపడిపోయె నోయి! నీ మనుజ జన్మ,
పూజ లేకున్న బాబు నీ పున్నె మాయె!
కోయ బోకుము మా పేద కుత్తుకలను
అకట! చేసేత మమ్ముల హత్య చేసి
బాపుకొన బోవు ఆ మహా భాగ్య మేమి?

(కరుణశ్రీ, పుష్పవిలాపం)

కరుణశ్రీ గారి పద్యాలు పువ్వుల వలె మెత్తగా మకరందం జాలువిరునట్లుగా హృదయాన్ని తాకుతూ ఉంటాయి. పువ్వుల్ని కోయడం మాత్రమే కాకుండా ఆ పువ్వుల్ని మరలా ఎలా పడేస్తారో చెప్పారు. దానికి బుద్ధి దేవుడు పుట్టిన, అహింసను వారసులైన శాంతి భూమిలో పుట్టినవారు కూడా పువ్వుల్ని కోస్తున్నారని ఎంతో ఉదాత్తంగా వర్ణిస్తారు. కరుణశ్రీ పద్యాలు మాధుర్య గుణంతో సుకుమార శైలిలో వినగానే అర్థమయ్యేటట్లుగా వర్ణించారు.

భావకవులొకరినొకరిపై వారి ప్రభావం పడుతుంది. కృష్ణశాస్త్రి, కాటూరి వేంకటేశ్వరరావు, పింగళి లక్ష్మీకాంతం గారు ఎంతో స్నేహంగా ఉండేవారు. వివిధ శుభ కార్యక్రమాలేవైనా జరిగితే ఒకరింటికి మరొకరు వస్తూ పోతుండేవారు. పింగళి లక్ష్మీకాంతంగారి కుమారుడి వివాహానికి దేవులపల్లి కృష్ణశాస్త్రి, కాటూరి వేంకటేశ్వరరావు గార్లు హాజరయ్యారు. ఆ దృశ్యాన్ని పింగళి సూర్య సుందరం తన 'పింగళి లక్ష్మీకాంతం' అనే గ్రంథంలో (పుట: 69)లో ప్రచురించారు. దీన్ని బట్టి ఒకరికొకరికి ఎంత దగ్గరగా ఉండేవారో దీన్ని బట్టి కూడా అర్థమవుతుంది. వీరి భావాలు కూడా ఒకరివి మరొకరిపై పడే అవకాశం కూడా ఉందని దీన్ని బట్టి కూడా ఊహించ వచ్చు. అయితే ఆ ప్రభావం ఎంత ఉన్నప్పటికి పింగళి,

కాటూరి కవులపై పడిన ప్రభావం గురించి ప్రముఖ విమర్శకులు కడియాల రామ మోహన రాయ్ వ్యాఖ్యా నిస్తూ ''భావ కవులు రాసే దంతా ప్రేయసి గురించి మాత్రమే కాదని భావ కవిత్వంలో ఒక నూతన ఒరవడిని సృష్టిస్తారని'' అని (తెలుగు కవిత వికాసం,1982 పుట: 69) అన్నారు.

పింగళి కాటూరి కవుల పద్యాల్లో నిగూఢమైన భావుకత ఉంటుంది. గొప్ప ధ్వని ఉంటుంది. మాధుర్య గుణం ఉన్నప్పటికి కరుణశ్రీ గారి పద్యాలలోని పదలాలిత్యం కనిపిస్తుంది. కానీ ప్రకృతితత్వం ఔచిత్యవంతగా ప్రతిఫలి స్తుంది. భావ కవులు సుకుమార మైన ప్రకృతిని ప్రేమి స్తారు. మనుషుల్ని ఇంకెంత ప్రేమిస్తారో ఆలోచించు కోవలసిందే, అందుకే. ప్రేమకు స్వేచ్ఛ ప్రాణం, స్వేచ్ఛ సుఖ సంతోషాల్ని నిర్వాజత అందిస్తుంది. అంటే ఒకరు మనకు ఇచ్చిన దానికి వెలకట్టడం గానీ, లేదా మనకు ఇచ్చిన వారికి పరోపకారం చెయ్యాలని అనుకోకుండా ఇవ్వడమే లక్ష్యంగా ఉండేదాన్ని నిర్వాజత అంటారు. నిజానికి ప్రకృతి మానవునికి ఇచ్చిన త్యాగాన్నే నిర్వాసిత అంటారు. అంటే ఒకరు మనకు సహాయం చేశారు కాబట్టి, మనం కూడా వారికి సహాయం చెయాలనుకోవడం స్వార్థం పరస్పర సహకారం అవుతుంది. అలా కాకుండా వాళ్ళు అడక్కుండానే మనం సహాయం చేయడం, మరలా వారి నుంచి సహాయాన్ని ఆశించకపోవడం నిర్వాజత. ఈ గుణం ప్రకృతిలో ఉంది. కాబట్టి ప్రకృతియే మనిషి కంటే గొప్పది. ప్రకృతితత్వ రహస్యం ఇదేనని భావించ వచ్చు. ప్రముఖకవి, విమర్శకుడు సుమనశ్రీ ''కవితా సామాగ్రి పుష్కలంగా ఉన్న'తొలకరి'' అనే వ్యాసం (రసజ్ఞ శిల్పి -ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శతజయంతి సంచిక, పుట: 24)లో చెప్పిన మాటలతో దీన్ని ముగిస్తాను. ''ప్రకృతి దృశ్యాల్ని వర్ణించుటలోను, నాటకీయంగా దృశ్యాల్ని మన కళ్ళముందు రూపుకట్టించడంలోను ఈ జంటకవులు (పింగళి-కాటూరి) సిద్ధహస్తులు.''

ఆధార గ్రంథాలు :

1. కరుణశ్రీ రచనలు 'పుష్పవిలాపం,'ఉదయశ్రీ' (ప్రథమ భాగం, 24వముద్రణ), అక్టోబర్, రామాపబ్లిషర్స్, గుంటూరు, 1954.
2. పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు, 'తొలకరి' (పద్య ఖండకావ్య సంపుటి), బందరు కృష్ణా స్వదేశి, ముద్రాక్షరశాల ప్రథమ ముద్రణ, 1923.
3. పింగళి వేంకట కృష్ణారావు, 'పింగళి లక్ష్మీకాంతంగారి కావ్య సమాలోచనము' నిర్మలా ఆఫ్ సెట్ ప్రింటర్స్, విజయవాడ,2013.
4. దేవులపల్లి కృష్ణశాస్త్రి 'కృష్ణపక్షం' నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2021,
5. పింగళి సూర్యసుందరం, 'పింగళి లక్ష్మీకాంతం' (ప్రథమ, ముద్రణ) సి.పి.బ్రౌన్ అకాడమి హైదరాబాద్, 2010.
6. సి.నారాయణరెడ్డి, 'ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు' ముద్రిత పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, ప్రథమ ముద్రణ,1989
7. గొల్లపూడి ప్రకాశరావు, 'భారతీయ సాహిత్య నిర్మాతలు పింగళి-కాటూరి' భారతీయ సాహిత్య అకాడమి న్యూఢిల్లీ, 1999.
8. కడియాల రామ మోహన రాయ్, 'తెలుగు కవితా వికాసం' ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్,1982.
9. సుమనశ్రీ, కవితాసామాగ్రి పుష్కలంగా ఉన్న తొలకరి (వ్యాసం), రసజ్ఞ శిల్పి (సంపాదకులు) : పోణంగి శ్రీరామ అప్పారావు, నండూరి రామకృష్ణమాచార్య, పింగళి సూర్య సుందరం. ప్రచురణ: డా.పి.శ్రీనివాస్, విశాఖపట్టణం.1994.

★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సాహిత్య ప్రస్థానం కథల్లో – మద్యంపై పోరాడిన స్త్రీ పాత్రలు

– పి. సాయిలక్ష్మి, పరిశోధక విద్యార్థి, తెలుగు భాష & అనువాద అధ్యయన శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

మద్యం వలన కుటుంబాలు గుల్లవుతున్నాయి. వాటి వలన ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. వాటికి పరిష్కారం కోసమ సాహిత్య ప్రస్థానంలో అనేక మంది వ్యాసాలు వ్రాస్తున్నారు. అందులో 2007 నుండి 2018 వరకు మద్యంపై వచ్చిన కథలుపైన విశ్లేషణ చేయడం జరిగింది. అందులో భాగంగా కొన్ని కథలు మీ దృష్టికి తీసుకొస్తున్నాము.

మమ్మల్ని బతకనివ్వండి :

రంగి, రాజిగాడు భార్య భర్తలు. రాజుగాడు మద్యానికి బానిస. ఇద్దరు చేసే పని ఒక్కడే చేస్తాడు. అయినా వచ్చిన డబ్బులు మొత్తం తాగి ఇంటికి వస్తాడు. కానీ భార్య పట్ల ఎంతో ప్రేమ ఎంత అరిచి గీ పెట్టినా ఎన్నడూ చెయ్యెత్తి రంగిని ఒక్క దెబ్బ కూడా కొట్టింది లేదు. మానేస్తాను లేవే అంటూ చెప్పి మంచంపై పడుకుంటాడు. మానేస్త మానేస్తా అని అంటావు కానీ, రోజు తాగేసి వస్తావు. ఈరోజు ఏదో ఒకటి తేలిపోవాలి అంటూ మళ్లీ రాజుగాడిని పనికి వెళ్ళనీయకుండా అడ్డం పడుతుంది. రాజుగాడు ప్రమాణం చేసి మానేస్తానంటూ వెళ్ళిపోతాడు. సాయంత్రం తాగకుండా ఇంటికి వచ్చిన భర్తను చూసి మాట నిలబెట్టుకున్నందుకు సంబరపడిపోతుంది. ఇంతలో ఎలక్షన్లు వస్తాయి. రాయుడు గారు పిలిచి పనిలోకి రమ్మన్నాడు. అందరిని పనిలో పెట్టాలంట. జీతం రూ.500 ఎక్కువ ఇస్తానన్నాడు. రోజు బత్తాఇస్తాడు. భోజనం పెడతాడు. జీతం మొత్తం నీకే ఇస్తాను, అప్పు తీర్చేద్దాం అంటాడు. మందు కూడా ఇస్తాడు కదా వద్దంటుంది. రాజుగాడు పిల్లల మీద ప్రమాణం చేస్తున్నా ఈనెల వదిలేయ్ నిజంగానే మానేస్తాను అంటూ రంగీని ఒప్పిస్తాడు. ఒకరోజు పేటలోని వారంతా పరుగులు తీస్తున్నారు. కల్తీ సారా తాగి మనోళ్లంతా ఆసుపత్రిలో ఉన్నారు, రాజు గాడు కూడా ఉన్నాడంటూ అంటూ వెళ్ళిపోతారు. రంగి అక్కడికి చేరుకునేసరికి రాజుగాడు చనిపోయాడనే వార్త ఎదురొస్తుంది. అందరూ ఏడుస్తున్నా రంగి కంట్లో చుక్క నీరు రాలేదు. తెలివిలేని దానిలా పిచ్చి చూపులు చూస్తుంది. రాయుడు గారు డబ్బులు ఇస్తే కల్తీ సారా తాగి సచ్చారని రాముడు గారు కేసు కొట్టేయించుకుంటాడు. ఎలక్షన్ కోసం పేటను జెండాలతో ముస్తాబు చేస్తున్నారు. ఇంకా విషాద చాయాలున్నాయి. పేట ఇష్టంలేని పెళ్లి కూతురిలా ఉంది. సభ మొదలైంది. అందులో నాయకుడు మాట్లాడుతున్నాడు. మన పార్టీ అధికారంలోకి వస్తే పింఛన్ల పెంచుతాం, 10 పైసలకే వడ్డీ ఇస్తాం, పని కల్పిస్తాం, రేషన్ సరుకులు, అన్నీ అందరికీ అందేలా చేస్తాను అంటూ హామీలు గుప్పిస్తున్న, సమయంలో సభ మధ్యలోకి దూసుకొచ్చిన రంగి, ఇవన్నీ ఎవరు అడిగారా మిమ్మల్ని. మేము కష్టం చేసుకొని బతకగలం. ఉంటే తింటాం, లేదంటే పస్తుంటాం. సారా ఎత్తేయండిరా.. మా బతుకులు మమ్మల్ని బతకనివ్వండి అంటూ తిడుతుంటే సభ నుండి రంగిని పక్కకు ఈడ్చేస్తారు. తన చేతితో ముఖం దాచుకుని రంగీ తన భారమంతా దిగిపోయేదాకా ఏడుస్తుంది.

రాజకీయ నాయకులు ఎన్నికల్లో తాము గెలవడానికి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. ఈ మద్యం కూడా కల్తీ చేయడంతో ఒక్కోసారి ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజలు ఎక్కువ శాతం మద్యాన్ని తీసేయాలని ఉద్యమిస్తున్న ప్రభుత్వం మద్యాన్ని నిషేధించడం లేదు. మద్యాన్ని ప్రభుత్వం ఆదాయ వనరులుగా చూస్తున్నంత కాలం ప్రజలు మద్యానికి బానిసై జోగుతుండడం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని ఈ కథ తెలుపుతున్నది.

నాన్నకు ప్రాణంతో :

ఈ కథలో శిశిర ప్రధాన పాత్రధారి. శిశిర తల్లిదండ్రు

లకు ఇద్దరు కూతుళ్లు. అందులో పెద్దది శిశిర. ఎప్పుడు చదువులో ముందుండే పిల్ల. ఇంటర్ పరీక్షలో లెక్కల్లో తప్పిందనే కారణంతో ఆత్మహత్య చేసుకుంటుంది. కానీ తండ్రికి మాత్రమే ప్రేమతో లేఖ రాస్తుంది. దాని సారాంశం ఏమిటంటే తండ్రి మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడం, తల్లికి ఎప్పుడు కన్నీళ్లు కలిగించడం, తండ్రి అనారోగ్యం పాలయితే తల్లి రక్తం అమ్ముకొని మందులు, ఆసుపత్రి ఫీజులు కట్టిన విషయం తెలిసి కూడా, ఆమెను బాధపెట్టడం, మళ్ళీ మూడు రోజులు స్నేహితులతో కలిసి మద్యం తాగుతూ అదే విషయం మాట్లాడడం, ఇవన్నీ తనని కలచి వేశాయని అందుకే ఇంటర్ పరీక్షల్లో కావాలనే లెక్కల పరీక్ష సరిగ్గా రాయలేదని, పరీక్ష తప్పినందుకే చని పోయానని,అందరినీ నమ్మించ వచ్చని ఆత్మహత్య చేసుకున్నాను అని తెలుపుతుంది. అంతేకాక నా చావుకు నీ తాగుడు కారణమని మా అమ్మకు తెలినియ్యకండి బాధపడుతుందని. నా చావుతోనైనా మీరు తాగడం మానేస్తే ఆనందిస్తానని అప్పటికీ మానకపోతే నా పెళ్లి ఖర్చు తగ్గించానని ముగిస్తుంది. ఈ లెటర్‌ను చూసిన తండ్రి మద్యం మానేసి స్వచ్ఛంద సంస్థలో పనిచేసి మద్యానికి వ్యతిరేకంగా పని చేస్తాడు. అతని కృషికి వారు కేంద్ర కమిటీలో అతన్ని నన్మానించాలని అను కుంటుంది. రాష్ట్ర కమిటీలో కూడా చోటు కల్పిస్తుంది. తనలా ఎవ్వరు బిడ్డలను పోగొట్టు కోకూడదని, తన కూతురు వల్లనే తాను మారానని ప్రపంచానికి తెలియ జేసి, కూతుర్ని బతికించుకుంటాడు. ఈ కథలో మద్యం వల్ల కన్న కూతురి ప్రాణం పోగొట్టుకోవడం కనిపిస్తుంది.

ఇనుప తెరల మధ్య :

ఎల్లవ్వ ప్రధాన పాత్రదారి. క్రింది తరగతికి చెందిన స్త్రీ. ఈమెకు చిన్నతనంలోనే చనిపోవడంతో మేనమామ చేరదీసి పెంచుతాడు. మేనమామ కొడుకు చిన్ననాటి నుండి బాధ్యతలు మరిచిపోయి తిరుగుతుంటాడు. ఎల్లవ్వ బాధ్యతగా పనిచేసుకుంటుంది. మేనమామ వయసైపోయిన సందర్భంగా ఎల్లవ్వకు తన కొడుకు బాధ్యత తీసుకుంటే ప్రశాంతంగా కన్నుమూస్తానని వేడుకుంటాడు. మేనమామ రుణం తీర్చుకొందామని మౌనంగా పెళ్లికి ఒప్పుకుంటుంది. పెళ్లైనా బాధ్యత లేకుండా తాగుడుకు బానిసై భార్యను వేదిస్తాడు. భార్య సంపాదించిన డబ్బులు దొంగలించడంతో ఆవేశంతో భర్తను చంపేస్తుంది. దీనికి గాను ఆమెకు శిక్షపడుతుంది. శిక్ష పూర్తి చేసుకొచ్చిన ఎల్లవ్వ పనిదొరక్క పోవడంతో అడుక్కొని కాలం గడుపుతుంది. ఈ విధంగా మధ్యంకు ఎల్లవ్వ జీవితం నాశనం అవుతుంది.

లిక్కరు మంటలు :

ఇందులో పకీరమ్మ, సత్యమ్మలు ప్రధాన పాత్ర ధారులు. ఫకీరమ్మకు ఒక కొడుకు అహ్మద్. కూతురు ముంతాజ్. వీరిది నర్కన్‌తో జీవనం సాగిస్తున్న కుటుంబం. ఆమె భర్త మద్యం షాప్‌లో ఉద్యోగం. తాగి గొడవ చేసే వారి నుండి యజమానిని కాపాడుకునే ఉద్యోగంలో చేరతాడు. ఈ ఉద్యోగం మానేసి కులవృత్తి చేసుకుని గౌరవంగా బతుకుదాం అంటూ ఎంతగా బ్రతిమలాడినా వినిపించుకోడు. మద్యం షాపు యజమాని ప్రతిరోజు తాపించి, జీతం డబ్బులు పట్టుకొని ఇస్తాడు. చివరకి పకీర భర్త కల్తీ సారాతో చనిపోతాడు. కిక్కు కోసం ఏదో మాత్రలు కలుపుకుని తాగడం వల్ల చనిపోయాడని పోస్ట్‌మాస్టం రిపోర్ట్‌లో వస్తుంది.

ఇక సత్యమ్మ భర్త రోజూ తాగొచ్చి చితకబాదుతుంటే, అది భరించలేక గ్యాస్ నూనె పోసుకొని నిప్పంటించు కుంటుంది. చనిపోయేముందు ఈ లిక్కర్‌ను తగలబెట్టక అన్యాయంగా నేను చనిపోతున్నానే అనే బాధతో చని పోతుంది.

పకీరమ్మ భర్త చావుకు, సత్యమ్మ చావుకు కారణమైన లిక్కరు షాపును గాంధీ జయంతి రోజున మద్యం షాపును తగలబెట్టి తమ నిరసనను తెలుపుతారు పకీర, ఆమె బిడ్డలు.

పై కథలో మద్యాన్ని నియంత్రిస్తాం, నిర్మూలిస్తాం అని చెప్పి ఓట్లు దండుకునే నాయకులు మద్యం ద్వారానే ప్రభుత్వాన్ని నడుపుకోవడానికి వీధివీధికి మద్యం షాపులకు అనుమతులిచ్చి ఆ మద్యానికి భర్తలు బలైపోతే కుటుంబ భారం, పిల్లల చదువులు, ఆరోగ్యం లాంటి కనీస అవసరాలు తీర్చలేక, లిక్కర్ పెట్టిన మంటలకు బలైపోవడాన్ని తెలియజేస్తాయి.

బ్లాక్ హోల్ :

ఈ కథలు ఎల్లవ్వ, కొమరయ్య ప్రధాన పాత్రధారులు. ఎల్లమ్మకు చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోవడంతో మేనమామ దగ్గర పెరుగుతుంది. మేనమామ కొడుకు కొమరయ్య. ఇతను బాధ్యత లేకుండా కొమరయ్యను మల్లయ్యతో తిరుగుతూ ఉంటాడు. ఎల్లవ్వ బాధ్యతగా అన్ని పనులు చేసుకుంటూ ఉంటుంది. దీంతో ఎల్లవ్వ మేనమామ వీడికి ముడిపెడితే ఏదోలాగా కొమరయ్య బతికిపోతాడని ఆలోచించి, అదే విషయం చెప్పి ఎల్లవ్వను ఒప్పించి పెళ్లి చేస్తాడు. మేనమామ చని పోతాడు. ఊర్లో ఏ పనీ దొరక్కపోవడంతో పట్నం పోదాం అంటుంది. అందుకు కొమరయ్య ఒప్పుకోడు. చేసేదిలేక ఎల్లవ్వ ఉదయం అన్ని పనులు పూర్తి చేసుకొని కరీంనగర్‌కు పోయి పని సంపాదించుకుంటుంది. మెల్లగా ప్లంబర్ దగ్గర పనికి కుదిరి అన్ని పనులు నేర్చుకుంటుంది. కొలాయిలే కాక సెప్టిక్ ట్యాంక్ పైపులు బిగించడం కూడా నేర్చుకుంటుంది. ఈ విధంగా ప్రతిరోజు ఉదయం పోయి రాత్రి ఇంటికి చేరుకునేది. అయితే ఏ పనిచేయని కొమరయ్య తాగుడే పనిగా పెట్టుకొంటాడు. పెళ్ళాన్ని సాదించి, హింసించి డబ్బు గుంజుకు పోయేవాడు. కొన్నాళ్ళకు ఎలక్షన్ రావడంతో ఒక రోజు మీటింగ్‌కు పోతాడు. వాళ్లు బాగా తగ్గించి సారా ప్యాకెట్లతో ఇంటికి వస్తాడు. ఎల్లమ్మ పని చేసిన డబ్బులు ఇంటికి తెస్తుంది. ఆ రాత్రి డబ్బులున్న సంగతి పసిగట్టి ఎల్లవ్వతో గొడవ పడతాడు. డబ్బులు తీసుకొని రోడ్డుమీదకు పరి గెత్తుతుంది. వెనుకనే పోయి రోడ్డులోనే డబ్బులు లాక్కెళ్ళి పోతాడు. దీంతో ఎల్లవ్వ ఇంటికి రాకుండా కరీంనగర్‌లోనే రూము అద్దెకు తీసుకొని ఉంటుంది. ఇక్కడ పస్తులు లేదు, తాగుబోతు మొగుడితో హింస లేదు. సుఖంగా సంతోషంగా ఉంది. ఎల్లవ్వ లేకపోవడంతో కొమరయ్య తిండికి, తాగుడుకు డబ్బులు లేక ఆమెను వెతుక్కుంటూ పట్నానికి చేరుకుంటాడు. తాను దాచుకున్న డబ్బులు అడిగి గుంజుకుంటున్నాడు. ఎల్లవ్వకు కోపం కట్టలు తెంచుకుంది. మొగుడ్ని చావగొట్టింది. అతను చని పోవడంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోతుంది. శిక్షను అనుభవించిన తర్వాత సొంతూరికి చేరుకుంటుంది. కొమరయ్య ఇల్లు అమ్మేసి ఉండటంతో ఊర్లో తిరుగుతూ అడుక్కుంటూ, ఊరి జనాలతో మాటలు పడుతుంది. చివరకు చావే శరణ్యమనుకుని అడుక్కోవడం మానేసి చనిపోతుంది.

ఈ కథలో మద్యం ఎల్లవ్వ, కొమరయ్య జీవితాలను ఎంతలా నాశనం చేసిందో.. చివరికి వారి ప్రాణాలు ఎలా బలితీసుకుందో తెలియజేస్తుంది. ఇది సామాజిక, సాంఘిక కోణంలో ఉంది.

బొగ్గుల బట్టి :

కిందిస్థాయి కుటుంబంలోని యువతి కమల. కమల తండ్రి తాగుబోతు. మరొక మహిళతో వివాహేతర సంబంధం నడుపుతాడు. అతని సంపాదన తాగుడుకు పోయి చిన్నింటికి ఇచ్చి మిగిలింది కుటుంబానికి ఇచ్చేవాడు. అది సరిపోకపోవడంతో కుటుంబ భారం మొత్తం కమల తల్లి మీద పడుతుంది. దీంతో ఆమె అనారోగ్యం పాలవుతుంది. తండ్రితో కలిసి అడవికి వెళ్లి బొగ్గులు కాల్చడానికి వెళ్తుంది. ఆ రాత్రి కూతుర్ని అడవిలో వదిలేసి తాగి చిన్నింటికి వెళ్లి పొద్దున కు వస్తాడు కమల బిక్కుబిక్కుమంటూ రాత్రంతా గడుపుతుంది. చెరొక మూట బొగ్గులు తీసుకుని వస్తారు. అవి అమ్మి ఒక మూట డబ్బులు మరియు రెండవ మూట సగం డబ్బులు తీసుకొని చేతికి ఇస్తాడు. ఈ డబ్బులతో సరుకులు కొనుక్కుని ఇంటికెళ్లి వంట చేసి కమల, ఆమె తల్లి

తింటారు. రెండురోజులు ఎక్కడికి వెళ్లాపు కనిపించలేదు అన్న కమల స్నేహితురాలికి తన కుటుంబంలోని సమస్యలు చెప్పుకొని బాధపడుతుంది.

సాహిత్య ప్రస్థానం కథల్లో - మద్యంపై పోరాడిన స్త్రీపాత్రలు :

సాహిత్యం ప్రస్థానం 2000సం॥లో ప్రారంభ మైంది. 2003 సం॥ నుండి మాసపత్రికగా రూపు దిద్దుకుంది. అనాటి నుండి అణగారిన మరియు స్త్రీ పక్షాన రాస్తున్న రచనల్ని ప్రోత్సహిస్తూ ఆ సమస్యల్ని చర్చకు పెట్టింది. స్త్రీల సమస్య మరియు సాంఘిక సమస్యలతో ప్రధాన కారణంగా మద్యం మహమ్మారిని చెప్పుకోవచ్చు. హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, రోడ్డు ప్రమా దాలు, అకాల మరణాలు, ఇలా ఒక్కో కథలో చిన్న కోణాలు మనకు ఈ కథల్లో కనిపిస్తాయి. ఇందులో స్త్రీల సమస్యలు ఈ సమస్యల్ని పరిష్కరించుకోవడానికి, వాటిని ఎదుర్కోవ డానికి ఎంతో కృషి చేయడం అవసరమైతే తమ ప్రాణా లను పణంగా పెట్టైనా సరే తమ వారిని మద్య పాన వ్యసనం నుండి బయటకు పడేయడానికి పడిన తపన మనకు కనిపిస్తాయి. మద్యం ద్వారా వచ్చే ఆదాయంతో ఇచ్చే (సంస్కరణలు) పావలా వడ్డీ, రూపాలలో బియ్యం ఎవరిమన్నారు. మద్యాన్ని తీసే యండంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన తెగువ కలిగిన స్త్రీలు మనకు కనిపిస్తారు. ఈ కథలలో అంశాలు పరిశీలన చేయాలని కోరు తున్నాము.

ఈ కథలోని స్త్రీలు అన్ని వర్గాలకు అన్ని వయస్సుకు చెందిన వారుగా కనిపిస్తారు. ఒక్కో వర్గం మహిళలపై హింసలో కూడా ఒక్కోరకంగా వ్యక్తం కావడం కనిపిస్తుంది. లిక్కరు మంటల కథలో పకీరమ్మ, సత్యమ్మలు మద్యం పెట్టిన మంట వేరువేరుగా వుంది. పకీరమ్మ భర్త మద్యం షాపులో పనిచేస్తూ ఉండటం జీతం బదులు యజమాని రోజు తాగించి పంపడంలో ఒక్కరూపాయి ఇంట్లో ఇవ్వక పోగా ప్రాణాలు కోల్పోతాడు. పనిచేసే చోట యజమాని తాగించడం వల్లే చనిపోయినా నష్టపరిహారం ఇవ్వకపోగా, ఏదో కిక్కు కోసం మాత్రలు కలుపుకొని తాగి చని పోయాడనే తప్పుడు రిపోర్ట్ కారణంగా న్యాకం కూడా జరగదు. ఈ విధంగా పకీరమ్మ ఆర్థికంగాను, భర్తను, న్యాయాన్ని కోల్పోయిన మహిళగా కనిపిస్తుంది.

మరో పాత్ర దారి సత్యమ్మ భర్త రోజు తాగొచ్చి చిత్ర హింసలు పెడుతుంటే తట్టుకోలేక ఆవేశంతో ప్రాణాల్నే కోల్పోతుంది.

నాన్నకు ప్రాణంతో కథలో శిశిర ఇంటర్ చదువు కొంటున్న విద్యార్థిని. కుటుంబంలో తండ్రి తగుడుకు బానిసై తల్లిని హింసించడం చూడలేక తండ్రిని ఎలాగైనా మద్యం మాన్పించాలని ఆలోచించి మద్యంవల్లే చని పోతున్నానని, ఎవరికి ఈ విషయం చెప్పొద్దని వీలైతే మద్యం మానేయమని కోరుకుంటుంది. ఆమె చావుతో కన్నతండ్రి కళ్లు తెరిపించి మద్యం మాన్పించేస్తుంది.

బొగ్గులబట్టి :

బొగ్గుల బట్టి కథలో కమల తండ్రి మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకుండా, చిన్నిల్లు ఏర్పాటు చేసుకొంటే, కుటుంబం అరం మొత్తం తల్లిమీద పడుతుంది. అంతేకాక అనారోగ్యం పాలౌ తుంది. ఆ బాధ్యతనుపంచుకొనే పాత్రగా కమల ఇందులో కని పిస్తుంది.

బ్లాక్‌హౌస్ కథలో ఎల్లవ్వ భర్త కొమరయ్య తాగుడుకు అలవాటు పడి చెడుతిరుగుళ్లు తిరగటం దానికి తోడు ఆమె సంపాదించిన డబ్బులు, ఆమెను శారీరంగా హింసించేవాడు. ఎల్లవ్వ ఈ హింసనుండి బయటపడ డానికి శతవిధాల ప్రయత్నిస్తుంది. అతనికి దూరంగా పట్నంలోనే ఇల్లు అద్దెకు తీసుకొంటే అడ్రస్ కనుక్కొని వచ్చి ఆమెను హింసిస్తాడు. వీటిని తట్టుకోలేని ఎల్లవ్వ భర్తను చంపి శిక్ష అనుభవిస్తుంది. సర్వం కోల్పోయి అడుక్కొని తినడం ప్రారంభిస్తుంది. అది నచ్చక తినకుండా ప్రాణాలు వదిలేసే ఆత్మాభిమానం కలిగినా వ్యక్తిగా కనిపిస్తుంది.

మమ్మల్ని బ్రతకనివ్వండి కథలో రంగి భర్త రాజుగాడు త్రాగుబోతు. తాగొచ్చిన ప్రతిసారీ రంగీ తాగుడు మానేయ మని నోరేసుకొని అరుస్తుంది. ఎంత అరచీ గీ పెట్టిన భార్యని చెయ్యెత్తి ఒక దెబ్బ కొట్టడు. మానేస్తాలేవే అంటాడు. భార్య పై అంతప్రేమ. ఎలక్షన్స్ వచ్చాయి. రాజుగారు పనిస్తానన్నాడు. జీతం ఎక్కువిస్తాడు. ఈనెల వదిలేయ్ పూర్తిగా మద్యం మానేస్తానని వెళ్లి రాజుగారిచ్చిన కల్తీ సారా తాగి చనిపోతాడు. మరికొంతమంది అస్వస్థతకు గురౌతాడు. భర్త చావుకు కారణమైన రాజకీయ నాయకులు ఎవరిమన్నారు, రా మిమ్మల్ని పావలా వడ్డీ, రూపాయికి బియ్యం. సారా ఎత్తేయండి మమ్మల్ని బ్రతకనివ్వండి అంటూ వారిని కడిగి పారేసే తెగువ చూపిస్తుంది. మద్యం వలన కుటుంబాలు జీవన పరిస్థితి దిగజారి పోయింది. ప్రభుత్వాలు ఆలోచించి సరైన నిర్ణయం చేయాల్సి వుంది. సంపూర్ణ మద్యం నిషేదించాలి. త్రాగుడుకు అలవాటు అయిన కుటుంబాలు డి-అడిక్షన్ -కేంద్రాలు ఏర్పాటుచేసి వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలి. త్రాగుడుకు గురైనా కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి. దశలవారీగా మద్యం నిషేదించా లని కోరుతున్నాము.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ద్రావిడ భాషల్లో భారతాలు

– డా॥. వి. వళని, సహాయాచార్యులు, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

"ఏయది హృద్య మపూర్వం
బేయది? యెద్దాని వినిన యెఱుక సమగ్రం
బైయుందు? నఘనిబర్హ్మణ
యేయది? యక్కథయ వినగ నిష్టము మాకున్"
(ఆది.. 1-30)

శౌనకాది మహామునులు సూతుని కోరిన కోర్కె ఆ కోర్కెకు తగిన విధంగా సూతుడు.

"అతఁడింతటిది మహాభా
రతంబయను నిశ్చయము దిరంబుగ మతి సం
గతి మగుడు నమ్మహాత్ముల
కతి విశదముగాఁగ నిమ్మహాకథ చెప్పెన్!"
(స్వర్గ 1-78)

అందుకే, మహాభారతం భారతీయ సమాజపు సహజ విజ్ఞాన సర్వస్వం. ద్రావిడ సాహిత్యాల్లో పరిపూర్ణమైన భారతాన్ని రచించిన ఘనత తెలుగువారికే దక్కుతున్నది. తమిళంలో సంగం కాలంనాటి పెరుందేవనార్ భారతం లభించలేదు. అది వ్యాసభారతాన్ని పూర్తిగా అనువదించిందో లేదో తెలియడంలేదు. భారతవెణ్బా, విల్లి భారతాలు కూడా సంస్కృత భారతాన్ని పరిపూర్ణంగా అందించడం లేదు. పైగా తమిళంలో ఆదరణ తక్కువ ఉండడంవల్ల భారత రచనపై ఎక్కువ మంది కవులు మక్కువ చూపలేదు. కాని, తమిళ భారతాలు చాలా మటుకు స్వతంత్ర రీతిలో నడిచినట్లు కన్పిస్తున్నాయి. తమిళులు మూల విధేయతను ప్రకటించలేదు. ఏ కవియైనా తన సమాజంలోని ప్రజలకు నచ్చే విధంగా కావ్యాన్ని తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తాడు. కాని ఈ స్వభావం తమిళకవుల్లో మరింత పెచ్చుగా కన్పిస్తున్నది.

కన్నడ కవులు తొలి రోజుల్లో మూలకథను నామ మాత్రంగానే స్వీకరించారు. పంప, రన్నల జైన మతాభిమానంవల్ల మూలకథకు విరుద్ధమైన కల్పనలు, పాత్రల స్వభావాలు అనేకం వీరి కావ్యాల్లో చోటుచేసుకొన్నాయి. కుమార వ్యాసుడు కూడా భారతాన్ని 'తెలియ హేళువె కృష్ణకథెయను' అనడంవల్ల ఆ కావ్యాన్ని భాగవతదృష్టితో చూడాల్సిన అవసరం ఏర్పడింది. అందులోను అది పది పర్వాల కథకు మాత్రమే పరిమితమైంది కూడా.

మలయాళంలో కణ్ణశ్శకవులు, చెరుశ్శేరి, ఎళుత్తచ్చన్‌లో ఎవ్వరూ పది పర్వాల కథను మించినవారు కాదు. ఎళుత్తచ్చన్ కూడా భక్తి ఉద్యమ కవి కావడంవల్ల 'శ్యామళ, కోమళ గాత్రు'డైన నారాయణుని కథగానే భారత రచనను చేశాడు.

తుళు భాషలో ఈ మధ్య కాలంలో లభించిన కర్ణపర్వ, అరుణాబ్జ రచించిన 'మహాభారతా' కూడా సంపూర్ణ భారతం కాదు. ఇది కూడా పది పర్వాలకే పరిమితమైన కావ్యం. అరుణాబ్జ భక్తి ఉద్యమకాలకవి కావడంవల్ల ఆ కావ్యాన్ని కూడా భాగవత దృష్టితోనే చూడవలసి ఉన్నది. అరుణాబ్జ కీర్తించిన ప్రాచీన కావ్యాలు అలభ్యాలు కావడంవల్ల వాటిని గురించిన చర్చకు తావులేదు.

మొత్తంమీద ద్రావిడ భారతాల్లో ఎక్కువమంది కవులు ధర్మజుని పట్టాభిషేకంతోనే భారత రచనను ముగించడం కన్పిస్తుంది. అందుకు కారణాల్ని అన్వేషిస్తే, భారతీయ సంప్రదాయంలో కావ్యం శుభాంతంగా ఉండాలన్న నియమం ఒకటైతే, రెండవది కృష్ణుని ప్రాధాన్యత కూడా అంతవరకే ఉండడం. ఈ కారణంవల్ల భక్తకవులెవ్వరూ కృష్ణుని ప్రస్తావన పెద్దగాలేని చివరి పర్వాల జోలికి పోలేదు. ఇంకా, కన్నడ కవులైన పంప, రన్నల కవితాలక్ష్యం భారత రచన కాదు. వారి ఉద్దేశంలో భారతం కేవల లౌకిక కావ్యం. తమ పోషకుల ఆనందం కొరకు

వారు భారత కథను స్పృశించినవారే కాని కథపట్ల ప్రీతితో స్వీకరించినవారు కాదనిపిస్తుంది.

అయితే కన్నడంలో కుమారవ్యాసులు, మలయాళంలో చెరుశ్శేరి, ఎళుత్తచ్చన్‌లు, తమిళంలో విల్లి భక్తకవులై ఉండి కూడా పోతనవలె భాగవత రచనకు పూనుకొనకుండా భారత కథను స్వీకరించడంలో కూడా ఒక పరమార్థం గోచరిస్తున్నది. భాగవతం పురాణకథ, కథాసూత్ర సంబంధం లేనిది. దశమస్కంధంలో తప్ప మరెక్కడా కృష్ణగాథ కన్పించదు. ఇతర అవతార వర్ణనలున్నా అవి పాయసంలో ద్రాక్షపండ్లే. అయితే భారతం కథాసూత్ర సంబంధంగల చిక్కని కథ. ఉపాఖ్యానాలను వర్ణిస్తే అది పాఠకులను ఉత్కంఠకు గురిచేసే సామర్థ్యంతో సాగుతుంది. విల్లి వంటి చాలామంది ఉపాఖ్యానాలను విడిచిపెట్టారు కూడా. అందులోనూ కర్రలోపల నిప్పులాగా కృష్ణుడు కొనసాగుతూ, ఆయనే సూత్రధారియై నడిపించిన కథకూడా. కాబట్టి భక్తకవులు అవకాశమున్న ప్రతిచోట కృష్ణుని మనసారా కీర్తించి ఆనందించారు.

తెలుగు కవిత్రయ భారతం ద్రావిడ భాషల్లోని భారతాలన్నింటిలోనూ భిన్నమైంది. విశిష్టమైంది. మూల కథలోని సూత్రం తెగకుండా, తెలుగువారి స్థానికతకు, ఆత్మీయతకు భంగం కలగకుండా సాగడంలో దానికదే సాటి. పైగా మూలభారతంలోని ఏ చిన్ని ఉపాఖ్యాన కథను లేదా ఉపాఖ్యానాల పరమార్థాన్ని విడవకుండా వెలువడిన భారతం తెలుగులో తప్ప మరే ద్రావిడ భాషలోనూ లేదని చెప్పడం అతిశయోక్తి కాదు.

తెలుగులో ఈ విషయంలో మరింత విస్తృత పరిశోధన జరగవలసివుంది. ఇందువల్ల ద్రావిడ సంస్కృతీ సంబంధమైన విశేషాలతో పాటు, ఎన్నో కొత్త సంగతులు, భాషా రహస్యాలు కూడా వెలుగు చూసే వీలున్నది. ముఖ్యంగా తమిళ భారతాలపై దృష్టిని పెడితే చరిత్ర తెలుస్తుంది. పోతన భాగవతాన్ని బెంగళూరులోని ఎం.ఎస్.రామయ్య ట్రస్టు వారు కన్నడంలోకి అనువదిస్తున్నారు. నన్నయ భారతాన్ని కూడా ప్రత్యేక శ్రద్ధతో కన్నడంలోకి తెచ్చే ప్రయత్నం చేయాలి. ఇందుకు కర్ణాటక ప్రభుత్వంవారు ఆర్థిక సాయం అందించాలి. ఇటువంటి ప్రయత్నం తెలుగులోనూ జరగాల్సి వుంది. ముందుగా ద్రావిడ భాషా కావ్యాల లిప్యంతరీకరణమైనా జరిగితే కొంతలో కొంత ప్రయోజన ముండవచ్చు. ప్రభుత్వం వారు యిందుకు పూనుకొంటే ద్రావిడ కావ్యాల్లోని సౌందర్యాన్ని అందరం ఆస్వాదించే వీలు కల్గుతుందని మనవి చేయగలను.

తుళు భారతం :

ద్రావిడ భాషల్లో సాహిత్య చరిత్రగల మరొక భాష తుళు. గత 20, 25 సంవత్సరాల ముందు వరకు 14వ శతాబ్దం ఉత్తరార్ధం వాడైన అరుణాబ్జ రచించిన 'మహా భారతొ' అన్న గ్రంథం ప్రాచీనమైన తుళు గ్రంథంగా ఉండేది. అయితే 1980-85ల మధ్య డా॥ వెంకట్రాజ పునిచ్చితాయ అనే పండితుడు తుళు భాషలో వెలువడిన మరొక గ్రంథాన్ని కనుగొన్నాడు. దాని పేరు 'కర్ణపర్వ'. కర్త హరియప్ప సాక్షాత్తు విజయనగర పాలకుడైన రెండవ హరిహరరాయలే (1379-1104)నని గుర్తించారు. అయితే, దురదృష్టవశాత్తు ఈ గ్రంథం పూర్తిగా లభించలేదు. ఈ కావ్యం అంశ షట్పది, మల్లికమాల, తరళ, దీర్ఘతోటక ఛందోవృత్తాల్లో ఉన్నది. ఈ కావ్యం తుళు మహాభారతం కంటే ముందుదని పండితులు విశ్వసిస్తున్నారు.

తుళు భారత కర్తయైన అరుణాబ్జపై కుమారవ్యాసుని ప్రభావం ఉన్నది. కుమార వ్యాస భారతంవల్ల ప్రేరేపితుడైన అరుణాబ్జ తుళు భాషలో మహాభారత రచనకు పూనుకొన్నట్లు తెలుస్తున్నది. కుమార వ్యాసుడిలాగే అరుణాబ్జ కూడా పదిపర్వాలను మాత్రమే రాశాడు.

అయితే అరుణాబ్జ తన గ్రంథంలో గుడ్డెదరాయ విరచితమైన రుక్మిణీ స్వయంవర, కీచకవధె, బాణాసుర వధె అనే మూడు గ్రంథాల్ని కూడా ప్రస్తావించాడు. కాని అవి అలభ్యాలు. అరుణాబ్జ అభిప్రాయం ప్రకారం ఇవి తుళు గ్రంథాలే కాని, ఏ లిపిలో ఉన్నాయో, ఆ కవి కాలమేదో స్పష్టంగా పేర్కొనలేదు.

ఆధార గ్రంథాలు :

1. తమిళ వాఙ్మయ చరిత్రము, ము. వరదరాజన్, అనువాదం- తిమ్మావజుల కోదండరామయ్య, సాహిత్య అకాడమి, ఢిల్లీ.
2. కన్నడ సాహిత్య చరిత్ర, ఆర్వీయన్. సుందరం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు.
3. దక్షిణ భారత సాహిత్యములు, చల్లా రాధాకృష్ణశర్మ. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు.
4. తెలుగు కన్నడ భారతముల తులనాత్మక పరిశీలనము (తిక్కన, కుమార వ్యాసుల విరాటోద్యోగ పర్వములు) డా॥ బి.వి.ఎస్. మూర్తి, (తి.తి.దే. వారి ఆర్థికసహాయం)
5. తమిళాంధ్ర భారతముల తులనాత్మక పరిశీలనము, శ్రీ వి.ఎస్. రాఘవన్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి. హైదరాబాదు.
6. మలయాళ వాఙ్మయ చరిత్రము, పి.కే. పరమేశ్వరన్ నాయర్, (డా॥ దివాకర్ల వేంకటావధాని). సాహిత్య అకాడమీ, ఢిల్లీ.
7. పంపకవి-తిక్కన, శ్రీ గడియారం రామకృష్ణశర్మ.
8. తిక్కన భారతం - మలయాళ భారతం, డా॥ ఎన్. భక్తవత్సలరెడ్డి, తిక్కన తిరునాళ్ళ 716వ వర్ధంతి సప్తాహ సంచిక, నెల్లూరు.
9. శ్రీమదాంధ్ర మహాభారతం, తి.తి.దే., తిరుపతి.
10. విక్రమార్జున విజయ, పంప, కన్నడ సాహిత్య పరిషత్తు, బెంగళూరు
11. గదాయుద్ధ, రన్న, కన్నడ సాహిత్య పరిషత్తు, బెంగళూరు.
12. గదుగిన భారత - ఒందు సాహిత్య అధ్యయన, జవరేగౌడ, కర్ణాటక విశ్వవిద్యాలయం, ధారవాడ.
13. మహాభారత కిళిప్పాట్టు, ఎళుత్తచ్చన్.
14. మహాభారతము - సాహిత్య అకాడమి, ఢిల్లీ.
15. ఆంధ్రసాహిత్య చరిత్ర, పింగళి లక్ష్మీకాంతం, హైదరాబాదు
16. తిక్కన, కుమార వ్యాస భారతముల తులనాత్మక పరిశీలన, జగన్నాథాచార్, అనంతపురం.
17. భారత కథా మంజరి - కుమారవ్యాస.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య పరిచయం

- ఆర్. గోపాల్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైద్రాబాద్.

సంప్రదాయాన్ని గౌరవించి ఆదరించి, ఆచరించిన వారు. తాను ఆదరించి, ఆచరించిన సంప్రదాయాన్నే తన రచనల ద్వారా తన తర్వాత తరానికి వారధిగా అందించిన మహానుభావుడు బ్రహ్మశ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు. ఈ కవిపుంగవుడు అష్టభాషా ప్రవీణుడు (ఆంధ్ర, ఆంగ్ల, ఉర్దూ, హిందీ, కన్నడ, తమిళ మరాఠీ). మహా మహోపాధ్యాయ, బ్రాహ్మీభూషణ, ఆంధ్రబిల్హాణ, సుధీంద్రమౌళి బిరుదులు, అనేక సన్మానాలు పొందిన లక్ష్మణశాస్త్రి 1911నాడు వనపర్తిలో పద్మావతి, శ్రీనివాసశాస్త్రి పుణ్యదంపతులకు జన్మించాడు. రామనాథశాస్త్రి, వేంకటకృష్ణమూర్తిశాస్త్రి ఈయన అగ్రజులు. వీరి ఇంటి పేరు కప్పగంతుల, కౌశికగోత్రం, వెలనాటి శాఖ వనపర్తి స్వస్థలం.

శాస్త్రిగారు అక్షరాభ్యాసమును అనుముల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారి దగ్గర ప్రారంభించారు. ఇతడు 1930 ప్రాంతంలో తిరుపతి శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాలలో సాహిత్య శిరోమణి పరీక్షలో ఉత్తీర్ణులై, మద్రాసు మైలాపూరు సంస్కృత కళాశాలలో అద్వైత వేదాంతం, అన్నామలై విశ్వ విద్యాలయంలో వ్యాకరణ శాస్త్రం అధ్యయనం చేశాడు. లక్ష్మణశాస్త్రి మొదట హైదరాబాదులోని వివేకవర్ధిని పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేసి ఆ తర్వాత స్వస్థలమైన వనపర్తి సంస్థాన పాఠశాలలో ప్రధాన పండితులుగా కొంతకాలం పని చేసి 1947లో వనపర్తి వదలి రెండవసారి హైదరాబాదు సిటీ కళాశాలలోను, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచారశాఖలోను చివరకు ఉన్నత విద్యాశాఖలో పని చేస్తూ ఓరియంటల్ శాఖకు ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందాడు. మహాభారత ద్రోణ పర్వం అనువాదం ముగింపు చేస్తూ ఈ జన్మబంధం విడెదనని వ్రాసుకున్న రెండు మాసాలు పూర్తి చేయకుండానే ఇతడు 10.1.1981నాడు కీర్తి శేషులైనారు.

కం॥ "వేదమయ వేంకటేశ్వరు
పాదాబ్జములందు ద్రోణపర్వమునకు శ్రీ
వేదావ్యాస కృతికి నను
వాదము నర్పించి జన్మబంధము విడెదన్"
(లక్షణశాస్త్రి, కప్పగంతుల, ద్రోణపర్వానువాదం, పుట : 732.2001)

లక్ష్మణశాస్త్రి రచనలు :

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి వనపర్తి సంస్థాన పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉన్న సమయంలో రచనా వ్యాసంగం ప్రారంభించినాడు. సాహిత్యపరిశోధకుడు, కవి, సంస్కృతాంధ్ర పండితుడు అయినా మానవల్లి రామకృష్ణకవి కోరిక మేరకు బిల్హణమహాకవి రచించిన విక్రమాంకదేవచరితమను మహాకావ్యాన్ని కప్పగంతుల లక్ష్మణశాస్త్రి ఇతని మిత్రుడు మాదిరాజు విశ్వనాథరావు ఇద్దరు జంటగా కలిసి తెనిగించారు. బిల్హణుడు ఆరవ చాళుక్యవంశ రాజైన విక్రమాంకుని (1076-1126) ఆస్థానంలో ఉంటూ తన ప్రతిభతో 18 సర్గల మహాకావ్యాన్ని రచించాడు. ఈ కావ్యాన్ని తొలుత తిరుపతి వేంకటకవులు వచనరూపంలో 18 సర్గలుగానే తెలుగు అనువాదం చేశారు. ఈ సంస్కృత విక్రమాంక దేవచరితమను కప్పగంతుల, మాదిరాజు ఏడు ఆశ్వాసాల ప్రౌఢప్రబంధంగా కుర్చినారు. ఇది చారిత్రకకావ్యం. ఈ కావ్య ముద్రణకు ముందే సుమారు 42 మంది కవి పండితుల ప్రశంస పొందినది. ఈ అనువాదకులకు తిరుపతి సంస్కృత కళాశాల ప్రాచీన విద్యార్థి సమితి ఆంధ్రబిల్హాణ బిరుదును (2-1-1944) నాడు ప్రదానం చేశారు. శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారి అధ్యక్షతన జరిగిన సభలో

శ్రీ వేంకటేశ్వరాంధ్ర సాహిత్యపరిషత్తు తిరుపతి వారు సన్మానపత్రము వీరికి ఇచ్చారు. ఈ కావ్యాన్ని ఎన్నో విశేషాలతో వీరు అనువదించారు. బిల్హణుడు రచించిన మరొక నాలుగు అంకముల కర్ణసుందరి సంస్కృతనాటికను ఈజంట కవులు తెలిగించారు.

లక్ష్మణశాస్త్రి వేదవ్యాసుడు రచించిన మహాభారతమునకు యథామూలాంధ్ర గద్యానువాదం చేశాడు. లక్ష్మణశాస్త్రి (1960-1980) సుమారు రెండు దశాబ్దాల పాటు ఆది, సభా, అరణ్య, విరట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ పర్వాలను అనువదించాడు. ఈ గ్రంధాలు ఇతని మరణానంతరం ధర్మపత్ని కప్పగంతుల అన్నపూర్ణమ్మగారి స్వంత ధనంతో, శాస్త్రిగారి కూతురు ఆచార్య కె. కమలగారి సంపాదకత్వంలో 1990 నుండి 2001 సంవత్సరాల మధ్యకాలంలో ముద్రించారు. ఇందులో అనుసరించిన విధానం లలితమధుర శైలిలో, శ్లోకాల భావాన్ని ఎన్నుకొని పేరాలుగా అనువదించాడు. సుదీర్ఘమైన వర్ణనలు, పల్లుమార్లు వచ్చిన సన్నివేశాలను శాస్త్రిగారు కుదించి, పరిహరించి చాలా చక్కగా అనువదించారు. భీష్మపర్వంలో భగవద్గీత శ్లోకాలతో సహితంగా ప్రచురించి భగవద్గీత శ్లోకాలను పారాయణం చేసుకొనుటకు సులభతరం చేశారు. శాస్త్రిగారు ఆంధ్రప్రదేశ్ మాసపత్రికకు సంపాదకునిగా ఉన్న సమయంలో ఇతను వ్రాసిన వ్యాసమహాభారత వ్యాసాలను దారావాహికంగా 1966 సెప్టెంబరు సంచిక నుండి సుమారు వందకు పైగా (100) వ్యాసాలు ప్రచురించారు.

వనపర్తి సంస్థానమును రాణి శంకరమ్మ పరిపాలించు సమయంలో 18-8-1868 నాడు సంపూర్ణ సూర్యగ్రహణం కాలంలో ఏర్పడిన వివిధ సంఘటలను శ్రీ కృష్ణ బ్రహ్మతంత్రపరకాల స్వామివారు సంస్కృతభాషలో నాలుగు సర్గల కావ్యాన్ని రచించారు.

ఈ కావ్యంలోని శ్లోకాలకు తాత్పర్యరూపంలో శాస్త్రి అనువదించాడు. దీనిని పురాతత్త్వశాఖవారు ప్రచురించారు.

శ్రీతపోవన స్వామిగారు సంస్కృతభాషలో వంద శ్లోకాలతో రచించిన శ్రీబదరీశ స్తోత్రం. ఈ రచనను శాస్త్రిగారు శ్రీ దండు పెంటయ్య శ్రేష్ఠిగారి కోరిక మేరకు ప్రతి శ్లోకానికి తెలుగులో పద్యానువదం చేసి వాటికి భావాలు వ్రాశాడు. దీన్ని దండు పెంటయ్య శ్రేష్ఠిగారి షష్ఠి పూర్తి సందర్భంగా ప్రచురించి ఇతనికి అంకితమిచ్చాడు.

వారణాసి విద్వాంసులు వాసుదేవ ద్వివేదిగారు రచించిన భారతీయ సదాచారం - వ్యవహారం అను సంస్కృత గ్రంథాన్ని శాస్త్రిగారు తెనిగించారు. ఇందులో సాహిత్య - నీతి - శాస్త్ర -పురాణ ఇతిహాస గ్రంథాల నుండి గ్రహించబడిన శ్లోకాలకు తెలుగు అనువాదం చేశారు. ఈ అనువాద గ్రంథం లక్ష్మణశాస్త్రిగారి నూట ఒకటవ (101) జయంతి సందర్భంగా లక్ష్మణరేఖలు అనే పేరుతో 2012వ సంవత్సరంలో కుటుంబసభ్యులు, సాహితీ మిత్రులు కలిసి ప్రచురించారు.

శ్రీ ఎన్. రామేశన్ గారి ఆంగ్లగ్రంథమైన గ్లింప్సెస్ ఆఫ్ బుద్ధిజమ్ (Glimpses of Buddhism) అను గ్రంథాన్ని కప్పగంతుల వారు బౌద్ధ దర్శనం అనే పేరుతో అనువదించారు. ఈ గ్రంథంలో బుద్ధుని జీవితవిశేషాలు, బౌద్ధమతస్థాపన, వ్యాప్తి మొదలైన అంశాలతో కలదు. బుద్ధుడు జన్మించి క్రీ.శ. 1956 సంవత్సరానికి 2500 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ గ్రంథ నిర్మాణం జరిగింది.

వనపర్తి సంస్థానంలో ఆస్థానకవిగా ఉన్న సమయంలో జరిగిన కవిపండితుల చర్చలను (15 వ్యాసాలు) శాస్త్రీయ విజ్ఞానం అనే పేరుతో ప్రచురించారు. పుల్లెల శ్రీరామచంద్రుడితో కలిసి శాస్త్రిగారు ఆంధ్రసంస్కృతకోశం అనే నిఘంటువుకు సంపాదకత్వం వహించారు. ఆది శంకరాచార్యులు రచించిన శివానందలహరి, సౌందర్యలహరి, భర్తృహరి సుభాషితాలు, కృష్ణలీలాశుకుడు రచించిన శ్రీ కృష్ణ కర్ణామృతం. శివభక్తుడైన పుష్పదంతుని శివమహిమ్నస్తోత్రములలోని శ్లోకాలను 'స్తోత్రలహరి' అనే

పేరుతో వెలువడిన గ్రంథానికి శాస్త్రిగారు సంపాదకత్వం వహించారు. మరియు కొంతకాలం ఆంధ్రప్రదేశ్ మాస పత్రికకు సంపాదకునిగా ఉన్నాడు. ఈ సమయంలో శాస్త్రిగారి వ్యాసాలతో పాటు ఇతర కవి పండితుల సాహిత్య వ్యాసాలని పరిష్కరించి ప్రచురించారు.

శాస్త్రిగారు వివిధ సాహిత్య మాసపత్రికలకు వ్రాసిన వ్యాసాలు అనేకం కలవు. వాటిలో అమరసాహిత్యం, వసంతసేన, అష్టభాషా బహిరీ గోపాలరాయకవి, సంస్కృత సాహిత్యం ముస్లీముల సేవ, శాంతరస విమర్శ, తెలంగాణ నాటకాలు, భద్రగిరి చరితం, మహాభారత వ్యాసాలు కలవు. అలాగే వివిధ మానపత్రికలలో వెలువడిన శాస్త్రిగారి పద్యఖండికలు కూడా కలవు అవి సంక్షేమ రాజ్యం, పంచరత్నోపహారం, నివాపాంజలి, శృంగార మంజరీ, లాలా లజపతిరాయ్ శతవార్షిక జయంతి, దీపావళి, వసంత ఋతువు మొదలైనవి కలవు.

శాస్త్రిగారి ఇతర రచనలు మణిమంజుష కథలు, ఆంధ్రవ్యాకరణ వివరణం, సంస్కృత పాఠమాల, తెలుగు లిపి సంస్కరణ, వివిధ వ్యాసాలు, పీఠికలు, పరిష్కార గ్రంథాలు కూడా ఉన్నాయి. శాస్త్రిగారు సభా ముఖంగా గొప్ప గొప్ప రాజకీయ నాయకుల ఉపన్యాసాలను అనువదించేవారు. అనర్గళ ధారతో, మేఘగంభీరకంఠంతో కూడిన బహుభాషా ప్రసంగాలు చేయుచు గొప్ప వక్తగా కీర్తి గడించారు. ఆయన సంభాషణా చతురతో, వ్యంగంగా ఉండేది. ఆయన విద్యాగురువులు, సాహితీ మిత్రులు గొప్ప గొప్పవారు కలరు. వారిలో శ్రీతులిసి కృష్ణమాచార్యులు, లక్ష్మీనరసింహశాస్త్రి, సుబ్బారావు, చక్రాల నరసింహాచార్యులు, రామచంద్ర దీక్షితులు, కరుంగళం కృష్ణశాస్త్రి, గిరిధరాచార్యులు. ప్రసిద్ధ పాత్రికేయులు తిరుమల రామచంద్రుడు, చలమచర్ల రంగాచార్యులు, శేషగిరిరావు మొదలైనవారు మిత్రులు. శాస్త్రిగారి మూడు సంవత్సరాల వయస్సులో ఉన్న సమయంలో తండ్రి శ్రీనివాసశాస్త్రి పరమపదించడంతో స్వాతంత్ర్య సమర యోధులు వనపర్తిలో ఉండు వామననాయక్ గారు పుత్రవాత్సల్యంతో ఆదరించారని విక్రమాంకదేవ చరితంలో శాస్త్రిగారు ఒక పద్యంలో చెప్పుకున్నాడు

కం॥ "వామననాయకుడు సుత
ప్రేమ బోషించి నన్ను విద్యాబుద్ధుల్
నేమముతో నేర్పెను నే
నామహితుని గృతిని దలతు నతిభక్తిమెయి"
(లక్ష్మణశాస్త్రి, కప్పగంతుల, విక్రమాంకదేవ చరితం, 1-51, పుట : 13.1974)

ఇతని సాహిత్య సేవను ప్రశంసిస్తూ కొందరు తమ రచనలలో,ఆత్మకథల్లో వ్రాసుకున్నారు వారిలో తిరిమల రామచంద్ర - హంపీ నుంచి హరప్పాదాక. డా॥ దేవులపల్లి రామానుజరావు - యాభై సంవత్సరాల జ్ఞాపకాలు. డా॥ సామల సదాశివ-యాది మొదలైన ఆత్మకథల్లో చూడవచ్చు. ఈ కవి దివంగతుడైన తరువాత ఇతని కుటుంబసభ్యులు సాహితీమిత్రులు, ప్రముఖ కవులు శాస్త్రిగారి సాహిత్యాన్ని వెలుగులోనికి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కోణంలోనే నా పరిశోధన జరుగుతుంది.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

డా॥. ఎమ్.వి.జె. భువనేశ్వరరావు 'ఈత రాని పడవలు' కథలోని సామాజిక, మానవీయ సంబంధాల పరిశీలన

– శవయ్య రొజులపాటి, పరిశోధక విద్యార్థి, ఆంధ్ర విశ్వకళా పరిషత్,విశాఖపట్నం

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లో డిప్యూటీ జనరల్ మేనేజర్ గా పనిచేస్తున్న ఎమ్.వి.జె. భువనేశ్వరరావు గారు, 'కార్టూనిస్ట్ భువన్' గా పిలుపించుకోవడాన్ని ఎంతో ఇష్టపడతారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందిన వీరు కథారచయితగా సమకాలికుల్లో ప్రత్యేకంగా గుర్తింపు పొందారు. వీరి కథా సృజనపై విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధన జరుగుతోంది. తెలుగు సాహిత్యంలో వీరి రాణింపుకు నిదర్శనమే హిందీ, మరాఠీ, ఒడిశా, కన్నడ భాషల్లోకి అనువదించబడి వెలువడిన వీరి కథాసంపుటాలు. కార్టూనిస్ట్ గా, కవిగా, కథకునిగా ప్రతిభ కనబరుస్తూనే.. తోటి రచయితలనూ, కార్టూనిస్టులనూ సత్కరించుకోవడంలోని సంతోషం తనకిష్టమని చెప్తుంటారు.

ప్రస్తుత కథా సంగ్రహం :

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న బీదవారి పట్ల సమాజానికి ఉండవలసిన కనీస మానవత్వం గురించి గుర్తు చేస్తున్న కథ 'ఈత రాని పడవలు'. మనవద్ద ఉన్న దాన్నే వారితో పంచుకోవడం మూలంగా, చేయూత అందించడం ద్వారా వారిలో స్ఫూర్తి నింపవచ్చు. ఆ పంచుకొనేది- మనకున్న జ్ఞానం కావచ్చు, ఆ చేయూత- వారు తమ కాళ్ళ మీద తాము నిలబడేందుకు పనికొచ్చేది కావచ్చు - ఏ రూపంలో ఉన్నా సరే, వారికది ఆసరా కావచ్చుననే మానవీయ కోణాన్ని స్పృశిస్తూ డా. ఎమ్.వి.జె. భువనేశ్వరరావు చెప్పిన కథాంశం ఇది.

"నా శ్రీమతికి నాకూ ఎప్పుడూ గొడవే...." అంటాడు ప్రధాన పాత్రధారి. విశ్లేషణా సౌలభ్యం కోసం పాత్రధారి పేరు లక్ష్మీపతి అనుకుందాం, ఎందుకంటే భార్య పేరు లక్ష్మి కాబట్టి, ఈయనకు కథకులు పేరేమీ సూచించలేదు కాబట్టి.

సతీపతుల మధ్య ఈ గొడవ కుటుంబ కలహం కాదు.. సమాజానికి ఏదైనా చెయ్యాలి, అవసరంలో ఉన్నవాళ్లకి వీలైనంత చేయూతనివ్వాలని చెప్పడమే కాదు, ఎవరేమనుకున్నా చేస్తూ పోయే లక్ష్మీపతి పద్ధతికి లక్ష్మి విరుద్ధం.

కూరలమ్మి చెప్పిన ధరకే ఆకుకూరలూ, కరివేపాకూ గట్రా కొనొచ్చు గదా, బేరమెందుకంటాడు లక్ష్మీపతి. కాస్త డబ్బు ఆదా చేద్దామని చూస్తుంటే మధ్య మీరెందుకు కలగజేసుకుంటారంటుంది లక్ష్మి. పార్కులో వేరుశెనగ పొట్లాలు ఒక్కోటీ పది రూపాయలకు కాక, మూడూ ఇరవై రూపాయలకు తీసుకోబోతే అడ్డుకున్న భర్తతో ఘర్షణ పడుతుంది. నలుగురికీ భర్త మంచోడు, భార్య చెడ్డది అని చెప్పడమా ఇదంతా అని రుసరుసలాడుతుంది.

ఊరెళ్ళడానికి రైల్వే స్టేషన్‌కి వెళ్తే, అక్కడొక దివ్యాంగుడు బఠాణీలు అమ్ముతుంటాడు. లక్ష్మి కోపంగా చూస్తున్నా ఊరుకోక, యాభై రూపాయల బఠాణీలు కొనేస్తాడు ధైర్యంగా. వాటిని, రైలు బండిలో తిరిగే పేద పిల్లలకీ, చేయి చాచిన వారికీ పంచేస్తాడు. చుట్టూ వున్నవారు వింతగా చూస్తున్నా ఏం పట్టించుకోడు. భర్తని లక్ష్మి పట్టించుకోనట్టే కూర్చుంటుంది.

70 యేళ్ళ వయసులో కూడా కూరలమ్మి ఇల్లిల్లూ తిరుగుతూ కూరలమ్ముకోవడం ఎంతో కష్టం. ఆమె కూడా పనిచేస్తేనే ఇల్లు గడుస్తుందేమో, పిల్లలు లేరేమో, ఉన్నా చూడ్డంలేదేమో, సరిగ్గా తిండి తింటుందో లేదో, చూడబోతే ఆరోగ్యంగానూ ఉన్నట్టు లేదు. అలాంటి ఆమె

దగ్గర ఆకుకూరలు చెప్పినదానికి సగం కంటే తగ్గించి బేరమాడడం మానవత్వం కాదు.

పార్కుకు వచ్చేవారికి కాస్త కాలక్షేపం అయ్యేందుకు వేరుశెనక్కాయలు అమ్మి కుటుంబాన్ని పోషించుకొనే అతని దగ్గర ఓ నాలుగు రూపాయలు మిగిలితే, ఆ చిన్నమొత్తం అతనికి ఏదో పెద్ద అవసరానికి సాయం అవుతుంది. కష్టపడి అమ్ముకుంటున్నాడు, తప్పుడు పని చెయ్యడం లేదు. పైగా, అతను, లక్ష్మీ-లక్ష్మీపతుల కొడుకు కిట్టూ తోటి విద్యార్థి అయిన చరణ్ వాళ్ళ నాన్న. చరణ్ కూడా స్కూల్ లేనప్పుడు తండ్రితో పాటూ బఠాణీలు అమ్ముతుంటాడు.

రైల్వే స్టేషన్ దివ్యాంగుడు ఒక్క చేత్తోనే బఠాణీలు అమ్ముకుంటూ స్వయంకృషితో బ్రతుకుతెరువు చూసుకుంటున్నాడు. వైకల్యాన్ని చూపించి బిచ్చం అడగటం లేదు. కష్టంతోనే పొట్ట నింపుకుంటున్నాడు.

రైళ్లలో బనీను గుడ్డలతో, చొక్కా గుడ్డలతో ప్రయాణీకులు తిని పడేసిన తొక్కలూ, కాగితాలూ, దుమ్ము, చెత్తా తుడుస్తూ రూపాయో రెండో ఇవ్వకపోతారా అని చెయ్యి చాచే వాళ్ళకి వీలైతే డబ్బులో, తినడానికి ఏదైనా పెట్టడమో చేస్తే అది పెద్ద సాయం కాదు, ఇచ్చిన వారికి అదో తృప్తి, పుచ్చుకున్నవారికి కడుపు కాలో నిండుతుంది.

ఇవన్నీ చెప్పినా మనసుకు ఎక్కించుకొనే తత్వం కాదు లక్ష్మిది. అర్థం చేసుకోకపోయినా, "... వందో వెయ్యో అయితే సాయం చేయగలం... అదీ ఒక్కరికో... ఇద్దరికో! ఒక్కసారికో... మలిసారికో ... వారి జీవితాలు బాగుండటాన్కి మనమేమీ చేయలేమా ... చేయకుండా అసలు ఉండలేము ..." అనుకుంటాడు, ఇదీ లక్ష్మీపతి పరిస్థితి.

ఓరోజు, ఎదురింట్లో దొంగ పడ్డాడని పెద్ద గొడవ. చూడబోతే, కిట్టూ క్లాస్ మేట్ చరణ్. ఇంకా ఏదీ ముట్టుకోలేదు, ప్రయత్నంలో ఉన్నాడంతే. ఆ వంక చూపించి, అందరికీ సర్దిచెప్పి, పోలీసులు రాకుండా చూసి, చరణ్ ని తమ యింటికి తీసుకెళతాడు లక్ష్మీపతి. ఎందుకో ఈసారి లక్ష్మి రుసరుసలాడలేదు. భర్త వైపు ఆరాధనగా, చరణ్ వైపు ప్రేమగా చూస్తుంది.

చరణ్ మాటల్లో, "మా నాన్నకి ప్రమాదం జరిగింది అంకుల్ ... గవర్నమెంటు హాస్పిటల్ లో ఉన్నాడు ... పల్లీల బండి వేయడం లేదు ... మందుల కోసం, తిండి కోసం డబ్బు అవసరమై ఇలా చేయాల్సి వచ్చింది ... నాన్న బ్రతకకపోతే ... చదువూ ఆగిపోతుంది ... కుటుంబానికి దిక్కెవరూ లేకుండా పోతారు", అని చెప్పి ఏడవసాగాడు. లక్ష్మీపతిలో గొప్ప బాధ.

లక్ష్మి ఆ కుర్రాడికి అన్నం పెడుతుంది. భార్యలోని మార్పు చూడగానే లక్ష్మీపతిలో గొప్ప ఆనందం. వెంటనే బండి మీద ముగ్గురూ హాస్పిటల్ కి బయలుదేరతారు.

"... సమాజంలో ఎందరెందరో ... ఎవరి బ్రతుకు వారిదే ... కారణాలేవైనా అందరి జీవితాలు ఒకేలా ఉండకపోవచ్చు ... బాగా బ్రతుకుతున్నవాళ్లు తప్పకుండా బ్రతకలేని వాళ్ళ కోసం ఆలోచించాలి ... సాటి మనిషికి సాయం చేయలేకపోవడం... అవకాశముండీ సహాయ మందించకపోవడం అత్యంత దారుణం ... కష్టపడి బ్రతికే వారికి ... సాయపడాలి ... జీవన స్థాయిల్లో అంతరాలు పెరిగిపోతున్న కొద్దీ ... నిరాశ, నిస్పృహలు కూడా అంతే స్థాయిలో పెరగక మానవు ... మంచివారు కూడా చెడ్డవారుగా తయారైపోయే అవకాశం ఉంది ...", కాబట్టి అలాంటి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి, వారు కూడా బ్రతగ్గలిగే దారి చూపాలి అంటాడు లక్ష్మీపతి.

దారిలో చెప్పులుకుట్టే అరవై యేళ్ళ పెద్దమనిషి, బేరం కోసం చూస్తుంటాడు. లక్ష్మి బండి ఆపించి, తన కొత్త జోళ్లని అతనిచే తుడిపించుకొంటుంది. కొత్త చెప్పులు కదా రిపేరు ఏమీ లేదంటాడు ఆ మనిషి. అయినా దుమ్ము తుడిచి ఇవ్వమంటుంది. తుడిచాక వంద రూపాయలు ఇస్తుంది. అంత చిల్లర లేదంటాడు చెప్పులుకుట్టే వ్యక్తి. ఫర్వాలేదు ఉంచండి అంటుంది

లక్ష్మి. లక్ష్మి లోని మార్పుకు లక్ష్మీపతి ఆనందంతో పొంగిపోతాడు. చరణ్ కూడా ఎంతో ధైర్యంగా, నమ్మకంగా వీళ్లవైపే చూస్తాడు, తన కుటుంబానికి ఇంకేమీ ఫర్లేదనే ధీమాగా ఉంటాడు.

మానవత్వం పరిమళాలు వెదజల్లడానికి ఆ ఇంట్లో ఆమోదం లభించిందన్నమాటే.

సామాజిక స్థితి, కథలో ప్రతిఫలించిన మానవత్వం:

సమాజంలో ఆర్థిక అసమానతలు, సామాజిక అంతరాలు వేల ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. చరిత్ర ఎరుగని కాలం నుండీ ఇప్పటిదాకా ఆ భేదం కాలానుగుణంగా రూపం మార్చుకుంటూ ఏదో రూపంలో ఉనికిలో ఉంది. కటువుగా అనిపించినా అంగీకరించ వలసిన సత్యం ఇది. నిజంగా దీనికో తరుణోపాయం ఉండుంటే కొన్ని వేల సంవత్సరాలకైనా ఈ దూరం సమసిపోయి ఉండేది. కానీ ఆ విధంగా కాలేదంటే ఇది ఒక చోట మాసిపోయినా మరోచోట బతికే ఉంటుందని అర్థం. ఇంత క్లిష్టతలోనూ ఒక ఓదార్పు ఏమంటే మంచి మనసులున్న మంచి మనుషులు కూడా ఈ సంఘంలో ఉన్నారనే సంగతి.

రంగు, రూపం, భాష, హోదా, డబ్బు, అధికారం లాంటి కొలమానాల ప్రపంచంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అంతరాలు ఉండటం కొత్తేమీ కాదు. తాము ఎక్కువ అనుకొనే వారు, తక్కువగా భావించే వారి పట్ల ఉదారంగా ఉండాలంటే, ఆ తక్కువ వారిని ఉద్ధరిస్తున్న చందంగా కాక.. వారినీ కనీన జీవన ప్రమాణాలతో జీవించేలాగున తీర్చిదిద్దాలి. ఇది ప్రభుత్వాల స్థాయిలో, స్వచ్ఛంద సంస్థల స్థాయిలో జరిగే పెద్ద పని.

అదే సమయంలో సాధారణ ప్రజలు ఏంచెయ్యాలో కూడా కథకులు లక్ష్మీపతితో చెప్పించారు, "... ఆత్మాభిమానంతో బ్రతికేందుకు వారికి మద్దతును ప్రకటించటం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించటం.. వారు సంతోషంగా బ్రతికేందుకు మన సంతోషంలో ఒక శాతాన్ని వారికి ప్రేమగా, మానవత్వపు పరిమళాలు వెదజల్లుతూ అందించటం ..." చెయ్యాలి అని.

సమాజంలో భాధ్యతగల పౌరునిగా కథలోని లక్ష్మీపతి తాను పాటించిన పద్ధతినే నలుగురికీ చెప్పాడు. ఆ మాటలనే కథకులు ఆ పాత్ర ద్వారా తన రచనలో వినిపించారు.

చేయూత అందించేవారి సహాయాన్ని అలుసుగా తీసుకొని వారిని మోసగించే వారు ఉంటారు. సహాయం చేస్తున్నాం అనే కార్యం చాటున చట్ట వ్యతిరేకంగా తమ సంపదని పక్కదారి పట్టించి ప్రభుత్వ లెక్కలకు అందకుండా చేసేవారు, అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ బెదిరింపు ధోరణిలో వ్యవహరించేవారూ ఉంటారు. అందుకే, సహాయం అందించేవారినీ, సాయం పొందుతున్నవారినీ - ఇద్దరినీ శిక్షించే వ్యవస్థలు సక్రమంగా పనిచెయ్యాలి.

సమాజంలో ఇలా జరుగుతుంది కదా అని, నిజంగా అవసరంలో ఉన్నవారి పట్ల ఉదాసీనంగా ఉండటం మాత్రం హర్షణీయం కాదు. ఆ విషయంలో కడు జాగ్రత్తగా ఉండాలి.

చట్టం చేయూత, ప్రభుత్వ బాసట :

ఒక్క మాటలో చెప్పుకుందాం, శాసన-కార్యనిర్వాహక-న్యాయ వ్యవస్థలు పేదరిక నిర్మూలనకు కలిసి కట్టుగా పనిచేస్తే దేశం నుంచి ఈ అంతరాల్ని చాలా తక్కువ సమయంలోనే తొలగిపోయేలా చెయ్యగలం. సంక్షేమ పథకాలు అమలుచేస్తూనే, ప్రజల్ని అన్నిటా భాగస్వాముల్ని చేస్తే.. ప్రభుత్వ గొంతుకగా ప్రజలే నిలిస్తే సామాజిక, ఆర్థిక అసమానతలు చెప్పుకోదగినంతగా తగ్గిపోతాయి.

సంక్షేమ చర్యలు చేపట్టడానికంటే ముందుగా ప్రజల మనస్సుల్లోంచి ఈ అసమానతా భావాల్ని తొలగించాలి. ప్రకృతి పరంగానో, భౌగోళికంగానో- నివాసాలు, సంప్రదాయాలు, ఆచారాలు, ఆహార విహారాలు భిన్నంగా

ఉండవచ్చు.. అవి జీవన రీతుల్లోని వైవిధ్యమే తప్ప - ఒకరి ఆధిక్యత, ఒకరి అల్పత్వం కానే కావనే సంగతి విద్యరూపంలో పాఠశాలల్లోనూ, వివిధ ప్రచార కార్య క్రమాల ద్వారా సమాజంలోను వ్యాప్తి చేస్తూ ఉంటే, మానవీయతా లక్షణాలు కలిగి ఉండటం ఎంత అవ సరమో చెప్తూ ఉంటే, ఒకనాటికి ఈ సంక్షేమ చర్యలు సరైన ఫలితాల్ని ఇస్తాయి.

ఏ పథకమైనా ప్రజల స్వావలంబనకి ఆధారంగా ఉండాలి గానీ, ఎప్పటికీ ఉచితంగా మాత్రం ఉండ కూడదనే ఆలోచన బలీయంగా వ్యక్తమౌతున్న ప్రస్తుత పరిస్థితిని జాగ్రత్తగా గమనించాలి.

మనోచిత్రణ :

కథలోని ప్రధాన పాత్ర చెప్పినట్టు, "... చుట్టూ ఉన్న వారు బాధ పడుతూ బ్రతుకీడుస్తుంటే... చూస్తూ కూడా మనం ఏమీ చేయలేకపోతే మనం కఠినాత్ముల క్రిందే లెక్క ... అలా చేయలేక పోతే... మన గొయ్యి మనమే త్రవ్వుకున్నట్లు ...".

బలహీనమైన పాత్రలు - కూరలమ్మి, వేరుశెనక్కా యల మనిషి, బఠాణీల అబ్బాయి, పబ్లిక్ టాయిలెట్ నిర్వాహకుడు.. ఇందరికీ డబ్బులిచ్చి, నరుకులిచ్చి, ఇంకేమైనా ఇచ్చి మానవీయత చూపించేసాం అనను కోలేదు లక్ష్మీపతి, మన ఈ కథలోని ప్రధానపాత్ర.

డెబ్భై ఏళ్ల ముసలమ్మ దగ్గర బేరం ఆడకుండా కూరలు కొందామన్నాడు.

వేరుశెనక్కాయల మనిషి కష్టాన్ని పది రూపాయలకు ఖరీదు చెయ్యవద్దన్నాడు.

వైకల్యంతోనే బఠాణీలు అమ్ముకుంటున్న అబ్బాయి దగ్గర అవి ఎక్కువగా కొని కొంచెం కష్టం తగ్గించమన్నాడు.

దుర్గంధం వస్తున్నా రూపాయి-రెండు రూపాయలకి మూత్రశాలని నిర్వహించే అతని కష్టాన్ని ఎలా తొలగించాలో ఆలోచించమన్నాడు.

క్లాస్‌లో ఫస్ట్ వస్తూ, తండ్రికి తోడుగా వేరుశెనక్కాయలు అమ్మే చరణ్- తండ్రి వైద్యం కోసం విధిలేని స్థితిలో దొంగతనం చెయ్యబోతే, అలాంటి పరిస్థితిలోకి ఆ మంచి కుర్రాడిని నెట్టేసిన సామాజిక అంతరాలని ప్రశ్నించా లన్నాడు.

బాగా ఉన్న వాళ్ళు, లేని వాళ్ళకి సాయం చేయాలని, ఒక వేళ అలా చేయకపోతే, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆ వెనుకబాటు వ్యక్తులు సంఘానికి వ్యతిరేకంగా తయారయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించాడు.

డబ్బులున్నవారు, మాట సాయమో-చెయ్యి సాయమో చెయ్యగలవారు, మానవత్వంతో సాటివారికి తోడుగా ఉండకపోవడమే ఈ ప్రమాదకర శక్తులు తయారవ్వడానికి కారణమని విశ్లేషించాడు.

"... అలా చేయలేక పోతే... మన గొయ్యి మనమే త్రవ్వుకున్నట్లు ..." ఎందుకో, ఈ పాటికి మనకు అర్థం అయి ఉండాలి.

మనం పట్టించుకోని సమాజంలోని ఒక భాగం, మనల్ని పట్టించుకోదు. అది ఏదో తీవ్రవాద చర్యే కానక్కరలేదు. అవసరానికి మనం హాస్పిటల్ కి వెళ్లడానికి మరో మనిషి సాయంగా రాకపోవచ్చు, దారిలో పడిపోతే లేవదీసే మనిషే ఉండకపోవచ్చు, పొరపాటున సరిపడా డబ్బులు లేకుండా బస్ ఎక్కితే మానవత్వంతో మనకోసం టిక్కెట్ కొనే సాటి ప్రయాణీకుడు లేకపోవచ్చు, చిల్లర లేదమ్మా మళ్ళీ వచ్చినప్పుడు ఇవ్వమని మనం రోజూ వెళ్ళే దుకాణదారుడు కూడా అనకపోవచ్చు, అరే.. ఏదో ఇబ్బంది కలిగినట్టుంది..ఈ పూటకి మనమే అన్నం-కూరలు పంపిద్దామనే ఆలోచన పక్కింటివాళ్లకి కలగక పోవచ్చు.

వాళ్ళు అలా అనలేదని మనం బాధ పడనక్కరలేదు. మనం ఎవరి కష్టంలోనైనా ఎన్నడైనా చేదోడు వాదోడుగా ఉన్నామా అని పరిశీలించుకోమంటున్నాడు, లక్ష్మీపతి. సమాధానం దొరుకుతుంది.

ఇన్నేళ్ళ సాహచర్యం తర్వాత, భర్తని అర్థం చేసుకున్న లక్ష్మి చరణ్ ని దగ్గరకు తీసుకొంది. అతని తండ్రి వైద్యం కోసం భర్తతో కలిసి హాస్పిటల్‌కి వెళ్లింది. దార్లో చెప్పులు కుట్టే అతనికి ఉచితంగా కాక, తన చెప్పులు తుడిపించుకొని కాస్త ఎక్కువ డబ్బులు ఇచ్చింది.

మానవత్వం పరిమళించే దారిని చూపించింది, ఈ 'ఈత రాని పడవలు' కథ.

కథలోని ఆర్థికంగా బలహీనంగా ఉన్న పాత్రలూ, అన్నీ సరిపడా ఉన్న పాత్రలూ, లక్ష్మీపతి చెప్పినట్టు 'కొందరు బాగా బ్రతుకుతున్న వాళ్ళు' అందరూ జీవన వ్యాపారంలో తమ తమ పనులు చేసుకుంటూ, ప్రపంచ పరిస్థితులతో ప్రభావితం అవుతూ, జీవితాన్ని ఈదుతూ వెళ్తున్నారు. ఎవరి జీవిత నౌక వారికున్నది.

సమర్థులు చకచకా పోతుంటే, అంత లేనివాళ్లు నెమ్మదిగా పోతుంటే, అదీ చేతకాని వారు ఎటూ కదలలేక ఊగిసలాడుతున్నారు. ఈత రాని ఆ పడవల్ని తమ చుక్కానికి కట్టి లాక్కుపోవడం మానవత్వం అనిపించుకుంటుంది. అనిపించుకోవడం కోసం కాదు, మనిషిగా అది ప్రతి ఒక్కరి కర్తవ్యం అనే స్పృహతో 'ఈత రాని పడవలు' కథ ద్వారా కథకులు డా. ఎమ్.వి.జె. భువనేశ్వర రావు ఒక సదాలోచనని కలిగించే ప్రయత్నం చేసారు.

విషయ వస్తువు, కథన శైలి :

బ్రతుకుతెరువు లేనివారిపట్ల, ఆ బ్రతుకుని ఎలా ఈదాలో తెలియని బలహీనులపట్ల, స్వయంకృషితోనే భారంగా బ్రతుకీడుస్తున్న వారి పట్ల - బ్రతుకు బాగున్నవారు మానవత్వంతో వ్యవహరించాలి, చెయ్యగలిగినంత సాయం ఎటువంటి నిబంధనలూ లేకుండా స్వచ్ఛందంగా అందించాలి. లాభాపేక్ష లేని అటువంటి సాయం.. ఎందరికో తమ తమ జీవిత నౌకల్ని ఒక క్రమ పద్ధతిలో నడుపుకోవడానికి ఆధారం అవుతుంది.

విషయానికున్న ప్రాధాన్యతతో కాస్త ఉపన్యాస ధోరణిలో కథ నడిచింది. ఒక వ్యాసంగా కూడా ఈ విషయాన్ని చెప్పొచ్చు. కానీ, విషయాన్ని చేరువచెయ్యడానికి కథా శిల్పానికున్న సౌలభ్యాన్ని ఉపయోగించుకున్నారు కథకులు. కాబట్టే అద్భుత రసోత్పత్తి, రోమాంచితమైన మలుపులు కాకుండా, శిల్పాన్ని మరీ ఎక్కువగా చెక్కకుండా.. నేరుగా, పలు సంఘటనలని ఉదహరిస్తూ, ఎక్కువ వివరణతో ఎక్కువ సమాచారం ఇవ్వాలనే తపనతో కథని నడిపించినట్టుగా తోస్తోంది.

హితవచనం :

సమాజంలోని ప్రతి మనిషీ, సాటి మనిషి పట్ల సమరస భావంతో మెలిగిన నాడు, సాటి మనిషి కష్టంలో పాలు పంచుకున్ననాడు, మానవతా దృక్పథంతో స్పందించిన నాడు ఈ హెచ్చుతగ్గులు సమసిపోతాయి. అందరూ అన్ని విధాలా బాగా ఉండకపోవచ్చు, బాగా ఉన్నవారు లేని వారిని కించ పరచకుండా సాయం అందించిన రోజున 'ఈత రాని పడవలు' కూడా ఒడ్డుకు చేరతాయనే ఆలోచన ఈ కథలో వినిపిస్తోంది. ఈ చైతన్యం అందరిలో కలగాలనే తపనను రేడియో కథ ద్వారా ప్రస్తావించారు డా. ఎమ్.వి.జె. భువనేశ్వరరావు.

ఆధార గ్రంథాలు :

1. ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రం - గ్రంథాలయం నుండి సేకరణ (18-03-2019న రేడియోలో ప్రసారం)
2. డా. ఎమ్.వి.జె. భువనేశ్వరరావు గారితో జరిపిన సంభాషణ నుండి గ్రహించిన విషయాలు

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జూకంటి జగన్నాథ కవిత్వంలో చారిత్రక సాంస్కృతిక అంశాలు

– యస్. మహేందర్, తెలుగు సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధిపేట.

భాషలో మాండలికం ఒక భాగం. మాండలికంలో ఆ ప్రాంతం యొక్క సంస్కృతి కనబడుతుంది. ఎందుకంటే యాన, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు మొదలైనవి సంస్కృతిలో భాగం. కరీంనగర్ జిల్లా మాండలికాన్ని చాలా మంది రచయితలు కథలలో, నవలలో ఉపయోగించారు. కరీంనగర్ జిల్లా మాండలికం ఎక్కువగా కాలువ మల్లయ్య, పెద్దింటి అశోక్ కుమార్ కథల్లో, నవలలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. కరీంనగర్ కి చెందిన చాలామంది కవులు,రచయితలు తమ తమ కవిత్వాలలో , కథలలో,వ్యాసాలలో ఉపయోగిస్తూ తమ సంస్కృతిని, అస్తిత్వాన్ని కాపాడుతున్నారు.

కథల్లోనే కాకుండా కవిత్వంలో కూడా మాండలికాలను సంబంధించిన పదజాలం(diction) విస్తారంగానే ఉప యోగిస్తున్నారు. తమ తల్లి భాషలో కవిత్వం రాయడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. పల్లె జీవితానికి దగ్గరగా ఉన్న వారు మాత్రమే వారి తెలంగాణా భాషలో, యాసలో మాండలిక పద జాలాన్ని వాడుతున్నారు. పట్టణాల్లో ఉన్న వారు తాము విస్మరించిన తల్లి భాషలో రచన చేయడానికి ప్రయత్నిన్తున్నారు. తమ అమ్మలు, అమ్మమ్మలు ఏ యాసలో మాట్లాడతారో అదే యాసలో కవిత్వం రాయాలని తపిస్తున్న వారిలో జూకంటి జగన్నాథం గారు ఒకరు. మాండలికంలో కవిత్వం చెప్పడంలో ఆయన శైలి, శిల్పం, అభివ్యక్తికరించడంలో వారిది అందే వేసిన చేయి.

జూకంటి జగన్నాథం సిరిసిల్ల వాస్తవ్యులు. మీరు పాతాళ గరిగె, ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గంగడోలు, వాస్కోడిగామా డాట్ కాం, బొడ్డుతాడు, ఒక్కరోజు పది గాయాలు, వైపని కథలు, తల్లి కొంగు, పిడికెడు కలలు-దోసెడు కన్నీళ్లు, తారంగం, రాజపత్రం, చిలుక రహస్యం మొదలగు కవితా సంపుటాలను రాసి ప్రచురించారు. వీరి కవిత్వంలో తెలంగాణ ముఖ్యంగా కరీంనగర్ మాండలిక నుడికారాలు, సామెతలు ఎక్కువగా సందర్భోచితంగా కనిపిస్తాయి. ఉదాహరణకు

"ఎవల్తోని సెప్పుకోవాలె
ఏమని సెప్పుకోవాలె
ఎవర్నని అనాలె
ఎవర్నని అడగాలె
జడ్తివ్వని గొర్రె యాదికి వత్తుంది
ఏడేడు సెర్లు ఒక్కసారి తెగ్గినట్టు
ఎడ్వేడ్వని దుఃఖం ముంచుకొస్తోంది" అనే కవిత

ఖండికలో ప్రపంచీకరణ నేపథ్యంలో రాసినప్పటికీ ఇందులో మాండలిక సంస్కృతి స్పష్టంగా కనబడుతుంది. జడ్తివ్వని గొర్రె యాదికి వత్తుంది అనే పంక్తిలో కరీంనగర్ సంస్కృతి కనపడుతుంది. భక్తులు తమ కోరికలు నెరవేరి నందుకు గ్రామ దేవతలకు మేకలను బలిచ్చే ముందు వాటిని జడ్త పడతారు. అంటే మేకలను, గొర్రెలను బలి ఇచ్చే ముందు పసుపు, కుంకుమ, వేపాకులతో అలం కరిస్తారు. ఇలా చేసిన తర్వాత గొర్రెల మేకల వీపు పైన కల్లు తో గాని బెల్లం నీళ్లు గాని చల్లి చెవులు పట్టి గ్రామ దేవతల ముందు చాకలి(రజక) ఉంచుతారు. అప్పుడు ఆ గొర్రె గాని గొర్రె గాని శరీరం మొత్తం ఊపితే జడ్త ఇచ్చినట్టు. జడ్తి అనగా భక్తులు సమర్పించిన మొక్కులకు దైవం సంతృప్తి చెందినదని అర్థం.జడ్తి ఇచ్చిన తరవాత అప్పుడుమేకను గాని, గొర్రెను గాని బలిస్తారు. ఒకవేళ ఇవ్వకుంటే భక్తులు రకరకాల మొక్కులు మొక్కుతారు. తప్పులు ఉంటే మన్నించమని వేడుకుంటారు. దైవానికి సమర్పించడంలో ఏదైనా లోటు ఉంటే మారు కొలుపుకు తప్పకుండా పెడతామని పదేపదే వేడుకుంటారు. జడ్తి

అనే పదానికి ఉన్న పుట్టుపూర్వోత్తరాలు ఇవి. ఇప్పటికీ ఇలాంటి ఆచారం కరీంనగర్ అంతా కనపడుతుంది. రచయిత ఇలాంటి సంస్కృతికి సంబంధించిన అనేక పదజాలాన్ని ప్రయోగించి మాండలిక అస్తిత్వాన్ని, సంస్కృతిని కాపాడడం లో నిమగ్నమై ఉన్నాడు.

జూకంటి వారు రాసిన రాజపత్రం అనే వచన కవితా సంపుటిలో ''గుట్టకు పానం అచ్చింది'' అనే

ఖండికలో..

''నాకైతే పడుకొని చిన్నపిల్లలను కాళ్ళ మీదేసుకొని
గుట్టలేసె గుట్టలేసె అని నన్ను ఎవరో పైకెత్తి
ఆడించినట్టనిపిస్తుంది.
ఇన్నోద్దులు కాళ్ల కింద అన్నపట్టిన
మట్టికి మాట అచ్చింది
ఇన్ని దినాలు వట్టి బండలనుకున్న
గుట్టకు అచ్చరాల పానం లేచి అచ్చింది''

ఈ ఖండికలో జగన్నాథం గారి మాండలిక భాషా పదజాలం స్పష్టంగా కనబడుతుంది. మాట అచ్చింది, పానం, ఇన్నోద్దులు, మొదలగు పదాలు కరీంనగర్ మాండలికంలో ఎక్కువగా వాడుతారు. గుట్టకు పానం అచ్చింది ఖండికలో కరీంనగర్ జిల్లాలోని బొమ్మలమ్మ గుట్ట మీద క్రీస్తుశకం 946లో జినవల్లభుడు మొదటి తెలుగు కంద పద్యాలను చూసి మనసు చెలించి రాయడం జరిగింది గుట్టలేసె గుట్టలేసె అనే పంక్తిలో తెలంగాణా భాషలో ప్రాచీన సాహిత్యం లేదని చిన్న చూపు చూసి, చిన్నవాడు గా ముద్ర వేయడం జరిగింది. కానీ అది నిజం కాదని కంద పద్యాలు ద్వారా రుజువయింది ఈ పద్యాల ద్వారా ప్రాచీన సాహిత్యం వారి కంటే ముందుందని కవి సంతోషించి ఎవరో (జినవల్లభుడు) పైకి ఎత్తి ఆడించినట్టనిపిస్తోందని వాపోయాడు. మిగతా ప్రాంతం కంటే తెలంగాణ లో ప్రాచీన సాహిత్యం పై స్థాయిలో ఉందని దాని విశ్లేషణార్థం. ఇప్పటికీ కరీంనగర్ ప్రాంతంలో చిన్నపిల్లలను కాళ్లమీద ఆడించుకుంటూ అని వాడుతుంటారు.

జూకంటి రాసిన రాజపత్రం కవితా సంపుటి లో మరో ఖండిక

లోగుట్టులో...

''అడగందే అమ్మయిన కలిగి బువ్వ పెట్టదు.
అడిగితే
తెలుగుతల్లి అలిగి అన్నం ముట్టదు
చెప్పితే మానం పోతది
చెప్పకుంటే పానం పోతది
అంటే కొంటెతనమంటరు
అనకుంటే లండుతనం అంటరు'' అనే కవిత్వంలో కరీంనగర్ మాండలిక భాష కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇందులో కొంటెతనము అనే పదాన్ని సందర్భోచితంగా వాడినారు. కొంటెతనము అంటే సర్వవిధాలా కష్టపడిన ఫలితం లేకుంటే దైవం చిన్నచూపు చూసిందని నిరక్ష రాస్యులలో బలమైన నమ్మకం. మనుషులకు వ్యాధులు వచ్చి మందులువాడిన తక్కువ కాకుంటే పశువులు పాలు ఇవ్వకున్నా పంట దిగుబడి సరిగా రాకున్నా బర్కత్ లేదని కొంటెతనం ఉన్నదని తెలంగాణలో జానవదుల నమ్మకము.

వీరి మరొక ఖండికలో...

''తప్పుకుంటూ పోవాల్సిందే
తట్టపార గడ్డపార పట్టుకొని
తప్పుకుంటూ పోవాల్సిందే
కోటిలింగాల! కోటిలింగాల!!
నీకు కోటి దండాలు
మునుల గుట్ట! మునుల గుట్ట!
నీకు ముక్కోటి దండాలు'
మనల్ని మనం
తప్పక తప్పుకుంటూ పోవాల్సిందే
భూమి తల్లి కడుపులో
చరిత్ర పాపాయి ఒదిగివుంది

అభివృద్ధి పేర
క్రీస్తు పూర్వాలు క్రీస్తు శకాలు
ప్రాజెక్టు ముంపులో

మునిగిశోక శకలాలు కాక ముందే తవ్వుకుంటూ పోవాల్సిందే తలెత్తుకుంటూ పోవాల్సిందే'' అనే పంక్తు లలో ప్రాజెక్ట్ కట్టడంలో ముంపుకు గురవుతున్న చారిత్రక కట్టడాల గురించి అని అర్థమవుతుంది కానీ తవ్విన కొలది ఈ జిల్లా ప్రాచీన సంస్కృతి సాంస్కృతిక సాహిత్యానికి సంబంధించిన ఆనవాళ్ళు బయట పడుతున్నాయి అని ఒక చారిత్రక ఘట్టాన్ని తన కవిత్వంలో ఈ విధంగా పొందుపరిచాడు.

ఈ విధంగా జూకంటి వారి కవిత్వం విశ్లేషణ చేస్తూ పోతుంటే చారిత్రక, సాంస్కృతిక అంశాలు కరీంనగర్ మాండలిక పదాలను ఎన్నో మనం గుర్తించవచ్చు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అనురాగ తరంగాలు నవల - అద్దె గర్భం చిత్రణ

- వడ్డివెటి ముల్లయ్య, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఈ సృష్టిలో ఎంతో మహోన్నతమైంది, విలువ కట్టలేంది అమ్మతనం. ఒక స్త్రీకి మాత్రమే లభించే అపురూపమైన ప్రకృతి కానుక అమ్మతనం. స్త్రీ జీవితానికి పరిపూర్ణతను చేకూర్చేది అమ్మతనం.కానీ నేటి సమాజంలో సరోగసీ విధానం ద్వారా అమ్మతనం ఒక వ్యాపారంగా మారిపోయింది. సమాజంలోస్త్రీ, పురుషుల సంపర్కం ద్వారా స్త్రీలు సహజ గర్భందాల్చి పిల్లలను కంటారు. అలాగే ఒకప్పుడు ఆడవాళ్లందరికీ ప్రసవం ఇళ్లలో జరిగేది. కానీ ఇప్పుడు చాలావరకు ప్రసవాలు ఆసుపత్రులలో జరుగుతున్నాయి. అందులో కూడా నార్మల్ డెలివరీస్ కాకుండా ఎక్కువ శాతం సిజేరియన్లు అవుతున్నాయి. ఇదే కాకుండా ఆధునిక కాలంలో సాంకేతిక అభివృద్ధి మానవ పుట్టుకను కూడా కృత్రిమం చేస్తోంది. ఈ కృత్రిమంలో భాగమే సరోగసి విధానం ద్వారా పిల్లలకు జన్మనివ్వడం.

సాధారణంగా సరోగసి రెండు విధాలుగా ఉంటుంది. భార్య నుంచి అండాన్ని, భర్త నుంచి వీర్యాన్ని సేకరించి కృత్రిమ వాతావరణంలో ఫలదీకరించి మరో మహిళ గర్భంలోకి ప్రవేశపెట్టి ఆమె ద్వారా పిల్లలను కనడం. దీన్నే జెస్టేషనల్ సరోగసి అంటారు. ఈ విధానంలో దంపతులకు, సరోగేట్ తల్లికి ఎటువంటి జన్యు సంబంధం ఉండదు. రెండోది దంపతుల్లో భార్యకు సమస్య ఉన్నప్పుడు భర్త వీర్యాన్ని మరో మహిళ గర్భంలోకి ప్రవేశపెట్టి సంతానం కలిగించడం. దీన్ని ట్రెడిషనల్ సరోగసి అంటారు.

మన భారతదేశంలో మొట్టమొదటిసారిగా టెస్ట్ ట్యూబ్ బేబీగా హర్షా చద్దా షా అనే ఆమె 1986లో ముంబయిలో పుట్టింది. అద్దె గర్భానికి స్త్రీ ధనాన్ని తీసుకుంటే దాన్ని కమర్షియల్ సరోగసి అని, కేవలం వైద్యానికి అయ్యే ఖర్చులు మాత్రమే తీసుకుంటే దాన్ని ఆల్ట్రాయిస్ట్ సరోగసి అని అంటారు. ఆ తర్వాత ఈ సరోగసీ విధానం ఒక వ్యాపారంగా మారిపోయింది. అలాగే 2002 ప్రాంతంలో సరోగసి విధానం ద్వారా విదేశీయులు భారతదేశంలో పిల్లల్ని పొందడం అధికమైంది. ఈ సరోగసీ విధానం ద్వారా అద్దె గర్భం దాల్చిన తల్లులు అనేక అవరోధాలకు గురి అవుతున్నారు. అందువలన ఈ అవరోధాలను రూపుమాపడానికి భారత దేశంలో కమర్షియల్ సరోగసిని నిషేధిస్తూ సరోగసి విధానంలో అనేక మార్పులు చేస్తూ రూపొందించిన బిల్లును కేంద్ర కేబినెట్ 2016లో 'సరోగసీ రెగ్యులేషన్ బిల్లును' పార్లమెంట్ లో ప్రవేశపెట్టడానికి ఆమోదించింది.

కోమలాదేవి 'అనురాగ తరంగాలు' అనే నవలను 1985లో రాశారు. ఈ నవల్లో సరోగసీ విధానం గురించి చెప్పడం జరిగింది. సరోగసీ విధానం మన భారతదేశంలోకి రాక పూర్వమే రచయిత్రి కోమలదేవి 1985లోనే ఈ 'టెస్ట్ ట్యూబ్ బేబీ' వలన కలిగే అనర్థాలను ఈ నవల్లో తెలియజేశారు. ఈ నవల్లో మధు, శోభ పాత్రలు ప్రధాన పాత్రలు.

మధు ఒక రోజు సాయంత్రం మిత్రులతో కలిసి ఉంటాడు. మిత్రులు ఇంటికి వెళ్లిపోగా మధు ఒక్కడే ఉంటాడు. మధు కూడా ఇంటికి వెళుతుండగా మార్గ మధ్యంలో ప్రబోధ్, కోటి కలుస్తారు. ప్రబోధ్ సైంటిస్ట్. తన అసిస్టెంట్ కోటి. ప్రబోధ్, కోటి ఇద్దరు మధు గురించి బాగా తెలుసుకొని అతనితో స్నేహం చేస్తారు.

ఒక రోజు సాయంత్రం కోటి, మధుకి ఫోన్ చేసి తన ల్యాబ్‌కు రమ్మని చెబుతాడు. మధు అక్కడికి వెళ్లి ఆ ల్యాబ్‌లో ఉండే పరికరాలు చూసి ఆశ్చర్యపోతాడు. ఆ తర్వాత మధు, కోటి ప్రబోధ్ రూమ్‌కి వెళతారు. అందులో

ఉండే టెస్ట్ ట్యూబ్ బేబీలను తయారు చేసే పరికరాలు మధుని ఆకర్షిస్తాయి. అప్పుడు మధు సరోగసి విధానం గురించి ప్రబోధ్‌ను అడుగుతాడు. అప్పుడు ప్రబోధ్ సరోగసి విధానం గురించి, అలాగే జన్యుశాస్త్రంలో జరిగిన మార్పుల్ని గురించి ఇలా చెబుతాడు. "జన్యుశాస్త్రం చాలా ముందంజ వేసింది. కొత్త కొత్త పరిశోధనలతో క్రొంగొత్త విషయాలను కనుక్కుంటున్నారు. టెస్ట్ ట్యూబ్ బేబీ, ఆ తరువాత క్లోనింగ్ ద్వారా బిడ్డను తయారు చేయటం - దీనికి స్త్రీ, పురుషులు అక్కరలేదు. అంటే నీ డబుల్ ను నీ కణాల్లోంచి తయారు చేయవచ్చును - కృత్రిమ సంపర్కం ద్వారా సంతానం పొందటం - ఇవన్నీ మామూలు అయిపోయాయి" అని అంటాడు.

ఆధునిక కాలంలో సాంకేతికంగా చాలా అభివృద్ధి చెందారని ప్రబోధ్ మాటల ద్వారా మనకు అర్థం అవుతుంది. అలాగే స్త్రీ పురుషులు లేకుండా మనిషిని కృత్రిమంగా పుట్టించగలరుని చెప్పారు. జన్యుశాస్త్రంలో వచ్చిన మార్పును, అలాగే కొత్త టెక్నాలజీని మనకు ప్రబోధ్ పాత్ర ద్వారా రచయిత్రి తెలియజేశారు.

అలాగే ఒక టెస్ట్ ట్యూబ్ బేబీకి సంబంధించి "ఈ మధ్య ఆస్ట్రేలియాలో మెల్బోర్న్ విక్టోరియా హాస్పిటల్‌లో ఒక కేస్ జరిగింది. కోటీశ్వర్లు అయిన దంపతులు టెస్ట్ ట్యూబ్ బేబీని తయారు చేయించుకున్నారు. ఆమె అండము ల్యాబ్‌లో ఫలించింది. రెండవది కూడ ఫలించింది. అంటే రెండు ఎంబ్రియోలు, భ్రూణాలు తయారయ్యాయి. వాటిని డీప్ ఫ్రీజ్ చేసి ఉంచారు. ఆమె గర్భంలో ఒకదాన్ని ప్రవేశపెట్టాలి. కాని, వారిద్దరు కూడా ప్లేన్ ఆక్సిడెంట్‌లో మరణించారు. ఆ భ్రూణాన్ని మరొక స్త్రీ గర్భాన్ని ఎరువుగా తెచ్చి పెంచాలా? లేక వాటిని నాశనం చేయాలి? అంటే భ్రూణహత్య అవుతుందన్న మాట". ఈ విషయం ప్రబోధ్ మధుతో చెబుతాడు.

నేటి సమాజంలో వస్తువులు పాడవకుండా ఉండటానికి వస్తువులను ఫ్రిజ్లో పుంచుతారు. అవి అవసరమైనప్పుడు తీసి ఉపయోగిస్తారు. అలాగే టెస్ట్ ట్యూబ్ బేబీ కోసం మనిషి పుట్టుకకు కారణమైన అండాన్ని కూడా కూరగాయల లాగా డీ ఫ్రిడ్జ్‌లో పెడతారు. నేటి సమాజంలో ఫ్రిడ్జ్‌లో నిల్వ పుంచిన వస్తువులను ఎక్కువగా ఉపయోగించకూడదని అంటారు. అలా ఉపయోగించడం వలన మనిషి ఆరోగ్యం దెబ్బతింటుందని అంటారు. అలాంటిది మనిషి పుట్టుకకు సంబంధించిన అండాన్ని ఫ్రిజ్లో పెట్టి ఉపయోగించడం అన్నది అంత శ్రేయస్కరం కాదు అని రచయిత్రి ఉద్దేశం.

మధు టెస్ట్ ట్యూబ్ బేబీ గురించి, విజ్ఞాన శాస్త్రం గురించి ఇలా అంటాడు. "ఈ మధ్య పేపర్లో వేశారు. విజ్ఞానం ఒక్క అడుగు ముందుకు వేశామన్న గర్వంతో అడుగు వేస్తుంది. కానీ అది ఆ తరువాత కూరుకు పోతుంది. అణువు భేధించినప్పుడు పొంగిపోయారు. అది అణ్వస్త్ర యుగానికి నాంది పల్కింది. మత్తుమందులు వైద్యానికన్నా, వ్యసనానికి ఉపయోగపడుతున్నాయి. ప్రయోగాల్ని మానము. వీటిని మానవుడి శ్రేయస్సుకు, లోకకళ్యాణానికి ఉపయోగించాలి" అని అంటాడు. వైద్య శాస్త్రంలో కానీ విజ్ఞానశాస్త్రంలో కానీ ఏదైనా కానీ మొదట చిన్నగా ప్రారంభమై ఆ తరువాత అది విస్తృతంగా వ్యాప్తి చెందుతుందని మధు అంటాడు. ఈ సరోగసీ విధానం కూడా మొదట చిన్నగా ప్రారంభమై ఆ తరువాత వ్యాపారంగా మారిపోయింది. సరోగసి విధానం ద్వారా మాతృత్వం అనేది అంగడిలో దొరికే సరుకైంది, అన్నదే మధు భావన.

మధు ఆ ల్యాబ్ నుండి ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో అందులో ఏదో పెద్ద శబ్దం వినిపిస్తుంది. అది విని మధు అక్కడ ఏదో తప్పు జరుగుతుంది అని భావిస్తాడు. మళ్ళీ ఒకరోజు కోటి ఫోన్ చేసి మధుని ల్యాబ్‌కు రమ్మని చెబుతాడు. అప్పుడు మధు మొదటి రోజు జరిగినది తలచుకొని అక్కడ వాళ్ళందర్నీ తిడతాడు.

మధు ల్యాబ్‌కు వచ్చినప్పుడు అక్కడి విషయాలను ప్రబోధ్‌కు క్షుణ్ణంగా వివరించి చెబుతాడు. అలాగే పురుషుల వీర్యకణాల్ని భద్రపరిచే 'సెమన్ బాంక్' గురించి

ప్రబోధ్ మధుకి చెబుతాడు. మన దేశంలో కూడా 'సెమన్ బాంక్' ఉందా అని మధు అడుగుతాడు. లేదు అని ప్రబోధ్ చెప్పగానే మధు ఊపిరి పీల్చుకుంటాడు. అది కూడా అప్పుడప్పుడు ఉపయోగపడుతుందని ప్రబోధ్ ఇలా చెబుతాడు. "ఎక్స్ రేలు తీసే టెక్నీషియన్లు, మత్తు మందులతో పనిచేసేవారు - అంటే ఎనస్తటిస్ట్‌లు, కోబాల్ట్ - రేడియం ట్రీట్మెంట్ ఇచ్చే వాళ్ళు-వీళ్ళు క్యాన్సర్ ట్రీట్మెంట్ విభాగంలో ఉంటారు. వీళ్ళు చాలా చిన్న డోసుల్లో యీ అతి శక్తివంతమైన కిరణాల్ని తమ శరీరంలోకి తీసుకుంటారు. దాంతో వారిలో అనేక మార్పులు వస్తాయి. శారీరకంగా మనకు కనబడే మార్పులు - కనబడని మార్పులు. వీళ్ళకు సంతానం కలగకపోవచ్చు పుట్టిన బిడ్డల్లో ఏదైనా లోపం ఉండవచ్చు. అందుకనే బెస్ట్ థింగ్ ఏమిటంటే వీళ్లు ఈ శాఖలో పని ప్రారంభించక ముందే పిల్లల్ని పుట్టించేసుకోవాలి. అట్లా కాని పక్షంలో ఈ బాంక్‌లు అవసరానికి ఆదుకుంటాయి" అని అంటాడు.

ఈ 'టెస్ట్ ట్యూబ్ బేబీని ఎవరు పడితే వాళ్ళు కాకుండా సంతానోత్పత్తి కలగని వాళ్ళు, ఇంకా కొన్ని ఆరోగ్య సమస్యల వలన సంతానం కలగని వాళ్ళు ఈ సరోగసీ విధానాన్ని ఉపయోగించుకోవచ్చు అని రచయిత్రి తెలియ జేస్తుంది. అలాగే ఎలాంటి వాళ్ళకి సంతానం కలగకుండా ఉంటుందో కూడా ఇక్కడ చెప్పడం జరిగింది. అలాగే ఆ టెస్ట్ ట్యూబ్ బేబీని ఏ విధంగా ఉపయోగించుకోవాలి, అది నిర్వీర్యం కాకుండా ఏ విధంగా జాగ్రత్తలు తీసు కోవాలి అనేది కూడా ఇక్కడ తెలియజేశారు.

ఈ విధంగా టెస్ట్ ట్యూబ్ బేబీ గురించి అంతా వివరిస్తాడు. వివరించిన తరువాత ఒక ఎక్స్ పెరిమెంట్ చేస్తున్నాము దానికి నీ సహకారం కావాలి అని ప్రబోధ్ మధుని కోరతాడు. అది కూడా ప్రత్యక్షంగా చేయాల్సిన అవసరం లేదు. పరోక్షంగా చేస్తే చాలు అంటాడు. మధు ఏం సహాయం చేయాలో చెప్పండని అంటాడు. అది అత్యంత రహస్యం. ఎవరికి చెప్పనని మాట ఇచ్చి ప్రమాణం చేస్తే చెబుతాను అని ప్రబోధ్ అంటాడు. అలాగే వారం రోజులలో ఏ విషయము చెప్పమని ప్రబోధ్ మధుకి చెబుతాడు. దాంతో మధు ఏం చెప్పాలో అర్థంకాక కోటి దగ్గరికి వచ్చి ప్రబోధ్ సహాయం కోరిన విషయం చెబుతాడు. అప్పుడు కోటి కూడా ప్రబోధ్‌ను సమర్థిస్తాడు.

మధుకి కోపం వచ్చి వర్షం వస్తున్నా అలాగే వెళ్ళి పోతాడు. తర్వాత మళ్ళీ వెనక్కి వచ్చి కోటిని ఎక్కించుకుని వర్షంలో తడుసుకుంటూ ప్రబోధ్ ఇంటికి వెళతారు. వర్షంలో తడవడం వలన బట్టలు మార్చుకోమని, ప్రబోధ్ కుమారుడు ప్రవీణ్ వాళ్లిద్దరికి ప్రబోధ్ బట్టలు ఇస్తాడు. అక్కడ ప్రబోధ్ కూతురు శోభను చూసి మధు ముగ్ధుడవు తాడు. తర్వాత ప్రబోధ్ వస్తాడు. ప్రబోధ్ వచ్చాక అల్పా హారం పుచ్చుకుని మధు, కోటి ఇద్దరు ఇంటికి వెళతారు. మధు ఇంటికి వెళ్లగానే తల్లిదండ్రులు సంతోష పడతారు. తన కోసం సాయంత్రం ఫ్రెండ్స్ వచ్చారని చెబుతారు. అలాగే పేరడైజ్ దగ్గరికి రమ్మన్నారని చెబుతారు.

రెండు రోజుల తర్వాత మధు శోభను చూడాలని అనుకుంటాడు. దాంతో కోటికి ఫోన్ చేసి కోటి వేసుకొచ్చిన ప్రబోధ్ బట్టలు ఇచ్చాడా లేదా అని కనుక్కుంటాడు. కోటి ఇచ్చానని చెబుతాడు. మధు ప్రబోధ్ కోరిన సహాయాని తిరస్కస్తాడు. తిరస్కరించినట్లు ప్రబోధ్‌తో చెప్పమని మధు కోటితో ఫోన్లో చెబుతాడు. ఫోన్ పెట్టి మధు వేసుకొచ్చిన ప్రబోధ్ బట్టలను ఇవ్వడానికి ప్రబోధ్ ఇంటికి మధు వెళతాడు. అక్కడ శోభ లేకపోవడంతో టీ తాగి శోభ తల్లితో కొద్దిసేపు మాట్లాడి వచ్చేస్తాడు. ఆ తరువాత తన మిత్రుల పేరడైజ్ దగ్గరికి వెళతాడు. మధు గురించి తెలుసుకోడానికి వాళ్ల దగ్గరికి కోటి వచ్చిన విషయం మధుకి చెబుతారు. తనకు ఒక చెల్లి ఉందంట అందుకనే తనను గురించి కనుక్కోడానికి వచ్చివుంటాడని మధుతో అంటారు.

అప్పుడు మధు అక్కడ నుండి కోటి దగ్గరికి వెళ్తాడు. ఫ్రెండ్స్ చెప్పిన విషయాన్ని గుర్తు చేసుకుని కోటి తనకు చెల్లెలు ఉందా అని అడుగుతాడు. కోటి నవ్వుతాడు. ఆ తరువాత వారు కొంతసేపు మాట్లాడుకుంటారు. తిరస్క

రించిన విషయం ప్రబోధ్‌కు చెప్పావని మధు కోటిని అడుగుతాడు. మనసు మార్చుకుంటావేమోనని చెప్ప లేదని కోటి అంటాడు. అలాగే శోభ గురించి కోటికి ఉన్నా అభిప్రాయాలను మధు అడిగి తెలుసుకుంటాడు. అలా వాళ్ళిద్దరి సంభాషణ కొద్దిసేపు జరుగుతుంది. ఆ తరువాత శోభ మధుకు తగిన అమ్మాయి కాదని కోటి చెబుతాడు. కోటి అలా చెప్పడంతో మధు ఆమె మీద మరింత ఇష్టాన్ని పెంచుకుంటాడు.

మరుసటి రోజు మధు శోభ వాళ్ళ ఇంటికి వెళ్ళతాడు. శోభ మధు ఇద్దరు సాయంత్రం మఫత్ లాల్ వారి షోకి వెళ్తారు. మధు శోభను బయటకు తీసుకెళ్లడం వలన శోభా చాలా సంతోషపడుతుంది. అలాగే ఒకరి ఇష్టాలు ఒకరు తెలుసుకుంటారు. భవిష్యత్ కార్యాచరణ గురించి మాట్లాడుకుంటారు. అలా వాళ్ళిద్దరి స్నేహంబంధం బలపడుతుంది.

శోభను వాళ్ళ ఇంటి దగ్గర వదిలి మధు తన ఇంటికి వెళతాడు. సాయంత్రం కోటి ఫోన్ చేశాడని తల్లి చెబు తుంది. మధు కోటికి ఫోన్ చేస్తాడు. తనమీద ఆశలు పెట్టుకోవద్దని ప్రబోధ్ తో చెప్పమని మధు కోటికి మళ్ళీచెబుతాడు. కానీ కోటి మాత్రం ఎలాగైనా మధుని ఒప్పించాలని ప్రయత్నిస్తాడు. అలాగే ఇలా అంటాడు. ''మధు ఆలోచించు. ఎవరి హృదయాన్ని గాయ పరుస్తున్నావో ఆయన కూతురంటే శ్రద్ధాసక్తులు చూపటం నీకు సిగ్గుకరంగా లేదూ!'' అని మధుని కోటి కోపగించు కుంటాడు. మధు జంకకుండా తాము మేజర్లం తమను ఎవరూ ఏమీ చేసుకోలేరు అని తిరస్కరిస్తాడు.

అంటే ఇక్కడ శోభను అడ్డుపెట్టుకొని ఎలాగైనా మధుని ఒప్పించాలని కోటి ప్రయత్నం చేస్తాడు. సమాజంలో కూడా ఈ విధంగా ఎదుటి వ్యక్తి లోపాలను తెలుసుకుని, వాళ్లను లొంగదీసుకుని కోటిలాగా అవసరా లకు ఉపయోగించుకోడానికి ప్రయత్నిస్తారన్నది రచయిత్రి భావన.

ఆ తరువాత ఆదివారంనాడు శోభ, మధు ఇద్దరు కలిసి బయటికి వెళతారు. శోభ తండ్రి మద్రాస్ నుండి తిరిగి రాగానే ఉద్యోగరీత్యా శోభ బొంబాయి వెళ్ళతానని చెబుతోంది. తన తండ్రి మద్రాస్ ఎందుకు వెళ్ళాడు అని మధు అడగగా శోభ ఇలా చెబుతుంది. ''ఒక మీటింగ్ అటెండ్ అవ్వడానికి. ఈ మధ్య ఆ ఆస్ట్రేలియన్ కేస్ ఉ ంది కదా? ల్యాబ్‌లో ఉన్న రెండు ఎం ఎం బ్రియేలను బైటికితీసి నాశనం చేయమని ఒక కమిటీ నిర్ణయించింది. న్యాయరీత్యా లేదా జెనిటిక్స్ ప్రయోగ న్యాయరీత్యా వాటిని తల్లిగర్భంలో ప్రవేశపెట్టాలి కదా ఆమె లేదు కనుక అవి పెరిగి శిశువు కావడానికి ఆస్కారం లేదు అని కొందరంటారు. మరికొందరు అట్లా నాశనం చేయకూడదు. పెంచి శిశువులను చేయాలి అంటారు. చివరికి ప్రజల సలహాలు వారి నిర్ణయాలు పంపమన్నారు. వాటి విషయం మీటింగ్ పెట్టారు'' అని అంటుంది.

ఏదైనా ఒక విషయానికి సంబంధించి నిర్ణయం తీసుకునేటప్పుడు ఇతరుల అభిప్రాయాలను తెలుసు కోని, అలాగే వాళ్ళ అభిప్రాయాలను లోతుగా పరిశీలించి, ఆ తర్వాతే తగిన చర్యలకు పూనుకోవాలని రచయిత్రి ఈ సంఘటన ద్వారా మనకు తెలియజేస్తుంది.

అలాగే మధు ఈ విషయం మీద చాలా లోతుగా ఆలోచించి ఇలా అంటాడు. ''ఒకవేళ పిల్లలిద్దరూ పుట్టిన తరువాత వారు మరణించి ఉంటే?'' అంటే ఈ టెస్ట్ ట్యూబ్ బేబీ కూడా ఫలిస్తే ఫలిస్తాయి లేకపోతే లేదు అన్నది మధు మాటల ద్వారా మనకు అర్థం అవుతుంది. అలా కొద్దిసేపు మధు శోభ ఇద్దరు మాట్లాడుకుని వెళ్ళిపోతారు.

రెండు మూడు రోజుల తర్వాత మధు శోభను చూడడానికి శోభ ఇంటికి వెళ్తాడు. అక్కడ ప్రబోధ్ కూడా ఉంటాడు. మధు తన కోసమే వచ్చాడని అనుకుంటాడు. ప్రబోధ్, మధు మాట్లాడుతూ ఉండగా, శోభ, ప్రవీణ్ బయటికి వచ్చి కారులో వెళ్ళిపోతారు. శోభ ముంబాయి

వెళుతుందేమో అనుకోని మధు బాధపడతాడు. తరువాత ప్రబోధ్ నడుచుకుంటూ ల్యాబ్ కి వెళ్ళి పోతాడు. ప్రబోధ్ భార్య కోటి ఫోన్ చేస్తాడని ఫోన్ మధుకు తెచ్చి ఇస్తుంది. మధు కోటితో ఫోన్ మాట్లాడి, ల్యాబ్‌కు వెళతాడు. అలాగే ప్రబోధ్‌కు సహాయం చేయడానికి మధు ఒప్పుకుంటాడు. అప్పుడు మధు చేయవలసిన సహాయం గురించి ప్రబోధ్, కోటి చెబుతారు.

ప్రబోధ్ ఒకరోజు సెమినార్ పనిమీద ఆస్ట్రేలియాకి వెళ్తాడు. ఆ సెమినార్‌లో కళ్యాణి రాజ్ అనే జన్యు శాస్త్రజ్ఞురాలుని కలుస్తాడు. ఫ్యామిలీ ఫోటోలు చూసుకుంటారు. అప్పుడు శోభా కళ్యాణి రాజ్‌కి నచ్చుతుంది. తన అన్నయ్య కొడుకు అజయ్ కి చేసుకోవాలి అనుకుంటుంది. ఇక ఆస్ట్రేలియా నుండి తిరిగి వచ్చాక ఇరు కుటుంబలు సంబంధాలు మాట్లాడుకుని పెళ్లికి ఒప్పుకుంటారు. అజయ్ తల్లిదండ్రి గంగరాజు, కమలమ్మలకు కూడా శోభ నచ్చుతుంది. శోభ, అజేయులు కూడా ఒక వివాహ వేడుకలో కలిసి మాట్లాడుకుంటారు. ఒకరినొకరు ఇష్టపడతారు. గంగరాజు, కమలమ్మలకు అజయ్ ఒక్కగానొక్క కొడుకు. అతను ఎయిర్ ఫోర్స్ లో పైలెట్‌గా ఉంటాడు. వివాహం కొద్దిరోజులు ముందు అజయ్ ప్లేట్ నడుపుతుండగా పేలిపోయి చనిపోతాడు. ఆ దంపతులు చాలా ధనవంతులు వాళ్లకి మనవడు కావాలనే కోరిక ఉంటుంది. అందుకు ముందుగానే టెస్ట్ ట్యూబ్ బేబీ కోసం అజయ్ జన్యువును గంగరాజు భద్రపరిచి ఉంటాడు.

ఆ దంపతులు టెస్ట్ ట్యూబ్ బేబీని శోభ ద్వారా పొందాలి అనుకుంటారు. కళ్యాణి రాజ్ ప్రోద్బలంతో అందుకు శోభ అంగీకరిస్తుంది. కానీ శోభ తల్లిదండ్రులకు ఇష్టం ఉండదు. శోభ తల్లిదండ్రులు శోభకి భర్త లేకుండా పిల్లలను కనడం సమంజసం కాదు అనుకుంటారు. అందుకు ఏ సంబంధం లేకుండా ఒక సంవత్సరం పాటు శోభకి భర్తగా ఉండాలని మధుని కోటి, ప్రబోధ్ కోరుతారు. ఎంత డబ్బు కావాలన్నా ఇస్తాం అంటారు. అప్పుడు మధు విస్తుపోయి బాధపడతాడు.

శోభను ఆ విధంగా వివాహం చేసుకోవడం మధుకు ఇష్టం ఉండదు. అలాగే తను ప్రేమించిన అమ్మాయి ఒక సంవత్సరం భార్యగా స్వీకరించడం చాలా చాలా ఇబ్బందిగా ఫీల్ అవుతాడు. అప్పుడు మధు కోటిని ఇలా ప్రశ్నిస్తాడు. ''విరమించుకో అని ఆమెకు ఎవ్వరు చెప్పలేరా?''అని అంటాడు. అంటే శోభ తీసుకున్న నిర్ణయం సరైనది కాదని ఆ నిర్ణయాన్ని విరమించుకునేలా చేయాలని మధు అంటాడు. అంటే సమాజంలో పిల్లలు ఏదైనా తప్పిదాలు చేస్తున్నప్పుడు, తల్లిదండ్రులు అందులో ఉండే కష్ట నష్టాలను, లోపాలను వివరించి చెప్పాలంటాడు. అలాగే వారికి ఏదో ఒక లాగా సర్దిచెప్పి ఆ పని నుండి తప్పుకునేలాగా చేయాలన్నదే మధు ఆలోచన.

అందరూ సర్ది చెప్పినా కూడా శోభా వినకుండా ఉందని కోటి చెబుతాడు. అలాగే ఇంకా ఏ గత్యంతరం లేక ఈ పనికి పూనుకున్నట్లు చెబుతాడు. శోభను మధు ప్రేమతో ఆ పని నుండి విరమించుకునేలా చేయాలని ప్రబోధ్, కోటి సూచిస్తారు. మధు కూడా శోభ పైన ప్రేమ అనురాగాలు చూపిస్తూ ఉంటాడు. ఆ సందర్భంలోనే అజయ్ గురించి అజయ్ తల్లిదండ్రుల గురించి తన గతాన్ని గురించి శోభ, మధుతో చెబుతోంది. మధు విషయాలన్నీ తెలుసుకున్న తరువాత అజయ్ తల్లి దండ్రుల దగ్గరికి వెళతాడు. ప్రబోధ్ ఫ్రెండ్ లాగా వాళ్ళను పరిచయం చేసుకుంటాడు. ఆ తరువాత అజయ్ విషయం తెలిసి విచారించానని చెబుతాడు. అలాగే తల్లిదండ్రులకు పిల్లల మీద ఉండే ప్రేమ గురించి ఇలా చెబుతాడు. ''తల్లిదండ్రుల ప్రాణాలన్నీ పిల్లల మీదనే ఉంటాయి. వారి జీవితాలు తమ కళ్లెదుట మూడు పువ్వులారుకాయలుగా వర్ధిల్లాలని ఆశిస్తారు. ఒక చిన్న పొల్లు తప్పిన బాధపడరు. కానీ దేశం కోసం తన్ను తాను సమర్పించుకున్నాడు. మహనీయుడు'' అజయ్ గురించి గొప్పగా అంటాడు.

సమాజంలో ఏ తల్లిదండ్రి అయినా తమ పిల్లలు బాగుండాలని అనుకుంటారు. అలాగే తమ పిల్లలు ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉండాలని అనుకుంటారు. ఇక సమాజంలో ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ మొదలైనవి దేశ రక్షణకు సంబంధించిన ఉద్యోగాలని, అలాంటి వాళ్లు దేశం కోసమే ప్రాణాలర్పించుకుంటారని మనకు అర్థమవుతుంది. మధు ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ మొదలైన వారి పట్ల గౌరవం ప్రదర్శించినట్లు మనకు కనిపిస్తుంది.

అలాగే ఆ తల్లిదండ్రులు టెస్ట్ ట్యూబ్ బేబీ కోసం గదిని చాలా అందంగా అలంకరించి ఉంటారు. ఆ గదిని కమలమ్మ మధుకి చూపిస్తుంది. అలాగే బాబు కోసం అన్ని వస్తువులు తెచ్చి ఉంటారు. వాళ్ళు కూడా టెస్ట్ ట్యూబ్ బేబీ కోసం అన్నట్లుగా చెబుతారు. అదంతా చూసి మధు ఆశ్చర్యపోతాడు. అప్పుడు ఇలా అంటాడు. "తల్లి దండ్రులు లేని అనాధలు ఇంతమంది ఉండగా టెస్ట్ ట్యూబ్ బేబీ ఎందుకండీ, ఆ బేబీ పెద్దయ్యాక నీ తలిదండ్రులెవరు? అని అడిగితే ఏం చెబుతాడు? మన దేశంలో మన పిల్లలు ఊరుకుంటారా? ఎవరో కనిపారేస్తే పెద్ద గొప్పగా టెస్ట్ ట్యూబ్ బేబీ అని చెప్పుకుంటున్నాడు. అని నవ్వి అపహాస్యం చేయరూ? పెద్దయ్యాక వాడుకూడ తిట్టుకుంటాడు. అసలు నన్నెందుకు పుట్టించారని. ఎవర్నైన నార్మల్ గా పుట్టిన బేబీని తెచ్చుకోండి సర్" అని గంగ రాజుకు సలహా ఇస్తాడు. అలాగే శోభ తల్లిదండ్రులు శోభ గురించి దిగులు పడుతున్నట్లు చెప్పి వస్తాడు.

తల్లితండ్రి లేని పిల్లలను సమాజం ఎలా చూస్తుందో చెప్పారు. అలాంటిది ఈ టెస్ట్ ట్యూబ్ బేబీ అయితే ఇంకెంత ఇదిగా చూస్తారో చెప్పాడు. అలాగే సమాజంలో వ్యక్తులు ఎలా ఉంటారు. ఎదుటి వ్యక్తి తప్పులను ఎలా ఎత్తి చూపుతారు. ఈ విషయంలో మధు పాత్ర ద్వారా రచయిత్రి మనకు తెలియజేస్తుంది.

అజయ్ తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లి వచ్చాక మధుకి అర్థమవుతుంది. శోభ ఆ నిర్ణయం ఎందుకు తీసు కుందనేది. అజయ్ తల్లిదండ్రులు ముసలివాళ్ళు. తల్లి కమలమ్మకు కళ్ళు లేవు. శోభ వాళ్ల మీద జాలితో ఈ నిర్ణయం తీసుకుందని మధుకి అర్థమవుతుంది. మధు ఆమె నిర్ణయాన్ని మార్చాలని ప్రయత్నం చేస్తాడు. శోభ తల్లిదండ్రులు మధు ఇంటికి వెళతారు. మధు తల్లిదండ్రులతో శోభ మధుల పెళ్లి విషయం చెప్పి సంబంధం మాట్లాడి వస్తారు.

పెళ్లి ఒక వారం రోజులు ఉండగా మధు అజయ్ తల్లిదండ్రుల దగ్గరకు వెళ్తాడు. అతను శోభను పెళ్లి చేసుకుంటున్నట్లు వాళ్ళకి ముందే తెలుస్తుంది. మధు వెళ్ళగానే గంగరాజు కంగ్రాట్స్ చెబుతాడు. టెస్ట్ ట్యూబ్ బేబీ గురించి వాళ్ల ఆలోచనలను మధు మార్చాలి అనుకుంటాడు. అలాగే తనకు శోభ మీద ఉన్న ప్రేమను కూడా వాళ్లకు తెలియజేస్తాడు. వారి నిర్ణయం మార్చుకోరు. మధు వారితో ఇలా చెబుతాడు. తమరు రెండు వైపుల నుండి ఆలోచించట్లేదు, ఒక వైపు నుండి ఆలోచిస్తున్నారు. తమ మొండి పట్టుదలతో చాలా మందిని ఇబ్బంది పెడుతున్నారు. తమవలన శోభ తల్లిదండ్రులు, ఆమె తోబుట్టువులు, ఆమెను చేసుకోబోయే తాను, తన పరివారం బాధ పడుతున్నాము అని మధు వాళ్ళకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తాడు. అయినా వాళ్లు వినరు.

తల్లికి బిడ్డ మీద ఉండే ప్రేమ గురించి మధు చెబు తాడు. తొమ్మిది నెలలు మోసి కన్న బిడ్డ తల్లిలో సగభాగం అవుతుంది. ఆ తల్లికి బిడ్డ మీద సర్వహక్కులు ఉం టాయి. ఆ తల్లిని బిడ్డను వేరు చేయడం సమంజసం కాదంటాడు. అలాగే తన ప్రియురాలిని ఇలాంటి పని చేయడానికి ఒప్పుకోనంటాడు. మధు వాళ్లతో ఈ విధంగా వాదిస్తాడు. "ఆమె జీవితం శారీరకంగా, మానసికంగా నాశనం కావటానికి నేను త్యాగం చెయ్యను. ఒక్క మాట- తల్లిగా చెప్పండి. కన్న కొడుకును - పసి బిడ్డగా వున్నప్పుడు ఎంత సేపు ఒదిలి ఉండగల్గారు? ఎవరికైన ఇచ్చే సేవా రేనా." పేగు తెంచుకు కన్న బిడ్డను తల్లి దూరం చేసు కోడానికి ఇష్టపడదని అంటాడు. తల్లికి బిడ్డ దూరమైతే

ఆమె మానసికంగా శారీరకంగా ఇబ్బందులకు గురవు తుందని చెబుతాడు. అలాగే తల్లికి బిడ్డల మీద ఉండే ప్రేమను మధు తెలియజేస్తాడు.

ఇంకా మధు ఇలా చెబుతాడు. పెళ్లికి ముందు బిడ్డకు జన్మనిచ్చిన స్త్రీని ఎవరు వివాహం చేసుకుంటారు. మీరు ధనవంతులు కాబట్టి ఏదో ఒక అనాథ స్త్రీని తెచ్చి, ఆమెకు డబ్బులు ఇచ్చి టెస్ట్ ట్యూబ్ బేబీని కనే లాగా చేయండని మధు అనేక విధాలుగా చెప్పి వాళ్ళని నచ్చజెప్పే ప్రయత్నం చేస్తాడు. వాళ్లు శోభను పెళ్లి చేసుకోవద్దని మధుని కోపగించుకుంటారు.

ఆ ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తున్నావు కాబట్టి శోభను వివాహం చేసుకోమని గంగరాజు మధుతో అంటాడు. అప్పుడు మధు చివరిగా వాళ్ళతో ఇలా అంటాడు. "ఆలోచించుకోండి. శోభను ఈ వాగ్దానం నుండి తప్పిం చండి. కావలిస్తే మీకు ఒకర్ని కాదు ఇద్దర్ని చక్కటి పాపలను తెచ్చి ఇచ్చే బాధ్యత మాది. మామూలు తలిదండ్రులుండి ఆరోగ్యవంతులైన బేబీలను తెచ్చి ఇస్తాము" అని చెప్పి మధు వెళ్ళిపోతాడు. అప్పుడు రాజు గారికి మధు బాధ అర్థం అవుతుంది.

ప్రేమించిన వ్యక్తి ఇబ్బంది పడకూడదని, అలాగే ఒక వ్యక్తిని ప్రేమిస్తే ఎంతగా ఆరాధిస్తారో మధు పాత్ర ద్వారా మనకు అర్థమవుతుంది.

మధు ఫ్రెండ్ రత్తయ్య భార్య ప్రసవం కోసం హాస్పిటల్‌కి వెళ్ళుతుంది. విషయం తెలియగానే మధు శోభను తీసుకుని హాస్పిటల్‌కి వెళ్తాడు. అప్పుడు శోభ రత్తయ్య భార్య పడుతున్న ప్రసవ వేదన కళ్ళారా చూస్తుంది. ఆమె రెండు రోజులుగా ఆ ప్రసవవేదన అనుభవిస్తున్నట్లు శోభ తెలుసుకుంటుంది. తరువాత మగ బిడ్డకు జన్మనివ్వగానే తల్లిలో ఆ ప్రసవవేదన మాయమై పోతుంది. "పాత్తిళ్ళలో తల్లి ప్రక్కలో పడుకుని ఉన్నాడు. తల్లి నిశ్చింతగ హాయిగ పడుకుని ఉంది. ఆమె ముఖంలో సంతృప్తి గంటక్రితం నరకయాతన ననుభవించినా అంత శాంతం-అంత సంతృప్తి చూచి శోభకు ఆశ్చర్యం వేసింది". తల్లి పిల్లల కోసం ఎంతటి కష్టాన్నైనా అనుభవించ గలదు. తల్లి అలాంటి నరకయాతనను కూడా పిల్లల ముఖం చూడగానే మరిచిపోగలగుతుంది. కాబట్టి తల్లి పిల్లల మీద ఎంత ప్రేమానురాగాలను కలిగి ఉంటుందో మనకు అర్థమవుతుంది. కన్నబిడ్డలను ఏ తల్లి వదులు కోడానికి ఇష్టపడదని రచయిత్రి చిత్రించిన ఈ సంఘటన మనకు తెలియజేస్తుంది.

శోభ నిర్ణయాన్ని మార్చుకునేలాగా చేయాలని మధు శత విధాలుగా ఆలోచిస్తుంటాడు. అప్పుడే జెన్నీ వచ్చి ప్రబోధ్ ఈ ఉత్తరం మీకు రహస్యంగా ఇవ్వమన్నారు అని చెప్పి మధుకి ఇస్తాడు. అప్పుడు మధు ఆ ఉత్తరాన్ని చదివి, ప్రబోధ్ చెప్పినట్టు చేస్తానని చెప్పి జెన్నీని పంపించేస్తాడు. అది గంగరాజు, ప్రబోధ్ కి రాసి పంపిన ఉత్తరం. అందులో ఇలా రాసి ఉంటుంది. "....మధు చాల కృంగిపోయి-లోకంలో అన్ని పోగొట్టుకున్న వాడిలా వెళ్తుంటే నాకు జాలి వేసింది. మధు మాటల్ని పునరావృతం చేసుకున్నాను. అతడు శోభను ప్రాణ పదంగా ప్రేమిస్తు న్నాడు. అతడు తన భార్యనుండి ఏది పొందాలో దాని కోసం శతవిధాల ప్రయత్నిస్తున్నాడు. నేను-మీరుకూడ మగవాళ్ళం. శోభ మా పై జాలిపడి - ఒక విధమైన 'సుపీరియారిటీ కాంప్లెక్స్ తో' ఈ పనికి ఒప్పుకున్న ది." "నేను కమలను ఎదిరించి శోభకు స్వాతంత్ర్యం ఇవ్వ టానికి పూనుకున్న విషయం మధు శోభ భవిష్యత్తును గూర్చి బాధపడటం. ఆమె మానసికంగా ఎటువంటి తీవ్ర ఘాతానికి లో నౌతుందో అని బాధపడ్డాడు. అనుక్షణం అదే పాయింట్ మీద నుంచున్నాడు" అని గంగరాజు ఉత్తరంలో రాసి ఉంటాడు. ఒక స్త్రీని శారీరకంగా మానసికంగా ఇబ్బంది పెట్టే ఇటువంటి ఆలోచనల నుండి బయటపడాలని, అలాగే టెస్ట్ ట్యూబ్ బేబీలను పొందడం అనేది అంత సరైన నిర్ణయం కాదని, ఇలాంటి ఆలోచనల్ని విరమించుకోవాలన్నది రచయిత్రి భావన.

అజయ్ తల్లిదండ్రులు టెస్ట్ ట్యూబ్ బేబీ నిర్ణయాన్ని విరమించుకున్నట్లు చెప్పడంతో అందరూ చాలా సంతోషిస్తారు. అలాగే ప్రబోధ్ కూడా ఒక పిల్లవాడిని దత్తత తీసుకుని అజయ్ తల్లిదండ్రులకు ఇస్తాడు. ఈ విషయం తెలుసుకున్న శోభ కూడా ఎంతో కృతజ్ఞతా భావంతో మధుని చూస్తుంది. మధు ప్రేమను కూడా అర్థం చేసుకొని సంతోషిస్తుంది. అదేవిధంగా శోభ తల్లిదండ్రులు కూడా మధుని ఆరాధనా భావంతో చూస్తారు. చివరికి అందరూ సంతోషంగా కలిసిపోతారు.

ఈ సమాజంలో సరోగసి విధానం ద్వారా పుట్టిన పిల్లలు తల్లి ప్రేమకు, తల్లి పాలకు దూరమవుతారు. అందువలన ఆ పిల్లల్లో మానసిక, శారీరక పెరుగుదల లోపించే అవకాశాలు ఉంటాయి.

అలాగే మానవ సంబంధాలు కూడా దెబ్బతినే అవకాశం ఉంది. కావున సరోగసి విధానం అంత శ్రేయస్సుకరమైనది కాదని, అలాగే అనాథ పిల్లలను దత్తత తీసుకోవడం మంచిది అనేది ఈ నవలా రచయిత్రి ఉద్దేశ్యం.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి ఫూలే

- డా॥. పెండ్యాల లావణ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

- డా॥. బూసి వెంకటస్వామి
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

ఆధునిక భారతదేశ చరిత్రలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి ఫూలే. ఈమె 1831 సంవత్సరం జనవరి 3వ తేదీన మహారాష్ట్రలోని సతారా జిల్లా ఖండాలా తాలూకా నయాగావ్ గ్రామంలో లక్ష్మీ ఖండోజీ నెవేషే దంపతులకు జన్మించారు. అప్పటి పరిస్థితుల దృష్ట్యా ఆడపిల్లలకు చదువు నిషిద్ధం. పైగా బాల్య వివాహాలు విరివిగా జరుగుతుండేవి. సావిత్రి బాయి తన 9 ఏళ్ల వయసులో జ్యోతిరావు ఫూలేతో 1840 సంవత్సరంలో వివాహం జరిగింది. జ్యోతిరావు ఫూలే సంఘ సంస్కర్త, అభ్యుదయవాది. తన ప్రసంగాల్లో తరచూ స్త్రీ విద్యను ప్రోత్సహించాలని పేర్కొనేవాడు. జ్యోతిరావు ఫూలే తన మాటలను ప్రసంగాలకే పరిమితం చేయకుండా కార్యాచరణకి పూనుకున్నాడు. తన భార్య సావిత్రిబాయి ఫూలేకు విద్యాబుద్దులు నేర్పించాడు. ఇంట్లో తల్లి దండ్రులు, బంధువులు, రక్త సంబంధీకులందరు హేళనలు, అవమానాలు చేసినా ఏది పట్టించుకోకుండా కేవలం భార్య చదువుపైనే దృష్టి పెట్టారు. సావిత్రిబాయి ఫూలే కూడా భర్త ఎదుర్కొంటున్న అవమానాలను, ఛీత్కారాలను వింటూ లోలోపలే బాధను దిగమింగుకుంటూ పట్టుదలతో విద్యను అభ్యసించింది. అహ్మద్ నగర్‌లో ఉపాధ్యాయ శిక్షణ పొంది మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా ఖ్యాతి గడించింది.

సావిత్రిబాయి ఫూలే భర్తతోపాటు సంఘ సంస్కరణ కార్యక్రమాలలో పాలు పంచుకునేది. నాటి సమాజంలో పేరుకుపోయిన దురాచారాలను నిరసిస్తూ ఉద్యమించారు. ఉద్యమంలో భాగంగా స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను ఎదురించారు. అయితే అప్పటికే సంఘంలో దురాచారాలు బాగా పాతుకుపోయి ఉండడంతో సావిత్రిబాయినే అందరు తిట్టిపోసేవారు. ఎవరు ఎన్ని రకాలుగా దూషించినా అవేమీ పట్టించుకోకుండా స్త్రీల అభ్యున్నతికి కృషి చేసింది. సమాజంలో స్త్రీ అణచివేయబడడానికి కారణం కేవలం వాళ్ళు చదువుకోకపోవడమే కారణమని ప్రత్యేకంగా ఆడపిల్ల లందరికి ఒక పాఠశాలను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. జ్యోతిరావు ఫూలే సహకారంతో సావిత్రి బాయి ఫూలే 1848 సంవత్సరం పూణేలో మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించింది.

సావిత్రిబాయి ఫూలే నడిపూ పాఠశాల అగ్రవర్ణాల వాళ్ళకు నచ్చలేదు. దీనితో ఆమెపై వేధింపులకు, భౌతిక దాడులకు పూనుకున్నారు. సావిత్రిబాయి ఫూలే పాఠశాలకు నడిచి వెళ్ళే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్ళు రువ్వి, అసభ్య పదజాలాన్ని వాడడం చేసేవాళ్ళు. బురదతో మలినమైన చీరతో పాఠశాలకు వెళ్ళి అక్కడ మార్చుకుని మరల తిరిగి వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చేది. ఎవరైనా అడిగితే ధైర్యంగా నా విధిని నేను నిర్వర్తిస్తున్నానని చెప్పేవారు. ఫూలే దంపతులు ఎప్పుడైతే బాలికల కోసం పాఠశాలను ఏర్పాటు చేశారో తమ కుటుంబీకులు, సంఘంలోని వాళ్ళందరు వారిని బహిష్కరించారు.

సామాజిక సేవల విషయంలో సొంత తండ్రే జ్యోతిరావు ఫూలేను ఇంటి నుంచి బయటకి పంపించినప్పుడు మియాన్ ఉస్మాన్ షేక్ ఆశ్రయ మిచ్చారు. ఉస్మాన్ షేక్ జ్యోతిరావు ఫూలే చేసే సంఘ కార్యక్రమములో పాలు పంచుకునేవారు. ఆ స్నేహంకొద్దీ భార్యభర్తలిద్దరికి ఆశ్రయం కల్పించారు. ఉస్మాన్ షేక్

సోదరి ఫాతిమా షేక్ ముస్లిం సమాజంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్రకెక్కింది. ఫాతిమా షేక్ జ్యోతిరావు ఫూలే స్థాపించిన బాలికల పాఠశాలల్లో విద్యను అందించడం ప్రారంభించింది. ఫూలే దంపతులు ఫాతిమా షేక్‌తో కలసి అణగారిన వర్గాలలో విద్యను వ్యాప్తి చేసే బాధ్యతను చేపట్టారు. సింథియా ఫర్రార్ అనే అమెరికన్ మిషనరీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో సావిత్రిభాయి ఫూలే, ఫాతిమా షేక్ కలిశారు. ఆ స్నేహబంధంతో ఫూలే దంపతులు స్థాపించిన ఐదు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసింది. 1851లో ముంబాయిలో రెండు పాఠశాలల స్థాపనలతో ఫాతిమా షేక్ పాల్గొన్నది. వీరిద్దరు ముఖ్యంగా బాలికా స్త్రీ విద్యకు కృషి చేశారు.

సంఘంలో ఫూలే దంపతులను అనేక అణచివేతలకు గురి చేశారు. ఆ దంపతులు అవేమీ పట్టించుకోకుండా అభ్యుదయంవైపు పయనించారు. మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి "మహిళా సేవా మండల్" అనే మహిళా సంఘాన్ని 1852 సంవత్సరంలో స్థాపించారు. సమాజంలో స్త్రీల మీద జరుగుతున్న అన్యాయాల్ని ఏకరువు పెట్టాలని ఫూలే దంపతులు సంకల్పించారు. బాల్య వివాహాలు, వితంతువులు శిరోమండనం, సతీసహగమనం,అతి మూఢ నమ్మకాలను రూపుమాపటానికి ఉద్యమం దారి పట్టారు. ఉద్యమంలో భాగంగా స్త్రీ విద్యావంతురాలైతే అన్యాయాల్ని ధైర్యంగా ఎదుర్కోవచ్చని చైతన్యపరిచారు. సంఘంలో జరుగుతున్న అక్రమాలను నిరసిస్తూ 1854 సంవత్సరంలో 'కావ్యఫులే' అనే కవితా సంపుటిని వెలువ రించారు. భర్త చనిపోయిన వితంతువులకు శిరోమండం చేయవద్దని క్షురకులను (మంగలి) వాళ్ళను చైతన్యపరచి వారితో 1860 సంవత్సరంలో ఉద్యమం చేయించి విజయం సాధించారు.

ఫూలే దంపతులు నిమ్నజాతి ఆడపిల్లలకి పాఠశాల లను ఏర్పాటు చేశారు. అది గిట్టని సంఘంలో కొందరు పెద్ద మనుషులు ఫూలేని చంపమని దోండిరామ్, కుంబార్ రోడే అనే హంతకుల్ని నియమించారు. రోజులాగే ఫూలే దంపతులు రాత్రి భోజనాలు ముగించు కుని నిద్రకు సిద్ధమయ్యారు. ఇంతలో ఫూలే పెరటి గుమ్మం గుండా ఇద్దరు హంతకులు గొడ్డళ్ళతో నిశ్శబ్దంగా లోపలకు ప్రవేసించారు. వాళ్ళ ముఖాలు భయంకరంగా ఉన్నాయి. ఫూలే దంపతుల ముందు దొంగలిద్దరు నిలబడి ఫూలేని చంపడానికి గొడ్డళ్ళు పైకెత్తారు. వెంటనే ఫూలే భార్య "అన్నల్లారా! ఆగండి దయచేసి వెళ్ళిపోండి" అని బతిమాలింది. ఎందుకు వచ్చారని ఫూలే దొంగల్ని అడగారు. అప్పుడు దొంగలు మీరు నడుపుతున్న బడులు కొందరు పెద్ద మనుషులకు ఇష్టంలేదు. అందుకే మిమ్మల్ని చంపమని బయానా ఇచ్చారని చెప్పారు. దొంగల మాటలకు ఫూలే "నా చావు మీకు లాభం అయితే నన్ను చంపండి. బీదవాళ్ళకు సాయం చేయడమే నా జీవితా శయం. బీదవారి చేతిలో చావడంలో తప్పులేదు. నన్ను చంపండి" అని మెడవంచి శాంతంగా చావుకు సిద్ధ మయ్యాడు.

ఫూలే మంచితనానికి దొంగలు దొండిరామ్, కుంబార్ రోడేలు గొడ్డళ్ళు కిందపడేశారు. ఫూలే కాళ్ళ మీద పడ్డారు. మేము మిమ్మల్ని చంపలేము. మీరు మా తండ్రి వంటివారు ఇప్పుడే వెళ్ళి మమ్మల్ని ఇక్కడకి పంపిన వాళ్ళను చంపేస్తాం అని బయలుదేరారు. ఫూలే దొంగల్ని ఆపి జ్ఞానబోధ చేశాడు. దొంగల మనసు మారిపోయింది. దొంగలిద్దరు ఫూలే రాత్రి బడిలో చేరారు. కుంబార్ రోడే ఫూలేకు బాడీగార్డుగా తయారయ్యాడు. కుంబర్ రోడే 'వేదాచార్' అనే పుస్తకం రాశాడు. ఫూలే సేవా కార్యక్రమాల్లో రోడే సాయంగా ఉండేవాడు.

సావిత్రిబాయి ఫూలే భర్తతోపాటు తాను కూడా అన్ని కష్టాల్ని, అవమానాల్ని సహించింది. సావిత్రిబాయి ఫూలే ప్రపంచ చరిత్రలోనే భర్తతోపాటు ఉద్యమం జీవితంలో కలిసి నడిచిన ఆదర్శ సహధర్మచారిణిగా నిలిచిపోయింది. తమకంటూ సొంతపిల్లలు ఉండాలన్నా కోరికను త్యజించి

ప్రపంచమే ఇల్లుగా చేసుకుని అనాథల్ని, అక్రమ సంతానంగా పుట్టి రోడ్లుపాలైన బిడ్డల్ని తన సొంత బిడ్డలుగా సావిత్రబాయి దంపతులు చేసుకున్నారు. 1874 సంవత్సరంలో ఒక బ్రాహ్మణ వితంతువు బిడ్డను ఫూలే దంపతులు దత్త పుత్రుడిగా స్వీకరించారు. ఒక బ్రాహ్మణ వితంతువు గర్భవతి కాగా ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఫూలే దంపతులు ఆమెను కాపాడి పుట్టబోయే బిడ్డను తాము దత్తత తీసుకుంటామని మాట ఇచ్చారు. ఆ మాట ప్రకారం పుట్టిన బిడ్డకు యశ్వంత్ అని పేరు పెట్టి పెంచి పెద్దవాడ్ని చేసి డాక్టర్‌ను చేశారు. 1873 సంవత్సరంలో సత్యశోధక్ సమాజం మహిళా విభాగం పేరిట కులాంతర వివాహాలు అనేకం జరిపించారు. ఫూలే దంపతులు భార్యను కోల్పోయిన ఒక యువకుడికి తన స్నేహితురాలి బిడ్డతో పెండ్లి చేశారు. పురోహితుడు లేకుండా ఒక వివాహం జరగడం చరిత్రలో ఇదే మొదటి సారి.

కుల వ్యవస్థ బాగా ప్రబలిపోయిన సమాజంలో అందరూ సత్యాన్ని శోధించడానికి కంకణం కట్టుకోవాలనే తత్వాన్ని ప్రచారం చేస్తూ 1873 సంవత్సరంలో ఫూలే దంపతులు ''సత్యశోధక్ సమాజ్''ను స్థాపించారు. ఇందులో భాగంగా బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా పోరాడి వితంతు పునఃర్వివాహాలకు మద్దతుగా ఉద్యమాలు నడిపారు. కులమత బేధాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి. 1854 సంవత్సరంలో 'కావ్యఫూలే' కవితా సంపుటితోపాటు అభంగ్ అనే రచన ఆనాటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టేలా రాశారు. సూటిగా, సరళంగా, ప్రకృతి వర్ణనలు, జానపద కళలు ప్రతిబింబించే విధంగా కావ్య రచనలు చేశారు. 1891 సంవత్సరంలో పావన్ సుభోధ్ రత్నాకర్ పేరిట కవితా సంపుటిని ప్రచురించారు. పండుగలు, పబ్బాలు వంటి ఆర్భాటాల కోసం శక్తికి మించి ఖర్చులు చేసి అవ్వలు పాలయ్యేవాళ్ళను విమర్శిస్తూ 'కర్జ్' అనే వ్యాసం వ్రాశారు. మూఢ విశ్వాసాలు గుడ్డిగా పాటించినంత కాలం ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాదని గుర్తించి హేతుబద్ధత కవితల్లో ప్రతిబింబించేవారు.

1890 సంవత్సరంలో జ్యోతిరావు ఫూలే నవబంర్ 28వ తేదీన మరణించడంతో తన భర్త చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి నాంది పలికారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పుపెట్టిన తొలి సంఘటన ఇది. 1896-97 సంవత్సరాల మధ్య సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జన జీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ కరువు పరిస్థితుల్లో దళిత పేదలకు జోలె పట్టి విరాళాలు సేకరించి అందించారు. ప్లేగు వ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలందించారు. 1890వ దశకంలో ప్లేగువ్యాధి బారిన పడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2 వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించింది. ప్లేగు వ్యాధి సోకిన ఒక బాలుడికి చికిత్స చేయిస్తూ అదే ప్లేగు వ్యాధి బారినపడి సావిత్రిభాయి ఫూలే 1897 సంవత్సరం మార్చి 10వ తేదీన పరమపదించారు.

సావిత్రిబాయి ఫూలే గొప్ప కవయిత్రి. చక్కని ఆలోచనలు, త్యాగసేవ, నిబద్ధత కలిగిన మహిళ. విద్యార్థిగా ఉన్నప్పుడే తన భర్త ఇచ్చిన 'నీగ్రోల మానవ హక్కుల పోరాట యోధుడు' 'థామస్ క్లార్క్‌సన్' ఉద్యమ చరిత్రను ఆమె చదివారు. తను కూడా భర్తతో పాటు కలసి మానవ హక్కుల పోరాట యోధురాలిగా మారారు. సావిత్రిబాయి ఫూలే జ్యోతిరావు ఫూలే అర్ధాంగిగానే కాక, భర్తకు తగ్గర భార్యగా సావిత్రి బాయి ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. భారతదేశంలో మహిళా విద్యకు పెద్దపీట వేస్తూ ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు చెందిన స్త్రీలు చదువుకునేందుకు ఆమె పాఠశాలలు సైతం ప్రారంభించారు. ఆమె విప్లవ ప్రసంగాలు ఆనాటి మహిళల్లో ఎందరికో స్ఫూర్తిని కలిగించాయి. భర్త చనిపోయాక స్త్రీలకు శిరోమండనం చేయడం సంప్రదాయం. అయితే ఫూలే

మరణం తర్వాత సావిత్రిబాయి ఫూలే శిరోమండనం చేయించుకోలేదు. అలాగే నుదుటి బొట్టును కూడా తీయలేదు. దళిత, ఆదివాసీ, గిరిజన, మైనారిటీ కులాల మహిళల ఐక్యత కోసం పాటుపడిన సావిత్రిబాయి తన పాఠశాలల్లో అన్ని మతాలకు చోటు కల్పించారు.

ముగింపు :

స్త్రీలకు విద్యను దూరం చేసిన సమాజంలో, అక్షరాలు నేర్వలేని అజ్ఞానంలో జాతి యావత్తూ మూఢ నమ్మకాలతో కొట్టుమిట్టాడుతున్న అంధకార యుగంలో భారతావనిలో ఒక వేగుచుక్కగా మెరిసిన నారీమణి సావిత్రిబాయి ఫూలే. స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి. స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు శ్రమించిన నాయకి, గొప్ప రచయిత్రి, మంచి వక్త. కులం పితృ స్వామ్యంపై కలం యుద్ధం నడిపిన కవయిత్రి. యుక్త వయస్సులోనే తన సౌఖ్యాలను వదలుకుని శూద్రులకు, దళితులకు పాఠశాలలు నడిపిన గొప్ప మానవి. 19వ శతాబ్దంలో ఆమె సాధించిన కృషి ముందు కులం, వర్ణం, లింగ వివక్ష వంటి శక్తులన్నీ తలవంచక తప్పలేదు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

Philosophical Concepts in the Bhagavad Gita- An Overview

- *Ashok Manda*, Research Scholar Dept. of Philosophy, Osmania University, Hyderabad, Telangana.

The Bhagavad Gita is not just a religious book; it covers many philosophical concepts, from birth to death, with almost 700 verses from Chapter 23 to Chapter 40 of the Bhishma Parva in the epic Mahabharata. Bhagavad Gita is called the "Song of the God", which guides us by showing us the various spiritual ways of enhancing our self-knowledge. As well as divine inner peace. Indians consider the Bhagavad Gita to be revered along with the Ramayana, the Mahabharata, the Vedas, the Upanishads, and the Puranas. Lord Krishna was Arjuna's charioteer in the battle of the Kuru Pandavas. Arjuna is in a moral dilemma when he sees his relatives, friends, and teacher-facing him in the battle. Lord Krishna instructs Arjuna in the form of Bhagavad Gita, who is saddened that such a war is for me, whether to kill or die in battle. The Bhagavad Gita is like the river Ganga, in which wisdom, duty, and deeds are emphasized for the welfare of mankind irrespective of caste, creed, gender, and nation. Bhagavad Gita is the foundation for many philosophical concepts like Soul, world, Ultimate Reality, Time, and Action in Indian philosophy.

Keywords : Bhagavad Gita, Dharma, Religion, Indian Philosophy, Social Values.

Introduction :

